Dr. B. Gopala Reddi appreciated the efforts of the Parisodhaka mandali in bringing out the Journal and critically evaluated the rich and varied contribution of Sastriji to the field of Telugu literature. He advised the Mandali that under no circumstances the Journal should be discontinued Sri MaruPoori Kodanda Rami Reddy and Kumari Lata also spoke. Kumari Jyotsna proposed the vote of thanks.

❊ వేటూరి సాహితీసమితి—ప్రారంభోత్సవం తిరుపతి. 27—1—1982

తిరుపతి బాలాజీభవన్ ఆడిటోరియంలో జనవరి 27వ తేదీన వేటూరి సాహితీ సమితి ప్రారంభోత్సవం జరిగినది. సినీపరిశ్రమలోని ప్రముఖులు, పురప్రముఖులు పలువురు సభలో పాల్గొన్నారు. "సాహిత్యసేవ చేయడమే మా ప్రధాన ధ్యేయం సాహిత్యంలో వేటూరి వంశం ప్రత్యేకతను వివరించనక్కర్లేదు" అని సమితి వైస్ ప్రెసిడెంటు శ్రీ పి. రామచంద్రారెడ్డి అన్నారు. "ఇది అపారమైన సాహితీసేవ చేసిన వేటూరి ప్రభాకరశాస్త్రి గారి చిహ్నంగా, మావంశానికి చిహ్నంగా స్థాపించబడింది" అన్నారు ప్రముఖ సినీకవి వేటూరి సుందరరామమూర్తి. స్థానిక దేవస్థానం కళాశాల ఆంధ్ర శాఖాధ్యక్షులు శ్రీ సింగరాజు సచ్చిదానందం గారు గురుదేవులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారి వాఙ్మయకృషిని మానవత్వ ప్రపూర్ణమైనవారి వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ ప్రసంగించారు. శ్రీ చలపతిరావు ప్రభృతులు కూడా మాట్లాడినారు. ఆ తరువాత వేటూరి సుందరరామమూర్తి గారి తలిదండ్రులు డా॥ వేటూరి చంద్రశేఖరశాస్త్రి, కమలాంబగార్లను; పినతండ్రి డా॥ వేటూరి శంకరశాస్త్రి గారిని సమితి గౌరవఅధ్యక్షులు శ్రీ బాలసుబ్రహ్మణ్యం నూతన వస్త్రాలతో సత్కరించారు.

(14-2-82 సితార సౌజన్యంతో)

❊ యోగమిత్రమండలి సమావేశాలు :—

తిరుపతిలోను, విశాఖపట్టణం, గుంటూరు, వరంగల్లు మొదలైన కేంద్రాలలోను యోగమిత్రమండలి సమావేశాలు జరిగినట్లు వార్తలందినవి. గత ఆగస్టు, డిశంబరు, ఫిబ్రవరి మాసాల్లో ఏర్పాటైన ఆ ప్రార్థన సమావేశాల్లో గురుపూజలు, రోగనివారణ ప్రార్థనలు, గురుచరిత్ర పఠనాలు, ధ్యానాలు జరిగినట్లు తెలుస్తున్నది.

❊ "సాహితీ ప్రభాకరీయం"

శ్రీ వేటూరి-ప్రభాకరశాస్త్రిగారి వాఙ్మయసేవని యోగసిద్ధిని ఆవిష్కరించే సంచికా కార్యక్రమం—ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంనుండి 6-1-1982 సాయంత్రం 7-30 కు ప్రసారమైంది. కళాప్రపూర్ణ శ్రీ రావూరి భరద్వాజగారి సంపాదకత్వంలో ప్రసారితమైన ఈ సంచికా కార్యక్రమంలో ఆచార్య శ్రీ బిరుదురాజు రామరాజుగారు ప్రభాకరశాస్త్రిగారి సారస్వత పరిశోధనను గురించీ; శ్రీ తిరుమల రామచంద్రగారు వేటూరి వారి శాసన చారిత్రక పరిశోధనలను గురించీ, శ్రీ కొత్త రామకోటయ్యగారు గురుదేవుల యోగదర్శనాన్ని గురించీ ప్రసంగించారు. కార్యక్రమం పలువురు శ్రోతల ప్రశంసలను అందుకొన్నది.

[ఈ సంచికా కార్యక్రమంలోని ప్రసంగవ్యాసాలను వచ్చే సంచికలో ప్రకటించగలము—సం॥].

103849

DECLARATION FORM

1.	Title of the journal	:	MANIMANJARI
2.	Publication	:	Half-yearly (February and August)
3.	Publisher's Name	:	Veturi Anandamurthy
4.	Nationality	:	Indian
5.	Address	:	6/2RT (New) Vijayanagar Colony Hyderabad-500 457
6.	Place of Publication	:	" "
7.	Printer's Name and address	:	As at Col : No. 3 and 5 noted above
8.	Printing Press	:	Aware Printing Press, 2-2-1157/8/9 Tilaknagar, Hyperabad-44.
9.	Status of the Journal	:	Owned by Individual; Veturi Anandamurthy.

VERSITY ORIENTAL RESEARCH INSTITUTE LIBRARY
TIRUPATI

శ్రీమతి ఇందిరాగాంధీ
ప్రధానమంత్రి

నిస్సహాయులకు చేయూత

శ్రీ టి. అంజయ్య
ముఖ్యమంత్రి

వికలాంగుల అంతర్జాతీయ సంవత్సరం తరుణంలో రాష్ట్రంలోని వికలాంగులకు ప్రత్యేకముగా ఆర్థిక సహాయక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకన్నా అగ్రగామిగా ఉంది.

రాష్ట్రప్రభుత్వం అమలు జరుపుతున్న కార్యక్రమాల వివరాలు దిగువ ఇవ్వడం జరిగింది.

- ప్రస్తుత సంవత్సరంలో రు. 3 కోట్ల ఖర్చుతో సంక్షేమ కార్యక్రమాల అమలు.
- 1981-82 సంవత్సరంలో రు. 70 లక్షల ఖర్చుతో కృత్రిమ అంగాలు, విద్యా సౌకర్యాలు, వైద్యచికిత్స సౌకర్యాలకల్పన.
- మరో 10 సంవత్సరాలవరకు ఉద్యోగాల రిజర్వేషన్ కొనసాగింపు.
- వికలాంగుల ప్రయోజనార్థం హైదరాబాదు, కరీంనగర్, మెదక్ విజయవాడలలో శిక్షణతో కూడిన ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు.
- స్వయం ఉపాధి నిమిత్తం రు. 3,000/-ల వరకు ఆర్థిక సహాయము.

కులతత్వం, వరకట్నం వంటి సాంఘిక దురాచారాలకు గురిఅయినవారికి తోడ్పడడంలో కూడా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

- అంటరానితనం, హరిజనులపై అత్యాచారాల కేసుల విషయంలో తీవ్రమైన చర్యలు తీసుకోడానికి వీలుగా సంచార కోర్టులను ఏర్పాటు చేశారు.
- వర్ణాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు.
- వరకట్న నిషేధ చట్టాన్ని పటిష్టముగా అమలుజరుపుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈనాడు వికలాంగులు, సాంఘిక దురాచారాలకు గురైనవారు నిస్సహాయస్థితిలో లేరు. ప్రభుత్వం అందజేస్తున్న చేయూతతో వారు ఉజ్వల భవిష్యత్ కోసం ముందడుగు వేస్తున్నారు.

సమాచార, పౌరసంబంధ శాఖ డైరెక్టరుచే ప్రకటితం : హైదరాబాదు.
No. 56

Cover Page Printed at 'AWARE' Printing Press, Tilaknagar Hyd-44.

LATE PRABHAKARA SASTRI
CHIEF JUSTICE'S TRIBUTE
UNIVERSITY CHEMICAL RESEARCH INSTITUTE
గోలకొండపత్రిక
శ్రీ॥ ప్రభాకర శాస్త్రిగారు
గురుస్మృతి
TRIBUTES TO LATE SRI PRABHAKARA SASTRI

మణి మ

శ్రీ ప్రభాకర పరిశోధక మండలి
హైదరాబాదు-500457

మణిమంజరి

వాఙ్మయ - యోగ - పరిశోధన పత్రిక

సంపుటి : 2. సంచిక : 2

శ్రీ ప్రభాకర వర్ధంతి సంచిక

ఆగస్టు - 1982

⁂

సంపాదకులు
వేటూరి ఆనందమూర్తి
వేటూరి ఆంజనేయులు

⁂

సంపాదక సలహా మండలి

శ్రీ తిరుమల రామచంద్ర
డా॥ పోచిరాజు శేషగిరిరావు
శ్రీ రావి రామమూర్తి

శ్రీ కొత్త రామకోటయ్య
డా॥ విస్సా రామచంద్రరావు
శ్రీ వేటూరి గురుప్రసాద్

డా॥ వేటూరి సుందరమూర్తి

శ్రీ ప్రభాకర పరిశోధక మండలి
'శ్రీనివాస్' - 6/2 ఆర్ . టి. (న్యూ)
విజయనగర్ కాలనీ. హైదరాబాదు-500 457
ఆంధ్రప్రదేశ్

వాఙ్మయ - యోగ - పరిశోధన షాణ్మాసిక
మణిమంజరి
శ్రీ ప్రభాకర వర్ధంతి సంచిక
ఆగస్టు - 1982.

వార్షిక చందా : ఇరవై అయిదు రూపాయలు
విడిప్రతి : పదిహేను రూపాయలు
వెనుకటి సంచిక : పదిహేను రూపాయలు

ప్రకాశకులు :
వేటూరి ఆనందమూర్తి
శ్రీ ప్రభాకర పరిశోధక మండలి
హైదరాబాదు - 500 457.

ముద్రణ :
మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్
1-1-694/2/ఎ, గాంధినగర్
హైదరాబాద్ 500 380.

భవనం వెంకటరామ్
ముఖ్యమంత్రి

21-8-1982

ప్రియమైన శ్రీ ఆనందమూర్తిగారికి,

శ్రీ ప్రభాకర పరిశోధక మండలి వారు 'మణి మంజరి' అన్న పేరుతో వాఙ్మయ యోగ పరిశోధక పత్రికను ప్రచురిస్తున్నందుకు సంతోషంగా వుంది.

సారస్వత తపస్వి, సుప్రసిద్ధ పరిశోధకులు అయిన శ్రీ ప్రభాకర శాస్త్రి గారికి పవిత్ర స్మృత్యంజలిగా, నిర్వహించబడనున్న మణి మంజరి సాహిత్య పరిశోధక మణి మంజరిగా ఏటేటా క్రొత్త వెలుగులు సంతరించుకో గలదని ఆశిస్తూ, మీ కృషి విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ,

మీ
భవనం వెంకటరామ్

I. RAMAKRISHNAM RAJU
Minister of State for Tourism
Cultural Academies & Sports

Hyderabad.

Dated 24-8-1982

Not long before a savant strode like a colossus In the land of literature. The sands of time bear eloquent witness to the impact of his influence on literature in general, research in particulr, and, most surprisingly, even in the quest of spiritual realization.

To honour the unfading and evergreen memory of that great personality, the revered Sri Veturi Prabhakara Sastri Garu, is to honour ourselves.

Sri Veturi Prabhakara Sastri garu was not merely an individual. He was an institution.

To tread in the footsteps of this great soul and to endeavour to contribute, in whatever measure, to further the goals he so nobly set himself is a real tribute to Sri Prabhakara Sastri Garu.

I wish 'Manimanjari' all success in its efforts.

sd–
I. RAMAKRISHNAM RAJU

సంపాదకీయం

మణిమంజరి పత్రికకు రెండేళ్లు నిండినవి. రెండోసంపుటం రెండోసంచిక ఇది. దీనితో కలుపుకొని ఇప్పటికి నాలుగు సంచికలు వెలువడ్డవి. మెట్టుమెట్టుగా గమ్యంవైపుకి స్థిరంగా క్రమంగా 'మణిమంజరి' అధిగమిస్తోందనే మావిశ్వాసము. ఎప్పటికప్పుడు సంచికను నూట ఇరవై పుటల్లో ముగించాలనుకొంటున్నా ప్రకటనార్థం వస్తున్న ఆసక్తికరమైన రచనల సంఖ్యనిబట్టీ ఇంకా ఇంకా ప్రకటింపవలసియున్న గురుదేవుల ముద్రితా ముద్రిత రచనల బాహుళ్యాన్ని బట్టీ పత్రిక పుటల్ని అంతకెక్కువగానే పెంచి వేయవలసివస్తున్నది. ఆరంభించాలనుకొన్న ఎన్నో కొత్త శీర్షికలను ఇంకా ఆరంభించనేలేదు!

తగిన వనరుల్ని సమకూర్చుకొని ముందుముందు వాటినీ మీ కందించగలము. తొలిసంచికలోని మా విజ్ఞప్తిని పురస్కరించుకొని సహృదయమిత్రులు కొందరు తాము భద్రపరచి సేకరించియుంచిన శ్రీవారి లేఖల్ని, అముద్రిత రచనల్ని ప్రకటనార్థం మాకు పంపినారు. అట్లే మరికొందరు పంప నున్నట్లు వ్రాసినారు. వారికి మా కృతజ్ఞతలు. ప్రభాకరుల జీవితరచనలకు సంబంధించిన అనేక అపూర్వాంశములు, మరగుపడిన విశేషములు సంశోధింపబడి మా యీ పత్రికమూలంగా వెల్లడి అవుతున్నందుకు, భావి పరిశోధన కనువు కల్పించే మౌలికసామగ్రి నీ పత్రిక అందించ గల్గుతున్నందుకు పాఠకులతోపాటు మాకూ సంతోషంగా ఉన్నది.

వేటూరివారి రచనల్ని సంపూర్ణ గ్రంథావళి రూపాన సంకలనపరచడానికి, ప్రకటనకు తేవడానికి ఈయేడు నాంది పలికినట్లయింది. శ్రీవారి ''నీతినిధి'' ఈ సెప్టెంబరులో ఆవిష్కరింపబడుతోంది. ''వేటూరివారి పీఠికలు'' తరువాతి సంపుటంగా సంకలితమవుతోంది.

కార్యభారం మిక్కుటమైనా అందుగల ఉత్సాహం, సహృదయుల సహకారం, దైవసంకల్పం మమ్ము ముందుకు నడిపిస్తున్నది. మా యీ వాఙ్మయకృషి నిరంతరాయంగా సాగగలదని ఆశిస్తున్నాము. చేదోడు వాదోడు అవుతున్న మిత్రులందరికీ కృతజ్ఞత లర్పిస్తున్నాము.

స్వవిషయము

''రవికి దీపమున నర్చ లిచ్చు పగదివోలె''

(నన్నిచోడుని కుమారసంభవము 1-49)

శ్రీ ప్రభాకర పరిశోధక మండలి (హైదరాబాదు) వారు ప్రచురిస్తున్న ఈ షాణ్మాసిక 'మణిమంజరి' వాఙ్మయ—యోగ—పరిశోధన పత్రికగా రూపుదిద్దుకొన్నది. గురుదేవులు స్వర్గీయ శ్రీప్రభాకరశాస్త్రిగారి దివ్యస్మృతి కంకితమై మా యీ 'మణిమంజరి' శ్రీవారి జయంతి-వర్ధంతి సందర్భాలను పురస్కరించుకొని ఏడాదికి రెండుసార్లు ఫిబ్రవరిలోను—ఆగస్టులోను వెలువడుతుంది. గురుదేవుల 32 వ వర్ధంతిని పురస్కరించుకొని 'ప్రభాకర వర్ధంతి సంచిక' ప్రస్తుతం మీ ముందున్నది.

విడిపత్రిక-వెనుకటి సంచిక—వెల (స్వదేశంలో) రూ. 15/- (పోస్టేజి ఉచితం.
రిజిస్ట్రేషను ఖర్చులు అదనము)
సంవత్సర చందా ,, రూ. 25/- (,,)
సంవత్సరచందా (విదేశాలకు) 8 డాలర్లు (,,)

కొద్ది ప్రతులు మాత్రమే అచ్చయినవి. వెనుకటి సంచికలుకూడా కొలది ప్రతులు మాత్రమే ఉన్నవి. వలసినవారు ముందుగానే సొమ్మును మనియార్డరు ద్వారాగాని. డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారాగాని క్రింది విలాసమునకు పంపి చందాదారులు కావచ్చును. ''మణిమంజరి — హైదరాబాదు'' పేరున చెక్కులు పంపగోరేవారు బ్యాంకుచార్జీల నిమిత్తం అదనంగా రూ. 3/- పంపవలెను.

ముందుముందు 'మణిమంజరి' కొత్త శీర్షికలను సంతరించుకొనబోతున్నది. గురుదేవుల మౌలిక రచనలెన్నో పరంపరగ వెలువడనున్నవి.

సంపాదకులు
మణిమంజరి
6/2 RT (New) విజయనగర్ కాలనీ,
హైదరాబాదు-500 457. ఆంధ్రప్రదేశ్.

విషయసూచిక

1. శ్రీ వేటూరిపై మహాత్ముని ప్రభావం 105. డా॥ పోచిరాజు శేషగిరిరావు
2. పూజనీయులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 109. వి. డి. యస్. ప్రసాద్
3. సాహిత్య సంచికా కార్యక్రమం—వేటూరివారు 125. (సంచికా కార్యక్రమం)
4. కలికి — చిలుక (కథ) 135. వేటూరి ప్రభాకరశాస్త్రి
5. ఒక ప్రశంస — సమాధానం 141. ముదివేడు ప్రభాకరరావు
6. కోటవారి లేఖలు 145. (లేఖలు)
7. జ్ఞాన సంపద 149. వేటూరి ప్రభాకరశాస్త్రి
8. నీతిద్విషష్టిక (ఉపోద్ఘాతము) 153. వేటూరి ప్రభాకరశాస్త్రి
9. శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి 159. (ప్రణాళిక)
10. ఆనాటి ఆదర్శమూర్తులే ఈనాటి గురుదేవులు 161. డా॥ వి. ఎన్. శర్మ
11. యోగవిషయము (ఉపన్యాసము) 174. వేటూరి ప్రభాకరశాస్త్రి
12. గురుదేవుల డైరీనుండి కొన్ని పుటలు 179. (డైరీ)
13. ఎన్నెని చెప్పేది మా అన్నయ గురించి 181. డా॥ వేటూరి శంకరశాస్త్రి
14. చాటుపద్య — మణిమంజరి 189. వేటూరి ప్రభాకరశాస్త్రి
15. కొన్ని జ్ఞాపకాలు 192. బులుసు వేంకటరమణయ్య
16. అప్పుపడి యున్నదయ్య
మా ఆంధ్రభూమి (కవిత) 196. డా॥ ఉందేల మాలకొండారెడ్డి
17. గాంధి రామాయణం 198. (సంకలనం)
18. మంగళహారతి 201. వేటూరి సుందరశాస్త్రి
19. స్మృతి పథంలో 202. శ్రీమతి లలితా రామచంద్రరావు
20. ఆత్మనివేదన (కవిత) 205. వేటూరి ప్రభాకరశాస్త్రి
21. గురుపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు 207. చాగంటి కల్పవల్లి
22. ప్రజ్ఞా ప్రభాకరము (కవిత) 212. డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు
23. మా అన్నయ్య 213. కాజ శారదాంబ
24. అభిప్రాయవేదిక 216. (అభిప్రాయాలు)

Andhra Pradesh State Film Development Corporation Ltd.

(A State Government undertaking)

11-5-423/1 Lakdikapool Hyderabad - 500 004

GIVING FILLIP FOR DEVELOPMENT OF FILM INDUSTRY IN ANDHRA PRADESH

LOANS FOR CONSTRUCTION OF CINEMA HALLS :

Loans are restricted for town/ villages with population of 75,000 and below.

Total outlay not to exceed Rs. 8 Lakhs.

Loan upto Rs. 4 lakhs or 2/3 which ever is less.

Loan repayable in 84 monthly Instalments.

Interest at 15% with a rebate of 3% for punctual payment on due dates.

LOANS FOR CONSTRUCTION OF FILM STUDIOS, LABORATORIES, ETC.

Loan assistance upto 70% to 80% of the cost of the project.

Interest at 9% for first 5 years and 12% for subsequent 10 years.

DOCUMENTARY AND NEWSREELS :

Purchase and production on behalf of Government of A.P. and supply to Departments of A. P. Government for exhibition through their field units.

PROGRESS AS ON 1-8-82 :

Loans sanctioned for construction of 131 Cinema Halls :

Rs. 3.42 Crores.

Number of Cinema Halls commenced Business : 92

Loans sanctioned to 5 film studios:

Rs. 75.09 Lakhs.

Number of Documentaries and Newsreels produced : 48

Documentaries & Newsreels under production : 11

Number of documentaries and Newsreels supplied to A P. Government Departments : 118

AND MANY MORE OTHER ACTIVITIES FOR THE GROWTH OF FILM INDUSTRY IN ANDHRA PRADESH.

శ్రీ వేటూరిపై మహాత్ముని ప్రభావం

–డా॥ పోచిరాజు శేషగిరిరావు

ఒక్కొక్క మహా పురుషుని జీవితము సాకల్యంగా సమీక్షిస్తే, ఆ మహాభాగుడు కొందరు మహనీయుల ప్రభావమునకు లోనయియుండుట మనము చూస్తున్నాము. అట్టి మహనీయులు కొందరు సమకాలికులు కావచ్చును. మరి కొందరు అంతకు ముందు తరముల వారును కావచ్చును. కొందరిని ఉత్తమగ్రంథాలు ప్రభావితం చేస్తే, మరికొందరిని వ్యక్తులు ప్రభావితము చేస్తారు. తమ తమ జీవితములను సరిదిద్దుకొనుటకు మార్గదర్శకముగా మహాపురుషుల జీవితాచరణలు పనిచేయుచుండుటయు గలదు. గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వర్యులపై జీవితాంతము ప్రభావము చూపిన వారిలో గాంధీమహాత్ముడొకరు.

1907లో శ్రీ శాస్త్రిగారు మదరాసులో నుండగా శ్రీమాన్ పనప్పాకం ఆనందాచార్యులవారి వాత్సల్యమునకు పాల్పడినారు. ఆనందాచార్యులవారు అఖిల భారత కాంగ్రెసు నాగపూరు సమావేశమునకు (1891) అధ్యక్షులై దేశాభ్యుదయకర విధానముల నభిమానించుచు వచ్చిరి. వారు కారణంగా శ్రీ శాస్త్రిగారిలో జాతీయాభిమానము తొలినుండియు వేరూనినది. భారత జాతీయోద్యమము క్రమశః వేటూరివారి నాకర్షించినది. అది అటుపిమ్మట గాంధీ ఆదర్శముల కంకితమైనది. ఆ రోజులలో జాతీయ భావవాహినిలో మునుకలు వైచిన కొలది మంది భాషాపండితులలో శాస్త్రిగారు పేర్కొనదగినవారు.

గాంధీ మహాత్ముని సత్యాహింసలు, హరిజన దేవాలయ ప్రవేశము వంటివి శాస్త్రిగారి నెక్కువ ప్రభావితులను జేసినవి. 1910 ప్రాంతములో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారితో పరిచయమేర్పడి, క్రమముగా గాఢమైత్రిగా విరిసినది. ఈ సంఘటన వారిలో గాంధితత్త్వాభిమానమునకు మరింత దోహద మొనర్చినది. మహాత్మాగాంధి ఇరువదియొక్క దినములు కఠోరోపవాస దీక్షపూనగా, 'భవిష్యంబింక నెట్లున్నదో'[1] అని ఆక్రోశించుచు పద్యములు వ్రాసినారు. అవి గుండెలను కుదిపి వేయునట్టివి.

గాంధీజీ ప్రతిపాదించిన, ఆచరించి చూపిన సత్యాహింసలు మాత్రమే లోకమును ఎప్పటికైనా ఉద్ధరింపగలవని శ్రీశాస్త్రిగారి పరిపూర్ణ విశ్వాసము. దేహములు రెండుగాని, ప్రాణమొక్కటే యన్నంత గాఢాభిమానముతో గాంధిజీని ప్రేమించెడివారు. 'గాంధి'ని 'గంధి' అనియే శాస్త్రిగారు పిలిచెడివారు.

గాంధీజీ 'క్విట్ ఇండియా' ఉద్యమ సందర్భముగా బొంబాయిలోని ఆగాఖాన్ సౌధములో నిర్బంధింపబడి ఉన్నప్పుడు, మరొకసారి నిరాహార దీక్షకు పూనుకొన్నారు. ఆ దినములలో గాంధీజీ క్షేమమునకై శ్రీ శాస్త్రిగారు తమ తపస్సును ధారవోసినారు. ఆయనకంటె జాతీయవాది మరెవ్వరు? అందు మూలముననే ఆంధ్రకేసరి టంగుటూరి

ప్రకాశం పంతులు, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య, దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావు, గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రభృతులు. శ్రీ శాస్త్రిగారియెడ అపూర్వాదర గౌరవాలను చూపేవారు. గాంధీటోపి పెట్టని జాతీయవాది ఆయన.

గాంధీజీ నిరాహార దీక్షకు పూనుకొన్న రోజుల్లో (1943) శ్రీ శాస్త్రిగారు తిరుపతి సంస్కృత కళాశాలలోని 'విద్వాన్' తరగతికి రాగానే (అప్పుడు వారు కళాశాలలో తెలుగు విభాగమునకధ్యక్షులు) తొలిగంటలో పాఠమారంభించుటకు ముందే గాంధీగారి ఉపవాస దీక్షను గురించి ఒకటి రెండు నిమిషములు చెప్పునరికి వారి కనురెప్పలు తడిసేవి. పిమ్మట శ్రీ శాస్త్రిగారు గాంధికి మనము తిన్న అన్నసారము సమర్పింతమని అంటూ కన్నులు మూసికొని, మమ్ము (శిష్యులను) ప్రార్థింపుమనేవారు. అంతకుముందు అరగంటో, పావుగంటో ముందే 'కాలేజీహాస్టలు'లో భోజనం చేసివచ్చినా, వారు సంకల్పించిన తోడనే మేము ఆకలితో తపించేవాళ్ళము. ఎంతో ఆశ్చర్యం గొలిపేది మాకు. మీ అన్నసారమంతా గంధికి సమర్పణ అయినదని శ్రీ శాస్త్రిగారు అనేవారు. ఇది మా అనుభవంలోది. అట్లే 1946 ప్రాంతములో రాయలసీమ కఱవును గూర్చి, 1947లో భారత స్వాతంత్ర్యమును గూర్చి వారొనర్చిన అమోఘతపస్సు, అందువారు పొందిన దివ్యానుభూతులు మఱువరానివి. శ్రీ శాస్త్రిగారు తమ సహజ వినయశీలమున నిట్టివి బహిరంగ పరచెడివారు కారు.

గాంధీజీ అంటే గాఢానురక్తి ఏర్పడటానికి మరొక ప్రబలకారణం ఆయన ఉభయ సంధ్యలయందుచేసే ప్రార్థనలు.[2] "గంధికి రెండు ప్రార్థనములు ఉచ్ఛ్వాస నిశ్వాసముల వంటివి. వీటిని విడిచి ఆయన జీవింపజాలడు. పదింబదిగా ప్రార్థనా మాహాత్మ్యమును ఆయన ప్రజలకు బోధించును. తనలో నేదేని విశేషమున్న అది ప్రార్థన మూలమున బడసినదేయని చాటుచేయక చెప్పును" ఇవి శాస్త్రిగారి మాటలు. వారే యింకను యిట్లనిరి.[3] మహాత్ముడు నిష్కళంకుఁడైన అహింసాతత్పరుఁడు.........మహాత్ముని అహింసా ధర్మమే, ఆయన ప్రార్థనమే విశ్వప్రపంచమంతా యిక మీద వెల్లివిరియనున్నవి.[4] నిజముగా మహాత్ముఁడు అలౌకికానుభవము గడించిన మహాకవి అని నేననుకుంటాను. ఆయన కొన్ని కొన్ని సందర్భములలో సాధారణముగానే వ్యవహరించిన చిన్న చిన్న వాగ్వ్యవహారములే కూడా మహాకావ్యములనదగినవిగా ఉంటవి." స్వచ్ఛమైన శీలమే ఆకృతి వహించి గాంధీజీగా రూపొందెనని శ్రీ శాస్త్రిగారి భావన. గాంధీజీ 1925లో మదరాసు వచ్చినప్పుడు చెప్పిన స్వాగతపద్యములలో మచ్చున కొక్కటి[5]

'కామేనవాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాతనా చైక విశుద్ధ వృత్తయే
సుదర్శనా ఆత్మవిదే మహాత్మనే
సుస్వాగతం మోహనచంద్ర గంధయే'

'మహాత్మాజీ నాహృదయాన్ని మొదటినుండీ జయించెను. ఆ విశ్వాసము పరమగురువుల (మాష్టరు సి. వి. వి.) వారివలన కూడా మరింతగా బలపడింది.'[6] ఇవి మునికృష్ణయ్య బి.ఏ;బి. ఎల్ (తిరుపతి) గారి డైరీలోని వాక్యములు. ఇదే అభిప్రాయమును శ్రీ పి. చెంచయ్యగారు 'మద్రాసు' ఒకచోట వెలిబుచ్చినారు.[7] గాంధీజీ ఆదర్శాలతో ఆయన అంతగా తాదాత్మ్యం చెందినారు.

శ్రీ శాస్త్రిగారు కృత్రిమమైన సంఘమర్యాదలను పటాపంచలు చేసిన సంఘసంస్కర్త. ఇదీ గాంధీ

ప్రభావంవల్లనే. ఏడుకొండల వానిసన్నిధికి హరిజనులను తొలిసారిగా వెంటబెట్టుకొని వెళ్ళిన 'చండాలోస్తు నతుద్విజోస్తు భవతి హ్యేషా మనీషామమ' అన్న శంకరులు వేటూరివారు.[౮]

బుద్ధుడైనా, గాంధి అయినా ఆయనకు ప్రాణం. అంటే వారి కరుణాతరంగిత హృదయం, సేవాపరాయణత వీనివల్లనే. మనస్సు నిర్మలమైన మనిషిగా పెరిగిన వారే మహాత్ములు. ఆ కోవలోని వారే శ్రీ శాస్త్రిగారు.

మహాత్మాగాంధి అస్తమయం శ్రీ శాస్త్రిగారి జీవితంలో ఎంతో నైరాశ్యాన్ని నింపింది. మహాత్ముని దశాహమునాడు మదరాసు రేడియోనుండి వారు ప్రసంగిస్తూ మధ్యలో గొంతురాపడి, దుఃఖము మితిమీటి మాటరాకుండ పోయినది. ఆర్ద్రతయే అందులకు కారణము. గాంధిజీహత్య, కాశ్మీరు యుద్ధము, పంజాబు-బెంగాలులలో దారుణహత్యాకాండ వేటూరి వారిని మానసికంగా ఎంతగానో కల్లోలపరచి, నిరంతర వృధాపరి భగ్నులను చేసివైచినవి. 8-2-48న మద్రాసు ఆకాశవాణినుండి వారు ప్రసంగిస్తూ," గాంధీగారి అగ్ని సంస్కార సమయంలో జరిగిన మీటింగులో మాట్లాడబోతే నోరాడలేదు. నాలో చితిమండుతూంది. ఇప్పుడేమో అజ్ఞానాంశములన్నీ మంట గలసి పోవుగాక అని మొత్తుకొన్నాను. .... గాంధీగారికి దారిచూపిన వెలుగు భగవత్ప్రార్థనము" అన్నారు. వారి హృదయాన్ని ఎంతగా కలచివేసిందో తెలుపడానికీ మాటలు చాలు. అప్పటి ఆయన అనుతాపము అంచులుదాటిని, మానవాళి భవితవ్యమును గురించి ఆయన పడిన ఆవేదన ఊహించే కొద్దీ ఆశ్చర్యం వేస్తుంది.

ఏ అంతస్థుకు శ్రీ ప్రభాకర శాస్త్రిగారు పరిణతి చెందినారో తెలుపుటకు 1943లో గాంధి ఆమరణ నిరాహారాదీక్ష పూనినపుడు శ్రీ శాస్త్రిగారు ఆంధ్రప్రభకు వ్రాసిన లేఖలోని ఈ వాక్యములు ఇట స్మరింపదగినవి.

"ఈశ్వరుడు చావు బ్రతుకులలో ఉన్నకాలమిది. గంధికి కాదు చావుబ్రదుకులు, ఈశ్వరునకే. లోకమున కిట్టి మహాపద్దశ రానున్నదని, ఇంకా ఎంతెంతో ఎదురుచూస్తూ ఎన్నాళ్ళనుండో క్షోభపడుతున్నాను. సృష్టి ఆరంభించిన తర్వాత ఈనాడు మానవతకు కల్గిన క్షోభం వంటి క్షోభ ఎన్నడూ కలుగలేదు. నేడు మానవకోటి అంతరంగ మహాసంతాప జ్వాలలు భగవదభిముఖమై, ఏకైక పరమార్థము అర్థిస్తూ ఏకరూపముగా వెళ్ళి భగవంతుని [ఉన్నాడో లేడో తేలవలసిన కాలమిది] ప్రార్థనా రూపమున తాకినట్లు తాకి ఉండవు. ఒక జాతికాదు, ఒక దేశము కాదు; విశ్వమంతా వివేకము గల మానవత అంతా, అనుకూలముగానో, ప్రతికూలముగానో గంధి ఉపవాసము వల్ల క్షోభిల్లుతున్నది. దేవరాక్షస సముద్రమథనమిది. అందు రాక్షసులకు వంచనమున్నది. ఇందు అది ఉండదు. అమృతము వెలసెనా విశ్వమంతా అమృతమయమే. ఏమి కానున్నదో.

'సర్వధర్మాన్ పరిత్యజ్య, అన్యధా శరణం నాస్తి' పలుకుల భవితవ్యం తేలనున్నది. శ్రీరాముడు అవతారం ముగించినప్పుడు, అయోధ్యావాసులు వయస్సయిన వారెందరో బిడ్డలకు ఇళ్ళువాకిళ్ళప్పగించి శ్రీరామునితో సరయూ ప్రవేశము చేసిరట! వయసయిన అస్మదాదులకు గాంధి జీవించక పోతే

ఇక జీవితాశ వ్యర్థం. అమంగళము కలుగకుండు గాక।"

జాతిమనుగడ గాంధీజీ సిద్ధాంతాల సాఫల్యంపైనే ఉన్నదని విశ్వసించిన కర్మయోగి శ్రీ శాస్త్రి గారు. ఆయనకు గాంధీజీయే ఊపిరి. త్రికరణములా మహాత్ముని అనుసరించిన గాంధేయవాది, జాతీయాభిమాని, దేశభక్తుడు, భారత జాతీయ జీవనవాహినికి శక్త్యనుసారము ఆ జీవితము తోడుపడిన ధన్య జీవులు శ్రీ ప్రభాకరశాస్త్రి మహోదయులు

[నాథీసిస్ 'వేటూరి వారి సారస్వత వరివస్య'ఆధారంగా]

---

1. 24–9–1924 ఆంధ్ర పత్రిక.

2. ప్రభాకర ప్రవచనములు–పుట 85.

3. నవ్యసాహిత్యపరిషత్ ఉపక్రమోపన్యాసము -1946–పుటలు 20,21

4. నవ్యసాహిత్యపరిషత్ ఉపక్రమోపన్యాసము -1946-పుట 24

5. 7-2-1925 ఆంధ్రపత్రిక.

6. He (V.P.S.) said that Mahatmaji conqured his heart from the beginning and his faith further strengthened by the Master also (5-8-1948).

7. 3-2-1976 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో తిరుమల రామచంద్రగారి మాటలు.

8. 'He was a follower of Mahatm Gandhi, since and devout' The pilgrim-the quarterly magazine of th Christian Society - December 195 Page-3.

31-8-1950 ఆంధ్రప్రభ సంపాదకీయను నుండి. సంపాదకుడు నార్ల వేంకటేశ్వరరావు.

పూజనీయులు

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

-వి. డి. ఎస్. ప్రసాద్

శ్రీ ప్రభాకరశాస్త్రిగారిని గురించి నా పిన్ననాటి నుండి వినుచుంటిని. నా సహాధ్యాయి ఇమ్మానేని నటరాజారావు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు సంకలనము గావించిన చాటుపద్య మణిమంజరిని నాకిచ్చినారు. అందలి చాటువలు నన్నెంతగనో ఉత్సాహపరచినవి.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారితో నా మూలమున నాకు పరోక్ష పరిచయము లభించినది.

ఆ తరువాతనే ముక్త్యాలలో నా అన్నగారి సన్నిధిన ఉంటూ వారి తోటల పాలన (చూస్తూ) పొగనారుల పరిశీలించుచుంటిని. 1920లో—అపుడు నేను విద్యా వ్యాసంగాసక్తుడనై కూడ ఉంటిని. మన ప్రాచీన విజ్ఞాన విశేషాలూ శాస్త్రములు, పరిశ్రమల గురించి తెలిసికొనుటకు కుతూహల పడుచుంటిని. ముక్త్యాలలో శ్రీ అన్నగారి ముద్రణాలయపు మేనేజరు శ్రీ చల్లా సూర్యనారాయణగారితో నీ విషయముల ముచ్చటించుచుండగా వారు "శ్రీ ప్రభాకరశాస్త్రిగారు బహుగ్రంథముల పరిశీలించిన ప్రజ్ఞాశువు. వారికి వ్రాయండి" అని చెప్పిరి. అంతట నుండి నేనాయా విషయములను గురించీ వానికి సంబంధించిన గ్రంథముల గురించీ వివరింపగోరుతూ శ్రీ ప్రభాకరశాస్త్రిగారికి జాబులు వ్రాయుచుంటిని. నేను వారికి వ్రాసిన తొలి జాబున "శ్రీమద్గీతో పనిషద్గుర్గోణ దోగ్ధ్రే శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః" అనియున్న మకుటము గమనించి శ్రీ శాస్త్రిగారుత్సాహపరవశులై నన్ను ప్రశంసిస్తూ బదులు జాబులో వ్రాసిరి. నేను కోరిన విషయముల కన్నిటికి వివరణాత్మకములైన ప్రత్యుత్తరముల వ్రాయుచుండిరి. వారి నీ జాబుల మూలమున నాకు బహుగ్రంథముల పరిచయము లభించినది. శ్రీ శాస్త్రిగారితో జాబుల పూర్వకముగా నాకు కలిగిన పరిచయమిది. వారి జాబులలో వారు నా యెడల బహుధా సద్భావమూ వాత్సల్యముల గనుపరచుచుండిరి. అమరావతి రాజా శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారిని గురించిన చాటువులు పంపుడని శ్రీ శాస్త్రిగారు జాబు వ్రాయగా వాటిని శ్రీ శాస్త్రిగారికి పంపించితిని. నాకు జ్యేష్ఠ కుమారుడు ముకుంద కృష్ణరాయలు జన్మించినాడని వారు తెలిసికొన్నారట. వెంటనే వారు నన్నూ నా పుత్రుని ఆశీర్వదిస్తూ జాబు వ్రాసిరి. ఒక పద్యమునూ వ్రాసిరి. ఆ పద్యమంతా జ్ఞాపకములేదు. వారిట్లు నాపట్ల నవ్యాజానురాగము గనుపరచుట నన్ను ముగ్ధుని గావించినది. ఇదేదో పూర్వజన్మానుబంధమని తలచుచుంటిని.

తరువాత 1921లో నని జ్ఞాపకము – శ్రీ అన్నగారికి కొన్ని సరుకులు మదరాసునుండి తీసికొని

వచ్చుటకు నేను మద్రాసు వెళ్లవలసి వచ్చినది. "నేను మదరాసు వస్తున్నాను విడిది యేర్పాటు చేయండి" అని శ్రీ శాస్త్రిగారికి జాబు వ్రాసినాను. నేను మద్రాసు వెళ్లి జట్కాలో తిరువళిక్కేణి వెళ్ళి శ్రీ ప్రభాకరశాస్త్రి గారుంటున్న వీధిలో వారి యింటి నన్వేషిస్తున్నాను. శ్రీ శాస్త్రిగారు నా రాకకోసం చూస్తూ వాకిట నున్నారు. "శ్రీ ప్రభాకరశాస్త్రి గారెక్కడున్నారు?" అని అడిగినాను. "ప్రభాకర శాస్త్రిని నేనే. సదాశివేశ్వర్లు మీరా?" అన్నారు, శ్రీ శాస్త్రిగారు. ఇలా పరస్పరము పరిచయము కలిగినది.

శ్రీ శాస్త్రిగారు నన్నాప్యాయనముగా నాదరిస్తూ నా కోసము వారేర్పాటు చేసిన విడిదికి నన్ను తీసికొనిపోయి దింపినారు. నా వంటమనిషి నా సామానులచట పెట్టినాడు. వంటపని సాగిస్తున్నాడు. వంటకు కావలసిన పాత్ర సామానులను శ్రీ శాస్త్రి గారాతని కిచ్చిరి.

నాకు ఇడ్లీకాఫీలను శ్రీ శాస్త్రిగారు వారింటిలోనే చేయించి పంపినారు. అవినేనారగించితిని. కొద్దిసేపటికి శ్రీ శాస్త్రిగారు నా దగ్గరకు వచ్చిరి. కుశల ప్రశ్నలడిగిరి. 'మన భారతీయ ప్రాచీన సభ్యత సంస్కృతులు, కళలు, విద్యలు, విశేషించి సాహిత్యముల విషయమున మీకుగల యాదరాభిమానములు నన్నలరించినవి. మిమ్ము చూడవలెనని లచుచుంటిని. మీరే వచ్చితిరి. చాల సంతోషము దొరక దైవసంఘటన కావచ్చు. మన చెలిమి క్కబడుట భగవత్సంకల్పము. మన జాబులలో ట్టి సూచనలున్నవి.' అని ప్రస్తావించిరి. వారి యాదరము, సద్భావము, వాత్సల్యములకు నాకృతజ్ఞతతెలిపితిని. పిదప విద్యా విషయము [లనవి] ముచ్చటించుకొన్నాము. అంతలో వంటవాడు వంట అయినదని చెప్పినాడు. శ్రీ శాస్త్రిగారింటికి వెళ్ళినారు. నావిడిదికెదురిల్లే వారిల్లు. నేను స్నానముచేసి భుజించి విశ్రమించితిని.

సాయంకాలం శ్రీ శాస్త్రిగారువచ్చి కాఫీకి రమ్మన్నారు. కాఫీకి వారింటికి వెళ్ళినాను. ఉపా కాఫీ యిచ్చినారు-అవారగించినాను. "మీరు వచ్చిన పని ఏమిటి?" అని అడిగినారు శ్రీ శాస్త్రిగారు. వచ్చినపని తెలిపినాను. "అవి చూడవచ్చు. మీరింతకాలముకు వచ్చినారు. మద్రాసులో చూడదగిన విశేషాలు చూడండి" అన్నారు శాస్త్రిగారు. సాయంకాలమైనది. శ్రీ శాస్త్రిగారు నేను తిరువళిక్కేణి బీచి (సముద్ర తీరము)కి వెళ్ళినాము. అచటి సముద్రపు కెరటాల నటనల వీక్షిస్తూ సముద్రపుగాలి సోకుడుల హాయిననుభవిస్తూ నవీయిపీ మాటలాడుకొంటూ కొంతసేపు విశ్రమించినాము. మరునాడు ఉదయాన మరల శ్రీ శాస్త్రి గారింటనే యిడ్లీకాఫీ నాకిచ్చినారు. నా అలవాటులు ఆచారాదులను గురించి శ్రీ శాస్త్రిగారు నావంటవానినడిగితెలిసికొన్నారట. నా ప్రవర్తన మెచ్చదగినదని తలచినా మన్నారు. విశేషించి నేను శాకాహారినని వినుట తమకు బహుచిత్రముగా తోచినదన్నారు. సహజముగా మాంసాహారులు—అందునా జమీందారు కుటుంబమున జన్మించి యిలా శాకాహారులగుట ఆశ్చర్యమే "అని, 'అదెట్లు సంగతమైనది?" అని ప్రశ్నించినారు. 'అది చాలా కథయున్నది—ఆయా సంఘటనల మూలముగా మాంసాహారముపై నాకేవగలిగి దానిని విసర్జించినాను' అని టూకీగా నా విషయము చెప్పితిని. అది విని 'మీరు వంటకు గదికావలెనని వ్రాయగా మీరు మాంసాహారులు గాబోలునను కొని వంటకు వేరుగా యేర్పాట్లుచేసినాను శాకాహారులని తెలిస్తే మాయింటనే మీకు

భోజనమేర్పాటు చేయించియుందును. ఇప్పుడిక మీరు మాయింటనే మావంటనే భుజించవలె"నని శ్రీ శాస్త్రిగారు గట్టిగాపట్టుబట్టిరి. వారింటనే నేను భుజింపవలసి వచ్చినది.

ఉదయము 9 గంటలైనది. నేను స్నానముచేసి కూర్చొనియున్నాను. శ్రీ శాస్త్రిగారు వచ్చిరి. 'భోజనమునకు రండి' అని శ్రీ శాస్త్రిగారు నన్ను వారింటికి తీసికొనివెళ్ళిరి. నాకు భోజనము వడ్డించినారు మాత శ్రీ శాస్త్రిగారి సతీమణి. శ్రీ శాస్త్రిగారు నాచెంత గూర్చున్నారు. నేను భుజించుచుండగా శ్రీ శాస్త్రిగారు కూరలచవుల వర్ణించి తెలుపుతూ అదెంక కొంచెము ఇది మరింత భుజించండని నన్ను ప్రేరేపుచుండిరి. నేతిని యెక్కువగా భుజించుట నాకలవాటులేదు. మరి శాస్త్రిగారో 'నేయి అమృతము, జవసత్వములనది సంఘటిస్తుంది - ఆరోగ్యప్రదము. దానిని బాగా నుపయోగించుటవసరము' అని యుపన్యసిస్తూ చేరెడు చేరెడు నేతిని క్రుమ్మరించిరి. తనివితీర భుజించితిని. వారింట వంటమిగుల శుచిగను రుచ్యముగనూ నున్నది. శ్రీ శాస్త్రిగారు భోజనప్రియులు. ఆయా యాహారముల విశేషములనభివర్ణించి తెలుపుచుండేవారు. భోజనానంతరము అవీయివీ ముచ్చటించుకొంటూ కాసేపు విశ్రమించినాము.

'ఈనాడు లైబ్రరీనీ, మ్యూజియమును చూద్దాము' అన్నారు శ్రీ శాస్త్రిగారు. శ్రీ శాస్త్రిగారూ నేనూ జట్కాలో యెగ్మోరులోని ప్రాచ్యలిఖిత పుస్తక భండాగారము (శ్రీ శాస్త్రిగారు పనిచేయుచున్న లైబ్రరీ)కు వెళ్ళినాము. శ్రీ శాస్త్రిగారి కార్యాలయములో కూర్చున్నాము. ఆ గ్రంథాలయమున గల గ్రంథములు, కళలు, శిల్పములు, శాస్త్రములు, మొదలైనవాటిని శ్రీ శాస్త్రిగారు నాకు చూపించిరి. యామిశాష్టక తంత్రము మొదలైనవాటిలో కొన్ని ప్రక్రియలు కుతూహలకరములైనవి వున్నవి.

ఇంతలో శ్రీ గన్నవరపు సుబ్బరామయ్యగారు వచ్చిరి. వీరు లైబ్రరీలో పుస్తకాలకు ప్రతులు వ్రాయు వారట. వారిని శ్రీ శాస్త్రిగారు నాకు పరిచయ పరచిరి. శ్రీ సుబ్బరామయ్యగారు సమర్థులు. ఆంధ్ర గీర్వాణ ఆంగ్లములలో నారూఢ ప్రజ్ఞ గలవారు.

శ్రీ శాస్త్రిగారూ, శ్రీ సుబ్బరామయ్యగారూ, నేనూ మ్యూజియముకు వెళ్ళినాము. అచట శిల్పాల దర్శించినాము. అచట శిల్పాలు శాసనాల నాయా విశేషాలను శ్రీ శాస్త్రిగారు నాకు తెలిపిరి. ఆ శిల్పాలలో బుద్ధునిదొక శిల్పము మనోహరముగా నున్నది. అది నన్నాకర్షించినది. ఆ తరువాత మరల శ్రీ శాస్త్రిగారి కార్యాలయమునకు వచ్చినాము. రేపు బొటానికల్ గార్డెన్‌కు అడయారులోని దివ్యజ్ఞాన సమాజమునకు వెళ్లుదామన్నారు శ్రీ శాస్త్రిగారు. పిదప నేనూ శ్రీ శాస్త్రిగారు జట్కాలో మా నివాసములకు వచ్చినాము.

మరునాడు ఉదయమున 9 గంటలకు నేనూ శ్రీ శాస్త్రిగారు భోజనాలు చేసినాము. కాసేపు విశ్రమిస్తున్నాము. శ్రీ శాస్త్రిగారు నా విద్యావ్యాసంగములు గురించి అడిగి తెలిసికొనుచున్నారు. 'మీకు సాహిత్యములో సరసాభిరుచి యున్నది. సముచిత ప్రజ్ఞా, వివేచనా శక్తి యున్నవి. మీ రేమైనా రచించినారా? అని అడిగిరి. నేను పరిణత ప్రజ్ఞుడను గాను. వివిధ విషయముల నవగాహన జేసికొనుచున్న(ట్టి బుద్ధి) కల్పుడను మాత్రమే. అందువల్ల గ్రంథాల నవలోకించుచుందునేగాని రచన కుద్యమించలేదు అన్నాను. "ఇప్పుడేది చదువుచున్నారు?" అన్నారు శాస్త్రిగారు. "క్షేమేంద్రుని అవదాన కల్పలతను చదువుచున్నాను" అన్నాను. "అవదానకల్పలతనా—

అది ప్రశస్తమైనదే. అది దుర్లభమే. మీ రెచట సంపాదించితిరి?" అన్నారు శ్రీ శాస్త్రిగారు. "ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాలు వారినుండి సంపాదించినాను" అన్నాను. "దానిని అనువదింతురా?" అన్నారు శాస్త్రిగారు. "ఆ తలపులేదు. దానిని చదువుచున్నందుకే నన్ను ఆర్యసంఘ బాహ్యునిగా నిందిస్తున్నారు అన్నగారి ఆస్థానులు. ఈ మూలముగా అన్నగారికీ నాయెడల నప్రియభావము గలుగుచున్నట్టున్నది. మరిదీనిననువదించితే యీ పరిస్థితులు మరింత విషమించవచ్చు" అన్నాను. 'ఆ ఆస్థానులే యవివేకులు.బుద్ధుడు మహోదారుడు. లోకకల్యాణ దీక్షాదక్షుడు. ఈ మీ కార్యము నిరవద్యమని నేను సమర్థింతును, నా వాదములో మీ అన్నగారికి నచ్చజెప్పగలను. మీరు నిశంకగా అనువదించండి' అన్నారు శాస్త్రిగారు. ఇంతలో శ్రీ సుబ్బారామయ్యగారు వచ్చిరి. మాదీ సంభాషణ విని శ్రీ సుబ్బారామయ్యగారు నవ్వి 'ఆ ఆస్థాన పండితులకు విశాలదృష్టి యుండియుండదు-బుద్ధుడు దశావతారములలో నొకడా ? ఆయన మతము నింద్యమా ? ఏమి వివేకమిది ? మీరీవిషయమువారి నేల ప్రశ్నించలేదు?' అన్నారు సుబ్బరామయ్యగారు. అంతలోపుగా నేను వారికి బదులు చెప్పలేదు, కాని, ఇది క్షేమేంద్రునికృతి. క్షేమేంద్రుని యెడల గౌరవముతోనే నేను దీనిని చదువుచున్నాను. క్షేమేంద్రుడు ఆర్యసంఘ బాహ్యుడు పతితుడునైతే నేనూ అలాటివాడనే. సుప్రసిద్ధ ఆంధ్రకవితల్లజులు తిరుపతి వేంకటేశ్వర కవులు 'బుద్ధచరిత్ర' రచించిరి కదా! వారు దోషులా? నాస్తికులా? ఆర్యసంఘద్రోహులా? అని మాత్రమే నేను వారికి ప్రతివాదము చేయుచుంటిని. ఈ ఉపమలవల్లనే శ్రీ అన్నగారికి నా వాదముపట్ల కొంత విశ్వాసము గలిగినది." అన్నాను. దానిని అనువదించుడని శ్రీ సుబ్బరామయ్యగారూ నన్ను ప్రోత్సహించిరి. అందుకు నేను సమ్మతించితిని.

పిదప శ్రీ శాస్త్రి గారు. శ్రీ సుబ్బరామయ్యగారు, నేను జట్కాలో తేనాంపేట బొటానికల్ గార్డెన్‌కు వెళ్లినాము. వృక్షశాస్త్ర సంబంధముగా జరుపబడుచున్న వివిధవిషయముల పరిశీలించినాము. ఆ వివరములిచట తెలుపుటకు స్థలము చాలదు. నా జీవిత చరిత్రలో నావిషయము విపులీకరించినాను.... వానిలో ముఖ్యమైనవి అంటులు. అవి అయిదు తీరులవి. వాటిలో ఇనార్సింగు లెయరింగు అంటుల నిర్మించుట నాకు పరిచితమే. నేనూ వాటిని నిర్మించుచుంటిని. కట్టింగు, బడ్డింగ్, క్రాస్ గ్రాఫ్టింగు, రూట్ గ్రాఫ్టింగులను గూర్చి చదివియున్నానే కాని ప్రత్యక్షముగా చూడలేదు. ఇపుడిచట వాటిని సిద్ధపరచు పద్ధతులను చక్కగా పరిశీలించి గ్రహించినాను. ఆ తరువాత నా పద్ధతుల నలవరచుకొని ఆ అంటుల నిర్మించుటనూ నేర్చితిని. ఇట్లా తోటను దర్శించుట నా ఉద్యాన కృషి పరిజ్ఞానమునకు బాగా నుపకరించినది.

తేనాంపేట నుండి మేము ముప్వురము జట్కాలో అడయారు దివ్యజ్ఞాన సమాజమునకు వెళ్లినాము అచట దివ్య జ్ఞాన సమాజపు ప్రధాన వ్యక్తులు శ్రీ వెడ్బిటరు, శ్రీ అనిబిసెంటు మొదలైన వారి నివాసములను చూచినాము. అచట బహు విశాలమైన మఱ్ఱి చెట్టున్నది. దానికి చాలా యూడలున్నవి. దానిది దట్టమైన నీడ. దానికిచట కొంత ప్రాముఖ్యము గలదట. పిదప దివ్యజ్ఞాన సమాజపు

గ్రంథాలయమున ప్రవేశించినాము. అదొకింత పెద్దదే. వివిధ మతాలకు సంబంధించిన గ్రంథాలందున్నవి. ఆ గ్రంథాలనొకింత పరికించినాము. అయితే పఠించుటకు సమయమేది? ఆదరా బాదరా అట్టిటు ఆకుల తిరుగవేస్తూ చదివినాము. ఆయా మతాల విశేషాలను గురించి ఆయా మతాల వారు రచించిన గ్రంథాలూ వివిధ మతాల సామరస్యమును గురించి వారు వారు రచించిన గ్రంథాలూనవి. ఇచటనూ ఒకపాటి తోటయున్నది. ఇందు విశేషమేమీలేదు. కాని నాగలింగము కన్నింగలను చెట్లున్నవి. శ్రీశాస్త్రిగారికి పాదపముల విషయమునా బహుధాపరిజ్ఞానమున్నది. కాగా పూవుల గురించి వారు చాలా ప్రసంగించినారు. పాటలీ పుష్పపు సౌందర్య సౌభాగ్యములను చాలగా విశదపరచిరి. దానిని గురించి వారొక వ్యాసమునూ రచించినామని చెప్పిరి. తరువాత గులాబిని గురించి కొంత చర్చించితిమి. గొజ్జుగి గులాబికి వికృతి కావచ్చునేమో యని సుబ్బరామయ్యగారన్నారు. కుబ్జకమునకు గొజ్జుగి వికృతియని శ్రీ శాస్త్రిగారన్నారు. కుబ్జకము కనోజమునకు ప్రాచీన నామమట. “కనోజ్‌లో గులాబీ తోటలు విశేషముగా నున్నవి. కనుక కుబ్జకము-గొజ్జుగైతే గొజ్జుగి గులాబి కాదగునేమో. ఇంకా గులాబీ కాశ్మీరములో రమ్యముగానున్నది కూడ. కాన గులాబీ జన్మ స్థానము భారత దేశము కావచ్చుగదా ?” అన్నాను నేను. అంతటితో నా చర్చ ముగిసినది. తరువాత చంపకము (సంపెగ) చర్చ సాగినది. నేడు సర్వసామాన్యముగా సంపెగని వ్యవహరింపబడుచున్నది నిజమైన సంపెగ కాదు అని చంపకమును గురించిన వర్ణనలను శ్రీ శాస్త్రిగారు వివరించిరి. శ్రీ సుబ్బరామయ్యగారు శ్రీ శాస్త్రిగారిని బలపరచుచు ‘సర్వసామాన్యముగా సంపెగగా వాడబడుచున్నది మనోరంజని’. దాని ఆకారము నాసికనుబోలియుండదు’ అన్నారు - శ్రీ శాస్త్రిగారు కనింగ పూవును చూపి ఇది దాదాపు చంపకములో చేరుతుంది అని నిజమైన చంపకమింతకంటెను సుందరముగా వుంటుంది. బంగారు రంగు. తీవ్రమైన పరిమళము గలది-నాసికాకారంగా నుంటుంది. విశాఖ జిల్లాలో దానిని చూచినాను” అని శ్రీ శాస్త్రిగారు చెప్పినారు. తరువాత శ్రీ శాస్త్రి గారు నాగలింగము పూవును చూపినారు. ఇది సార్థక నామము గలది. దాని నడుమ కీలముగా నున్నది. లింగాకారముగా నుండగా పుష్పదళాలు పాము పడగలవలె నాలింగముపైన నాచ్ఛాదనముగా వంగియుండుటను చూపినారు. ఈ విధముగా పూవులు పాదపాలను గురించి కొంతసేపు చర్చ జరిగినది.

అప్పుడు 3 గంటలైనది. శ్రీ శాస్త్రి గారు వారింటిలో దోసెలను పచ్చడిని చేయించి పొట్లము గట్టి తీసికొని వచ్చిరి. ఒక చెట్టు నీడన కూర్చున్నాము. శాస్త్రిగారా పొట్లమును విప్పి శ్రీ సుబ్బరామయ్యగారికి నాకు రెండేసి దోసెలను కొంత కొంత పచ్చడిని యిచ్చినారు. ముగ్గురము నాయుపాహారము నారగించినాము. ఉపాహారమైతే లభించినది కాని దప్పికకు నీరు దొరకలేదు. దప్పికకే కాదు చేతులు మూతులు కడుగుకొనుటకైనా నీరు లేదు. ఎంతగా వెదకినా ఒక బొట్టు నీరైనా లభించలేదు. ఏమి చేస్తాము? ఆ చేరువనే సోడా అంగడున్నది. తలా రెండేసి సోడా సీసాలను తీసికొన్నాము. ఒక సీసా సోడాను త్రాగి దప్పి తీర్చుకొని రెండవ సీసా సోడాతో చేతులు మూతులు కడుగుకొన్నాము. ఇక మరలి పోవలసియున్నది.

మేము వచ్చిన జట్కావాడు బాడుగ తీసికొని వెళ్లిపోయినాడు. మేము మరలి వెళ్లుటకు సాధనమేదీ దొరకలేదు. జట్కాయేకాదు. రిక్షాలూ లేవు. ఇక స్వశక్తినే యుపయోగించుకొనవలసివచ్చినది. మా పాదాలనే ఆశ్రయించవలసివచ్చినది. కాళ్లకు బుద్ధి చెప్పి కదలినాము. అడయారు నుండి థౌసెండు లైట్సు దాక నడచినాము. అచటనొక జట్కా లభించినది. దానిలో నెక్కి ఫ్లవర్ బజార్‌కు వెళ్లినాము. అచట నుండి శ్రీ సుబ్బరామయ్య గారు వారింటికి వెళ్లిరి. శ్రీ శాస్త్రిగారు, నేను శ్రీ అన్న గారికి కావలసిన సరకులను తీసికొన్నాము. తరువాత నా సరకులతో నేను శ్రీ శాస్త్రి గారు జట్కాలలో తిరువళిక్కేణికి మామా నివాసాలకు చేరినాము.

మరునాడుదయాన నావంటవాని దీసికొని జార్జి టౌనుకు వెళ్లినాను. శ్రీ అన్నగారికి కావలసిన మిగిలిన సరకులను తీసికొన్నాను. ఆ సరకుల నన్నిటిని బేరాలాడి తీసికొని తిరువళిక్కేణిలో నా విడిదికి వచ్చుసరికి 10 గంటలైనది.

శ్రీ శాస్త్రిగారు నాకోసము చూస్తున్నారు. నేను స్నానముచేసి భుజించినాను. శ్రీ శాస్త్రిగారూ భుజించినారు. కొంచెముసేపు విశ్రమించినాము. 2 గంటలు కావచ్చినది. ఆంధ్రపత్రిక ఆఫీసుకు వెళ్ళుదామన్నారు శ్రీ శాస్త్రిగారు. జట్కాలో తంబుచెట్టివీధిలోని ఆంధ్రపత్రిక కార్యాలయమునకు వెళ్ళినాము. అచట శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు గారి దగ్గరకు నన్ను తీసికొని వెళ్ళినారు శ్రీ శాస్త్రి గారు. నాగేశ్వరరావుగారు సంపాదకీయపు వ్యాస రచనలో కావచ్చు నిమగ్నులైయున్నారు. అచట నున్న కుర్చీలను లాగికొని శ్రీ శాస్త్రిగారు నేను కూర్చున్నాము. కుర్చీలను లాగుటలోనైన చప్పుడు విని శ్రీ నాగేశ్వరరావుగారు మావంక చూచినారు. నేను నమస్కరించినాను. శ్రీ శాస్త్రిగారు నన్ను శ్రీ నాగేశ్వరరావు గారికి పరిచయపరచబోవుచుండగా శ్రీ నాగేశ్వరరావుగారు వారికి సహజమైన మందస్మితముతో ''వారునాకు చిరపరిచితులే శాస్త్రిగారూ! రాజకీయముగా మేము సన్నిహితులము. వారి విషయము నాకు బాగా తెలిసినదే. వారి చిత్తస్థైర్యమూ కార్యదీక్ష ప్రశంసనీయములు" అన్నారు. 'మీకు రాజకీయాల మూలముగా సన్నిహితులైతే నాకు వీరు సాహిత్యము మూలమున సన్నిహితులు. వీరి సాహిత్యవ్యాసంగము మన ప్రాచీన సభ్యత సంస్కృతుల యభిమానము-విశేషించి ప్రాచీన కళలు, శాస్త్రములు, పరిశ్రమలు, ఉద్యానములుపట్ల వీరికిగల కుతూహలము ప్రశంసనీయము" అన్నారు శ్రీ శాస్త్రిగారు. 'వారి ఉద్యానకృషిని నేను చూచినాను. మరి వారికి సాహిత్యాదుల యాశక్తి ప్రజ్ఞలున్నవని నాకు తెలియదు' అన్నారు శ్రీ నాగేశ్వరరావుగారు. ఇలా కొంతసేపు సంభాషణ జరిగింది. తరువాత శ్రీ నాగేశ్వరరావు గారితో శ్రీ శాస్త్రిగారు, నేనూ సెలవు చెప్పినాము. 'ఏవైనా వ్యాసాలు పంపండి' అన్నారు శ్రీ నాగేశ్వరరావుగారు. 'నేనేవీ రచించలేదండీ' అన్నాను. 'శక్తి ఉన్నప్పుడు దానిని వినియోగించపద్దూ? ఉపేక్షించకండి. ఉద్యమించడి.' అని శ్రీ నాగేశ్వరరావు గారు ప్రోత్సహించినారు. 'అలాగే సాగిస్తాను' అని అన్నాను. 'ఉపేక్షించవద్దు. రచనలు సాగించండి' అని శ్రీ శాస్త్రిగారూ పునరుద్బోధించినారు.

అంతట శ్రీ శాస్త్రిగారూ నేనూ జట్కాలో ఎగ్మూరులో శ్రీ ఆచంట లక్ష్మీపతిగారి ఆయుర్వేద కళాశాల, ఫార్మసీలకు వచ్చినాము. శ్రీ శాస్త్రిగారు లక్ష్మీపతిగారికి నన్ను పరిచయ పరచినారు. ఆయుర్వేద విషయాలను ప్రస్తావించినారు శ్రీ లక్ష్మీపతి గారు.

'ఆవిషయాలలో నాకు కొద్దిగా పుస్తకపరిచయమే కాని ప్రయోగానుభవములేదు. నా జనకులకు ఆయుర్వేదము అభిమాన విద్య. ముఖ్యముగా శల్యతంత్ర వైద్యులు-శస్త్రచికిత్సలు చేయుచుండే వారు.' అని తెలిపినాను. 'అయితే వారి దగ్గర ఆయుర్వేద పురాతన పుస్తకాలున్నవా? వాటిని ఇస్తారా?' అన్నారు శ్రీ లక్ష్మీపతిగారు. 'ఏవో రెండు పుస్తకాలున్నవి. వాటిని నా శ్రీ అన్నగారి కిచ్చాను.' అన్నాను. అంతట శ్రీ లక్ష్మీపతిగారు వారి ఫార్మసీకినన్ను తీసికొనిపోయి అచట జరుపబడుచున్న పనులను నాకు చూపించినారు. అచట మూలికాదుల చూర్ణించుట, మర్దించుట, మాత్రలు చేయుట మొదలైన పనులన్నీ యంత్రములతోనే జరుపబడుచున్నవి. శ్రీ ప్రభాకర శాస్త్రిగారి సోదరుడు శ్రీ శంకరశాస్త్రి గారి ఆయుర్వేద కళాశాలలోనే ఆయుర్వేదము నభ్యసించిరి. శ్రీ లక్ష్మీపతిగారికి విశ్వాసపాత్రులైన శిష్యులైరి. శ్రీ ప్రభాకరశాస్త్రి గారు, నేను లక్ష్మీపతిగారితో సెలవు చెప్పివస్తూ ఆనందభవన్ హోటలుకు వెళ్ళినాము. అచట ఉపాహారాల సేవించినాము. ఆ ఉపాహారాలు మన దక్షిణాత్యుల ఇడ్లీ ఉప్మాలుగావు. ఔత్తరాహపద్ధతిని పూరి, బొంబాయి చట్నీ. ఇవి కాక తీపువి బాసుంది, గులాబ్‌జాం మొదలైనవీ ఆరగించినాము. అచట కాఫీలేదు. టీ యిచ్చినారు. అంతట తిరువళిక్కేణికి జట్కాలో వచ్చినాము.

ఆ రాత్రి రైలులో నేను వెళ్ళదలచియున్నాను. వంటవాడు సామానులన్నీ సరది కట్టలు కట్టినాడు. ప్రయాణమునకు సిద్ధముగా నున్నాను. 'వంట అయినది భోజనము చేసి వెళ్ళండి' అన్నారు శ్రీ శాస్త్రి గారు. ఇప్పుడే గదా ఉపాహారాలు తీసుకొంటిమి—అదీ మిక్కిలిగా తీసికొంటిమి. ఆకలి కావటము లేదు అని నేను భుజించలేదు. వంటవానికి భోజనము పెట్టించినారు శ్రీ శాస్త్రిగారు. అతను భుజించిన తర్వాత టాక్సీలో సామానులు పెట్టించినాను. శ్రీ శాస్త్రిగారికి నమస్కరించి సెలవని చెప్పినాను. శ్రీ శాస్త్రిగారు వాత్సల్యముతో నన్ను నిమిరి 'మీ సాహిత్యసేవ విశుద్ధమై వికసించవలెనని అభిలషించుచున్నాను. మీ విషయ వివేచనజ్ఞానము, సూక్ష్మగ్రహణశక్తి ఇతోధికముగా వృద్ధికాగలవని తలచుచున్నాను. సాహిత్యరంగమున మన మైత్రి దృఢపడగలదని యాశించుచున్నాను. మీకివే నా శుభాభినందనలు-వెళ్లిరండి" అని శ్రీ శాస్త్రిగారు వీడ్కోలు చెప్పిరి. నేనూ వంటవాడు టాక్సీలో స్టేషనుకు వెళ్ళి ఆరాత్రి రైలులో బెజవాడ వెళ్ళి బెజవాడనుండి ముక్త్యాలకు చేరినాను. సరుకులు శ్రీ అన్నగారి కిచ్చినాను.

ఒకనాడు శ్రీ అన్నగారు నన్ను పిలిచినారు. వారి దగ్గరకు వెళ్లినాను. శ్రీ పిరాట్ల మృత్యుంజయశాస్త్రి గారక్కడున్నారు. అన్నగారొక జాబును నాకిస్తూ శ్రీ మృత్యుంజయ శాస్త్రిగారి వంక చూసి యీయన గారీ జాబిచ్చినారు. దీనికి బదులు చెప్పదగినది వారికి నీవు చెప్పు అన్నారు. ఆ జాబు తీసుకొని నేను పై అంతస్థుకు వెళ్లుతూ శ్రీ మృత్యుంజయ శాస్త్రిగారినీ తీసికొని వెళ్లినాను. అచట నేను కూర్చుని శ్రీ మృత్యుంజయ శాస్త్రుగారినీ కూర్చుండ జేసినాను. జాబును తెరచి చదివినాను. అది చాల హేయముగా నున్నది. అపోహలు ఆవేశములతో అసహనముతో నిరాధారములైన నిందారోపణలతో నిండియున్నది. అది నాకు దిగ్భ్రాంతి కలిగించినది. అది శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రుగారు శ్రీ అన్నగారికి

వ్రాసిన లేఖ. మహాకవి, కవిసార్వభౌములను ప్రసిద్ధిగల శ్రీ కృష్ణమూర్తి శాస్త్రి గారా యిలాటి నింద్యమైన లేఖ వ్రాసినారు అని దానిని శ్రీ మృత్యుంజయశాస్త్రిగారి చేత పంపిరి. శ్రీ మృత్యుంజయ శాస్త్రిగారితో దీని విషయము సంభాషించ సాగినాను.

'శాస్త్రిగారూ! మీరు నాకు గురులు, మాననీయులు. అయితే ఈ విషయమున నేను చెప్పునది మీకు విప్రియముగా నుండవచ్చును. వాస్తవ పరిస్థితులు గమనించక మీరు కేవలము శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారి యెడల గల అభిమానముతో నీపనిని చేపట్టుట నాకు విచారము కల్గించుచున్నది. శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారికీ శ్రీ అన్నగారికీ వైమనస్యము లెందువల్ల నెప్పుడు గలిగినవి? ఒక గడువులోగా భారత మామూలముగా నాంధ్రీకరింతుమని, అందుకు శ్రీ అన్నగారివల్ల నా గడువుదాకా పారితోషికముల పొందుతూ శ్రీ అన్నగారిని కృతిపతిగా చేసి రచింతుమని ఒడంబడికతో వారు భారతాంధ్రీకరణమున కుపక్రమించిరటగదా! అది మీకూ తెలియునట. మరా విధముగా కథ నడచినదా? గడువుకాలము గడచిపోయినా చాలకాలము దాక శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారికి శ్రీ అన్నగారు పారితోషికము లిచ్చుచుండిరట. అయినా భారత రచన పూర్తి కాలేదు. కాగా శ్రీ అన్నగారు పారితోషికము లిచ్చుట విరమించిరట. అందుకు శ్రీ కృష్ణమూర్తిశాస్త్రిగారు కోపించి శ్రీ అన్నగారికేమేమో వ్రాసిరట. వారుభయులకూ వైమనస్యముల కిదీ కారణం. ఇందు మీ రాయబారాలూ నడిచినవట. బహుకాలము క్రిందట యీ కథంతా జరిగిన్నది. మరిపుడు శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారియెడ శ్రీ అన్నగారికి వైముఖ్యంను శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారూ శ్రీ ప్రభాకరశాస్త్రిగారూ కలిగించుచున్నారని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వారి గురులు శ్రీ వెంకటేశ్వరశాస్త్రిగారిని శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారికి పోటీగా జేసి ఆ మూలముగా శ్రీ ప్రభాకర శాస్త్రిగారు శ్రీ అన్నగారివల్ల యేదో లాభము పొందగోరుచున్నారని నింద లారోపించుట తగునా? ఇందు ఔచిత్యమున్నదా? అంతేగాక అసభ్యములైన వాక్యములలో నిందించుటేమి మర్యాద?

శ్రీ ప్రభాకర శాస్త్రిగారు, శ్రీ వేంకటేశ్వర శాస్త్రిగారల నిరసించుతూ నిందారోపణల జేయుచున్నారుగా! దాని మాట చూడండి. ఇంతవరకూ శ్రీ ప్రభాకరశాస్త్రి గారు అన్నగారిని చూడనేలేదు. మరి వారిరువురూ సంభాషించుట సంభవమా? శ్రీ ప్రభాకరులు శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారి యెడ అన్నగారికి వైముఖ్యము గలిగించుటెట్లు? నా ద్వారా కలిగించియుందురని మీరంటారేమో! మొన్నమొన్నటిదాక శ్రీ ప్రభాకర శాస్త్రి గారిని నేనూ ప్రత్యక్షముగా దర్శించలేదు. మా యిరువురకు లేఖాపూర్వక పరిచయము మాత్రమేయుండేది. ఆ లేఖలలో మాటమాత్రముగానైనా శ్రీ కృష్ణ మూర్తి శాస్త్రి గారి ప్రస్తావనలేవీలేవే - అవి మీరు పరిశీలించవచ్చు. శ్రీ ప్రభాకర శాస్త్రి గారు పనిచేయుచున్న గ్రంథాలయము చాల పెద్దది. మనము కనీవినీ యెఱుగని వనేక ఉద్గ్రంథముల కిరవా గ్రంథాలయమున నున్నది. ఆయా గ్రంథముల విషయములు శ్రీ ప్రభాకర శాస్త్రి గారికి కరతలామలకములు - కాగా నాయా సందర్భములలో నాయా గ్రంథముల నుండి ఉదాహరణలనుల్లేఖించుచుందురు శ్రీ ప్రభాకరులు. పరిశోధనలలో ఇతర గ్రంథముల శ్లోకములనో వాక్య

ములనోనుల్లేఖించుట గ్రంథకార్యమా? ఈ ఉల్లేఖనలను బట్టి శ్రీ ప్రభాకరశాస్త్రిగారు గ్రంథ కార్యము చేయువారని శ్రీ కృష్ణమూర్తి శాస్త్రి గారు నిరసించుటేమి మర్యాదా?

శ్రీ వేంకటేశ్వర శాస్త్రి గారి విషయమేమిటా? శ్రీ వేంకటేశ్వర శాస్త్రి గారు శ్రీ చల్లపల్లి రాజా అంకినీడు గారి పట్టాభిషేకోత్సవమునకు వచ్చినారు. అప్పుడే వారు శ్రీ అన్నగారిని దర్శించిరి. అంతకు పూర్వముగాని ఆ తర్వాతగాని వారుభయుల సమావేశము జరుగలేదు. పట్టాభిషేక సమయమున గూడ నొకమారే సమావేశమైనారు. అప్పుడైనా శ్రీ కృష్ణమూర్తిగారి విషయము ప్రాముఖ్యముగాలేదు. వివిధ విషయములను ముచ్చటించుటలో శ్రీ కృష్ణమూర్తి శాస్త్రి గారి భారత రచన దానికి శ్రీ అన్నగారు కృతి భర్తయగుట దొరలినది. అపుడున్న శ్రీ వేంకటేశ్వర శాస్త్రి గారు శ్రీకృష్ణమూర్తి శాస్త్రి గారిని గురించి విరసముగా నేదీ పలుకలేదు. 'కవనమొక కట్టడికి లొంగునదికాదు. శ్రీ కృష్ణమూర్తి శాస్త్రి గారు గడువులోగా ముగించలేదని తలచక భారత రచన వారు పూర్తి చేయునట్లు మీరు వారినుత్సాహపరచి ఆ యశస్సునందండి. వారూ మీరూ సంకల్పించిన యీ యుద్యమము విఘ్నమగుట ఉభయత్రా గౌరవహానికరము— అని ప్రోత్సహించిరే కాని శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారియెడ వైముఖ్యము గల్పించలేదు. ఈ నిజ పరిస్థితుల గమనించకనే నేవో ఊహించి సాటివారినీ శ్రీ అన్నగారినీ నిరసించుతూ నిందించుతూ యీ జాబును వారు వ్రాయుటా! దానిని మీరు తీసుకొని వచ్చుటా ఛాందసముగా ననౌచిత్యముగా నున్నది. ఇపుడైననూ వారీ నిజ పరిస్థితుల గుర్తింప గలరని ఆశించుచున్నానని చెప్పండి' అన్నాను. ఇది విని శ్రీ మృత్యుంజయ శాస్త్రిగారు మారుమాటాడక ఖిన్నవదనులై సెలవని వెళ్లిపోయిరి.

శ్రీ అన్నగారు ఆయుర్వేద శాస్త్రజ్ఞులైన వైద్యుని ఆస్థానిగా నియోగించదలచిరి. అట్టివారి నెవరినైనా చూడుమని నాతో చెప్పిరి. 'శ్రీ ఆచంట లక్ష్మీపతి గారి ఆయుర్వేద కళాశాలలో విద్యనభ్యసించి యుత్తీర్ణులైనవారు శ్రీ వేటూరి శంకరశాస్త్రి గారున్నారు. వారు రాగలరేమో! ఆలోచింతుము' అన్నాను. 'ఆలోచించుము' అన్నారు అన్నగారు. ఈ విషయము శ్రీ ప్రభాకరశాస్త్రిగారికి జాబు వ్రాసినాను. తాము వచ్చి యీ విషయము మాట్లాడుదుమని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు బదులు వ్రాసినారు.

శ్రీ అన్నగారికది చెప్పినాను. వారిని రమ్మని వ్రాయమన్నారు శ్రీ అన్నగారు. శ్రీ శాస్త్రిగారికది వ్రాసినాను. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వచ్చిరి. వారు నా విద్యావ్యాసంగాదులను గురించి నన్నడిగినారు. అవధానకల్పలత ననువదించుచున్నాను అని దాని ప్రథమ పల్లవానువాదమును వారికి చూపితిని. అనువాదము బాగున్నది. ఇలాగే రచన సాగింపుడని నన్ను ప్రోత్సహించినారు. తరువాత శ్రీ శాస్త్రిగారిని శ్రీ అన్నగారి దగ్గరకు తీసికొని వెళ్లినాను. ఉభయతాకుశల ప్రశ్నాదికములు జరిగినవి. పిదప శ్రీ అన్నగారికి ఆయుర్వేదమునందుగల అభిమానమును గురించి ముచ్చటించుకొన్నారు. తరువాత శ్రీ శంకర శాస్త్రి గారికి ముక్త్యాలలో ఆస్థాన వైద్యునిగా నియోగించుటను గురించి వారుభయులూ సంప్రదించుకొన్నారు. శ్రీ శంకరశాస్త్రిగారిని ముక్త్యాల పంపుటకు శ్రీ ప్రభాకరశాస్త్రిగారంగీకరించిరి. ఆ తరువాత

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి విద్యా విశేషములు. ఆ రంగమున వారి కృషిని గురించి శ్రీ అన్నగారు వారినడిగి తెలిసికొన్నారు. అన్నగారు శ్రీ ప్రభాకరశాస్త్రి గారిని సన్మానించినారు. నా విద్యా వ్యాసంగ విశేషముల గురించి శ్రీ శాస్త్రిగారు శ్రీ అన్నగారితో చెప్పిరి. శ్రీ శాస్త్రిగారు వెళ్లినారు. కొద్దినాళ్లకు శ్రీ శంకరశాస్త్రిగారు ముక్త్యాలకు వచ్చినారు. వారు శ్రీ అన్నగారిని దర్శించిరి. ఆయుర్వేదౌషధ నిర్మాణ సంస్థను స్థాపించుటను గురించి వారిరువురూ సంప్రదించుకొన్నారు. దానిని స్థాపించుటకు నిశ్చయించినారు. ఆ విషయము శ్రీ శంకరశాస్త్రిగారు శ్రీప్రభాకరశాస్త్రిగారికి వ్రాయగా ఆ సంస్థకు "ఆర్షరసాయనశాల" అను పేరును శ్రీ ప్రభాకరశాస్త్రి గారు సూచించిరి. ఆ పేరుతోనే ముక్త్యాలలో ఆయుర్వేదౌషధ నిర్మాణ సంస్థను స్థాపించిరి. శ్రీ శంకరశాస్త్రిగారి పర్యవేక్షణలోనది సాగుచుండెను. రెండు నెలలు గడచినవి. శ్రీప్రభాకరశాస్త్రిగారు వారి సోదరుని చూచుటకు మరల ముక్త్యాలకు వచ్చిరి. శ్రీ శాస్త్రి గారు నా సాహిత్య సేవను గురించి నన్నడిగినారు. ''అవదానకల్పలతననువదించుచున్నాను. భారతము మొదలైనవీ చదువుచున్నాను" చెప్పినాను. చెప్పి బౌద్ధము గురించి మరల ఆస్థానుల సంక్షోభము సాగినది. ఇక శ్రీ శంకరశాస్త్రిగారు వైద్యశాలలో చికిత్స చేయుటలో అస్పృశ్యులను వారివీ స్పృశించుచుండుట, దానిని నేను సమర్థించుచుండుట కూడ వారి విష ప్రచారమునకొక సాధనమైనది. ఇవన్నీ శ్రీ అన్నగారికి వారు పదే పదే చెప్పి బౌద్ధ మత ప్రభావమువల్లనిలాటి అపవిత్ర కార్యములు జరుగుచున్నవనీ, నేను శాకాహారినగుటా దానికొక నిదర్శనమనీ తెలుపుతూ శ్రీ అన్నగారికి నా ప్రవర్తనపట్ల విప్రియము గలిగింప జూచుచున్నారు' అని చెప్పితిని. 'ఆ విషయమున శ్రీ అన్నగారితో నేను ముచ్చటింతును. మీ ప్రవర్తన నిర్దుష్టము. దానిని నేను సమర్థింతును' అన్నారు శ్రీ శాస్త్రిగారు.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారొకనాడు శ్రీ అన్నగారిని దర్శించిరి. అన్నగారికి అభిమాన విషయమైన ఆయుర్వేద విశేషాలను అన్నగారికి విశదపరచి ఆ పిదప ఆర్ష సంస్కృతి సభ్యత ఆచారాదులను గురించి ముచ్చటించిరట. ఆ సందర్భముననే బౌద్ధ మతపు యోగ్యత శీలముల ప్రాముఖ్యము ప్రభావములను గురించి ఆయా ప్రమాణములతో సమర్థించిరట. నేను అవదాన కల్పలత ననువదించుట నింద్యముగాదనీ క్షేమేంద్రునివంటి మహాకవీ, విశేషించి శైవము వైష్ణవములను అనుసరించిన ఆస్తికుడు రచించిన యుత్తమ గ్రంథమది. దాన్ని వీరు అనువదించుట సమంజసమే. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటేశ్వరశాస్త్రి గారు దేశభక్తులు గదా ! వారు బుద్ధచరిత్ర రచించిరి. అది నింద్యము గాలేదు గదా! స్థానికులైన పండితులు తాము పఠించినదే తప్ప మరితరము నవగాహన జేసికొనరు. అందువల్లవారు ఛాందసులై ఇతర పంథాల నేవగింతురు.' అని నేనూ బుద్ధుని లోకోత్తర పురుషునిగా దలతును. ఆ మహనీయునియెడ నా సదాశయముతో నీ పద్యమును రచించినాను అని—

ప్రియయువతిన్ బ్రభుత్వమును వీడియరణ్యము
జేరి తత్త్వని
శ్చయమునకై మహాతపమునల్పి కృతార్థత
నొందెయెల్లెడన్
దయయు నహింసయున్ పరమ ధర్మములన్నెల
కొల్పె నమ్మహో
దయుడగు బుద్ధదేవుని పదంబులనేను నమస్క
రించెదన్

అని పద్యము చదివివినిపించిరట. అటుపిదప అస్పృశ్యత విషయమునెత్తి అస్పృశ్యతనునది స్మృతులలోనున్నా శ్రుతులలో స్పష్టపడినట్లున్నది. స్మృతులలోనూ అనేకవిషయాలలో నేక వాక్యత లేదు. విలోమసంతానమును అస్పృశ్యులుగా పరిగణించుట కనిపించుచున్నది.

దానినిబట్టి చూచితే నేడున్నతవర్ణాల వారిలో ననేకులను అస్పృశ్యులనవలసి వచ్చును. ఉపనిషత్తులను బట్టి సర్వభూతములను సమానముగా చూడవలసి యుంటుంది. కుక్కను, కుక్కమాంసమును దినువానిని సమముగా నాదరించవలెనని గీత ప్రబోధించినది. అందునా ఆతురులైవచ్చిన అనదలనంటుకొని యుపచరించుట పరమ ధర్మము. అది వైద్యుని వృత్తిధర్మము కూడ.” అని చెప్పిరట- శ్రీ అన్నగారు శ్రీ శాస్త్రిగారి మాటలను శ్రద్ధగా విన్నారట-అంతే బదులేదీ చెప్పలేదట.

ఒకనాడు శ్రీ ప్రభాకరశాస్త్రిగారూ నేనూ మాటలాడుచున్నాము. అపుడు శ్రీ చల్లా సూర్యనారాయణగారూ వచ్చినారు. శ్రీ సూర్యనారాయణ గారు నా విద్యావ్యాసంగమును గురించి ప్రస్తావించిరి. దానినందుకొని శ్రీ ప్రభాకరశాస్త్రి గారు ‘వీరి విద్యవినోదము నన్ను ముదితునిజేసినది. వీరనువదించిన అవదాన కల్పలతని 1, 2 పల్లవములు చూచినాను. శైలిసరళముగా నింపుగా నున్నది. కృషిచేసినచో వీరుత్తమ రచయిత కాగలరు ‘అని’ మీ విద్యావినోదమునకు తగిన విశాలరంగస్థలమవసరము. అందుకు సారస్వత పత్రికను మీరు నడుపదగును. దాని మూలమున మీ విద్యావినోదమును ప్రోగుచేసికొని మీ రానందించుచు విద్వల్లోకమునూ నానందపఱచనగును” అని నన్నుద్దేశించి ఆపత్రికను నిర్వహించుటకు నన్ను మిగుల ప్రోత్సహించిరి శాస్త్రిగారు. శ్రీ సూర్యనారాయణగారున్ను నన్నందుకు ప్రోత్సహించిరి. పత్రికను నడుపుటకు నేనంగీకరించితిని. అంతట శ్రీ శాస్త్రిగారి విషయమును శ్రీ అన్నగారితోచెప్పి పత్రిక ముద్రణ ముక్త్యాలలో శ్రీ అన్నగారి ముద్రణాలయమున బంపుటకేర్పాటుచేసిరి. ‘సరస్వతి’ అనుపేరుతో మాసపత్రికను నడుపుటకు నిశ్చయించినాము. నేను సంపాదకునిగా శ్రీ చల్లా సూర్యనారాయణగారు ముద్రాపకులుగా డిక్లరేషన్ లిచ్చినాము.

ఆ పత్రికలో ప్రచురింపదగిన ప్రాచీన గ్రంథములను శ్రీ ప్రభాకరశాస్త్రి గారితో సంప్రదించి నిశ్చయించినాము. శ్రీప్రభాకరశాస్త్రి గారు మద్రాసు వెళ్ళిరి.

‘సరస్వతి’ పత్రికను ముద్రించి ప్రచురించినాము. శ్రీ శాస్త్రిగారికీ దానిని పంపినాము. ఆంధ్రదేశమున ఆంధ్రభాషాభిమానులకూ విద్యాంసులకూ పత్రికను పంపినాము. పత్రికకు పలువురు వ్యాసములను పంపుచుండిరి-శ్రీ ప్రభాకరశాస్త్రి గారూ బహుధా మాకు సహకరించుచుండిరి. అమూల్యములైనవారి వ్యాసములనూ పంపుచుండిరి. సి. పి. బ్రౌనుగారి జాబులు (బ్రౌన్‌గారి ఆంధ్ర భాషాభిమానవిశేషాలను తెలుపునవి) సేకరించి శ్రీ శాస్త్రిగారు పంపుచుండిరి. వాటినీ ప్రచురించుచుంటిమి. ఇట్లు సాహిత్యము, చరిత్ర, కళలు, మొదలగు విషయములను మా సరస్వతిలో క్రమముగా ప్రచురించుచుంటిమి. అదీ చరిత్రకారులమన్ననలందినది. సరస్వతిని విద్వాంసులు ప్రస్తుతించిరి.

ఒక సంవత్సరముపాటు నేను స్వయముగా నీ పత్రికను నిర్వహించితిని.

ఇంతలో శ్రీ అన్నగారి పనులతో నేను కంచల నందిగామలలో సకుటుంబముగా నివసించవలసి వచ్చినది. అందువల్లనేను స్వయముగా పత్రికను నిర్వహించుట కవకాశములేక పోయినది. నేను నివసించుచున్న చోటులనుండి నా వ్యాసములను, అవదాన కల్పలత అనువాదములను మాత్రము పంపుచుంటిని. శ్రీ ప్రభాకరశాస్త్రి గారు యథా ప్రకారము వారి సహాయము నందించుచుండిరి. శ్రీ సూర్యనారాయణ గారే పనిచూచుచుండిరి. పత్రికకు చందాలను పంపుడని పత్రికల స్వీకరించుచున్నవారి నభ్యర్థించుచూ వ్రాసినా చందాల పంపరైరి. V. P.లను పంపితే త్రిప్పివేసిరి. భాషాభిమానులు, రసికులని పేరందిన శ్రీ విక్రమదేవ వర్మగారున్ను V. P. ని త్రిప్పివేసిరి. 3 వేలు నష్టము వచ్చినది. అందువల్ల పత్రికను విరమించవలసి వచ్చినది. పత్రికను విరమించినా దీనివల్ల నాకొక ఆత్మవిశ్వాసము కలిగినది. నేనూ రచనల చేయగలనన్నదది....

అందువల్ల నేను రచనల విరమించలేదు. అప్పుడప్పుడు కొన్ని వ్యాసములను ఆంధ్రపత్రికకు పంపుచుంటిని. క్షేమేంద్రుని రచన సేవ్యసేవకోపదేశమునకు పద్యానువాదముజేసి శ్రీ ప్రభాకరశాస్త్రి గారికి పంపితిని. వారు దానిని పరిశీలించి ప్రచురణకు ఆంధ్రపత్రిక వారికిచ్చిరి. భారతిలోనది ప్రచురించబడినది. అయితే నాకు అన్నగారి పనుల యొత్తిడివల్లనూ రాజకీయాల రాపిడివల్లనూ నాకాలమును నా సాహిత్యకృషికి పూర్తిగా వినియోగించలేకపోతిని.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు నాకు జాబు వ్రాసిరి. కపిలేశ్వరపురములో ఆలయమునగల శాసనము (శిలావిపుల) ల పరిశీలించదలచినాను. అచటికి వెళ్లుటకేర్పాటు చేయుడని. అప్పుడునేను బెజవాడలోనున్నాను. 'నేను బెజవాడలోనే యున్నాను. మీరు రండి, యిచటనుండి కపిలేశ్వరపురము వెళ్లుదుము' అని శ్రీ శాస్త్రిగారికి వ్రాసినాను. తాము వచ్చుచున్నామని శ్రీ శాస్త్రిగారు వ్రాసిరి. వచ్చుచున్నామని వ్రాసిననాడు రైలుదగ్గరకు మనిషిని పంపినాను. శ్రీ ప్రభాకరశాస్త్రి గారిని తీసికొని మావాడు వచ్చినాడు. శ్రీ శాస్త్రిగారు స్నానముచేసినారు. వారూ నేనూ ఉపుమా కాఫీ సేవించినాము. పెందలకడ భుజించి కపిలేశ్వరపురము వెళ్ళుటకు నిశ్చయించినాము. తరువాత శ్రీ శాస్త్రిగారూ నేనూ కూర్చుని అవీ యివీ మాటలాడుచున్నాము. ఆ మాటలు సాగి సాగి యొకమారు యోగవిషయమునందు కొన్నది. శ్రీ శాస్త్రిగారు C.V.V. యోగ నిష్ణాతులు. ఆ యోగమున పరిణత ప్రజ్ఞులు. కొంతశక్తి నుపార్జించిరికూడ. ఆ యోగమును గురించి ఆ యోగద్రష్ట పరిపూర్ణులు C.V.V. గారిని గురించి శ్రీ శాస్త్రిగారు నాకు బాహుధా యుపదేశించిరి. నన్నాయోగాను యాయినిగా జేయదలచిరి. అయినా నాడు నన్ను ముసరియున్న కార్యాకలాపాల కారు మేఘాలవల్ల నేను కనువిచ్చి యా వెలుగును చూడలేనైతిని.

9 గంటలు కావచ్చినది. శ్రీ శాస్త్రిగారు హోటలుకు వెళ్లినారు. నేనూ స్నానముచేసి

భుజించినాను. కపిలేశ్వరపురం వెళ్ళివచ్చుటకు జట్కాను బాడుగకు కుదిర్చినాను. శ్రీ ప్రభాకర శాస్త్రిగారూ భుజించివచ్చిరి. 9-15 గంటలైనది. శ్రీ ప్రభాకరశాస్త్రి గారు, నేను జట్కానెక్కినాము. కపిలేశ్వరపురము వెళ్ళుటకు జట్కా కదిలి వెళ్ళుచున్నది. శ్రీ శాస్త్రిగారు మరల యోగపువిశేషాలను గురించి చెప్పుచుండిరి.

—మన పూర్వయోగాలలో యోగులు పరబ్రహ్మమునందుటకు పైకి అవరోహణముచేయుట లక్ష్యము. ఈ యోగములో ఆ పరాత్పర పరబ్రహ్మకు యీ లోకమున నవతరించి యీ లోకమునే దివ్యలోకముగా గావించుట లక్ష్యము. అని వివరించిరి. మేమీ ముచ్చటలో మునిగియున్నాము. 2-30 గంటలైనది. మంటాడ మీదుగా వెళ్ళవలె కపిలేశ్వరపురముకు. ఇంకా మంటాడనే రాలేదు. జట్కా గుర్రము వదలిస్తూ ముందుకు తోస్తూ మకతికలు పడుతున్నాడు బండివాడు. అదంతా చూసి శ్రీ శాస్త్రిగారీ అశువుపలికినారు.

"మంటాడ యెంతదూరమొ
తింటామో తినమొ నేడు తిండో పండో
తంటాలు పెట్టుచుంటివి
కొంటెవుగదరన్నబండి కోటెంకన్నా" అని.

అప్పటి........మా ప్రయాణము వంకకేమరలినది. ఎలాగైతేనేమి చివరకు సాయంకాలము 5 గంటలకు కపిలేశ్వరపురము చేరినాము. కపిలేశ్వరపురములో ఆలయమునకు వెళ్ళినాము. శాసనపు అక్షరాలు సంజవెలుగులో సరిగా కనిపించుటలేదు. ఆ శాసనాలకు ఎస్టాంపేజి తీయదలచినారు శ్రీ శాస్త్రిగారు. అందుకు తగిన సాధనాలుకావలె. ఆ గ్రామములో నా మిత్రులు శ్రీ ఇల్లుట్ల హనుమంతరావు గారున్నారు. వారికి వర్తమానము పంపినాను. వారు వచ్చిరి. మేమువచ్చినపని వారికి చెప్పినాను. ఎస్టాంపేజి తీసికొనుటకు పలుచని కాగితము, సిరా, కొంచెముగా తుమ్మజిగురు, ప్రాతగుడ్డలు, సిరా పోయుటకు పళ్ళెము, బ్రషు కావలెనన్నారు శ్రీ శాస్త్రిగారు. హనుమంతరావు గారు వాటినితీసికొని వచ్చిరి. శ్రీ శాస్త్రిగారు సిరాలో తుమ్మజిగురు కలిపి దానిని పళ్ళెములో పోసిరి. పాతగుడ్డలొక ముద్దగా ముడిచికట్టిరి. శాసనాలను శుభ్రముగా కడిగించినారు. తరువాత ఆ తెల్లకాగితమును శాసనముపైన పరచి బ్రష్‌తో దానిని శాసనపు అక్షరాలలోనికి దిగనొత్తినారు. తరువాత ముద్దగా గట్టిన గుడ్డముద్దను పళ్ళెములోని సిరాలోనద్ది దానిని శాసనముపై పరచిన కాగితముపైన మెల్లగా నద్దుతూ శాసనభాగమునంతా నలాకలియనద్ది కాగితమునూడదీసిరి. అప్పుడు శాసనపు అక్షరాలు కాగితమున తెల్లగాను మిగిలినది నల్లగానూ కనిపించుచుండెను. ఈ పనంతా అగుసరికి 6 గంటలైనది-ఇక బెజవాడ వెళ్ళుటకు ప్రొద్దేదీ? నాటికి కపిలేశ్వరపురముననే ఉండవలసి వచ్చినది. మిత్రులు హనుమంతరావు గారు మమ్మాహ్వానించినారు. వారింటికి వెళ్ళినాము. శ్రీ హనుమంతరావు గారింటనే ఆరాత్రి మా భోజనాలు. శ్రీ శాస్త్రిగారిని హనుమంతరావు గారికి పరిచయపరచినాను. శ్రీ హనుమంతరావు గారూ విద్యాప్రియులే. శ్రీ శాస్త్రిగారి పరిచయము గలిగినందుకాయన చాల సంతోషించిరి. శ్రీ శాస్త్రిగారూ హనుమంతరావు గారి సౌజన్యము అతిధి సత్కారములకలరి వారినభినందించిరి.

రాత్రి కపిలేశ్వరపురమున నిద్రించి మరునాడుదయమున ఉపాహారముల స్వీకరించి జట్కాలో 12 గంటలకు బెజవాడ చేరినాము. శ్రీ శాస్త్రిగారు స్నానముచేసి హోటలులో భుజించి వచ్చిరి. నేను స్నానంచేసి భుజించినాను. బడలికగా నున్నందున శ్రీ శాస్త్రిగారూ నేనూ విశ్రాంతి తీసికొని నిద్రించినాము. సాయంకాలము మరల ఉపాహారాలు స్వీకరించినాము. శ్రీ శాస్త్రిగారాత్రి రైలులో మరల మద్రాసుకు వెళ్లినారు.

1938లో నేను మదరాసులో నివసించుచుంటిని. అప్పుడు దఱచుగా శ్రీ ప్రభాకరశాస్త్రిగారిని దర్శించుచుంటిని. అప్పుడు వారు సాహిత్యమునకంటె యోగమునననురక్తులై యుంటూ నుండిరి. నేను కలిసినపుడల్లా ఎప్పుడూ సాహిత్య విషయములకు బదులు యోగవిషయముల ప్రస్తావించుచుండేవారు. అప్పుడు నాకు కొంత అనారోగ్యము కలిగినది. తలదిమ్ముగానుండేది. శ్రీ శాస్త్రిగారు దానికి వారి యోగచికిత్సజేసిరి. దానివలన నేను నిత్యము సాయంకాలము వారి దగ్గరకువెళ్లి ఆ చికిత్స పొందుచుంటిని. శ్రీ C. V. V. కి ముమ్మారు నమస్కారము జేయించి కనులు మూసికొని లోపల నేమి జరుగుచున్నదో పరీక్షించిచూడుడని వారుచెప్పి అట్లు చేయుచుండిరి. అట్లు చేయగా కపాలములో నేదో గిరగిర తిరుగుచున్నట్లు, శరీరమంతా తిమ్మిరిగానున్నట్లు నుండేది. 15 దినాలు చేయగా కొంత గుణమువచ్చినది. అంతట నిత్యమిలా మీ యింటి దగ్గరే చేయుడన్నారు శాస్త్రిగారు. వారి ఆదేశమునమసరించి అట్లే చేయుచుంటిని. ఒక నెల్లాళ్ళలో నాకు ఆరోగ్యము చక్కబడినది. ఇతర వ్యాపంగమువల్ల నా ప్రార్థనను కొనసాగింపలేనైతిని.

తరువాత చాలకాలమునకు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు నాయింటికివచ్చిరి జగ్గయ్యపేటలో నా స్వగృహమున నుంటున్నప్పుడు.........తాము తిరుపతి దేవస్థానమువారి అధ్వర్యమున స్థాపించనున్న మ్యూజియంనకు వస్తువులను గ్రంథాలను సేకరించుచున్నామని అట్టివేవైనా మీ దగ్గరుంటే యియ్యండని అన్నారు శాస్త్రిగారు. నాదగ్గరున్నవి చూపినాను. ఆగ్రాలో నొకరాయికనిపించినది. దాని నూపితే ఊగుతుంది. దాని ముక్క నేను తెచ్చినాను. దానిని వారు తీసికొన్నారు. గోమతి నదిలో నెమలి ఆకారం గల తెల్లని శిలలవంటివి నాకు దొరికినవి. వాటినీ శ్రీ శాస్త్రిగారికిచ్చినాను. రామప్పగుడి గోపురమున నొకవింత యిటుకలున్నవి. వాటిలో నొకదానిముక్క నాకు లభించినది. దానిని నీటిలో వేసినమునుగదు, తేలుతుంది. దానినీ శ్రీ శాస్త్రిగారికిచ్చితిని. బాడ్లీయన్ లైబ్రరీనుండి నేను వృక్షాయుర్వేదపు ఫొటో ప్రతితెప్పించినాను. దానిని ఆంధ్రాక్షరములలోను ఆంధ్రాన్వయములోను నేను వ్రాసీయగా శ్రీ ఆచంట లక్ష్మీపతిగారు ముద్రించి ప్రచురించిరి. దాని ఫోటోప్రతిని శ్రీ శాస్త్రిగారికిచ్చితిని. అవి తీసికొని -'మీరు భగవద్గీతకు పద్యానువాదము చేసితిరట గదా!' అన్నారు. అనువాదము చేసినాను. అయితే పద్యాలు మాత్రమే ముద్రించబడినవి కొన్ని విషయాలను గురించి నా భావములు ముద్రించబడలేదు. అవింకా చిత్తులుగనే యున్నవి- అనిచెప్పి గీతాపద్యానువాదపు ప్రతిని శ్రీ శాస్త్రిగారికిచ్చితిని. గీతనూ అవలోకనచేసి రచించుట

ముదావహము. 'గీతోపనిషద్గోదోగ్ధ్రే శ్రీ కృష్ణపర బ్రహ్మణే నమః' అన్న మీ మకుటమునకది సార్థకము. శైలిచక్కగానున్నది. అయితే గీతకు వ్యాఖ్యానాలనేకముగా నున్నవి. మీ రెట్లుదేనిననుసరించి వ్రాసినారు?' అని ప్రశ్నించిరి. నేను శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారి గీతారహస్యము నచట నచట సంప్రదించి అనువదించినాను-చాలా వరకు మూలమునే అనుసరించి ఆ శ్లోకముల అన్వయమును యధాతధముగా గ్రహించినాను. నాకు అన్వయము కుదురని వాటికి గీతారహస్యమును సంప్రదించి రచించినాను.' అన్నాను. 'గీతారహస్యము మంచిదే - మీ రచనను పరిశీలించుదును' అన్నారు శాస్త్రిగారు.

తరువాత శ్రీ శాస్త్రిగారు వెళ్ళనున్నారు. వారిని సత్కరించి నమస్కరించి వీడికోలుచెప్పినాను. శ్రీ శాస్త్రిగారు వెళ్లినారు. అదే మాతుది సమావేశము. మరల శ్రీ శాస్త్రిగారిని దర్శించు భాగ్యము లేకపోయినది. తరువాత కొన్నాళ్లకు శ్రీ శాస్త్రిగారు పరమపదించినారన్న విషాదవార్తవిని ఖేదమందినాను. వారి స్మరించి అంజలి ఘటించినాను.

శ్రీ ప్రభాకరశాస్త్రి గారిని గురించి నా ఆకళింపు.
-అవగాహన-

శ్రీ ప్రభాకరశాస్త్రి గారు అనేక దుర్లభ గ్రంథములనూ అవలోడనము చేసిన పరిణత ప్రజ్ఞులు. వారి విజ్ఞానము బహుముఖము, విశాలమూ, విశదమూ. ఆంధ్రభాషామర్మముల బహుధా విశదీకరించిన భాషాతత్త్వవేత్తలు. లోకోక్తులు నానుడుల నిజాన్వయము నెఱిగిన నిపుణులు. ఈ సందర్భముననొకటి చెప్పుట యొప్పుగాకున్ననూ చెప్ప సాహసించుచున్నాను. "ఏనుగులకు ఏట్రింత రాయబారమా!" అన్న నానుడికి అన్వర్థము దెలుపునదొక కథయున్నది. అది బూతుగానుంటుంది. అయినా అది తెలియదగినది. కాన చెప్పుచున్నానని శ్రీ శాస్త్రిగారది చెప్పిరి. శ్రీ సి. పి. బ్రౌన్ మహాశయులూ నిట్టివిసేకరించి వ్రాసియుంచిరి. నేనూ దాని వ్రాసియుంచినాను.

శ్రీ శాస్త్రిగారు మధురభాషి. మృదు భాషి. మిత భాషి. ఎవ్వరినీ నొవ్వ నాడువారు గారు. దీన బంధువు. అనదల నాదరించువారు. పరమ దయా హృదయులు. యోగ శక్తితో ఆర్తులకుపకారము గావించుచుండిరి. సమాజమునగల అతిశయాడంబరములను దైన్యమునూ నుజ్జగించి మధ్యస్థితి నందింపవలెనని వారియభిమతము. దానినిట్లు వారు చెప్పుచుండేవారు- "ధనోన్మత్తులై దడబిడలుజేయు పైతరగతివారి కాళ్లబట్టి దిగలాగుతూ దరిద్రమున దిక్కుతోచక పొరలాడుచుండు దీనుల చేతుల బట్టుకొని యెగలాగుతూ నడుమతరగతి వారు ఆ ఉభయవర్గాలవారిని తమ తోడివారినిగా గావించవలెను" అని.

అస్పృశ్యతను పాటించువారుగారు. బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులు పంక్తిభోజనము చేయదగునని వీరు తలచువారు. సదాచారములు, సంస్కారములు, ఆచారసామ్యములుగలవా రంతర్వివాహముల గావించుకొనుట తగునని వీరియాశయము. వీరు మహదాస్తికులు. పరాత్పరుడగు భగవంతునియెడ ఆయనయమోఘ శక్తియెడ నచంచల విశ్వాసవగల మహాభక్తుడు. C. V. V. యోగముపట్ల నిశ్చల విశ్వాసము. C. V. V. యెడల నత్యంత

భక్తి గలవారు. ఆ యోగములో కొంతశక్తినీ పొందినారు. మరొక విషయమును అమాయకముగా విశ్వసించుచుండిరి. ఒక నాడీగ్రంథమున్నదట. అది చెప్పు జోస్యమును విశ్వసించుచుండిరి. ముఖ్యముగా మాష్టరు (C.V.V.) గారిని గురించి ఆ యోగమును గురించి చెప్పునట. ఆనాడి-ఎప్పటి కప్పుడది నవయుగ మవతరించు సూచనలు దాపుననున్నవని తెలుపుచుండును. రెండవ ప్రపంచ యుద్ధసమయమున మునులీ దేశమును పాలింప మన్నారని ఆనాడి తెలిపినదట. మునులంటే బౌద్ధులనీ, బౌద్ధులైన జపానీయులీ దేశమునాక్రమించ మన్నారనీ, ఆ మూలమున లోకమున శాంతి నిర్వైరము నెలకొని నవయుగము రాగలదని యా జ్యోతిషపు సారముగా తలచుచుండిరి. ఆ యోగ పరిణత దివ్యలోకము కనులారగాంచవలెనన్న వారి తీవ్రాభిలాషచేనైన....కిరి కావచ్చు. పూజనీయులు

శ్రీ ప్రభాకరశాస్త్రి గారికి నావినయపూర్వక వందనములు. శ్రీ శాస్త్రిగారినుద్దేశించి నేను రచించిన పద్యములు.

గీ॥ నా హృదయక్షేత్రమున మీరనాటినట్టి
వమృతమయ సూక్తిబీజము లంకురించి
విస్తరించె నన్నాపాద మస్తకమ్ము
తత్ప్రభావమె నా జీవితమును దిద్దె॥

గీ॥ భవ్యనవయోగి సి. వి. వి. సద్భక్తినిరత
మద్ధృదబ్జ ప్రభాకరా! మధురహృదయ
మీ చలువయె నా విద్యా సమృద్ధియెల్ల
గురు! ప్రభాకర! మొక్కెదఁ గరము మోడ్చి॥

గీ॥ కలముజేకొని రచియింప గడగినపుడు
దలచుకొని మీరు చూపిన మెలపు లవవి
భక్తినమ్రుడనై మీకు ప్రణుతిజేయ
భవదమోఘకృపయె నాకు బలము గూర్చు॥

సాహిత్య సంచికా కార్యక్రమం - వేటూరివారు

సాహితీ ప్రభాకరీయం - సంచికా కార్యక్రమము
(ఆకాశ వాణి: 6/1/1982)

సంపాదకులు : కళాప్రపూర్ణ శ్రీ రాపూరి భరద్వాజ
వక్తలు : 1. ఆచార్య శ్రీ బిరుదురాజు రామరాజు
2. శ్రీ తిరుమల రామచంద్ర
3. శ్రీ కొత్త రామకోటయ్య.

(ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం వారి సౌజన్యంతో)

శ్రీ రాపూరి భరద్వాజ:

"తెలుసుకొంటున్న కొద్దీ, తన కేమీ తెలియదన్న సత్యం తెలియడమే జ్ఞానం" అన్న ఆర్ష వాక్యంలోని సత్యం, వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని దర్శించిందాకా తమకు తెలియలేదన్న విద్వాంసులు, పండితులు, పరిశోధకులు, అగ్గలంగానే ఉన్నారు.

1888వ సంవత్సరం, ఫిబ్రవరి 7వ తేదీన, కృష్ణాజిల్లాకు చెందిన పెదకళ్లేపల్లి గ్రామంలో ఉదయించిన ప్రభాకరులు, 1950 ఆగష్టు 29వ తేదీన, భౌతికంగా అస్తమించారు.

ఈ మధ్య కాలంలో, ఉత్తమ గురువులకు సచ్ఛిష్యులుగా, జ్ఞానసముపార్జనం చేసిన ప్రభాకర శాస్త్రిగారు, ఉత్తమోత్తములైన శిష్యులకు, తమ జ్ఞాన, యోగ సంపదనంతా పంచిపెట్టారు. కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, సంస్కర్తగా, జాతీయవాదిగా, జీర్ణగ్రంథోద్ధారకునిగా, యోగిగా, శాస్త్రిగారు, తెలుగుజాతికి చేసిన సేవ, విలువకట్టు అందనిది.

శాస్త్రిగారి బహుముఖ ప్రజ్ఞావైభవాలను, సంపూర్ణంగా కాదుగానీ—సూచ్యంగా తెలియచేసే ప్రయత్నమిది. ఆయారంగాలలో, కృషిచేసిన పెద్దల ద్వారా వివరాలను తెలుసుకొందాం—ముందుగా—వేటూరివారి సారస్వత పరిశోధనను గురించి, డాక్టర్. బి. రామరాజుగారు చెబుతారు.

డా॥ బిరుదురాజు రామరాజు

ఆంధ్ర వాఙ్మయంలో పరిశోధన రంగానికి పాదులు త్రవ్వినది బ్రౌనుదొరగారు, విత్తనం నాటినది వీరేశలింగం గారు, నీరు పోసినది కొమర్రాజువారు, కంచెకట్టి కలుపు తీసి దోహదం చేసి

వది మానవల్లివారు, తీరొక్క పంట పండించి దేశవాసులందరికీ పంచి పెట్టినది పవిత్రాత్ములైన ప్రభాకరశాస్త్రిగారు. తెలుగు పండితులలో అంతటి బహుముఖప్రజ్ఞాశాలీ, పరిశోధకుడూ, మీదు మిక్కిలి కరుణాంతఃకరణుడూ నాటికీ నేటికీ ప్రభాకర శాస్త్రిగారే అంటే అతిశయోక్తి కాదు. తిరుపతి వెంకట కవుల శిష్యుడైనందుకు గురువుల మనసుకెక్కిన కవి పండితుడైనాడు. కవిత అల్లినాడు; కథలు కూర్చినాడు; సంస్కృతరూపకాలు అనువదించినాడు; అవసరమైనప్పుడు కవి పండితులతో సిద్ధాంత రాద్ధాంతాలూ చేసినాడు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో తెలుగు పండితుడుగా చేరి, తాళపత్ర గ్రంథాలూ మెకంజీ కైఫియతులూ, ప్రాణ్యనిధులూ గాలించి పరిశోధించి ప్రభాకరశాస్త్రిగారు పండించిన పంట, వైనంలోనూ, వాసిలోనూ, రాసిలోనూ, బహుదొడ్డది, దానిని బండ్లకెత్తించవచ్చు.

తెలుగుభాష గురించీ, లిపి గురించీ, ప్రభాకర శాస్త్రిగారు చేసిన పరిశోధన మౌలికమైనది. బసవపురాణం పీఠికలోనూ, తాము ప్రకటించిన శాసన పరిచయముల్లోనూ ప్రాచీనాంధ్ర భాషా తత్త్వ, లిపి సంప్రదాయాల గూర్చి శాస్త్రిగారు కొంగ్రొత్త విషయాలు చెప్పినారు. క్రీస్తుపూర్వపు అమరావతీ శాసనాల్లోని "నాగబు" అనే తొలితెలుగు మాటను కనుగొన్నది శాస్త్రిగారే. నాగము అనే పదానికి నాగబు రూపాంతరము. ఈ 'బు' ప్రత్యయమే 'ంబు' గా మారి నేటి ప్రథమావిభక్తి ప్రత్యయం 'ము' ఐనదని శాస్త్రిగారి తీర్మానము. తెలుగు భాషలో విశిష్టంగా కనిపించే అర్ధానుస్వార సంప్రదాయం గురించీ, మకార వకారముల వినిమయం గురించీ, రేనాటి చోళుల శాసనాల్లో కానవచ్చే 'ఱ'కారంగురించీ, ప్రథమావిభక్తిప్రత్యయం 'ండు' గురించీ, తెలుగు లిపి సంస్కారం గురించీ, శాస్త్రిగారు నూతన విషయాలు చెప్పినారు. ప్రభాకరశాస్త్రిగారుప్రకటించిన అహదనకర శాసనమూ, లక్ష్మీపుర శాసనమూ, శ్రీనాథుని శాసనములూ ఆంధ్రభాషా లిపి పరిణామాల దృష్ట్యా చాలా విలువైనవి. శాస్త్రిగారు శాసనములను శబ్దార్థ వివరణతో ప్రకటించేవారు. అందులో భాషాలిపి సంప్రదాయాల గురించి ఎన్నో క్రొత్త విషయాలు చెప్పేవారు. అహదనకర శాసనమూ లక్ష్మీపుర శాసనమూ శాస్త్రిగారు ఈవిధంగానే ప్రకటించినారు.

తెలుగు భాషావికాసం గురించి శాస్త్రిగారు చేసిన ప్రసంగం ఆధునికులకు కూడ మార్గదర్శకమైనట్టిది. వ్యావహారిక భాషావాదానికి ఆనాడు శాస్త్రిగారు పట్టుగొమ్మగా ఉండేవారు. గిడుగు రామమూర్తి పంతులుగారు శాస్త్రిగారి భాషా పాండిత్యమును అభ్యుదయ దృక్పథమునూ అగ్గించినారు. "సాహిత్యం అన్ని తరగతుల వారికి అనుభవింపదగి ఉండాలి" అని శాస్త్రిగారెన్నడో హెచ్చరించినారు. "నేటి తెనుగు నోటి తెనుగు" అనే వ్యాసంలో "క్షుల్లూకభట్టీయాన్ని బట్టి వర్ణాశ్రమ ధర్మాలనూ, నన్నయభట్టీయాన్నిబట్టి ఆంధ్రభాషా వ్యవహారములను ఆచిపట్టవలననే వారు నాలుక కఱచుకోవలసిన స్థితి వస్తుంది. తప్పదు" అని ప్రభాకర శాస్త్రిగారెన్నడో తీర్మానించినారు. ఏనాదుల భాష దాని తీరుతెన్నుల గురించి 1917 నాటికే శాస్త్రిగారు గొప్ప వ్యాసం ప్రకటించినారు.

చరిత్ర పరిశోధనలో కూడ ప్రభాకరశాస్త్రిగారు అందెవేసిన చేయి అనిపించుకున్నారు. దక్షిణాపథ చరిత్రమంతా వారికి కరతలామలకం. సాతవాహనుల చరిత్రలోని కొన్ని సమస్యలను వారు పరిష్కరించినారు. నన్నిచోడుని కాలనిర్ణయం గురించి కొలచెలమ కవుల గురించీ, ప్రతాపరుద్ర గజపతి అనంతవరం శాసనం గురించీ, తెలుగుదేశపు సంస్కృత కవుల గురించీ వారు రచించిన

వ్యాసాలూ, వారి చరిత్ర పరిశోధన పాండిత్యాన్ని వెల్లడిస్తవి. తంజావూరి రాజుల చరిత్రి పీఠిక, శృంగార శ్రీనాథమూ ప్రభాకరశాస్త్రిగారి చరిత్రి పరిశోధనకు విజయపతాకలు. ప్రాచీన చరిత్రతో పాటు ప్రాచీన శిల్పకళా విశేషాలు కూడ శాస్త్రిగారికి బాగా పట్టుబడినవి. అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల వంటి ప్రాచీన బౌద్ధక్షేత్రాలలో త్రవ్వకాలు కూడా జరిపించినారు. కెయిరన్సు అనే చరిత్రి పూర్వ యుగానికి చెందిన మానవ సమాధులు త్రవ్వించి ఎన్నో క్రొత్తవిషయాలు కూడ శాస్త్రిగారు ప్రకటించినారు.

ప్రభాకరశాస్త్రిగారి గొప్ప ధ్యేయం ప్రాచీన తాళపత్ర గ్రంథాలను సేకరించటమే కాక మద్రాసు తంజావూరు తాళపత్ర గ్రంథభాండాగారాల్లో పడియున్న అపూర్వ గ్రంథాలను పరిష్కరించి అమూల్యమైన పీఠికలతో వెలయించడం. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో ఉన్న గ్రంథాలకు వివరణాత్మకమైన 20 కేటలాగులు ప్రభాకర శాస్త్రిగారు తయారుచేసినారు. వారు ప్రకటించిన సంకలన గ్రంథాలు ప్రబంధ రత్నావళి, చాటుపద్య మణిమంజరి, చాలా ఉత్కృష్టమైన కృతులు. వాటి మూలంగా ఎందరో ప్రాచీనకవులూ, వారి కృతులూ వెలుగులోనికి రావటంతో కవుల చరిత్రల్లోని కటిక ముళ్లు విడివడినవి. తెలుగులో జైన సాహిత్యానికి సంబంధించిన నాచిపురాణమూ, జినేంద్ర పురాణమూ ప్రబంధరత్నావళి మూలంగానే తెలియవచ్చినవి. శాస్త్రిగారిచ్చిన ఆధార గ్రంథాలమూలంగా అనంతర పరిశోధకులకు ఎంతో మేలు కలిగింది. శాస్త్రిగారు సంపాదించిన చాటుపద్య మణిమంజరి రెండు భాగాలు మన కవుల చరిత్ర, రాజుల చరిత్ర, మంత్రులచరిత్ర, ఆయా కవుల సమకాలీన చరిత్ర తెలిసికోవటానికి ఎంతో తోడ్పడేవిగా ఉన్నవి. శాస్త్రిగారు ఆ సంకలన గ్రంథాల్లో జనశ్రుతిలో ఉన్న చాలా కథలు ప్రకటించినారు. అందులో వారు ప్రకటించిన ఆయా రాజుల బిరుదావళులూ, దామెరవారి వంశావళి తరువాతి చరిత్ర పరిశోధకులకు ఎంతోగానో తోడ్పడినవి. శాస్త్రిగారు సంపాదించిన మరొక బృహత్తర సంకలన గ్రంథం లక్షణోదారము, అముద్రితంగానే ఉండిపోయినది. అందులో వారు పేర్కొన్న లక్షణ గ్రంథాల పట్టిక, వైదిక, సంస్కృత, ప్రాకృత, దాక్షిణాత్య భాషల ఛందో విశేషాలు ఎంతో విలువైనవి.

శాస్త్రిగారి పరిశోధన పాటవం లోకోపకారకం కావటానికి మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారం కూడ తోడ్పడినది. ఆ గ్రంథాలయంలో మరుగుపడిన మాణిక్యాల నెన్నింటినో శాస్త్రిగారు సానలదీర్చి సూర్యాలోకనం కలిగించి వాటికాంతులు తెలుగు సారస్వత రంగంలో ప్రసరింప జేసినారు. పావులూరి గణితము, ఉద్భటారాధ్య చరిత్రమూ చారుచర్య, నాసికేతోపాఖ్యానము మొదలైన గ్రంథాలు శాస్త్రిగారు పరిష్కరించి ప్రకటించినట్టివే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి కోరిక మేరకు శాస్త్రిగారు బసవపురాణం పరిష్కరించి చాలా గొప్ప పీఠిక సంతరించినారు. తెలుగు భాషా విశేషాలు అందులో చాలా ఉన్నవి. తెలుగు ద్విపద కృతుల్లో బసవపురాణం వంటిదే రంగనాథ రామాయణం. పూర్వ ముద్రణల్లోని లోపాలు సవరించి శాస్త్రిగారు సుష్ఠైన రంగనాథ రామాయణం మనకందించినారు. క్రీడాభిరామం పరిష్కరణమూ, దాని పీఠికా, శబ్దార్థాల పట్టికా పరిశీలిస్తే శాస్త్రిగారి పరిశోధన పాండిత్యం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. శృంగార గ్రంథమాల వారు ప్రకటించిన గ్రంథాలన్నీ శాస్త్రిగారి పరిష్కరణ భాగ్యం పొందినవే. శాస్త్రిగారు సంస్కృత కృతులు కూడ చాలా పరిష్కరించి ప్రకటించినారు. బోధాయనుని భగవదజ్జుక ప్రహసనము, సుంధర పాండ్యుని నీతి

ద్విషష్టిక, పల్లవ మహేంద్రవర్మ మత్తవిలాస ప్రహసనము మొదలైన వాటిని శాస్త్రిగారే వెలుగులోనికి తెచ్చినారు. గ్రంథ పరిష్కరణలో, సాధుపాఠ నిర్ణయంలో, ప్రభాకర శాస్త్రిగారు సిద్ధహస్తులు. నన్నిచోడుని కుమారసంభవం, నాచన సోముని ఉత్తర హరివంశం, బసవపురాణం, రంగనాథ రామాయణం, క్రీడాభిరామం మొదలైన గ్రంథాల్లో పూర్వముద్రణల్లో ఉన్న అనేకలోపాలను సవరించి శాస్త్రిగారు చక్కని పాఠ నిర్ణయం చేసినారు.

మన దేశి సాహిత్యం గూర్చి ప్రభాకరశాస్త్రిగారు చేసిన పరిశోధనలూ, చాటిన ఫలితాలూ చాలా అమూల్యమైనవి. కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయానికి శాస్త్రిగారు సంతరించిన పీఠిక చాలా గొప్పది. జానపద సారస్వతమునకు చెందిన కాటమరాజు కథలు శాస్త్రిగారే పరిష్కరించినారు. జానపదగేయాలు, కథలు, గాథలు, సామెతలు, పలుకుబళ్లు, బాలగేయాలు సేకరించి ప్రకటించి జానపద వాఙ్మయానికి ఎంతో సేవ చేసినారు. తిరుపతికి మారిన తరువాత శాస్త్రిగారు తాళ్లపాక కవుల సాహిత్యానికి ఏతమెత్తినారు. అన్నమాచార్యుల సంకీర్తన సంపుటాలలో నాలుగో సంపుటం ఐదో సంపుటం శాస్త్రిగారే పరిష్కరించినారు. తాళ్లపాక చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్రకు శాస్త్రిగారు గొప్ప పీఠికను సవరించినారు. వెంకటేశ్వర వచనములు, తిమ్మక్క రచించిన సుభద్రాకల్యాణము తిరువెంగళనాథుని శృంగారామరుకము, వెంకటేశ్వర లఘుకృతులు, శాస్త్రిగారే పరిష్కరించి ప్రకటించినారు. ఈనాడు అన్నమాచార్యుల ఉత్సవాలు జరుపుతున్న ప్రణాళిక ఆనాడు ప్రభాకర శాస్త్రిగారు చేసిన రూపకల్పనమే.

శాస్త్రిగారు మనచరిత్ర, మనలిపి, మనభాష, మన సాహిత్యము, మనసంస్కృతి మన వాఙ్మయమునకు సంబంధించిన అనేక నూతన విషయాలు వివిధ పత్రికల్లో వ్యాసరూపంగా ప్రకటించినారు. వాటిలో కొన్నింటిని సేకరించి ప్రభాకర పరిశోధక మండలి వారు సింహావలోకనము, తెలుగు మెఱుగులు, మీగడ తఱకలు అనే వ్యాససంపుటాలను ప్రచురించినారు. ఆ సంపుటాలు చదివితే ప్రభాకర పరిశ్రమము ఎంత గహనమైనదో చూచాయగానైనా తెలుస్తుంది. ప్రభాకర పరిశోధక మండలి వారు ఇటీవల ప్రకటించిన మణిమంజరి రెండు పత్రికా సంపుటాలు, శాస్త్రిగారి పరిశోధనకు సంబంధించిన అముద్రిత సంపద ఇంకా చాలా ఉన్నట్లు తెలుపుతున్నవి. పెదవి కదిపినపుడల్లా సత్యమునూ, కలం నడపినపుడల్లా క్రొత్త విషయాన్ని, అందించి తెలుగు జాతిని ఋణగ్రస్తులను చేసిన వేటూరి ప్రభాకర శాస్త్రిగారు నిజంగా ప్రాతస్స్మరణీయులు.

* * *

డాక్టర్ బి. రామరాజుగారి ప్రసంగం విన్నారు.

ప్రభాకరశాస్త్రిగారు, చరిత్రలిపి, పురాతత్త్వశాస్త్ర రంగాలలో చేసిన కృషిని వివరిస్తున్న వారు శ్రీ తిరుమల రామచంద్రగారు.

* * *

శ్రీ తిరుమల రామచంద్ర

కలం పట్టినప్పుడెల్లా కలకాలం నిలిచే కొత్త విషయం చెప్పడమే గురువర్యులు శ్రీవేటూరి ప్రభాకరుల ప్రజ్ఞ, అదే ఆయన ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞను వారు భాషా సాహిత్యరంగాలలోనే కాదు, చరిత్ర, పురాలిపి, పురాతత్త్వ రంగాలలోను నెరవేర్చుకొని సత్యదృష్టిగల తర్వాతి పరిశోధకులకు వెలుగుబాటలు

తీర్చారు. చీకటిచాటువారికి కన్నులు జిగేలు మనిపించారు.

నూనూగు మీసాల నూత్నయౌవనంనుంచే వారికి పరిశోధన దృష్టి, చరిత్ర సృష్టి అలవడినవి; వాటికి మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకాలయం ఉద్యోగమూ దాని పరిసరాలలోని మ్యూజియమూ పుష్టిని కలిగించాయి. అందువల్లనే ఆరు దశాబ్దాలనాటి నుంచే వెలుగులు ప్రసరింపజేసి. భాషాచరిత్రాది రంగాలలో కొత్త మలుపులు తిప్పారు. వాటిలో కొన్నిటిని మాత్రం స్థాలీపులాకన్యాయంగా పేర్కొంటాను.

వారు 1928లో భారతి పత్రికలో ప్రచురించిన ① ప్రాచీనాంధ్ర శాసనములు అనే వ్యాసం అనేకాపూర్వవిషయాలు తెలిపింది. 1920 లో పురాతత్త్వజ్ఞులు శ్రీ రమాప్రసాద్‌చందా ప్రచురించిన శాసనాలలో 'నాగబు' అనే మూడక్షరాల శాసనం వారికి ముచ్చటగొల్పింది. శ్రీ చందా ఇది పాళీభాషా పదమయివుంటుందని భావించి నాగ-బు అని విడదీసి శిల్పిపేరు కావచ్చునని భావించారు. కాని ప్రభాకరులు ఇది క్రీస్తుశకం రెండవ శతాబ్దికి ఈవలిది కాదని బ్రాహ్మీలిపినిబట్టి నిర్ణయించి, ఒకే పదమని క్రీస్తుశకం ప్రారంభకాలానికే సంస్కృతపదాలు తెలుగు విభక్తి ప్రత్యయాలతో వ్యవహృతమయ్యే దశ వచ్చి, తద్భవాలు ఏర్పడ్డాయని అన్నారు. బు ప్రథమా విభక్తి ప్రత్యయం, నాగంబు అనేది ప్రాచీనరూపం. ఎద్ద అనేది పూర్వపరకాల్లో పాలతో ఎడ, ఎద అయినట్టు నాగంబు నాగమూ, నాగబు అయింది. నాగమ్మ అనేది తర్వాతి పరిణామం. ఈ ప్రక్రియను వారు ద్విత్వశైథిల్యమని అన్నారు.

వారు ప్రచురించిన రెండవ శాసనం క్రీస్తుశకం 675 నాటి లక్ష్మీపురశాసనం. ఇది కృష్ణా జిల్లాలో దొరికిన తొలితెలుగు శాసనం; చాళుక్య యువరాజు మంగిరాజు దానశాసనం. దీనివల్ల పెక్కు భాషా విశేషాలు తెలిశాయి.

② అహదకర తామ్రశాసనాన్ని ఫ్లీట్ ఇండియన్ యాంటిక్వెరీలో ప్రచురించారు. దానిని లక్ష్మణరావు గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చదివారు. ఇది 847నాటిది. కరిగల్ల ఒడయరు-దేవరకు ఆగ్రామాధికారులు ఇచ్చిన దానశాసనం. దీనిని ప్రభాకరులు 1928 జూలైలో భారతిలో ప్రచురించి కొన్ని విచిత్రమైన పదాలకు అర్థ నిర్ణయం చేశారు. ఇది పండితలోకంలో పెద్ద దుమారం లేపింది. తమిళలో నేడూ వున్న [ఴ] అనే వర్ణం ఒకప్పుడు తెలుగులోను వుండేదని ఇది ర,డ,ద,ల లుగా తర్వాత మారిందని ప్రభాకరులన్నారు. ఈ విచిత్రాక్షరానికి బండి రకారు వ్యత్యాసం తెలియక కొందరు పొరపాట్లు చేశారని అన్నారు. అరి, తగ్గు. తెఱ, సిద్ధాయము, దండు, దశాపరాధము-అనే పన్నులను గుర్తించారు. దాయ-దానం- సెడ్లు-రాజోద్యోగులు, పనికొళు-పనివారు మున్నగు పెక్కు పదాల అర్థాలు నిరూపించారు.

వారు ప్రకటించిన కపిలేశ్వరపురశాసనం 740 నాటిది. ఇది కృష్ణాజిల్లాలో దొరికిన రెండవ తెలుగు శాసనం. ఇది భాషా పరిశోధనకు చాల తోడ్పడింది. ఇది తొమ్మిది పంక్తులది. ప్రాచీన భాష ఎలా వుంటుందో చూపడానికి ఉదాహరిస్తున్నారు.

స్వస్తిశ్రీ జెజె ఇత్త
భటరళ నిల్పిన దత్తి
కడందల ఇశరయ నిల్పిన
గుడియు వరికొడుకు బాదయ
కొడు మత్తిశకు తబుండు శక
వైశ్రవను కొడుకు జోప్లయ
భటరళ పన్నెసళకు
వ్రగము పచ్చువరు బ[రనాసి]
వేవురు ప[ఱ]

విజయాదిత్య భట్టారకులు నిలిపిన దానం. కడందల ఇళరయ అనేవాడు గుడి కట్టించాడు. ఆ గుడికి ఆతని వంశం వారయిన బాదయ, మత్తిళ, అతని తమ్ముడు శకవై స్రవను, అతని కొడుకు ప్రోలయ భట్టారకుడు ఇచ్చిన పన్నస భూమికి చెరుపుచేసేవారు వారణాసిలో వేయి మంది బ్రాహ్మణులను చంపిన పాపానపోతారు. దీనిలో విజయిత్త - విజయాదిత్యుడు. ప్రాకృతరూపం. ఇది నన్నయకాలానికి బెజయితగా మారింది. భటరళ - భట్టారుల. దత్తి-దానం. కడందల ఇళరయ-కడందల ఇంటిపేరుగల ఈశ్వరయ్య. బాదయ వాతాపి నుంచి వచ్చిన తద్భవం. త్రోప్వలయ-ప్రోలయ పన్నెస - పన్నస, పన్నసం. సర్వమాన్యభూమి. వగ్రంబు వచ్చువారు-చెరిపేవారు.

శ్రీ తల్లావజ్ఝల శివశంకరస్వామిగారు చితాభస్మమున్న ఒక పిడతను ప్రభాకరులకు ఇచ్చారు. దానిమీద బ్రాహ్మీలిపితో 'అయో మణిలిష్టకాః' అని వుంది. ప్రాకృతంలో ప్రభాకరులు దానిని పరిశీలించి 'ఆర్యమునేః ప్లుష్టకాః' ఆర్యముని చితాభస్మం అని విశదీకరించారు. ఈ ఆర్యముని ఆనాటి స్థానిక బౌద్ధాచార్యులలో ఒకరు.

ప్రభాకరుల పరిశోధన దృష్టి కిరణాలు గుడిగంటల వ్రాతలమీదను పడ్డాయి. రాజులకాలంలో దాక్షారామ భీమేశ్వరాలయం ధర్మసత్రంలో ఒక గంట వుండేది. భోజనాహ్వానానికి దానిని వాయించేవారట. ఆ విషయం ప్రాచ్యలిఖిత పుస్తకాలయంలో ఒక తాళపత్రప్రతిలో వుంది. 'ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి గంటమీద తారీఖు: శాలివాహన శకాబ్దంబులు 1356 ఆనందనామ సంవత్సర వైశాఖ బహుళ 13 బుధవారం, చేయించినవారు వీరారెడ్డి, వేమారెడ్డి, దొడ్డారెడ్డి.' ఈ ముగ్గురు అన్నసత్తర్వు గంటసమర్పించారు. శాలివాహన శకానికి సరైన తేదీ 1434. ఈ తాళపత్ర ప్రతి 1840లో లిఖిత పుస్తకాలయానికి చేరింది. ఈగంట ఆరా తీయాలన్నారు ప్రభాకరులు.

వారు వెలుగులోనికి తెచ్చిన ఇలాటి శాసనాంశాలు అసంఖ్యాకాలు. వాటివల్ల లిపి భాషాచరిత్ర పరిణామ క్రమానికి కొత్తమలుపులు ఏర్పడ్డాయి.

చరిత్రకు ప్రభాకరుల సేవ అనిదం పూర్వం. రెడ్డిరాజుల చరిత్రకు, వారి శృంగార శ్రీనాథం, క్రీడాభిరామపీఠిక, రెడ్డిరాణివ్యాసాలు కలికితురాయి వంటివి.

సాతవాహనులు ఆంధ్రులేనని తొలిసారిగా వక్కాణించినవారు వారే. శ్రీ భావరాజు వేంకటకృష్ణరావుగారి ద్వారా ఆంగ్లీకృతమై ఈ వ్యాసం యావద్దేశ చరిత్రకారుల మన్ననా పొందింది.

కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళం ప్రాచీనాంధ్ర రాజధాని అని శ్రీ కాంప్‌బెల్ వ్రాతలబట్టి పలువురు వ్రాసిన వ్రాతలు సరిగావని వారు 1920లోనే ఖండించారు. స్కంధపురాణాంతర్గత మనబడే శ్రీకాకుళ క్షేత్రం మహాత్మ్యానికి శ్రీనాథుడు క్రీడాభిరామంలో వర్ణించినదానికి భేదం వుండడంవల్ల రాజధాని కాదని వారన్నారు.

కృష్ణదేవరాయలకు కమల అనే మూడవభార్య వున్నదని 1914లో వ్రాశారు. ఆముక్తమాల్యదలోని

ఆవిభు ననంతరంబధ
రా వలయము పూనితీవు రహిమై దిరుమ
ల్దేవియును నన్నపూర్ణా
దేవియు గమలాబ్జముఖియు దేవేరులుగాన్.

అనే పద్యాన్ని వ్యాఖ్యాతలు సరిగా గ్రహించలేదని పెక్కు తాళపత్ర గ్రంథాలలో కమలాబ్జముఖి అనే వుందని తెలిపారు.

రాజరాజుకు, సారంగధరునికి ఎలాటి సంబంధం లేదని 1925 లోనే తొలిసారిగా తెలిపారు. అతడొక సిద్ధుడని నిరూపించారు. ఇలాటి కథలు దేశమంతా వున్నాయి. పంజాబులో విశేష ప్రచారమున్న పూరణ్ భగత్ కథ ఇలాటిదే.

వేమన కాలాన్నిగూడ వారు తొలిసారిగా 17వ శతాబ్ది చివరిపాదమని నిర్ణయించారు.

ప్రస్తుతంపువేళ బద్యంబు జదివిన
దప్పులున్న మిగుల నొప్పియుండు
వెలది సురతవేళ బిత్తలై యుండదా?
[భామ పడకపట్ల బిత్తలైయుండదా?]

అనే వేమనపద్యం జగన్నాథ పండితరాయల

అవసర పఠితావాణీ
గుణగణ రహితాపి శోభతే పుంసాం
రతిసమయే నారీణాం
భూషా హానిశ్చ భూషణం భవతి.

అనే శ్లోకాన్ని పోలింది కనుక, జగన్నాథుడు వేమనను అనుకరించాడు గనుక అతని కాలం 1412-1440 అనికొందరు వాదించగా, ఈ శ్లోకం 1380 నాటి ప్రసంగ రత్నావళిలోనిదని ప్రభాకరులు వివరించారు.

శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు శివాజీచరిత్ర వ్రాశారు. శివాజీ సమకాలికులైనవారు వ్రాసిన రచనలను ఆయన చూడలేదు. ఆ విషయాన్ని ప్రభాకరులు గుర్తించారు. ఈసంగతిని 1917 మార్చిలోనే ఇలా తెలిపారు: "మహాదేవ పండితుడను విద్వాంసుడు శతసహస్రికయగు సంహితగా "శివభారతమ్" అను పేర మహాగ్రంథమును రచించెను. సవిస్తరముగా నాతని విజయము లిందు వర్ణితములు. మహాదేవ పండితుడను నింకొక విద్వాంసుడు తంజాపురమును వశపరచుకొన్న శివాజీ సోదరుడగు నేకోజీ మహారాజు కడకు వచ్చి, యేకోజీ యెరుగని కొన్ని విజయములు మాత్రము గ్రంథరూపముగా తెలిపియున్నాడు. 'పర్ణాల పర్వతీగ్రహణోపాఖ్యానమ్' అని దీనికి పేరు. ఇది తంజాపుర పుస్తకశాలలో నున్నది. ఈ రెండు గ్రంథములును శివాజీకాలముననే రచింపబడినవి. కన్నారజూచి వర్ణించినారు" అని తెలిపారు.

జగన్నాథ పండితరాయలకు లవంగి అనే యవన కాంతతో సంబంధమున్నట్టు కథ ప్రచారంలో వుంది. ఈ కథ శ్రీ రంగస్వామి సరస్వతి అనే పురాతత్త్వవేత్త తెలిపిన 'విభాగరత్నమాల' అనే గ్రంథాన్నిబట్టి శ్రీనాథుడు ఓడించిన డిండిమ భట్టారకుని వంశం వాడయిన శోణగిరి నాథుని కథయని, ఇతడు ఢిల్లీకి వెళ్లి అక్కడ ఢిల్లీ పాదుషా ఆస్థాన పండితులను జయించి, లవంగి అనే యవన కన్యక్కు ముగ్ధుడైన గాధేనని ప్రభాకరులు 1916లోనే వ్రాశారు. సి. పి. బ్రౌను, మెకంజీ సేవలను గుర్తించి వారిని తొలిసారిగా 1911 మార్చి నెలలో కృష్ణా పత్రికలో వ్రాశారు ప్రభాకరులు.

"హైందవ సారస్వతమునకు గనియని చెప్పదగు చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున గల విషయరత్న విశేషములు ప్రపంచమునకు దప్పక వెల్లడికావలసినవి. మెస్తరు మెకంజీ బ్రౌను అను నాంగ్లేయులు మనకు జేసిన మహోపకారము మరువరావిది. పత్రికాధిపతులును, భాషాభిమానులును నిందలి విషయములను వెలిపుచ్చ బ్రార్థితులు. వీలునుబట్టి యప్పుడప్పుడు కొన్ని కొన్ని చిన్న చిన్న యుపయుక్తాంశములను వెల్లడింపదలంపుగొని ప్రస్తుతమిద్దానిని వ్రాయించి పంపితిని. బ్రౌను, మెకంజీ దొరలు వ్రాయించిన వ్రాతలు భాషా విషయమున సంపూర్ణ సంస్కారమందని వైనను, పసి బాలురకైన నర్థమగునట్లు తేటతెల్లముగ

మండును. అట్టి వానిని మన మతి కౌశలము జూపి సంస్కరింపబూనిన సులువుగా నర్థము కాకపోవు నేమో యను తలపున నున్నదున్నట్టే వ్రాయించి పంపగలిగితిని”.

ఈ పీఠికతో వారు ఎర్రగడ్డవారి పోరాటం ప్రచురించారు. 1914తో ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధంలో బ్రౌను ఉత్తరాలు, పిదప 1944-45లలో కొన్ని ప్రచురించారు.

తంజావూరు నాయకరాజుల విగ్రహాలను నిర్ధారించిన కీర్తి ప్రభాకరులదే. కుంభకోణంలో రఘునాథరాయలు రామస్వామి దేవాలయం కట్టించారు గొప్పది.

ఆ దేవాలయంలోని ఒక స్తంభంపై రఘునాథరాయల, ఆయన కుమారుని విగ్రహాలున్నాయి. ఉత్సవసమయాలలో ఉత్సవ విగ్రహాలు ఆ స్తంభం వద్దకు రావడం ఆ స్తంభాన్ని పుష్పమాలతో అలంకరించడం ఆచారం. వాటికి, దేవాలయ భాండాగారంలో విగ్రహాలకుగల పోలికలను బట్టి అవి రఘునాథరాయలవేనని ప్రభాకరులు నిర్ణయించారు.

ఇలా చెబుతూపోతే, ఏండ్లూ పూండ్లూ పడుతాయి. ప్రభాకరుల కృషి అపూర్వం, ఋతం, తేజోమయం అని మూడు ముక్కలలో ముగిస్తాను.

* * *

శ్రీ తిరుమల రామచంద్ర గారి ప్రసంగం విన్నారు. ఇప్పుడు, వేటూరి వారి యోగదర్శనాన్ని గురించి, శ్రీ కొత్తరామకోటయగారి అనుభవాలు తెలుసుకొందాం.

* * *

శ్రీరామకోటయ్య:

శ్రీ గురుదేవుల దర్శనానికి నన్ను తోసుకు వెళ్ళిన ముఖ్యమైన కారణం నా అనారోగ్యమే. చాలా సంవత్సరములు అనారోగ్యంతో బాధపడిపడి, పెద్ద పెద్ద డాక్టర్లందర్నీ చూచి వారేమీ సహాయం చేయలేకపోయిన స్థితిలో నేను వెళ్ళి గురుదేవులు ప్రభాకరశాస్త్రులు గారిని దర్శించాను. అది 1943 వ సం॥ డిసెంబరు 13వ తేది, ఆ రోజున వారు నన్ను చూడగానే అన్నటువంటి యోగవాక్కు ఏమిటంటే ‘నీవు ఇవ్వాల్టి నుంచీ బాగానే వుంటావు’ అని; ‘నా ఆరోగ్యం బాగా లేదు’ అని నేనన్న దానికి సమాధానంగా ‘బాగానే ఉంటావు’ అన్నారు. ఆ “బాగా ఉండడ”మనేదే అప్పటి నుంచీ ఇప్పటి వరకూ అవిచ్ఛిన్నంగా జరుగుతూ వున్నది. విశేషమేమిటంటే వారి చుట్టూ వున్న వారందరికి వారిలో నించి ‘బాగు’ అనేదే ప్రవహిస్తూ వుంటుంది: వారిలో అందరికీ ప్రధానంగా గోచరించే విషయం. మనలో వున్న చెడు అంతా లోపలికి వెళ్ళిపోవడము మనకు సుఖమును ఆనందమును కలిగించేటటువంటి బాగు, ప్రేమ అన్నటువంటివి వారిలోనించి బయటికి సదా ప్రవర్తించడము, అనేది వారి యోగానుష్ఠానంలో మొట్టమొదట నాకు కొట్టవచ్చినట్టు విశిష్టంగా కనిపించినటువంటి విభాగం. ఎందువల్లనంటే నేను చాలా అనారోగ్యంగా నీరసంగా వుండి వారి దర్శనానికి వెళ్ళినపుడు ‘నీకేమిటి జబ్బు?’ అని కూడా వారడగలేదు. ‘ఇవాళటి నుంచి బాగానే వుంటావు’ అని చెప్పారు అదే విశేషం. ఆ తరువాత ఇంకొక మహత్తరమైన వాక్యం కూడా అన్నారు. అదేమిటంటే “నువ్వు రేపుదయం ప్రార్థనకు వచ్చేటపుడు, నీకు ఏ ఆహారం తింటే వికటించి విరుద్ధంగా బాధ కలిగిస్తుందో చక్కగా అదే పుచ్చుకునిరా” అంటే నేను ఆ వాక్యం పొరపాటుగా వింటున్నానా-తింటే వికటించకుండా వుండే ఆహారం ఏదైనా పుచ్చుకురా అంటున్నారేమో అని మొదట్లో భ్రమపడ్డాను. కాదు, వారన్నది ‘వికటించే ఆహారమే చక్కగా పుచ్చుకునిరా’ అనే

అలాటి వాక్యం నా జన్మలో అదే మొదటిసారి నేను వినడం. మళ్లీ ఎప్పుడూ ఇంకెవరూ కూడా ఆ వాక్యాన్ని చెప్పేవారిని నేను చూడలేదు. అది వారిలో నాకు మొట్టమొదట కనిపించినటువంటి యోగవిశేషం. పరుల బాధని భారాన్ని వహించే వారి యొక్క ప్రేమ తత్త్వ ప్రభావం అట్టిది. అది వారి చుట్టూవున్నవారి అందరిలో వున్న చెడును తుడిచివేసి హాయి చేకూర్చేది. తమలో వున్నటువంటి జ్ఞానతేజస్సుని చుట్టూవున్న అందరికి పంచిపెట్టడమనేదే వార సాన్నిధ్యంలో మాకు ప్రత్యేకంగా కలిగిన అనుభూతి. అనుష్ఠాన సమయంలో ఎవరెవరికి ఏయే విషయం కావాలో అదిగా వారి వారికి ఆయన ఒక్కరే అవుతూవుండేవారు. ఎవరెవరు ఏం కోరుకొంటూ అక్కడికి వారి దర్శనానికివస్తూ వుండేవారో వారివారికి ఆకోరుకొన్నదిగా ఆయన ప్రత్యక్షమయ్యేవారు. అంటే కామధేనువని పూర్వం అంటూ వుంటే - అదేమిటో సరిగా తెలిసేదికాదు గాని శాస్త్రిగారిని చూసింతర్వాత అది యిటువంటిదేనన్న విశేషమైన భావం కలుగుతూ వుండేది నాకు. ఎందుకంటే ఎవరేం కోరుకొని వచ్చేవారో అది అవుతూ వుండేవారాయన. ఉద్యోగం, ప్రమోషన్, —అదీ అవుతూ వుండేది. ఇంకోపని అదీ అవుతూ వుండేది. వ్యాపారం అదీ అవుతుండేది. అది లౌకికం. తరువాత ఆధ్యాత్మికంగా కూడా ఎవరు ఏది తెలియగోరి వస్తారో వారికది తెలియటం అనేది వారి సన్నిధిలో జరిగేది. అది నాకు కలిగిన మొట్టమొదటి అనుభవం కూడాను. ఏలాగునంటే మొదట్లో నాకంతా తెలుసుననుకొనే వాణ్ణి నేను. ఆయన దగ్గరికి వెళ్ళిం తర్వాత మనకేమి తెలియదనేది కూడా తెలిసింది. నాకిక ఆ తరువాత తెలియదం అంటే ఏమిటో ఆయన సన్నిధిలోనే తెలియటం ప్రారంభమయింది కూడాను. మొదట కవిగా పండితుడుగా చాలా కృషి చేసినప్పటికి ఈ యోగానుష్ఠానంలో దిగిం తర్వాత అదంతా ఉప్పన చప్పనైపోయి మానేసేవారు. మానేసి ఈయోగం, అనుష్ఠానం అవలంబించి తన చుట్టూ వున్నవారి యొక్క ఆధివ్యాధులను నివారణచేసి వారినికూడా ఆనందమయులనుగా సుఖశాంతులతో వుంచాలన్నదే వారెప్పుడూ తపించే ప్రధానమైన అంశంగా వుండేది. వారి దర్శనమైన దగ్గరినుంచీ వారియొక్క అనురాగ ప్రవాహం అవిచ్ఛిన్నంగా ఇప్పటికీ సాగుతూనే వున్నది. ఇప్పుడు కూడా గుంటూరు ప్రాంతాల్లో చాలమంది భక్తులు ఆదివారంఆదివారం సమావేశంకావడం అనేక విధములైన ఆధివ్యాధులతో బాధపడేవారు రావడం-గురువుగారి యొక్క నామస్మరణ తోటి మాస్టర్ సీ. వీ. వీ. యొక్క పూజావిధానంలో వారి వ్యాధులన్నీ తగ్గిపోవడం, వారికి సుఖం కలగడం అన్నది ఇప్పుడూ నడుస్తూనే వున్నది. ఆ నడిపేదివారేగాని మనం కాదనేది కూడా స్పష్టంగా తెలుస్తూనే వుంటుంది. వారి పేరు చెప్పి నమస్కారం పెట్టితే- అసలు నయంకాదు, ఈ వ్యాధి మహాప్రమాదమైనది, - అని పెద్ద డాక్టర్లు సర్టిపై చేసిం తర్వాత వచ్చిన కేసులు కూడా చక్కబడడం మా అనుభవంలో తెలుస్తున్నది. దానికి కారణమేమిటంటే వారి యొక్క అపారమైన కరుణే: ఇతరుల శ్రేయస్సును గూర్చిన వారి చింతన పరులు బాధపడుతున్నారంటే అయ్యో పాపం బాధపడుతున్నారన్నటువంటి అనుతాపం ఆయనలో చాలా ఎక్కువ వుండేది. అది ఇప్పుడూ మా అనుభూతికి వస్తూనే వుంటుంది. ఇతరుల బాధనుచూచి అనుతాప పడేస్థితి నాకు కలగ

డానికి కూడా కారణం వారి యొక్క అనుగ్రహ విశేషమే. అందువల్ల ఇప్పుడూ ఎప్పుడూ వారు నాకు ప్రత్యక్షమే. ఈ యోగ చికిత్సా కార్యక్రమాలు నడపడంలో వారి యొక్క అధ్యక్షతయొక్క వికాసమే ప్రధానమైన కారణం. ఈ యోగవిద్య అభ్యాసం చేయడానికి ఫలానివారు పనికొస్తారు, ఫలానివారు పనికిరారు అనేది లేనేలేదు. వ్యాధిని మృత్యువుని జయించి మానవకోటి నుద్ధరించి అమృతత్వాన్ని సిద్ధింపజేసే నూతనయోగమిది. అట్టియోగాన్ని సాధించిన మహాయోగిశ్రీశాస్త్రిల వారు అయినా ఆయన ఎప్పుడూ అలా తమని గురించి చెప్పనిచ్చేవారు కాదు. అట్టి ప్రచారం జరగాలనని వారి కెప్పుడూ కోరిక వుండేది కాదు. కాని అందరికీ యోగ విద్య రావాలనే కోరిక మాత్రం బాగా వుండేది. అందరికీ ఈ విషయం చెప్పాలనేది వారి ప్రధానమైనటువంటి ఉత్సాహం. మాకు గూడా అటువంటి ఉత్సాహాన్నే ఇప్పుడు గూడా అందిస్తూ వున్నారు. మేము ఆవూళ్లూ యీవూళ్లూ వెళ్ళడం అక్కడ బాధపడుతున్నవారిని కూర్చోబెట్టి భగవత్ప్రార్థన చేసుకోండి మీకు నయమవుతుంది, మా గురువుగారి అనుగ్రహం పనిచేస్తుంది, అని చెప్పడం, అలా జరగడం, దీనికంతటికీ కారణభూతమైన ప్రజ్ఞ మా ప్రభాకర గురువులదే!

(శ్రీ కొత్త రామకోటయ్యగారి ముఖాముఖి ప్రసంగంఆధారంగా కూర్చిన వ్యాసం)

కలికి - చిలుక

—వేటూరి ప్రభాకరశాస్త్రి

[‘కలికి—చిలుక’ అన్న శాస్త్రిగారి యీ చిన్నకథ 1924 జూన్‌నెల ‘భారతి’ పత్రికలో ప్రకటింప బడింది. శృగారనైషధంలోని పద్యం ఆధారంగా వారీకథను వ్రాసినట్లు తోస్తుంది. తెలుగు నుడికారము, కవితాచమత్కారము, చెలికారము మమకారము, కథాకథనమున కొసమెరపు తళత్కారము నిండుకొన్న వీరి యీ కథానిక అత్యంత మనోజ్ఞము-సం॥]

కలికీ! నాలుగు దినముల నుండి నీ చెలికారము నన్నెంత సంతోషపెట్టుచున్నదో చెప్పుటకు నాకు చేతగాకున్నది. ఆహా! భవభూతి కవి ఉత్తర రామచరిత్రలో ‘అద్వైతం సుఖదుఃఖయోః’ అని ఆరంభించి దాంపత్యమును గురించి ఎంత మంచి పద్యము చెప్పినాడనుకొన్నావు! ఏదీ! నీవు సంస్కృతము నేర్చుకోవైతివిగదా! మీ నాయనగారికి అప్పుడప్పుడు ఉత్తరాలలో వ్రాస్తూ వచ్చినాను. “మీ కుమార్తెకు సంస్కృతము నేర్పించండి” అని. అట్లాయేమీ జరుగలేదుగదా! అబ్బ! ఆయన మాటే ఆయన మాట. ఆయన నింకొకరు చెప్పి ఒప్పించడము కష్ట సాధ్యము. ఇంతవరకు వారి యిష్టము. అయినది అయినదిగాని, యికనైనా సంస్కృతము నేర్చుకోవలెసుమా నా దగ్గరకు వచ్చిన తర్వాత! ఏమయినది చెప్పవూ నీ ప్రయాణము మాట యింతకూను! మీ నాయనగారు, అమ్మగారు ఏమనుకొంటున్నారు? ఇప్పుడు పంపిస్తారా? గట్టిగా కనుక్కోవద్దూ! ఎట్లా యికమరి? నీవూ కనుక్కోలేకపోతివి! అంతకంటే నేను అసలే అడుగలేకపోతిని; పాడు సిగ్గు!

కాంతుఁడుచిత్తజ్ఞుఁ డైనను
కాంతకు సిగ్గుపడుజెల్లుఁగాక! కటాకటా
కాంతుఁడు సిబ్బితికాఁడై
కాంతయు నట్లైన నెట్లు కాపురమింకన్!

నిన్నసాయంకాలము అట్టా వీధిలోకి వెళ్ళినపుడు ఎట్లాగో మనసు గట్టిపరచుకొని మీ అన్నయ్యతో చెప్పినాను; కాని ఆయన ‘నాయనగారితో అనకపోయినావా! నాతో చెప్పితే ఏమి లాభము? నా మాట వింటారా? అయినా చెప్పి చూస్తాను’ అన్నాడు. అడిగితే ఆయన అడుగవలసినదేగాని నే నడుగలేను సుమా! నాకు అసలే మీ నాయనగారిని చూస్తే ఠారు! ముఖము చాటుగా ఉన్నప్పుడు ఏదయినా ఉత్తరాలలో వ్రాస్తే వ్రాయగలనుగాని ఎదటబడితే మెదలలేను. మీ నాయనగారికి మీమీద వెఱ్ఱిప్రేమసుమా! మీమీద అంటే కూతుళ్ళ మీదనే. కొడుకులమీద అంతలేదు. కూతుళ్ళను పంపించండి అని అడుగకుండావుంటే అల్లుళ్ళ మీద కూడా అంత ప్రేమ ఉంటుండిగాని ఆ మాట వస్తే మాత్రము బెదుస్తుంది ఇక నాకు సెలవులేదు. అదీకాక ఇంటి దగ్గర మా అమ్మ ఒక్కర్తే ఉన్నది. రేపు వెళ్ళక తప్పదు. నిన్ను విడిచి వెళ్ళడానికి కాళ్లాడడము లేదు. ఎట్లాగయినా తీసుకొని వెళ్ళవలెనని ఉన్నది” అని శ్రీరామమూర్తి మధ్యాహ్నము భోజనమైన తరువాత పడక గదిలో కూర్చుండి తాంబూల మీయవచ్చిన ప్రేయసితో—సీతతో ముచ్చటించెను.

ఎదుట ఎవరూ లేకుండుటను చూచి, సీత గది తలుపు ఓరవాకిలిగా వేసి కవటాకులను చిలుకలుగా చుట్టి వ్రేళ్లకు పెట్టుకొని ఒక్కొక్కటిగా! వల్లభుని పలు మొగ్గలకు అందిస్తూ ఈ విధముగా బదులుచెప్పెను. “నిన్న మీ రిట్లా అడిగినారని మా అన్నయ్య ప్రొద్దున నాన్నగారితో అన్నాడు.”

శ్రీరామ:- ఏమిటీ! బావ అడిగినాడు! మీ నాన్నగారేమన్నారు? మీ అమ్మగారేమన్నది?

సీత :- నాన్నగారు కసురుకొన్నారు. 'ఇప్పుడేమిటోయి పంపించడము? అయినా నీ వడగడమేమిటి? నీకు బదులు చెప్పడమేమిటి; పోపో"మ్మని;

శ్రీరామ:- మీ అమ్మగారేమన్నారు?

సీత:- మా అమ్మ మీ పక్షము మాటాడింది ఎందుకు అట్లా కసురుకొంటారు. బావమరిది చేత అడిగిస్తే తప్పు వచ్చిందాయేమిటి? ఎట్లాగూ పంపక తప్పుతుందా? ఇంకా వారము రోజులలో చిన్నమ్మాయి పుట్టిన దినము పండుగ వస్తుంది. అది అయిన తర్వాత పంపిస్తానని చెప్పండి" అన్నది.

"కార్యమయి వడసారం ఆర్నెల్లు కాలేదు. ఎవడు చెప్పాడే! ఇప్పుడే పంపించమని! ఛట్ వల్లకాదు. ఆ మాట ఇప్పుడు ఎత్తరాదు. కొన్నాళ్లదాక పంపించడానికి వీలేలేదు. పసికూనను పంపిస్తుందట పదిరోజులైన తర్వాత!" అని నాన్నగారు మరింత గద్దించినారుగాని, మా అమ్మ నిమ్మళంగా తప్పించి ఎట్టాగో సర్ది మీతో ఈ విషయము చెప్పమని మా అన్నయ్యతో చెప్పినది. పదిరోజులైన తర్వాత పంపిస్తానన్నది. కాని మా నాన్నగారికి ఇష్టములేదు.

శ్రీరామమూర్తి ముఖము చిన్న బుచ్చుకున్నాడు. కట కట పడ్డాడు. ఏమిచెయ్యగలడు! ఆలోచించినాడు. తోచలేదు. 'సరే - ఇంటికి వెళ్ళి నేనూ, గట్టిగా ఉత్తరము వ్రాస్తాను. ఇంతకంటే ఏమి చేసేది" అనుకొన్నాడు.

పంజరములో చిలుక కిలకిలలాడింది. మూన్నాళ్ళనుండి దానిముచ్చటలతోకూడా కొంతవినోదము అతనికి కలుగుతూవుండేది. శ్రీరామమూర్తికిప్పుడు సీతను వదలి వెళ్ళడమేకాక చిలుకను వదలి వెళ్ళడముకూడా దుస్సహమేఅని తోచినది.

శ్రీరామ:-నీ వియోగదుఃఖము నాకు దుస్సహముగా వుంటుంది. ఇంటికివెళ్ళినతర్వాత కాలక్షేపం ఎట్టాగో నాకు తోచలేదు. నీపలుకులకు బదులు చిలుకపలుకులయినా వింటూవుంటే కొంత ఉబుసుపోకగాఉంటుందేమో! దీనిని తీసుకువెళ్ళదునా? దీనిని తీసుకువెళ్ళడానికి మా అత్తమామలపెత్తన మక్కరలేదుగద!

సీత: మీసంతోషముకంటే నాకింక కావలసినదేమున్నది? తప్పక తీసుకొనివెళ్ళండి; కాని దానితో వినోదము కుదిరి నన్ను మరిచిపోతారేమోనని దిగులుగాఉన్నది. మళ్ళీ ఎప్పుడు వస్తారు? ఎప్పుడు వస్తారో నన్నుకూడ తీసుకువెళ్లుదురూ!

శ్రీరామమూర్తి కన్నులనీరుకమ్మగా "ఏమిచెప్పేది? ఉత్తరము వ్రాస్తానుగదా? ఇప్పు డెట్టాతీసుకోవెళ్ళడము? నీవేమయిన అడిగి ఏర్పాటుచేయగలిగితే సరే! నేను గట్టిగ పట్టుపట్టి అడగలేను" అనెను.

అంతలో బావమరది సావడిలో 'బావ ఎక్కడున్నా'డని విచారించడము విని శ్రీరామమూర్తి గదిలోనుండి బయటికి వచ్చెను.

* * *

శ్రీరామమూర్తి ఒక్కడేవెళ్ళేటట్టు ఏర్పాటయినది. అల్లుడు బదులాడక అంగీకరించినందుకు మామగారు మహానందభరితు లయినారు. కూతుర్ని పంపండి అని కోరినపుడు పుట్టినతలపులన్నీయిపుడు తలక్రిందులయినవి. అంతకుముందు పదిపండ్రెండు రూపాయల ధోవతులచాపు కట్టబెట్టదలచుకొన్నవారు ఏబదిరూపాలపట్టుత్తరీయము పట్టంచులధోవతి కట్టనిచ్చినారు. రైలుచార్జీక్రింద పాతికయీపాయలిచ్చినారు. ఊరినుండి పదిమైళ్ళ

ఎద్దుబండిమీద వెళ్ళి తర్వాత రైలెక్కవలెను. తెల్లవారుజామున ఏకారణముచేతనైన బండివాడు పాలుమాలి బండి తోలుకొని రాకపోతే ప్రయాణము మొండిపడిపోతుందేమో, మళ్ళీకూతుర్ని పంపండని అల్లుడు అడిగిపోతాడేమోనని దిగులుచేత మామగారు సాయంకాలానికే బండి తెప్పించి వాకిట ముందర ఊడదీయించినారు ఆబండినిజూచి, శ్రీరామమూర్తి, సీత, కంట తడిపెట్టుకోసాగించినారు. అవతల ఉద్యోగపుతొందర మొదలయినచిక్కులు ఎట్లాఉన్నా శ్రీరామమూర్తి అప్పుడు ఏదయినా కారణము ఏర్పడి ప్రయాణము నిలిచిపోతే ఔను అనుకొంటాడు.

ఊరుమిరపకాయలు, బుడమదోసకాయలు, మొక్కజొన్నకండెలు మొదలయినతినుబండారములు మూటకట్టినారు. ప్రయాణము సర్వసిద్ధమయినది. రాత్రి శ్రీరామమూర్తికి, సీతకు కలిగినవిచారము ఎట్టిదో ప్రాయపుదంపతులు కొంతయినా తెలుసుకోగలరు. తెల్లవారుజామున బండి సిద్ధపరిపించి మామగారు అల్లుని పిలిచినారు. నాలుగుపిలుపులు పిలిచినతర్వాత నిద్రమెలకువ నటిస్తూ కన్నులు నులుముకొంటూఉన్నట్టు కన్నీరు తుడుచుకుంటూ, శ్రీరామమూర్తి చిలకపంజరము చేతపుచ్చుకొని గదిలోనుండి బయిటికివచ్చినాడు.

గదిలోనుండి వచ్చేటందుకుముందు అతడు, సీతచీరచెంగున ఏదోముడివేసి తర్వాత చూచుకొమ్మని చెప్పెను. కార్యమునాడు కట్టినట్టు బంగారమేమో కట్టినారనుకొని సీత కన్నీరుకారుస్తు 'మీదగ్గిరే ఉంచుకొండి, నాకిప్పుడు సొమ్మెందుకు, వద్దు వద్దు.' అనిచెప్పి విప్పబోయినది గాని, 'అది కాదు, తర్వాత చూచు'కొమ్మని శ్రీరామమూర్తి కన్నీరుతుడుస్తూ చెప్పలేక, చెప్పలేక, చెప్పి మరీ బయిటికి వచ్చినాడు. తెల్లవారవస్తున్నదని తొందరపరచి ప్రయాణము చేయించి మామగారు ఊరి బయటదాకా బండి సాగనంపి మరీ యింటికి వచ్చినారు.

ఆతర్వాత సీత ముడిఊడదీసిచూచుకొన్నది. కాకితము ఉన్నది. అందులో ఈ పద్యాలున్నవి:

క॥ కలికీ! చిలుకలకొలికీ!
చెలువమ్ములుచిలికి తేర్చి చేర్చినవెన్నా!
చెలిమిన్నా! బలవంతపు
వలవంతకుఁ బాలుపఱుతువా నను? సెలవా?

క॥ రిక్కలరాయనిచెలువపు
ధిక్కారమ! ముద్దుగుమ్మ! తేనియసోనల్
చిక్కెడువాతెఱ! చక్కని
చుక్కా! నిన్నెపుడు మరలఁ జూచెదనొక్కో!

పూర్వదినము చిన్నకూతురుపుట్టినదినముపండుగకు కట్టిన ఉయ్యాలతాళ్ళను, ఊడదీస్తూ, సీత తండ్రి సావడిలో ఉండగా టపాబంట్రౌతుసుబ్బయ్య 'ఉత్తరాలు, ఉత్తరాలు' అని కేకవేసుకొంటూ వచ్చి ఉత్తర మిచ్చిపోయినాడు, బంట్రౌతుకేకవిని వచ్చి సీత ఉత్తరముకేసిచూస్తూ తండ్రిఊడదీసినతాళ్ళను చుట్టిపెట్ట మొదలుపెట్టింది. ఉత్తరముతెరచిసగము ముప్పాతికపాలు చదివి ఆయన విసరిపుచ్చుకొని దూరముగా పారవేసి మొగాన గంటుపెట్టుకొన్నాడు. అంతలో ఆయనకుమారుడు వచ్చి ఉత్తరము ఎత్తిపుచ్చుకొని, తల్లిదగ్గిర చదువుటకు లోనికి తీసుకొనిపోయెను. అయిదారు నిమిషాలయిన తర్వాత ఆగ్రహవికారము అణచుకొని లోనికిపోయి భార్యాపుత్రులయెదుట ఈ క్రిందివిధమున ఆయన మాటాడెను.

“ఏమే, అల్లుడుగారు వ్రాసినఉత్తరము విన్నావా? చిలుక బెంగపెట్టుకున్నదట! ఆహారము తినడము లేదట! అందుకని దానిని పెంచుతూఉన్నఅమ్మా

యిని వెంటనే పంపవలెనట! లేదా చిలుకను వెంటనే తీసుకొని వెళ్లనయినా వెళ్ళవలెనట! నక్కజిత్తులు! ముఖముఎదుట నత్తరునత్తురుమని ఊరకుంటాడు! మొగముచాటు చేసుకొని ఉత్తరాలలోచూపిస్తాడు పాండిత్యముఅంతాను. ఈపదిరోజులలోనే ఇంత పన్నుగడ పన్నుతాడనుకొంటే, అన్నిరూపాయలు ఖర్చుపెట్టి పట్టుబట్టలు అవీ కొనియిచ్చేవాణ్ణటే! అవీకాజేశాడు. మళ్లీ ఆటా సాగించాడు. వీణ్ణిచిలక నెవ్వడు తీసుకోవెళ్ళమన్నాడు? ఎత్తులెవడెత్త మన్నాడు? నిజమే వ్రాయరాదూ? చిలకనెప మెందుకు? చిలకకథే నిజమైతే మరేమిఫరవాలేదులే? నాలుగురోజులుపోతే అదే అలవాటుపడుతుంది. ఇట్లాగనే బదులు వ్రాస్తాను. కన్నులలో మెదలుతూ ఉండే కన్నతల్లిని విడిచి నేనుండగలనా? నన్ను విడిచి మాఅమ్మాయి ఉండగలదా?" అని కన్నీరు తెచ్చుకొనెను.

కుమారుడు:- నాన్నా మీరన్నమాట నిజమే! బావ అమ్మాయిని పంపండని బాహాటంగా వ్రాయ లేక చిలకమీద నెపంపెట్టి ఉత్తరమువ్రాసినాడు. అతనుసిగ్గరితనమునుగుర్తించి మీరు అమ్మాయిని పంపిస్తే బాగుటుంది. నాలుగురోజులుపోతే బెంగ తీరి చిలక అలవాటుపడుతుందని మీరంటిరిగదా! అట్లాగే నాలుగురోజులుపోతే మీకూ బెంగతీరుతుంది. అలవాటవుతుంది. అమ్మాయికీ అంతే.

తండ్రి:- ఓరి! నీవెక్కడపుట్టావురానాకూ! ఏతి అంటే ప్రైతిఅంటావు.

అంతలో కోడలువచ్చి మామగారు చూడకుండా భర్తకు ఏదో సూచించి పనిమిషమీద ఆప్రక్కనే నిలుచుండెను.

కొడుకు:-కాదు, నాన్నా ఆర్నెల్లయినా అమ్మాయిని పంపడానికి అభ్యంతరము చెప్పడముబాగుండలేదు. కబుర్లమీదకబుర్లు కురిపించి నెలలోనే కోడలిని మనము తీసుకువచ్చినామాలేదా ? అది తలచుకోవద్దా?

తండ్రి:- ఓరి దుర్మార్గుడా! కోడల్నివెంటనే ఎందుకుతీసుకురావడము? వద్దు.కొన్నాళ్ళు పుట్టింటనే ఉండనిమ్మని అప్పుడనకపోయినావట్రా ! నీ బులపాటాన్నిపట్టికాదూ నే నప్పుడు అన్నికబుర్లు పంపిందీ; తీసుకవచ్చిందీని! అది నా కిప్పుడు తంటాఅయినదీ?

కొడుకు:-నాన్నా! అప్పుడు నాబులపాటాన్ని బట్టి మీరు తీసుకువచ్చినట్లే, ఇప్పుడు బావబులపాటాన్ని బట్టి పంపించండని కోరుతున్నాను.

తండ్రి:-చా! పో! పిల్లకాకి కేమితెలుస్తుంది. నీముఖము! నీవు చెప్పేదేమిటి! నేను వినేదేమిటి!' అని తుటారించి భార్యను చూచి 'ఏమిటే! ఏమంటావు? నీవుద్దేశమేమిటి ? మాటాడవు. నేను నిన్నడిగితే వీడేమోబదులు చెప్పవస్తాడు.

భార్య:– నన్నేమి చెప్పమంటారు? మీయిష్టము. నేనేదైనా చెప్పితే కొడుకుకు తగిలిన చీవాట్లే నాకూ తగుల్తవి. మీరు ఎదటి వాండ్లను గూర్చి మాట్లాడేటప్పుడు మిమ్ము మరచిపోతారు. చచ్చి స్వర్గాన ఉన్నాడు మా నాయన; అనేవాడు మిమ్మల్ని "నాయనా! నీ కడుపున గూడా నాలుగు కాయలు కాస్తేనేగాని తెలియ"దని ఆయన ఆశీర్వచనము ఫలించినది. నన్ను కార్యమయిన తర్వాత మూడు నిద్రలయినతోడనే ఈడుచుకు వచ్చారు. జ్ఞాపకమున్నదా? నన్ను చిన్నప్పటినుంచి పెంచిన పెద్దముండ మా నాయనమ్మ మంచం మీద ఉండగా "నాయనా! ముసలమ్మ స్థితి చూచుకుని పది రోజులయిన తర్వాత పంపిస్తా"నని మానాన్న చెప్పుతూ ఉంటే ససేమిరా అని పట్టు పట్టి తీసుకు వస్తిరి. మరచిపోయినారాయేమిటి? సరే! ఆ కాలము ఆ కథ

వెళ్ళిపోయింది. ఇపుడెందుకు! చిన్నవాళ్ళ ప్రేమలు చిన్నవాళ్ల మనసులు కొంత ఆలోచించుకోవద్దా! ఆ చిన్నవాడు ఎదట అడగలేక వెళ్లి ఉత్తరము వ్రాసినాడు. మీవంటివాడైతే అప్పుడే పట్టుపట్టేవాడు. నన్నడుగుతున్నారుగనక చెప్పుతున్నాను. పంపడం మంచిది. అతడు కోరినప్పుడు మనం పంపితే మనం కోరినప్పుడు పంపడానికి అతనికి బుద్ధి పుట్టుతుంది. ఎట్టాగూ వాళ్ల బిడ్డగాని మన బిడ్డగాదు గదా!"

తండ్రికి అల్లుని మీద ఆగ్రహము కూతురి మీద కూర్మి, చిడి ముడి పడినవి. సీతను చేర బిలిచి దగ్గర కూర్చుండబెట్టుకొని కన్నీరు నించుకొనెను. సీత బిక్కమొగము పెట్టెను.

"నా మాటకేమిగాని పసికూన! ఎట్టా పంపేది. వెళ్లి ఉండగలదా! బిక్క ముఖం పెట్టినది. ఏమయిన సరే ఇప్పుడు పంపను" అంటూ తండ్రి సీత నడిగెను. 'అమ్మా నీవేమంటావు?'

సీత:- (పెదవులు అదరగా) ఇప్పుడేదో సాహసించి అనకపోతే చెడుతుందని లోన అనుకొని "నాన్నా! చిలక ఏమయి పోతుందో!" అంటూ యింకా ఏదో చెప్పనున్నదిగాని తండ్రికిక చెవి కెక్కేటట్టులేదయ్యెను. కోపము వచ్చినది. ప్రేమ పరిణామము మనస్సులో తట్టింది. చఱ్ఱుమని లేచినాడు. "సరే! రేపో యెల్లుండో మంచి రోజు చూచి ప్రయాణంచేసి దిగవిడిచిరండయ్యా! తల్లీ కొడుకూను" అంటూ కిఱ్ఱు చెప్పులు తొడుగుకొని కఱ్ఱ చేత పుచ్చుకొని "పొలానికి పోతున్నా"నని భార్యతో చెప్పి బయటికి వెళ్లినాడు. మూడు రోజులయిన తర్వాత అట్లే అంపించినారు.

'గీ॥ ఉభయవంశలలామ మయ్యుత్పలాక్షి
యత్తవారింటి కరిగెడునవసరమున
మాతృ జనక సఖీజనభ్రాతృ విరహ
మధిపతి ప్రేమ జలరాశి కౌర్వమయ్యె."
(శృంగార నైషధము)

సీత వచ్చి పది రోజులే అయినదిగాని యింతలోనే చిక్కి సగమయినది. కడుగారాబముతో కన్నులలో కప్పుకొని పెంచిన తల్లిని తండ్రిని విడిచి వచ్చిన దుఃఖమా చిన్నదానికి దుస్సహముగా ఉండెను, ఒంటరి పాటున పులుకు పులుకున ఏడ్చును. భర్త చేరవచ్చినపుడు కొంత సమ్మాళించుకొనునుగాని ఒక్కొక్కపుడు అక్కడ కూడా కన్నీరు కార్చుచుండును. ఈ వైక్లబ్యము చూచి భర్త తరచుగా ఇట్లు బెదరించుచుండెను. "నీవు మిక్కిలి దుఃఖిస్తున్నావు. కడుపు నిండ ఆహారము కూడా తినడములే"దని మా అమ్మ అంటున్నది. మీ నాయనగారికి వ్రాస్తాను వచ్చి తీసుకు వెళ్లవలసినద'ని; నీ విట్లా దుఃఖిస్తూ ఉంటే నాకేమి ముచ్చటగనుక! పుట్టినింటి దగ్గిరనే దిగులులేకుండా ఉందువుగాని" ఈ మాటలకు సీత మరింత దిగులంది చితికిపోతూన్న చిత్తమును చేరదీసుకుంటూ ఉండెను. తండ్రిని చూడవలెనని కోరిక ఉన్నదిగాని, ఆయనవస్తే తన్ను పుట్టినింటికి తీసుకువెళ్లితాడనిన్నీ అది తన భర్తకేకాక తనకు కూడా దుస్సహమే అనిన్నీ ఆ చిన్నది తెలుసుకొన్నది. తల్లిదండ్రులను విడిచి వచ్చుట ఎంత విచారకరముగా ఉన్నదో, భర్తను విడిచి వెళ్లుట అంతకంటే హెచ్చుగా విచారకరమవునని ఆ చిన్నదానికి అప్పుడు బాగా తెలిసివచ్చినది.

ఒకనాడు ఉదయము తొమ్మిది గంటల వేళ సీత దొడ్లో ఏదో పనిచేస్తూ ఉండగా అత్తగారు వచ్చి "పిల్లా! మీ నాయనగారు వచ్చినారు. అల్లుడూ మామా సావట్లో ఏమో బిగ్గరగా మాటాడుకుంటున్నారు" అన్నది.

అది విని సీత చీకాకుపడి తొందరగా దొడ్డి దోవను గదిలోనికి వచ్చి తలుపుచాటుననిలిచి వారి మాటలు వినెను. అప్పటి వారి మాటలివి.

మామ:- ఎవడు చెప్పినాడోయి నీకు? వచ్చిన పదిరోజులలోనే అటువంటి ఉత్తరము వ్రాయమని? అంత తొందరా? కష్టసుఖాలు ఆలోచించ అక్కర లేదు? కన్న మోహము, కడుపు తీపు, ఎట్టిదో నీకిప్పుడు ఎట్లా తెలుస్తుంది? వచ్చి తీసుకోవెళ్లవలసినదని కూడా ధిమాకా?

అల్లుడు:- అంతకంటె ఏమిచేయుటకు నాకు తోచలేదు. నా దగ్గర ఉన్నదన్న సంతోషము నాకేమీ లేదాయెను, ఆహారము తినదాయెను. కన్నుల నిండా నీరు తెచ్చుకొని బిక్కచూపులు చూడడము, పలుకరిస్తే పలుకకపోవడము, చూచేటప్పటికిఏమవుతుందో అని నాకు దిగులు తోచింది. ముచ్చటా అచ్చటా లేక చిక్కి చీకాకయి, చెడుతూఉంటే ఏమిచేసేది? ఆ తర్వాత ఎందుకు తెలుపలేదని మీరేమన్నా అంటారేమో అని కూడా తోచింది. అక్కడ మీరు అంత ప్రేమతో పెంచుకొంటిరి. నాకెందుకు ఈ దుఃఖము? మీరెవరైనా వచ్చి తీసుకోవెళ్లతారని అట్లు వ్రాసినాను.

మామ:- పదిరోజులు అలవాటుపడితే బెంగ తీరదూ! దానికంత తీవ్రముగా వెంటనే రావలసినదని వ్రాయవలసినదేనా? ఇందుకోసమే కాబోలు నీవు కొనితెచ్చుకొన్నది! సరే నాయనా! నీ యిష్టప్రకారమే జరిగిస్తినిగదా! ఎట్టా పిల్లనిచ్చుకొన్న తర్వాత వంగి వంగి సలాములు చేయవలసినదే" అంటూ అక్కడ నుండి లేచి, కూతుర్ని చూచుటకు కాబోలు ఆయన లోపలికి వెళ్లెను. సీత గది తల్పు పై చిటిక వేసి కదల్చెను. శ్రీరామమూర్తి గదిలోని కరిగెను. తెలికన్నులు తేలవేసి కన్నీరు నిండగా పెదవులు అదరగా డగ్గుత్తికతో సీత మగని చేతులు రెండు పట్టుకొని యిట్టు పలికెను.

సీత:- "నన్నా! నన్నేనా! పుట్టినింటికి పంపివేస్తారా? నేను ఏడుస్తున్నానని, వచ్చి తీసుకు వెళ్ళవలసినదని, మా నాన్నకు ఉత్తరము వ్రాసి పిలిపించినారా? నావల్ల మీకు ఆనందము కలగడము లేదా? అప్పటికీ మీకు వ్యాకులత కలుగుతుందని నేను ఎంతోబెంగదిగమింగుకొని ఉంటూఉంటే...." పుట పుట కన్నీరు జారెను. పయిని పలుకజాలదయ్యెను.

శ్రీరామ:- "కలికీ! చిలుక మాట నేను చెప్పితే నీ మాట అనుకొని ఉలికి పడితివిగదే! నిన్ను పిలిపించుకొనేటందుకు చిలుక మీద మిషపెట్టి నేను వ్రాసిన ఉత్తరము మాటగదే! మేము ముచ్చటించినది!" అని కన్నీరు తుడిచి చెక్కిలి పుడికెను. అంత సీత ముఖము చిత్రముగా మారెను. వల్లభుని రొమ్ము మీద వ్రాలెను.

గీ॥ వెడనుడుల కుల్కి కడుదిగుల్పడిన కల్కి
దేర్చి యతఁ డట్టె చెయి చెక్కుఁ దార్చెనట్టె
వింతకళతోచె మొగముపై వేడ్కపూచె
నెనరుఁగన్నీరు రాలెఁ బన్నీరు వోలె.

ఒక ప్రశంస-సమాధానం

సేకరణ-వివరణ

—ముదివేడు ప్రభాకరరావు

ఆంగ్లభాషలో 'కవులజీవితాల'ను రచించిన డా॥ సామ్యుల్ జాన్సన్ (1709–84) తన జీవితంలో ఒకసారి జార్జిమూడవ చక్రవర్తితో సంభాషించటం తటస్థించింది. ఇది 1767లో జరిగిన సంఘటన. ఆ సంభాషణలో చక్రవర్తి జాన్సన్ యొక్క మౌలికపరిశోధనా శక్తినీ, ప్రతిభా పాండిత్యాలను నిరంతర పరిశ్రమనూ బహుధా ప్రశంసింపగా జాన్సన్ మారు మాటాడక మిక్కిలి వినయముతో తలవంచుకొనెను. దీన్ని జాన్సన్ జీవిత చరిత్రకారుడైన జేమ్స్ బాస్వెల్ (1740-95) వర్ణించాడు. సరిగ్గా వేటూరివారి జీవితంలో సంభవించిన ఈ క్రింది సంఘటన జాన్సన్ వంటి మహామేధావి ప్రవర్తనను తలపిస్తూ 'విద్యాదదాతి వినయమ్' అన్న సూక్తిని సార్థకపరుస్తోంది.

భారతి, ప్రమాది, భాద్రపదమాస సంచిక (1939, సెప్టెంబరు) లో "కొందఱు తెలుగు కవులు" అను శీర్షికతో శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారు ఒక వ్యాసము ప్రకటించినారు. ఆ వ్యాసంలో వారు శ్రీవడ్డాది సుబ్బరాయ కవిని, శ్రీ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారిని, శ్రీ గిడుగు వేంకట రామమూర్తి గారిని, శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారిని. శ్రీ పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారిని, శ్రీ ఆదిభట్ల నారాయణదాసు గారిని వారి వారి సుగుణములనూ, రచనా చాతుర్యములనూ బహుధా ప్రశంసించి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని గూర్చి యీ క్రింది విధముగా వ్రాసినారు.

"తమిళమున గూడ తగినంత పాండితిని పడసినగాని తెలుగు పాండితి నిండుకుండ కాజాలదని గ్రహించినఏకైక రచయితలు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, సంస్కృతాంధ్ర ద్రావిడ భాషలందు సమానాభిజ్ఞానమును జూపజాలిన పండిత వరేణ్యులు వీరు. ఆగ్లమున నుచితపరిచితిని పడసి సర్వసంప్రద్రాయములను సమానాదరముతో పరిశీలించు విశాల హృదయములు వీరు. ముద్రణా యంత్ర ముఖమును చూడని గ్రంథములను ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారమున పెక్కేండ్లనుండి పఠించుచు నాంధ్రభాషా స్వరూపమును సమగ్రముగ గ్రహించిన విద్వాంసులగుడు జాను తెనుగు వీరి చిరసంగిణియై వీరి రచనమున సౌందర్య సందీప్త వాణియై వెలయుచుండును. వీరి 'కపోతకథ', 'మూన్నాళ్ళ ముచ్చట', 'విశ్వాసము', 'కడుపుతీపు' 'మత్తవిలాసము', 'భగవదజ్జుకము' మున్నగు గ్రంథములీయంశమును దృష్టాంతీకరించునవి. మిల్టన్ మహాకవి గ్రంథములను మెకాలే మహాశయుడు కంఠస్థ మొనరించుకొనినట్లు శ్రీనాథకవినాథుని యుద్గ్రంథములను శాస్త్రీజీ గళస్థము గావించుకొనిరి. జాన్సన్ పీఠికలవలె వీరి పీఠికలు గ్రంథస్థములగుచో ఆంధ్రభారతికి అమూల్యములైన భూషణములు కాజాలును. కట్టమంచి మనీషివలె వీరును తమ యుపోద్ఘాతములను ప్రత్యేకమైన సంపుటియందు ప్రకటింపబూనెదరుగాక! మూలబడి యున్న గ్రంథములను పరిశోధించి, తమోయవనిక నుండి తప్పించి వీరు పున్నెమును గట్టుకొను

చున్నారు. అముద్రితమైయున్న రంగనాథ రామాయణమును వీరి సాహాయ్యము కతన పునరుద్ధరించుచున్న మన విశ్వకళాపరిషత్తు వారు వందనీయులు. వీరి రచనములేకాక ప్రసంగములుకూడ నుపమ యర్థాంతరన్యాసాది యలంకారములతో తుందిలములై యుండును. వీరివలె నాధ్యాత్మికదృష్టిగల పండితకవుల నాధునిక యుగమున నెందఱినో కానము. ఏమి తలచినను, ఏమి తెలిపినను, ఏమి చేసినను ఈశ్వరప్రీత్యర్థమైనెఱపు భక్తప్రవరులు వీరు. యోగనిష్ఠా గరిష్ఠులై, పరార్థజీవులై బహు సంఖ్యాకులకు బహుభంగుల సాహాయ్యమునలుపు మహనీయులువీరు. శారీరక స్వాస్థ్యమును గోల్పడినవారును, మానసిక శాంతికి దూరస్థులైనవారును, అతులైశ్వర్య సంపన్నులును. నిప్పచ్చరమునకు మిగులగూర్చు నెచ్చెలులును, పండితులును, పామరులును అనుదినము ప్రభాతసాయం సమయములందు వీరి చరణోపాంతమునజేరి, ధ్యానమగ్నులై ఆనందమున నోలలాడుచుందురు. వీరి హృదయము కరుణాశరధియనుట స్పష్టాంశమేకదా! కష్టము కట్టెదుట దోచినంతన శిలావిగ్రహములగు వారెందఱో ప్రత్యక్షమగు ప్రస్తుతకాలమున ఉపకారము చేయకపోయిన పోవుదురుగాక అపకారమొనరింపక, తమ దారిని తాము తరలిపోవు వారి నెందఱినో చూడజాలని ప్రస్తుత సమయమున శాస్త్రీజీ బోలువారు మఱికొందఱున్నచో, మానవ సంఘమును గురించి నిట్టూర్పులను వీడనక్కఱ లేదు. లెక్కలేని తమ యిడుమలను కన్నెత్తిచూడక కట్టెదుటివారి కడగండ్లను కాంచి భగవతివలె విలపించు మహాత్ములు వీరు. ఎదుటబడిన అభాగుల నుద్ధరించిగాని నిదురపోని దీనబంధువు ప్రభాకర శాస్త్రులు గారు. "నీవెవరిని మెచ్చెదవో తెలుపుము; నీవెవండవో తెలిపెదను" అను వాక్కు లాంగ్ల సాహితియందు సుప్రసిద్ధములు. శాస్త్రీజీ గాంధీజీ ననవరతము మెచ్చుచు, వారియెడల బద్ధానురాగులై వర్తించుచుందురు. యుగములనుండి క్రమసిద్ధి నందుచున్న ఈశ్వర మహత్త్వము గాంధి మహాత్ముని యందు మూర్తీభవించినదని శాస్త్రీజీ విశ్వసించుచుందురు. సర్వాంశములందు మహాత్మననుకరింప వీరువ్విళ్ళూరుచుందురు. మహాత్ముని ప్రశంసించి, మహాత్మననుసరించువారి యాశయము లెట్టివై యుండునో గ్రహించుటకు పరితల కాలస్యముకాదు. శాస్త్రీజీ ఎట్టి యుత్కృష్టక్రియనైనను రహస్యముగ నిర్వర్తింపవలెననియే ఆతురపడుచుందురు. వీరి పాండితి, పారావారమునకు సహపాఠియైనను, వీరి హృదయము దొడ్డబెట్ట శిఖరముకంటె నున్నతమైనదయ్యు సదా మఱుంగున నుండవలెననియే వీరు మక్కువపడుచుందురు. ఆకు మూకల నడుమ నడగు పూవునెచ్చలివలె, మొగులు వెన్కదాగు జాబిలిలీల, మలయ హిల్లోలమున నదృశ్యమైమసలు మధురగీతిక రీతి, చిఱుతరగలందు కలహంసతో దాగిలిమూతలాడు నరోజదళము చాడ్పున, అందంపు నానతాననమున నడగియు నడంగియుండని సిగ్గువెలుగువలె, తల్లిపయ్యెదలోని ముద్దునిసుంగులీల, సూనవనమున దాగు భృంగి భంగి, మింటియందెందో మిన్కుమిన్కుమను చిట్టి చుక్కవలె, స్మృతిపథమున నస్పష్టముగ దలసూపు మధురానుభవము మాడ్కి, నడినిశిలోని తియ్యని గుస గుస పొలుపున, వ్రజనారివేనలిలోని కృష్ణాంగుళికరణి, చూతపత్రాగారమున కులుకు కలకంఠ మిథునముకైవడి, శతపత్రములందలి శిశిరబిందుసుందరి చందమున, స్వీయసృష్టియందడంగి యుండు కవి చంద్రుని చాడ్పున, మబ్బుదొంతరలందలి కనకంపు తళుకులీల, కారుణ్యవనధిలోని సద్భావరత్నముభాతి, కడలేని యడకువయం దడగిమడగి యుండ మహాపురుషుడాతురం పడుచుండును. తన నమ్రతయందు తానడగియుండ నువ్విళ్ళూరు మహనీయుడు శాస్త్రీజీ."

జొన్నలగడ్డవా రిట్లు శాస్త్రిగారి వాఙ్మయసేవనూ, యోగజీవితాన్నీ ప్రశంసించినందుకు శాస్త్రిగారిట్లు, భారతి, ప్రమాధి, కార్తికమాసము (1939 నవంబరు) సంచికలో 'అపీ, యిపీ' అనే శీర్షిక క్రింద మొదటనే యిట్లు వ్రాసినారు.

"నన్నుఁగూర్చి పూర్వతర భారతిలో శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగా రేదోదో పొగడ్త గావించిరి. వారట్లు కావింతురని నే నెఱుఁగను. దానిఁజూచి తల వంచుకొంటిని. వారు నాపై నవ్యాజదయతో నట్లువ్రాసిరి గాని నాకది సహింపరానిది. అఱవము వాడుకభాష తప్ప గ్రాంథికభాష నాకురాదు. ఇంగ్లీషు అసలేరాదు. చిరశ్రవణమున నేదో గుఱికిఁ గొంత యెడుమగా నర్థమగుటగాని యందు నాకేమాత్రము నెఱుక లేదు. తెలుఁగులో నేదో కొంత తంటాలుపడితి ననుట తథ్యము. ఆంధ్ర వాఙ్మయసౌధ నిర్మాణ కర్మకారులలో నేను నొకఁడ నగుదు ననుకొని కొన్నాళ్లు కూలిపనిచేసి మట్టి ముద్దలు మోసితిని. చేతులుకడిగికొనుదశలో నిప్పుడున్నాను. నా యాధ్యాత్మిక పరిశ్రమమునకు సంబంధించిన విషయము లితరులకుఁ దెలియవలసినవి గావు. శ్రీ సత్యనారాయణమూర్తిగా రట్టి విషయము లేవేని గొన్ని యేదేరీతి ననుమానించి గ్రహించినను వాని లోఁతుపాఁతులు సరిగాఁదెలియక వ్రాయుట సరికాదు. నాకుఁ బూజ్యులు గురువర్యులు నగు శ్రీ చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రిగారిని గూర్చి నా తర్వాత వారు ప్రశంస నెఱపిరి. అది మఱీ నాకు దుఃఖకరము. తెలుఁగున నేను నేర్చిన నాలుగు ముక్కలకు వారి గురుత్వానుగ్రహము ప్రధాన కారణము. నేను వారి శిష్యకోటిలో నొకమూల నుండవలసిన వాఁడను. పత్రికా పాఠకలోకమునకు నాయెడ నయథార్థభావన కలుగకుండుటకై యిది వ్రాసినాఁడను. వాఙ్మయవిషయమున నాపైఁగొన్ని యప్పులున్నవి. అవి యెప్పుడో తీర్పవలసినవి. కాని పెక్కేండ్లనుండి యుపేక్షతోనే ఉంటిని. ఈశ్వరానుగ్రహమున్న నందుఁగొన్నింటినేని యికఁ దీర్చుకొనఁ గల్గుదునేమో!"

సరిగ్గా పై మాటలు జాన్సన్ జార్జి చక్రవర్తితో నన్న వాక్యాలతో సంవదిస్తోంది. "His Majesty having observed to him that he supposed he must have read a great deal, Johnson answered, that he thought more than he read; that he had read a great deal in the early part of his life but having fallen into ill health, he had not been able to read much, compared with others: for instance he said he had not read much, compared with Dr. Warburton."

'చెళ్ళపిళ్ళవారి శిష్యకోటిలో నేనొకమూల నుండవలసినవాడను' అన్న శాస్త్రిగారివాక్యాలు వారి వినయాన్ని ప్రదర్శిస్తూ జాన్సన్ పండితుని వినయాన్ని స్ఫురింపజేస్తున్నాయి. "During the whole of this interview Johnson talked to his Majesty with profound respect but still in his firm manly manner with a sonorons voice and never in that subdued tone which is commonly used at the levee and in the drawing room".

జొన్నలగడ్డవారి ప్రశంసకు 'తలవంచుకొన్న' వేటూరి వారి సహృదయత్వం భర్తృహరి నీతి శతకం లో చెప్పిన "నమ్రత్వే నోన్నమన్తః, పరగుణ కథనైః స్వాన్గుణాన్ఖ్యాపయన్తః' (సత్పురుషులు అణకువ గలిగియే ఔన్నత్యాన్ని పొందుతారు. పరుల గుణాలనే శ్లాఘించడం చేత తమ సహృదయత్వాన్ని ప్రకటిస్తారు) అన్న సూక్తికి చక్కని దృష్టాంత మవుతున్నది. జార్జి చక్రవర్తి

వెళ్ళిన తర్వాత జాన్సన్ ఇలా అంటాడు. "Sir, they mav talk of the king as they will; but he is the finest gentleman I have ever seen" అని. పరుల గుణలేశాన్ని పర్వతీకరించి మెచ్చుకోవడం సజ్జనులైన పండిత లక్షణం. పండితులకు అసూయారాహిత్యం, గర్వించ పోవడం అనేవి గొప్ప ఆభరణాలు అంటాడు భర్తృహరి. ఈ దృష్టిలో వేటూరివారు—జాన్సన్ కోవక చెందుతారు.

* * *

సమస్య

సేకరణ

ముదివేడు ప్రభాకరరా

"జాంపండు కొనియేటి సరసుండవైతేని
పైకాలు పెట్టుకొని పండుకొనుము" (పుట-24

ఈ సమస్యను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు మద్రాసు నుండి వెలువ "కల్యాణి" అను సచిత్ర మాసపత్రికకు పంపారు. ఇది శ్రీ గంటి సూర్యనారాయణశాస్త్రిగారిచే సంప దితమై ప్రచురింపబడిన 'కల్యాణి' సంపుటం-1 సంచిక-1 ప్రజోత్పత్తి సంవత్సరము, శ్రావణమా సంచిక 1932లో అచ్చయింది. దీనిని 'కల్యాణి' పత్రిక మరుసటి సంచికలో శ్రీ కూరెళ్ళ రామనరసింగరా గారు యీ క్రింది విధముగా పూరించినారు.

సమస్యా పూరణము

శ్రీ కూరెళ్ళ రామనరసింగరావుగా

సీ॥ 'జాంపండు కొనియేటి సరసుండవైతేని
పైకాలు పెట్టుకొని పండుకొనుము'
'పైకాలు పెట్టుక పండు కొంటకు ముందు
నాణ్యమౌ వస్తువు నరయ వలదె?'
'అంతయు నిచట నాణ్యం బౌను తడవేల?
తొలుఁదొల్త రుచిఁజూడ వలయుఁగాదె?'
'కంటికింపగు వన్నె కల్గిన రుచియేల?
పై వన్నె విశ్వాస పాత్ర మగునె?'
'వన్నెకును మిన్నయౌ రుచి యున్న దిచట
వన్నె రుచులున్న యెడల జాంపండు కొందు'
వంచు నీరీతి నర్మహాస్య ప్రసంగ
మునను రసికద్వయము ప్రొద్దుఁ బుచ్చుచుండె. (పుట-32)

కోటవారి లేఖలు

[“ఆంధ్ర కళాలక్ష్మికి అందాలుదిద్దిన శిల్పి కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు”. గురుదేవులు చివరి రోజుల్లో తిరుపతిలో ఒక మ్యూజియం నెలకొల్పాలనే యత్నంలో దేశాటనం జరిపి ఎన్నెన్నో అపూర్వములైన వస్తువులను సేకరించడము, తుదకు ఆ ప్రయత్నభారం వల్లనే అనారోగ్యానికి గురై అసువులను గోల్పోవడము అతి వివరంగా ఆంధ్రపత్రికలో 1950 సెప్టెంబరు/అక్టోబరుల మధ్య పడ్డ ఐదారు వ్యాసాల్లో శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు వివరించారు. అప్పుడు శ్రీవారు సేకరించిన శిల్పాలు ఇతరములు అనేకం నేడు తిరుపతిలో కొన్ని, ముక్త్యాలలో మరికొన్ని ఉన్నాయి. వాటనన్నిటినీ వారు భావించిన రీతిని భద్రపరచి ప్రదర్శించవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది. ఆ సంకల్పం నెరవేరు టెన్నడో!

దీనికి జ్ఞాపకంగానే కోట సుబ్బారావుగారి ఆ నాటి లేఖల్ని, ముక్త్యాలలో మూగవోయిపడిఉన్న అమూల్యములైన విగ్రహాల వివరాల్ని ఇక్కడ పొందు పరుస్తున్నాము.
సం]

మచిలీపట్నం
2/6/50.

చిరునామా :
కోటసుబ్బారావు.
C/o కృష్ణా పత్రిక.

పూజ్యులక్షు—నమోనమః

మీరు నార్లవెంకటేశ్వరరావుగారి ఇంట్లోకూర్చుని వ్రాసిన తారీఖులేని జాబు మొన్నచేరింది. కృతజ్ఞుడను. రెండునెలలనుంచీ అనారోగ్యం. మనస్సంతా కలవరంగా వుంది. ఏదో ఒక నిశ్చయానికి రావడానికి ఒక మాసం గడువువేడుచున్నాను. ఈలోపుగా ఈ దిగువ సందేహాలకు జవాబు ఆశిస్తున్నాను.

నేను సేకరించిన యీ నాలుగు వస్తువులూ ఏ నావికాసంఘం, ఏ రైల్వేకంపెనీ నావెంట తీసుకొని వెళ్ళడానికి లగేజి చెయ్యదుగనుక భూమిమీద వదలి వెయ్యక తప్పదు. గాలికిపోయిన పేలపిండి కృష్ణార్పణమన్నట్లు ఏదోనటించాలి. ఒక విషయం మాత్రం మీరు గట్టిగా గమనింపదగ్గది. నాదగ్గిర వున్న నాలుగువస్తువులూ సంసార పక్షపు సామాన్యములైనవే గాని అపురూపము లైనవికావు. కొందరు తెలియనివారు వానిని మహాభాగ్యంగా అనుకోవచ్చు. కనుక, నాదగ్గిర ఏవో అపురూపమైనవీ ప్రాచీనమైనవీ ఉన్నాయని మీరేమీ భ్రమపడవద్దు. అలా స్వయం నియంతృత్వ వృత్తిలో

కాలం చెల్లినతర్వాత ప్రవేశించాను. అరవయ్యో పడిన వివాహమాడిన వాడి నాదారు సంతానమల్లే తయారైంది. విశేషమేమీలేదు. ప్రాచీనవస్తు సముచ్చయం సేకరించాలనే వాంఛ నన్ను వెంటాడిందని మీరు గ్రహించ గలిగితే నేను తరించినట్లు భావిస్తాను. ఇప్పటికి ఎంతసేపూ 'మీరా మీరా' అని వరాన్వేషణ కొరకు నేను వెతుక్కులాడడమే గాని, 'మీ కన్నెను మా యింట్లో వేసుకుంటా'మని ప్రథమంగా ఆశించింది మీరే కనబడుతున్నారు. కనుక అగ్రతాంబూలం మీకే ఇవ్వాలి. ఈ దిగువ సందేహాలను నివృత్తిచేయ్యండి :

(1) పత్రికల్లోని 'ఆంధ్రరాష్ట్ర' సంబంధమైన వాద ప్రతివాదాలు నేను గమనించడం లేదు. రేపు కర్మంచాలక ఆంధ్రరాష్ట్రం వస్తే, తిరుపతి ఆంధ్రరాష్ట్రంలో పడుతుందా తమిళరాష్ట్రంలో చేరుతుందా?

(2) మీరు నిర్మిస్తూన్న మ్యూజియం గవర్నమెంటు వారు నడిపేదా ? దేవస్థాన సంస్థా ? లేక ప్రయివేటు సంస్థా? అది యెవరి మేనేజిమెంటులో వుంటుంది? దానికి మూలధనం కూడా సేకరించారా?

(3) ఇత్తడి విగ్రహాలు వగైరాలకు గృహంగా ఏర్పాటుచేసిన 'షోకేసు' యొక్క పదహారు అద్దాలే ఇప్పటి ధరలకు నూరు రూపాయలుంటాయి. మంచి నగిషీతోవున్న యీ 'షోకేసు'ను భద్రంగా తిరుపతి చేర్చడం యెట్లా?

(4) ఈపెద్ద 'షోకేసు'కాక చిన్న 'షోకేసులు' ఇంకా రెండు మూడున్నాయి. అవి కూడా జాగ్రత్తగా తిరుపతిలో చేర్చాలి. రైల్వేగార్డులకు పోర్టర్లకు భద్రంగా ఎగుమతి దిగుమతులు చేసినందుకు మధ్య మధ్య మేతవేస్తూ సొంత మనిషి వెంటవుండి తోలించుక్కు వెళ్లాలిసిందేగాని గాలిలో దీపం పెట్టి 'నీమహిమ' అని యేడుకొండలవాణ్ణి హెచ్చరిస్తే లాభంలేదు. ఈ విషయం ఎట్లాపరిష్కరిద్దాం?

(5) ఇంతకూ మీరు వీలు చేసుకుని ఒకతూరి ఇక్కడికివచ్చి, వస్తువులు కళ్లారా చూచుకొని, అక్కడికి గొంపోదగినవి అవునోకాదో నిర్ణయించుకొన్న పిదపగాని, మన ఆలోచనలేమీ సాగుటకువీలులేదు కదా!

ఈ విషయాలన్నీ ఆలోచించి, సాధ్యమైనంత త్వరలో నాకు జవాబు వ్రాస్తే సంతోషిస్తాను. మీరు మీ చిరునామా ఇవ్వనందున ఓరియంటల్ రిసర్చి లైబ్రిరీలో పనిచేస్తున్నారని ఊహచేసి యీ ఉత్తరం అక్కడికి వ్రాస్తున్నాను. మీ సరియైన చిరునామా దయచేసి తెలియజేయండి.

మంచమెక్కి రెండునెలలైనా నేనింకా ధారాళంగా ఉత్తరం వ్రాయగల్గిన స్థితిలోనికి రాలేదు. ఒక స్నేహితుని బ్రతిమాలి ఈ ఉత్తరం వ్రాయించి నేనుగా సంతకం చేశాను. మీ పిల్లలందరూ క్షేమంగా ఉన్నారని తలుస్తాను - ఆశీర్వదించండి.

మీ

కోటసుబ్బారావు.

కోటసుబ్బారావు మచిలీపట్నం
C/o కృష్ణాపత్రిక. 28/6/50

బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి-

తిరుపతి.

పూజ్యులకు నమోనమః. మీరు ఈ 23న వ్రాసిన జాబు 26 సాయంత్రం చేరింది.

శుభస్య శీఘ్రం అన్నారుపెద్దలు. 'తటాలున దీని పరిగ్రహింపుడీ' అని ఆతురత కనబరచడం తప్ప నేను చేయగలిగిందిలేదు. అంత్య నిష్ఠురం కంటె ఆదినిష్ఠురం మంచిది. 'కులమింటి కోతి' అని మీరు స్వీకరించడం తప్ప మా పెంచిన కన్నె ఆర్షేయ పౌరుషేయాలు ఆట్టేపట్టి చూడకండి. ఈకాలంలో సాలంకృత కన్యాదానమంటే ప్రాచీనం నవీనం కలిసేవుంటాయి అని మాత్రం గుర్తులో ఉంచుకుంటే మీకు ఆశాభంగం కలుగదు. బహుశః నార్లవెంకటేశ్వరరావుకి నేనిచ్చిన 'ద్వారపాలకులను' చూచిన్నీ, అతడు చెప్పినమాటలు బట్టిన్నీ నాదగ్గిర ఏమో అపురూపమైనవి ఉన్నాయని భ్రమపడ్డారేమో అని అనుకుంటున్నాను. మన శిల్పకళావైదగ్ధ్యం వెల్లడించగలిగిన ప్రశస్తవస్తు సముచ్చయమంతా ఇంగ్లాండు, ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాంసు, మొదలైన దేశాలు ఇదివరకే కొల్లగొట్టుకొని పోయినాయి. గవర్నమెంటువారు మాన్యుమెంటల్ ఆక్టు కింద చాలా విగ్రహాలు మొదలైనవాటిని బందిఖానా చేసేశారు. ఎక్కడన్నా క్వచిత్తుగా ఏ లోహపు సామగ్రి అయినా మిగిలివుంటే యుద్ధపురోజుల్లో కరిగేశారు. మనకు ఇప్పుడు ప్రస్తుతం దాపురించిన సెక్యులర్ స్టేటులో ఇకను కళలు అభివృద్ధి చెందడానికి ఆస్కారమే లేదని నా అభిప్రాయం. ఇకపోతే మావారెప్పుడో జలతారు వుత్తరీయాలు వేసుకున్నారని గొప్ప గోడు పెట్టుకోవలసిందే తప్ప చేయ దగింది లేదు. ఒకటే నాకు కించగా వుంది. తిరుపతి దేవాలయ శిల్పం చాలా గొప్పది. అట్టి తిరుపతిలో మ్యూజియం నెలకొల్పాలంటే చాలా అపురూపమైన శిల్పమూర్తులు లభిస్తేనే ఆకర్షణీయంగా ఉంటుంది. అలాటివి మీకు ఒకటి రెండైనా ఇవ్వగలనో లేదో చెప్పలేను. సరియైన మూర్తులు లభించనప్పుడు, లభించినవి రమ్యంగా అలంకరించి యీ కొరతను బాపుకోవలసి ఉంటుంది. నావద్ద వున్న సామాగ్రి ఏదైననూ సరే మంచివి గాని చెడ్డవి గాని అన్నీపట్టుకు వెళ్ళవలసిందే. మ్యూజియంలో అవి యెలా అలంకరిస్తే బాగుంటుందో ముందు మనం కాస్త ముచ్చటించు కుంటే బాగుంటుందని నా అభిప్రాయం. నాకో అలోచన తట్టుతోంది. మీరు ముందొకసారి ఇక్కడికి వచ్చి సామానంతా చూచుకొని తీసుకువెళ్లటకు యోగ్యమని తోచేయెడల తరువాత మీరనుకొన్న లారీ తీసుకువచ్చి తీసుకువెళ్ళడం ఒక పద్ధతి. లేదా అన్నీ తీసుకు వెళ్ళడానికి నిశ్చయించి మీ వెంటనే లారీని తీసుకువచ్చి తీసుకుని వెళ్ళడం రెండవ పద్ధతి. మీరన్నట్టు జులై మొదటివారంలో వచ్చి వస్తువులు తీసుకుని వెళ్ళవచ్చును. నా అభ్యంతరంలేదు.

ఇంకొక విషయం. నేను ఒంటరిగాణ్ణన్న మాట మీరెరుగుదురు. ఇప్పుడిప్పుడే మనిషి సాయంతో గదిలో తచ్చాడుతున్నాను. బహుశః మీరు వచ్చేటప్పటికి కాస్త సాహాయ్యం లేకుండా నడవ గలుగుతానేమో. కనుక వస్తువులు మీకు అప్పగించి మీ వల్ల రసీదు పుచ్చుకోడం తప్ప నావల్ల ఇంకే విధమైన సహాయము అపేక్షించి లాభంలేదు. సామాను ప్యాకేజి చేయించి లారీలో వేయించుకునే యేర్పాటంతా మీరే చేసుకోవాలి. రాకరాక మీరు వస్తునందుకు ఈ యనారోగ్యంవల్ల మీకు సరియైన

ఆతిథ్యం ఇచ్చే స్థితిలో లేనే యని మనస్సు మహా యాతన పడుతోంది.

నేను తిరుపతి ఆంధ్రరాష్ట్రం వస్తే ఇటౌతుందా అటౌతుందా అని ఛలోక్తిగా వ్రాశాను. ఆంధ్రరాష్ట్రానికి మనం తగమేమోనని ఆంధ్ర కాంగ్రెసు మంత్రుల చర్యలను బట్టి అనుకునే కోటిలోని వాడిని. కళ యెప్పుడూ దేశకాలాతీతం. ఏ కట్టుబాట్లు మీరు చేసుకున్నా మీ మధ్య చేసుకోవలసిందేగాని నాకు దానితో ప్రసక్తి లేదు. నాకే పత్రాలూ అవసరం లేదు. ఏ మాత్రం వోపికవున్నా మీరు వచ్చేసరికి సామానుల జాబితాలు సిద్ధం చేసి వుంచుతాను.

ఇంకోసంగతి. మ్యూజియంకు మీ వంటివారు తలుచుకుంటే దక్షిణ దేశంలో చాలా సామాగ్రి దొరికే వీళ్లున్నాయి. మీరువస్తే ఆ విషయం కూడా మాట్లాడడానికి వీలుగావుంటుంది. కనుక ఇతరులను పంపడం కన్న తప్పక మీరే వస్తే మీకూ మాకూ మీ మ్యూజియంకూ శ్రేయస్కరం. మీ రాక రెండురోజులు ముందుగా తెలియ చేయండి. లారీలో ప్యాకేజికి వీలగునట్లు నాలుగు దేవదారు పెట్టెలు, చాపలు, తాళ్లు, అన్నీ అక్కడ మంచే పట్టుకొని వస్తే తేలికగా వుంటుందేమో ఆలోచించండి. నాకు అనారోగ్యం వుండబట్టే ఈ వ్యవహారం దేవుడింత సులువుగా తేల్చేటట్లు క పడుతోంది.

నా ఆరోగ్యం : వెనక ఎనిమిది తొమ్మి సంవత్సరాల కింద రాచకురుపుతో ఆరునెలల ఆసుపత్రిలో బాధపడ్డాను. వ్యాధి శరీరమంతా పీల్చి పిప్పి చేసింది. తిరిగి కోలుకోలేదు. నరాలలో పటుత్వమే పోయింది. శరీరం కాళ్ళను మోసుకు వెళ్లడమేగాని కాళ్లు శరీరాన్ని మోసుకు వెళ్ళడం మరచి పోయినాయి. రెండునెలల క్రిందట 'బ్లడ్ ప్రెషర్' ఎక్కువై మంచమెక్కాను. పక్షవాతం తప్పిపోయిందని డాక్టర్లు అంటారు. ఆఖ బాధపడకుండా వెళ్ళిపోయే సదుపాయం మీర ప్రసాదిస్తే సంతోషిస్తాను. ఆ విధంగా ఆశీర్వదించండి. మీ ఉత్తరానికీ రాకకూ ఎదురుచూస్తున్నాను.

విధేయాప్తుడు.

P.s.

(Sd.) కోట సుబ్బారావు.

నేను కోరేది ఒకటే-మీరు మొదటి జాబులో వ్రాసిన ప్రకారం మ్యూజియంలో ఒక భాగంలో అలంకరించి దాన్ని కృష్ణరాయ చిత్ర వస్తుశాల అని పేరు పెడితే చాలు. కృష్ణారావుగారి enlargement photo కూడా వుంది. ఇస్తాను. అక్కడ అది వ్రేలాడ కట్టుదురుగాని.

(Sd.) కోట సుబ్బారావు.

జ్ఞాన సంపద

-వేటూరి ప్రభాకరశాస్త్రి

జ్ఞాన సంపద, ధన సంపద, ధాన్య సంపద, ఉద్యోగ సంపద, ఆరోగ్య సంపద - వైరాగ్య సంపద; ఆనంద సంపద, ఈలాగు సంపద్విభేదము నెన్నింటినైనా పేర్కొనవచ్చును. అయితే మటుకీవిభాగములన్నీ కూడా మూడు విభాగములలో ముగిసి పోయేవే అవుతవి. ఆరోగ్య సంపద, జ్ఞాన సంపద. ఆనంద సంపద, అని ఆ మూడు విభాగములూనూ; ఈ మూడింటికే సచ్చిదానందము లని పేరు. మానవసంఘమంతా ఈ సత్య జ్ఞానానందములను పొందవలెననే తహతహతోనే జీవయాత్ర సాగిస్తున్నది. నిరతిశయములయిన యీ సచ్చిదానందములే యీశ్వరుడని - వేదాంతులు, తత్త్వజ్ఞులు, నిర్ణయించినారు. సచ్చిదానందములను గుర్తించి పొందుటయే మానవ జీవయాత్రా పరమావధి. ఈ సత్యజ్ఞానానంద సంపదలలో మొదటిది సత్య సంపద. అనగా ఆరోగ్యసంపద అంతరించి అసత్యము కాకుండా తన ఉనికి నిజముకావడము ఆరోగ్యమువల్లనే కదా! ఆరోగ్య సంపద మీదిది జ్ఞానసంపద. ఈ రెంటి మీదిది ఆనంద సంపద. ఈ మూడూ కూడా అన్యోన్యాశ్రయములై జడవారి ఉన్నప్పుడే మానవుడు మహనీయుడవుతాడు. ఆరోగ్యసంపద లేని జ్ఞాన సంపదగానీ, జ్ఞాన సంపద లేని ఆరోగ్య సంపదగానీ, ఈ రెండూ లేని ఆనందసంపదగానీ ఆనంద సంపదలేని యా రెండూగానీ, నిలువలేనివి విలువలేనివి అవుతవి. అయినా ఈ మూటిలో నాకిక్కడ ప్రసంగ విషయము జ్ఞానసంపద మాత్రమే. ప్రాణికోటి లోనికంతా మానవజాతికే భాష-అంటే సువ్యక్తవాక్కు, జ్ఞానము,- అనే భాగ్యములత్యధికముగా ఉన్నవి. సృష్ట్యాది నుండి యింతదాకా మానవ సంఘము సమాకలించిన జ్ఞాన సముచ్చయ మంతా, ఒక దివ్య కుసుమపు దళ మాత్ర వికాసమున కయినా సాటి వచ్చునో రాదో! బంగారు పుటములు పడి పడి వన్నె హెచ్చించు కొన్నట్టు మానవ సంఘము జన్మపరంపర లనేపుటపాకముల పడసి పడసి జ్ఞానపు వన్నెలు హెచ్చించుకొని తేజరిల్లుతూ ఉన్నదని జన్మకర్మవాదులు సిద్ధాంతీకరించినారు. భూగోళమున వేయియేండ్ల క్రిందట మానవ సంఘము మొత్తము మీద కొన్ని జన్మములలో సాధించగలిగే జ్ఞానమును నేటి కాలమున ఒక్క జన్మలోనే ఇంకా అందులో కొంతభాగములోనే సాధించ గలుగుతున్న దనవచ్చును. పూర్వకాలమున కాశీప్రయాణము ఆరు మాసములలో సాధ్యమైతే ఇప్పుడు ఆరురోజులలోనూ ఆరు జాములలోనూ కూడా సాధ్యమవుతున్నది గదా! ఈలాగే సర్వ సందర్భములూనూ. విశ్వమానవ సామరస్యము విశ్వ విజ్ఞాన సామరస్యము జ్ఞాన సాధన యంత్రాద్యుపకరణ విశేష సంపత్తి ఈ కాలములో క్షణక్షణము పెరుగుతున్నది. జ్ఞాన సంపద్వికాస మీ విధముగా వన్నెలు దేరుతూ మీదికి మీదికి దూకులాడుతూ పెరుగుతూ ఉండడానికి మానవ సంఘపు ప్రయత్నబలమే కదా

ప్రధాన సాధనము. ఒక్కొక్క మానవుని సంకల్ప ప్రయత్నములూ వేర్వేరుగా ఉన్నా అవి తక్కినవారి సంకల్ప ప్రయత్నములతో కొన్ని సందర్భములలో సమరసపడి, కొన్ని సందర్భములలో విరోధపడి, పరస్పరోత్తేజకములై పెంపొందుతూ అపూర్వసిద్ధులు గలవవుతూ ఉన్నవి. వీని వికాసము చుట్టుపట్టుల నుండు మానవుల సంకల్ప ప్రయత్నముల తాకిడివల్ల, అపూర్వముగా తనలో నుండే పూర్వ జన్మవాసనలచే ఉద్బుద్ధములయ్యే సంకల్ప నిర్వాహమువల్ల కొంత, సాగుచున్నది. అచ్చ మొండి బండ బుద్ధి గల వానికి పరస్పర సంకల్ప ప్రయత్న సిద్ధుల బలమెంతఉన్నా లాభములేదు. మహాప్రతిభాశాలికి పరిసరోత్తేజనములేక పోయినను లాభములేదు. రెండూ సమకూడినప్పుడే మానవుని యంతరంగ జ్ఞానాగ్నిజ్వలిస్తుంది. ఈ చిదగ్నిజ్వాలలు, అంతరంగ మథనమువల్ల చెలరేగుతుంటై. ఈ సందర్భమున సముద్ర మథనకథ దృష్టాంతముగా తీసికోవచ్చును. దేహి ఒకమహాసముద్రము. సంకల్పభారము మందర పర్వతము. మంచి చెడుగులు కుడి యెడమపట్టులు. అంతరంగావలోడనము సముద్ర మథనము. తీవ్రాంతరంగావలోడనము వల్ల కలిగే కష్టనష్టములు తిమితిమింగల హాలాహలాదుల్లు. సుఖలాభములు కల్పవృక్ష కామధేన్వమృతాదులు. ఇట్టి సముద్ర మథనమున కట్టకడకు అత్యుత్తమ జ్ఞానామృతము మునికి దేహి లభింపగలదు. విశ్వమంతా పరిసర చక్రము లక్ష్యీకరించుకొని చుట్టు ద్రిప్పుకొనుచు ఆత్మాణువు మధ్యబిందువు కాగా దానికడ నెలకొని కుమ్మరివలె మానవుడు విజ్ఞానవస్తు నిర్మాణము సాగిస్తున్నాడు. మానవునకు పూర్వపూర్వ జన్మములలో అనుభూతములు, సాధితములు అయిన విషయములు ఉత్తరోత్తర జన్మలలో వాసనారూపమున అంతర్లీనములై నిలిచియుండి ప్రసక్తికలిగినపుడు పరిస్ఫురిస్తూ ఉంటై. కాని అననుభూతములు, అసాధితములు అగు జ్ఞేయాంశముల మీద మక్కువలు ఎక్కువగా చెలరేగుతూ తత్సాధన ప్రయత్నములు సాగుతూఉంటై. మానవ సంఘమంతా ఈశ్వరుని జ్ఞానమహాభాండారమును విభాగించుకొని భిన్న భిన్న శాఖలతో విజ్ఞానాంశముల వశపరచుకొనుచున్న దనవచ్చును. నిరతిశయమయిన యానందమూ, వీనియానంత్యమూ, ఇవే ఈశ్వరస్వరూపమని ఉపనిషన్నిర్వచనము గదా! "జ్ఞానానంద మయం దేవం" అని ప్రాచీనస్తుతి. జ్ఞానపారమ్య ప్రాప్తియే ఈశ్వరప్రాప్తి యన్నమాట. సామాన్యమానవులు జ్ఞానార్జనమున అంతరంగావలోడనమున అంతగా పనిగొనక బాహ్య పరిసరముల మీదనే ఆధారపడుతూ ఉంటారు. వారి యెఱుక పయిపయిదై పస లేనిదై ఉంటుంది. లోతుగా త్రవ్వని నూతిలో చుట్టుపట్టులలోని మురికిపాఱుడునీరే ఊరివచ్చినట్లు వారి యంతరంగము బాహ్యజ్ఞానానుకరణముననే పర్యవసన్నమవుతుంది. వారు లోకమునకు అపూర్వ జ్ఞానాంశములను వేనిని గాని అంతగా అర్పింప జాలరు. మఱికొందఱు పరిసర జ్ఞాన సంపదపై నంతగా నాధారపడక వాటిని ఉత్తేజకరములుగా గైకొని యంతరంగ మథనముననే యధికముగా పనిగొనుచుందురు. వారే మహానీయులయిన తత్త్వవేత్తలు. చట్టునేలలో నూతిని ద్రవ్వువాఁడు ఆనేలకు రంధ్రముతొలిచి, తుపాకి మందు కూరి, కాల్చి, నేల ప్రీల్చి, మంటిని రాళ్ళను ఎత్తివేసి లోనికి లోనికి బోయి అన్యాస్పృష్టము నిర్దుష్టము నగు పాతాళ గంగ యూటపట్టును గనుగొని మధురాతి మధురమగు దివ్య జలధారను వెలువరించినట్టు తాత్త్వికుఁడు తీవ్రానుచింతనముతో తపస్సున అంతరంగమును ప్రీల్చుకొనుచు బోయిపోయి నిరతిశయానంద జనకమయిన విజ్ఞానామృతము నూటలూరింప గల్గును. "తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ" అని యుపనిషత్తు. అనంతమయిన దేశమున, అనంతమయిన కాలమున

ఎంత జ్ఞాన వస్తు భాండాగారము నిక్షిప్తమయి యున్నదో దానిని కొంతకు గొంతైనా గుర్తించుటకు శరీరాంతర్గత మయిన జీవాత్మబిందువే మూలాధారమై యున్నది. విజ్ఞాన మహావృక్షమును విరియించే యీ మూలాంకురము మానవ శరీరగుహానిహితముగా ఉన్నదని నిరంతర తపస్సంఘర్షమున త్రోవ త్రొక్కుకొనుచు బోవుచుఁబోవుచు ఆ త్రోవలో అపూర్వ జ్ఞానాద్భుతాంశములను గుర్తిస్తూ గుర్తిస్తూ గుర్తించిన వాటిని వెలికిగొనితెచ్చి లోకమున కర్పిస్తూ తుదకు నిరతిశయానంద జనకమైన జ్ఞానామృతమును, ఈశ్వర రూపమును మానవుడు పడయ వలసి యున్నాఁడు. ఈ విధమున యాత్మాంతరావేక్షణములో గోచరించే అద్భుతాంశములు కొన్ని, కార్యరూపమున లోకమున సిద్ధములై యుండి వాని కారణ సమన్వయము కుదురనివై యుండగా తత్సమన్వయ రూపములు గాను; మఱికొన్ని శాస్త్ర సిద్ధాంతములనుబట్టి కారణములు కుదరగా వానివల్ల అభ్యూహించి సాధించిన కార్యరూపములుగానూ ఉన్నవి.

గణిత జ్యోతిష వైద్య రసవాద పదార్థ విజ్ఞానాది శాస్త్రకారుల దివ్య ప్రతిభలు సాధించే సిద్ధులు సామాన్య మానవులకు నివ్వెరగొల్పుతున్నవి. ప్రస్తుత యుద్ధము మహా నర్థపుపెంటను పెంచుతున్నా ఈ పెంట యెరువులో దివ్య జ్ఞానాంకురములెన్నో మొలక లెత్తుతున్నవి. భౌతిక శాస్త్రజ్ఞులు శబ్ద స్పర్శరూప రసగంధములనే పంచ జ్ఞానేంద్రియముల విషయములలో శబ్దమును, రూపమును, ఎక్కడబట్టితే అక్కడ ఎప్పుడు బట్టితే అప్పుడు వినగలిగేటట్లు, చూడగలిగేటట్లూ సమన్వయించుకోగల్గడం అద్భుత విషయముగదా! ఇదే విధముగా రసగంధస్పర్శములను గూడా సమన్వయించుకోగలిగితే ఇక చెప్ప వలసిన దేమి? అంటే ఏమిటంటే నేనిప్పుడు మాటాడుతున్న మద్రాసు రేడియో స్థానంలో-నేను గాదనుకోండి మహాప్రాజ్ఞుడింకొకడే ఆయెను-అద్భుతమైన ప్రసంగం జరిపి నాడంటే దాన్ని అప్పుడే గ్రామోఫోనులో ఎక్కించినారంటే అది ఎక్కడ బట్టితే అక్కడ ఎప్పుడు బట్టితే అప్పుడు వినదగ్గ దౌతుందిగదా! అసలు తొలుత అతడు మాటాడేటప్పుడే రేడియో సెట్లు గలవారంతా విశ్వమంతటా వినగలుగుతున్నారు గదా! ఈలాగే రేడియోద్వారా రూపంకూడా చూపించడమౌతున్నదట గదా! విదేశాలలో: ఆవిధముగానే మద్రాసురేడియో స్థానంలోని పాటలు ఆటలు వినరావడము కనరావడము మాత్రమేకాక అక్కడ ఆరగింపబెట్టిన మధుర భక్ష్యములచవీ ఆఘ్రాణింప బెట్టిన పూవుల వాసనా, ఆ యా వస్తువుల స్పర్శసుఖమూ కూడా రేడియో ద్వారా సదాసర్వత్ర సులభముకావచ్చునేమో! మానవ ప్రజ్ఞ ఎంతెంత జ్ఞాన సంపద నార్జించదగిఉన్నదో! ఇప్పటికి జ్ఞాన సుమములో ఒక రేకు అయినా విచ్చెనో లేదో అంటినిగదా! జ్ఞానసంపదార్జనమును గూర్చి నా ఆశాస్వప్నాలు కొన్ని విన్నవిస్తాను. ముళ్లు లేని గులాబిచెట్లు, టెంకలేని మామిడి పండ్లు, ఇలాంటి వింకా ఎన్నో సాధ్యములు కావచ్చును. అవసరమును బట్టి చెట్లు, పైర్లు, కాచే చెట్లు కాసే పూసేవి గాను, పైర్లు పండేవి గాను మార్చవచ్చును. ప్రపంచములో ఎక్కడగానీ పిచ్చి కుక్కల్నీ, తేళ్లనీ పాముల్నీ వీటినేకాదు దోమలూ నల్లులూ జెఱ్ఱులూ మొదలయిన విష జంతువులన్నింటి సృష్టి అంతరించి పోవచ్చును. ఆవుపాలు మొదలయిన ఆహారపదార్థములను కృత్రిమంగా నిర్దుష్టముగా కల్పించవచ్చును. పంచజ్ఞానేంద్రియ విషయములను పంపినట్లు ఘనపదార్థమును గూడా ఎలక్ట్రిసిటీ వల్ల సర్వత్రపంపగల్గవచ్చును. పదిమాసములు నీరు మోసి ప్రసవించవలసిన స్త్రీని పదిపక్షములలో ప్రసవము మయ్యేటట్లు చేయగల్గవచ్చును. ఇచ్ఛ ఉన్నప్పుడే గర్భధారణము కల్గించవచ్చును. ఇప్పుడు కుదురురానివనుకొనే వ్యాధులన్నింటినీ కుదుర్చ గలుగ వచ్చును. వైద్యులమూలాన మృత్యుదేవత క్షితిజరేఖ వలె (హారైజ

వలె) దూరదూరంగా తొలగిపోయేది కావచ్చును. అవును. పై భౌతికాభ్యుదయాలనన్నింటినీగుర్తించడానికీ, అనుభవించడానికీ, మానవునికి దీర్ఘాయుష్యము కూడా ఉండవలెనుగదా! కనుక మానవునికి చిరంజీవిత్వమూ సాధ్యము కావచ్చును. అయితే సరేకాని లోకములోని చెడుగులన్నీ తొలగిపోవడం, మేళ్లే మిగలడం, సాధ్యమయ్యేటట్టయితే, వాటిని అనుభవించడానికి మానవునకు చిరంజీవిత్వమూ సాధ్యమయ్యేటట్టయితే, యికవాడిలోని, దుర్గుణాలూ దుశ్చేష్టలు మిగిలి యుండవలెనా? అవి మానవునిలో కుదురు కట్టుకొని కూర్చుండడం చేతనే కదా మృత్యువూ, దానిని వానికి సంపాదించి పెట్టడానికిగా బాహ్యప్రపంచంలోని చెడుగులూ ఏర్పడి ఉన్నవి! బాహ్యప్రపంచంలో పై సర్వసౌఖ్యాలూ ఏర్పడంతో పాటే మానవులోని చెడుగులన్నీ సర్వనాశమౌతవి. మానవ శరీర లోకంలోని చెడుగులూ, బాహ్య ప్రపంచశరీరంలోని చెడుగులూ రెండూ సర్వనాశం కావలసినవే. ఈలాగు శరీరంలోనీ లోకంలో చెడుగులన్నింటినీ తొలగించుకోగల్గితే, సర్వ సచ్చిదానందములకు ఊటపట్టయిన, శరీర గుహానిహితమైన పదార్ధాన్ని, అంటే ఈశ్వరుణ్ణే, కనిపట్టి మానవుడు ఆయన సర్వశక్తులనూ వశపఱచుకొన్నాడన్నమాటేగదా! ఇట్టి జ్ఞానస్వప్నాలు కలుగుతూ ఉంటై నాకు. మరీ తెల్లవారుజామున వచ్చే స్వప్నాలు సమీపకాలంలోనే ఫలప్రదములౌతవంటారు. నా స్వప్నాలలో ఏవైనా ఫలింప గలవేమో. ఏవైనాఏమి అన్నీ ఫలింపగలవనే నా ఆశ.

సచ్చిదానంద స్వరూపుని
 సకల జనకుని జనులు కనగల;
రిచ్చ నా తండ్రియును బిడ్డల
 కెల్ల సంపదలున్.,
హెచ్చు తగ్గులు తొలగి పోవును
 చచ్చు బుద్ధులు సమసిపోవును
పెచ్చు పెరుగును జ్ఞాన సత్య
 ప్రేమ సుఖములిలన్

[చూ. భారతి. స్వభాను-మాఘం]

నీతి ద్విషష్టిక

ఉపోద్ఘాతము

వేటూరి ప్రభాకరశాస్త్రి

[ఇది 1928వ సంవత్సరంలో శ్రీ. కే. మార్కండేయ శర్మగారు ప్రచురించిన నీతిద్విషష్టికకి శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు సంస్కృతంలో వ్రాసినభూమికకు అనువాదము. అనువాదకులు డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు-సం.]

'నీతిద్విషష్టిక' అనే ఈ కృతి సుందర పాండ్యుడు రచించినట్లు మొదటి శ్లోకం ద్వారాను, చివరి శ్లోకం ద్వారాను, గ్రంథాంతంలో ఉన్న పుష్పికద్వారానూ తెలుస్తూన్నది. పాండ్యదేశానికి రాజధానియైన మధురలో వెలసి ఉన్న పరమేశ్వరుని పేరు సుందరపాండ్యస్వామి అనే విషయం ప్రసిద్ధమే. ఆ పరమేశ్వరుని అనుగ్రహానికి చిహ్నంగా ఆ దేశంలోని రాజులు తదితరులూ కూడా ఆ పేరు పెట్టుకొనే వారు. ప్రాచీనపాండ్యరాజులలో సుందరపాండ్యుడు అనే పేరు కలవారు ఎంతో మంది ఉన్నట్లుగా ఐతిహాసికులు చెపుతున్నారు. శాసనాలలో పేర్కొన్న రాజులైన సుందర పాండ్యులు చాలమంది ఉంటూండగా, గ్రంథకారులైన ఎంతోమంది సుందరపాండ్యులు కూడా ఉన్నారు. ఇంతవరకూ గ్రంథపరిశీలకు లెవ్వరూ గుర్తించని ఒక గొప్ప మీమాంసా పండితుడైన సుందరపాండ్యుని గూర్చి మహామహోపాధ్యాయ యస్. కుప్పుస్వామిశాస్త్రిగారు ఇదంప్రథమంగా తెలిపి ఉన్నారు (చూ. Journal of Oriental Research, Madras Quarterly, Vol. I No. I. January 1927. Pages 5–15.) శ్రీశంకర భగవత్పాదులు, ఈసుందర పాండ్యుడు రచించిన ఏదో గ్రంథంలో ఉన్న రెండు కారికలను, సమన్వయాధికరణం చివర, ఉదాహరించారు. ఐతే ఈతని పేరు నిర్దేశించ లేదు. భగవత్పాదులు సుందరపాండ్యుని పేరు చెప్పకపోయినా వారికంటె అర్వాచీనులు, మన కంటె చాలా ప్రాచీనులు అయిన కొందరు అద్వైత విద్యాచార్యులు ఈ కారికలను ఉదాహరించి, ఇవి సుందరపాండ్య విరచితములని చెప్పి ఉన్నారు. ఇలా చెప్పిన వారు - పంచపాదికా వివరణానికి వ్యాఖ్యయైన 'ప్రబోధపరిశోధిని' రచించిన ఆత్మరూపాచార్యులు, సూతసంహితకు వ్యాఖ్యానం వ్రాసిన మాధవాచార్యులు. అమలానందుడు బ్రహ్మసూత్రభాష్యవ్యాఖ్యలో(3-3-25) "ఆహ చాత్ర నిదర్శనమాచార్య సున్దరపాణ్డ్యః" (ఇందుకు నిదర్శనంగా సుందరపాండ్యుడు ఇట్లు చెప్పుచున్నాడు) అని అంటూ కొన్ని కారికలు ఉదాహరించినాడు. తంత్రవార్తికంలోని బలాబలాధికరణంలో, కుమారిలభట్టు కూడా, ఈ కారికలనే ఉదహరించి ఉన్నారు. దీనిని

బట్టి మీమాంసాగ్రంథకారుడైన ఒక సుందరపాండ్యుడు శంకరాచార్యులకంటె, కుమారిలభట్టుకంటె కూడా పూర్వం ఉండేవాడని తెలుస్తూన్నది. అందుచేత ఈ సుందరపాండ్యుడు క్రీ. శ. సప్తమ శతాబ్దికి పూర్వం ఉండేవాడనే విషయం స్పష్టం అవుతున్నది.

కేరల దేశీయుడైన కృష్ణలీలాశుకముని, తను రచించిన "పురుషకారము" అనే వ్యాకరణ గ్రంథంలో, ఒక సుందరపాండ్యుని పేర్కొంటూ ఆతని వాక్యం అన్నట్లుగా-"నిక్షతి చుమ్బతి నింస్తే తన్వ్యా ముఖపఙ్కజం ప్రేయాన్" అనే శ్లోకార్థాన్ని ఉదాహరించాడు. కృష్ణలీలాశుకముని- రాజరాజ చోళుని గురువూ, "ఈశానదేవగురుపద్ధతి" అనే గ్రంథం రచించినవాడూ అయిన ఈశానదేవునికి శిష్యుడు. ఈశానదేవుడు తన "పద్ధతి" లోను, కృష్ణలీలాశుకుడు 'పురుషకారం' లోను భోజుని గ్రంథాలను పేర్కొన్నారు. అందుచేత వీరిద్దరూ క్రీ. శ. పన్నెండవ శతాబ్దిలో ఉండి ఉంటారు. ఈ విధంగా 'పురుషకారం'లో పేర్కొన్న సుందరపాండ్యుడు క్రీ. శ. పన్నెండవ శతాబ్దానికి పూర్వమే ఉండి ఉండాలని తెలుస్తూన్నది.

ఐతే ఇక్కడ ఒక చిక్కు ఉన్నది. "నిక్షతి చుంబతి" ఇత్యాదిశ్లోకార్థం సుందరపాండ్య విరచితం అన్నట్లుగా 'పురుషకారం'లో చెప్పబడినా, ఇది వీరపాండ్య విరచితంగా ప్రసిద్ధమూ ముద్రితమూ అయిన క్రియానిఘంటువులో కనబడుతున్నది. ఆ గ్రంథప్రారంభం ఈ విధంగా ఉన్నది:—

"తిఙన్తరూపపర్యాయాః కేచిత్కావ్యోపయోగినః
వీరపాణ్డ్యక్షితీశేన వక్ష్యన్తే శిక్షితుం శిశూన్."

ఈ విధంగా ప్రారంభించిన గ్రంథంలో—

"కక్ఖతి కఖతి ప్రహసతి గగ్ఘతి ఘగ్ఘతి చ తక్కతి స్మయతే.
నిక్షతిచుమ్బతి నింస్తే తన్వ్యా ముఖపఙ్కజం ప్రేయాన్."

అనే శ్లోకం ఉన్నది. ద్వాదశ శతాబ్దిలో ఉన్న లీలాశుకుని వాక్యమే ప్రమాణం అని అంగీకరించిన పక్షంలో, వీరపాండ్యుని పేరు ఉన్న క్రియానిఘంటు ప్రారంభశ్లోకం ప్రక్షిప్తమనేనా అనాలి; లేదా ఇది అపపాఠ మనేనా అనాలి. ఐతే—క్రియానిఘంటువు క్రమబద్ధంగా ఉండడంచేతనూ, వీరపాండ్యుని పేరు శ్లోకనిబద్ధమై ఉండడం చేతనూ ఈ ముద్రితగ్రంథమే ప్రామాణిక మని అంగీకరించడం యుక్తం అని మాఅభిప్రాయం. 'పురుషకారం'లో కూడా వీరపాండ్యుడనే వ్రాసినా, మీమాంసాపండితుడైన సుందరపాండ్యు డొకడు ప్రసిద్ధుడుగా ఉండడంచేత, లేఖకుడు వీరపాండ్యునికి బదులు సుందరపాండ్యుని పేరు చేర్చి ఉంటాడని ఊహించడానికి కూడా అవకాశం లేకపోలేదు. ఏమైన ఈతడు సుందరపాండ్యుడా తద్భిన్నుడా అనే సందేహం అలాగే ఉండిపోతున్నది.

ఈ నీతిద్విషష్టిక రచించిన కవి సుందరపాండ్యులలో ఒకడు. సుభాషిత సంకలనకర్తలు చాలామంది ఈతని శ్లోకాలు సేకరించారు. వల్లభదేవుడు ఈ కృతిలోనుంచి చాలా ఆర్యలను తన "సుభాషితావళి" లోనికి గ్రహించాడు. ఐతే-ఇతడు శ్రుతానుశ్రవిక (వినికిలి) మీదనే ఈ ఆర్యలను గ్రహించాడు. అసలు గ్రంథాన్ని చూచినట్లు లేదు. ఇందులోని ఆర్యలను కొన్నింటిని ప్రకాశవర్షుడివనీ, కొన్ని రవిగుప్తునివనీ, కొన్ని అమృతవర్ధనుడి వనీ, ఏవేవో క్రొత్తపేర్లన్నీ కల్పించి వాటికి అంటకట్టి ఉన్నాడు. వల్లభదేవుడు ప్రసిద్ధులవో, అప్రసిద్ధులవో ఎవరో కొందరు కవుల పేర్లు కల్పించి, వారు రచించినట్లుగా ఉదాహరించిన శ్లోకాలు తద్భిన్న

లైన కవులు రచించిన కొన్ని కావ్యాలలో లభించడం పండితలోకానికి తెలిసిన విషయమే. చాలామంది సుభాషిత సంకలన కర్తలు ఇలాగే కనిపిస్తున్నారు. జల్హణుడు కూడా "సూక్తిముక్తావళి"లో ఈ ఆర్యలను ఈ విధంగానే గ్రహించి రవిగుప్తుడు మొదలైన వాళ్ళని రచయితలుగా పేర్కొన్నాడు. శార్ఙ్గధరుడు కూడా అంతే. ఒక్క ఆర్యను తీసికొని, ఈ ముగ్గురూ ముగ్గురు వేర్వేరు కవులకు దానిని సంబంధింపచేశారు. పోతయార్యుడు "ప్రసఙ్గరత్నావళి" లోను, పెద్దిభట్టు "సూక్తివారిధి" లోను, రచయిత పేరు చెప్పకుండగా ఈ ఆర్యలను ఉదాహరించారు. ఈ సుభాషితసంకలన కర్తలందరూ పదమూడవశతాబ్దికి పూర్వులు కారు.

జల్హణుడు 1257వ సంవత్సరంలో సూక్తి ముక్తావళి రచించాడు.

వల్లభదేవుడు 'సుభాషితావళి'ని

శార్ఙ్గధరుడు 'పద్ధతిని' 1400 సం ప్రాంతంలో రచించారు.

పోతయార్యుడు 'ప్రసఙ్గరత్నావళి'ని 1460 సం. లో రచించాడు.

పెద్దిభట్టు 'సూక్తివారిధి'ని 1500 సం. లో రచించాడు.

వీరిలో ఏ ఒక్కరికి కూడా ఈ సుందర పాండ్యుని కృతినిగూర్చి తెలియకపోవడం ఆశ్చర్యకరంగానే ఉన్నది. ఐతే వీరి అందరికంటే ప్రాచీనుడైన ఒక పండితునికి ఈ కృతిని గూర్చి యథార్థంగా తెలిసి ఉండడం ముదావహమైన విషయం.

క్రీ. శ. 1200 ప్రాంతంలో కలింగరాజు అనే నామాంతరం గల సూర్యవిబుధుడు "కులశేఖర సూక్తిరత్నహారం" అనే పేరుతో ఒక సుభాషిత సంకలన గ్రంథం గ్రంథించాడు. ఈ ఆర్యలు సుందరపాండ్యరచితాలను అతడు ఆ గ్రంథంలో గ్రథించాడు. ఈఆర్యలుసుందర పాండ్యుని కృతి అని చెప్పడంలో తప్పులేదు. అతడు క్రీ. శ. పన్నెండవ శతాబ్దికి పూర్వుడనే విషయం కూడా స్పష్టం అవుతుంది. ఐతే,ఇదొక చెప్పుకోదగిన విషయం కాదు. ఎందుచేతనంటే ఈ సుందర పాండ్యుడు షష్ఠశతకం కంటె కూడా ప్రాచీనుడని నిరూపించనున్నాము.

ఈ సందర్భంలో గుర్తింపదగిన విషయం ఇది:- పంచతంత్రం రచించిన విష్ణుశర్మ ఆరవ శతాబ్దానికి అర్వాచీనుడు కాడు అని విమర్శకుల అభిప్రాయం. అతడు కూడా ఈ గ్రంథంనుంచి కొన్ని ఆర్యలు (29, 30, 48 శ్లోకాలు) తీసుకున్నాడు. అందుచేత ఈ సుందరపాండ్యుడు షష్ఠశతకంకంటె ముందుగానే ఉండేవాడని తేలినది. ఈ గ్రంథానికి చివర ఉన్న-

"ఇమాం కాఞ్చనపీఠస్థాం సమేత్య కవయో భువి
ఆర్యాం సున్దరపాణ్డ్యస్య స్నాపయన్తి వధూమివ"

అనే శ్లోకం కూడా పై నిర్ణయానికి ఉపోద్బలకంగా ఉన్నది. "భూలోకంలో. కవులందరూ కలసి, సుందరపాండ్యుని కృతియైన కాంచనపీఠంపైన ఉన్న ఈ ఆర్యను మధురానగరంలో సుందరపాండ్య డనే పేరుతో వెలసిన పరమేశ్వరుని వధువైన ఆర్యనువలె, అనగా మీనాక్షీదేవిని వలె, కనకాభిషేకంచేసి, పూజిస్తున్నారు" అని ఈశ్లోకానికి అర్థం. క్రీ. శ. ఆరవ శతాబ్దానికి పూర్వంనుంచే, ద్రవిడదేశంలోని మధురానగరంలో "ద్రవిడసంఘం" అనే పేరుతో ఒక విద్వత్సమితి ఉంటుండేది. ఆ సమితిలో సభ్యులైన విద్వాంసులు ఉత్తమ కవినీ, అతని

కృతినీ ఆ సంఘం పూజించే ఒక బంగారు పీఠం మీద ఉంచి కనకాభిషేకం చేస్తూండేవారు. బహుశా సుందరపాండ్యుని కృతికి అలాంటి సత్కారము జరిగి ఉంటుంది. దానినే కవి ఇక్కడ సూచించి ఉంటాడు. అందుచేత ఇది "ద్రవిడసంఘం" ప్రచారంలో ఉన్నప్పుడు రచించిన కృతి అయి ఉంటుందని చెప్పవచ్చును.

కుమారిలభట్టు తంత్రవార్త్తికంలోను, శంకర భగవత్పాదులు శారీరక భాష్యంలోనూ ఉదాహరించిన మీమాంసాగ్రంథం రచించినవాడు ఈతడే అయి ఉంటాడు. ఇతడు భగవత్పాదాచార్యులకంటె ప్రాచీనుడై ఉండడమే ఈ విధంగా (ఈ సుందర పాండ్యుడూ ఆ సుందరపాండ్యుడూ ఒకడే అని) ఊహించడానికి కారణం. మరొకకారణమేమిటంటే- ఈ కవి కృతి ప్రారంభంలో– "శ్రీమాన్ సున్దర పాణ్డ్యః శ్రుతిస్మృతప్రసృతి సత్పదార్థజ్ఞః" అని వ్రాస్తూ-తాను శ్రుతిస్మృతి ప్రోక్తాలైన సత్పదార్థాలు తెలిసినవాడు అని చెప్పుకుంటున్నాడు. "శ్రుతిస్మృతి ప్రసృతసత్పదార్థజ్ఞః" అనే విశేణాన్ని బట్టి ఈ కవి మీమాంసాశాస్త్రంలో నిష్ణాతుడని తెలుస్తూన్నది. ఈ ప్రమాణలన్నింటినీ పట్టి చూడగా మీమాంసాశాస్త్ర గ్రంథం రచించినవాడూ, ఈ 'ఆర్య'ను రచించిన వాడుకూడా ఒక్కరేలనీ, ఇతడు క్రీ.శ. షష్ఠశతాబ్దికి పూర్వము ఉండేవాడనీ స్పష్టం అవుతున్నది.

అనేక మైన పంచతంత్రాదిగ్రంథాలలో ఈ ఆర్యలను ఉదాహరించడాన్ని పట్టి చూస్తే పూర్వకాలంలో ఇది ఎంత బహుళప్రచారంలో ఉండేదో విశదం అవుతున్నది. ఈ ఆర్యలకు మూలగ్రంథం ఏదో తెలియకపోయినా, చాలామంది ఆధునిక పండితులు కూడా పంచతంత్రభోజప్రబంధాదులలో పరిచయం ఉండడంచేతనూ శ్రుతానుశ్రవికచేతనూ కూడా సహృదయగోష్ఠులలో ఈ ఆర్యలను ఉదాహరిస్తూ ఉంటారు. వజ్రపు తునకల వలె ఊర్జస్వలాలైన ఇందలి పద్యాలు తేనెలో ఊరబెట్టిన అల్లపు ముక్కల వలె కటు-మధురాలుగా, పథ్యంగా హృద్యంగా-ఉంటాయి. అందుచేత ఇవి సహృదయహృదయావర్జకాలుగా ఉంటాయని సంతసిస్తున్నాము.

కొందరు ప్రాచీనాంధ్రకవులు కూడా ఈ ఆర్యలను అనువదించి తమ గ్రంథాలలో పొందుపరచుకొన్నారు. క్రీ. శ. 1300 ప్రాంతానికి చెందిన మంచనకవి, రాజశేఖరుని, 'విద్ధసాలభంజిక'ను అనుసరించి రచించిన 'కేయూరబాహుచరిత్రం' అనే రసభరితమైన ఆంధ్రప్రబంధంలో ఇందులోని రెండు ఆర్యలను రెండు పద్యాలుగా అనువదించాడు.

క్రీ. శ. 1400 ప్రాంతానికి చెందిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు కూడా ఒక ఆర్యని అనువదించి భీమఖండంలో ఉపయోగించుకున్నాడు. ఆతని పద్యం ఇది:-

తే. నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడరి కాకులు బిట్టు పెద్దరచునపుడు
ఉడిగి రాయంచ యూరక యుంట లెస్స
సైప రాకున్న నెందేని జనుట యొప్పు✻
(చూ. శ్లో 113)

✻ నా ఉపోద్ఘాతాన్ని పరిశీలించిన తరువాత, మా మిత్రులు బ్రహ్మశ్రీ మా. రామకృష్ణకవి మహాశయులు వ్రాసిన ఆంగ్లోపోద్ఘాతంతో, ఈ సుందర పాండ్యకృతి షష్ఠశతాబ్దికి పూర్వమే రచింపబడినది అని చెప్పడానికి మరొక ప్రమాణంగా జనాశ్రయుని "జానాశ్రయి" అనే ఛందోగ్రంథంలో పథ్యలక్షణంలో, "చారిత్రనిర్మలజల" అనే (ఈ గ్రంథంలోని) ఆర్యను (24) ఉదాహరించడం చూపబడినది. మా మిత్రుని ఊహ సత్యమే. ఆ జనాశ్రయుడు కృష్ణాతీరాంధ్ర దేశాన్ని పాలించిన మాధవశర్మ అనే నామాంతరం గల విష్ణుకుండిన

(157వ పుట చూడుడు.)

‘నీతిద్విషష్టిక’ అనే పేరుతో 116 ఆర్యలు ఉన్న పుస్తకం ఒకటి చెన్నపుర ప్రాచ్యలిఖితపుస్తకశాలలో ఉన్నది. అందులో లేఖకప్రమాదాలూ, గ్రంథపాతాలూ కూడా చాలా ఉన్నాయి. దానికి ఒక పుత్రికను (కాపీ) సంపాదించి, దానిని యథామతిగా సంస్కరించి, ప్రచురించడానికై, మామిత్రుడు, బహు సంస్కృతాంధ్రగ్రంథ ప్రకటన ప్రఖ్యాత కీర్తి, శ్రౌతస్మార్త గ్రంథాల సంధానమూ, వాటికి టీకావివరణాదిరచనమూ, సంస్కరణము, ప్రకటనమూ మొదలైన సత్కార్యాలలో ఆరితేరినవాడూ అయిన బ్రహ్మశ్రీ కనుపర్తి మార్కండేయశర్మ ప్రారంభించాడు. ముద్రణకార్యం సగం పూర్తి అయింది. ఇంతలో మిత్రుల ద్వారా ఈ విషయం తెలిసి, చెన్నపుర రాజకీయ శాసన పరిశోధకశాలాధికారులలో ఒకరైన శ్రీ ఏ. యస్. రామనాథయ్యర్ మహాశయులు తమకు తిరువనంతపూర్ రాజకీయ పుస్తకశాలలో లభించిన, వేరే మాతృక గల మరొక పుస్తకం మాకందజేశారు. దీనిపై అక్కడి అధికారులు ‘ఆర్యావలీ’ అనే పేరు వ్రాసి ఉన్నారు. ఇందులో 33 ఆర్యలు అధికంగా ఉన్నాయి. లేఖకప్రమాదాలూ, పాఠాలూ కూడా చాలా పరకూ (మాకు అంతకు పూర్వం లభించిన ప్రతితో) సమంగానే ఉన్నాయి. “కులశేఖరసూక్తిరత్నహారాన్ని” గూర్చి, అందులో సుందరపాండ్యుని ఆర్య ఉదాహరింపబడడాన్ని గూర్చి వారి ద్వారానే మాకు తెలిసినది. అధికంగా లభించిన ఆర్యలను గ్రంథాంతంలో అనుబంధంగా చూపించి ఉన్నాము. గ్రంథాద్యంత శ్లోకాలలో ఈ కృతికి “ఆర్యా” అనే పేరుమాత్రమే కనబడుతూన్నది. చెన్నపురపుస్తకశాలలోని తాలపత్రపుస్తకానికి, ఎవరోలేఖకుడు, తనకెక్కడో అరవైరెండు శ్లోకాలు మాత్రమే లభించడంచేత “నీతిద్విషష్టికా” అనే పేరుపెట్టి ఉంటాడు. అందుచేత అనుబంధంగా ముద్రింపబడిన ఆర్యలు కూడా సుందరపాండ్యుని గ్రంథంలో చేరినవే అయి ఉంటాయి. తలవని తలంపుగా లభించిన ఈ సహాయానికి, ఉపోద్ఘాతం వ్రాస్తున్న నేనూ, ఈ

వంశీయుడైన రాజై ఉంటాడు. అతడు క్రీ. శ. 580 కి పూర్వం ఉన్నవాడు. ఈ ‘జానాశ్రయి’ ప్రారంభంలో ఉన్న-

“సభూపతిరుదారధీర్జయతి సమ్పదేకాశ్రయో
జనాశ్రయ ఇతి శ్రియా వహతి నామ సార్థం విభుః.

మఘైరురుభిరద్భుతైర్మఘవతో జయశ్రీరపి
జితా విజితశత్రుణా జగతి యేన రుద్ధా చిరమ్.”

అనే శ్లోకాన్ని బట్టి ఈ ఛందోగ్రంథం రచించిన జనాశ్రయుడు ఎన్నో మహాయజ్ఞాలు చేసినట్లు తెలుస్తూన్నది. పులిబూరు శాసనం కూడా ఈ విషయానికి సమర్థకంగా ఉన్నది- “క్రతుసహస్రయాజీ, హిరణ్యగర్భప్రసూతః, ఏకాదశాశ్వమేధావబృథస్నానవిగతజగదేనస్కః, సర్వభూతపరిరక్షణచుఞ్చుః. విద్వజ్జనతపస్విజనసమాశ్రయో, మహారాజశ్రీమాధవవర్మా....జనాశ్రయ మహారాజః గుద్దవాడ విషయే” ఇత్యాదికము. ఈ శాసనాన్ని బ్రహ్మశ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ప్రకటించారు. ఈ తామ్రశాసనం కాలం క్రీ. శ. 609 అవుతుంది. ప్రసంగరత్నావళిలో ఈ క్రింది శ్లోకం ఉన్నది.

(“నీల?) శ్రీమచ్ఛకాబ్దేబ్ధి శశిసాయక (514 శకాబ్దం. 592 క్రీ. శ) సమ్మితే *
రాజా మాధవవర్మాభూ ద్విఖ్యాతో ధరణీతలే”.

(సుమతి శతకంలోని “కమలములు నీట బాసిన” అన్న పద్యం అనుబంధంలోని 15వ పద్యానికి అనువాదం అనికూడా కవిగారు వ్రాసినారు. సంపాదకుడు)

* సంస్కృతోపోద్ఘాతంలో (514 A D 192) సమ్మితే అనేది ముద్రణ దోషమై ఉంటుంది (సంపాదకుడు)

గ్రంథాన్ని ప్రచురిస్తూన్న మా మిత్రుడూ కూడా సుహృద్వరులైన బ్రహ్మశ్రీ రామనాథఅయ్యరు గారికి, సంతోషంతో, కృతజ్ఞతను తెలుపుకుంటున్నాము. మా మిత్రుడైన మార్కండేయశర్మ, ఇంతకు పూర్వం చాలా అవసరమైన అనేక గ్రంథాలు ఆంధ్రలిపిలో ప్రచురించి ఉన్నాడు. ఇటుపైన ప్రఖ్యాతులైన ఆంధ్రులు రచించిన గ్రంథాలను ప్రప్రథమంగా నాగరీలిపిలో ప్రచురించడం జరుగుతుంది. ముద్రించడంలో అవకాశం (Space) ఇచ్చే పద్ధతిని ఆంధ్ర ముద్రణ సంప్రదాయం ప్రకారం అనుసరించినాము. సహృదయులు ఈ పద్ధతిని మెచ్చుకొనే పక్షంలో ఇటుపైన కూడా ఈ పద్ధతినే అనుసరిస్తాము. దీన్ని నిర్విఘ్నంగా నిర్వహించేటట్లు సర్వేశ్వరుడు అనుగ్రహించు గాక అని అభిలషిస్తూన్న:

విద్వద్విధేయుడు

చెన్నపురి వే. ప్రభాకరశాస్త్రి

* * *

శ్రీ ప్రభాకర

సంపూర్ణ గ్రంథావళి

[1979 డిసెంబరు 27వ తేదీ హైదరాబాదులో శ్రీ ప్రభాకర పరిశోధక మండలి పక్షాన శ్రీ శాస్త్రిగారి రచనలన్నిటిని సంపూర్ణ గ్రంథావళిగా శ్రీవారి శతజయంతి (1888)లోగా వెలువరచడానికి ఆలోచన జరిగింది. ఆచార్య తిమ్మావఝుల కోదండ రామయ్యగారు ఆనాడు ఈ క్రింది మాస్టర్ ప్లానును సూచించిరి. శ్రీవారి రచనలను గూర్చిన ఆకళింపునకు ఇది ఒక సూచన మాత్రమే. దీనిని చర్చించి తగు నిర్ణయము తీసుకోవలసి యున్నది. ఆంధ్రలోకమందించే సహకారముతో మా యీ పూనిక ముమ్ముందు ఒక సమగ్ర రూపమును దాల్చగలదని ఆశిస్తున్నాము-సం॥]

ప్రణాళిక :-

1. నీతినిధి (అచ్చుపని ముగిసినది. ఈ సెప్టెంబరులో ఆవిష్కరింపబడును.)
2. ప్రభాకరశాస్త్రిగారి పీఠికలు
3. పద్యరచనలు-చాటువులు
4. సంస్కృత నాటకానువాదములు, స్వతంత్ర నాటకములు.
5. శాసనపరిశోధనలు
6. జానపద సాహిత్యమునకు సంబంధించిన రచనలు, ప్రసంగములు.
7 ప్రభాకరశాస్త్రిగారి వచన రచనలు
8. పత్రికలలో ప్రచురితమై పూర్వసంకలనములలో చేరని వ్యాసముల సంకలనము
9. తెలుగు సామెతలు, పలుకుబళ్ళ సంకలనము
10. ప్రభాకరశాస్త్రిగారి లేఖలు-పాఠాంతరములకు సంబంధించిన సూచనలు.(నోట్సు)

11. ఉత్తరహరివంశము—గచ్ఛద్వ్యాఖ్య; కుమార సంభవము-అసంపూర్ణ వ్యాఖ్య.
12. ప్రభాకరశాస్త్రిగారి ఉపన్యాసములు.
13. లక్షణోద్ధారము.
14. ప్రభాకరశాస్త్రిగారి యోగలేఖలు—సాధకుల అనుభూతులు.
15. గాంధేయ రచనలు.
16. ప్రభాకరశాస్త్రిగారి పరిశోధనాదికమును గురించి యితరుల వ్రాతలు, అభిప్రాయములు, అభిభాషణములు.
17. ప్రభాకరశాస్త్రిగారిచే పరిష్కృతములై అముద్రితములయిన, అలభ్యములైన ప్రాచీనకావ్యములు.
18. ప్రభాకరశాస్త్రిగారు సేకరించి ప్రకటింపని ప్రాచీనకావ్యముల పరిష్కృతముద్రణములు.
19. తెలుగు భాషాసాహిత్యములకు ప్రభాకరశాస్త్రిగారు చేసిన బహుముఖీన మయిన సేవ—ప్రత్యేకించి పరిశోధన రంగమునకు వారుచేసిన దోహద స్వరూపము—మార్గదర్శిత్వము.
20. ప్రభాకరశాస్త్రిగారి జీవితచరిత్ర.
21. ప్రభాకరశాస్త్రిగారి పసిడిపలుకులు.
22. చాటుపద్యముల సంకలనము (చాటుపద్య మణిమంజరి.)
23. శృంగార శ్రీనాథము.

ఆనాటి ఆదర్శమూర్తులే ఈనాటి గురుదేవులు

—డా॥ వి. ఎన్. శర్మ

[ఊపిరి ఈ శరీరానికి జీవాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అయినా అది వెలికి గోచరించదు. ఎదలోని కదలికల వల్లనే ఆ ప్రాణశక్తిని అభ్యూహించుకో గలుగుతాం. ఎనభై నాల్గేళ్ళవృద్ధులైనా అలుపు నిలుపు లేకుండా నిత్యోత్సాహంతో నిరంతరాన్వేషణతో జీవనయాత్రను సాగిస్తున్న నిత్యపథికులు డా॥ వి. యన్. శర్మగారు తమ యెడద నూదిన జీవశక్తి నిందు ప్రదర్శిస్తున్నారు. పరికించండి— సం॥]

నా ధృక్పథంలో ప్రభాకరశాస్త్రి గారు యుగపురుషులు. ఈ యుగానికి సంబంధించిన వారేకాదు. ఎన్నెన్నో యుగాలనుంచి తమయోగాన్ని సాధకులకు. అన్వేషకులకూ అందజేయటానికి ప్రత్యేకంగా నియమింపబడ్డవారని చెప్పినా సత్యానికి దూరంకాదు. ఈ జన్మలో గురుమూర్తి ప్రభాకరశాస్త్రిగారు సరస్వతీ పుత్రులుగా అవతరించారు. అంచేతనే 'కవి' నామం సార్థకమైనదని అనవచ్చు. ఇప్పటివారు ''కవి'' శబ్దానికి అంతులేని వ్యాఖ్యానాలు సృష్టిస్తున్నా నాకు తెలిసింది వేదవాఙ్మయాన్ని సృష్టించిన మహనీయుల భావాలకే మనం ప్రాముఖ్యత నివ్వామూ. "కవి" ఋషి; సృష్టిస్థితి లయాలని స్పష్టంగా తెలిసినయోగి. ఒక్కసారి శ్రీ శాస్త్రి తమని ఓం ప్రధమములో కలుసుకున్న సాధకునితో అన్నారు. జన్మజన్మలనుంచి తమకు చిరపరిచితులని — ఈ సంఘటను సోదరులు కొత్త రామకోటయ్యగారు ''మణిమంజరి''లో;అంతకన్న ఎక్కువ సున్నితంగా, స్పష్టంగా, ఈ మధ్యనే ప్రచురించిన ''జీవనజ్యోతి''లో చిత్రిస్తూ తమకూ గురుదేవులకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని వెలిబుచ్చటమేగాక. నావంటి జిజ్ఞాసువులకు ఆ దివ్యమూర్తితోగల సంబంధబాంధవ్యాన్ని జ్ఞాపకపరచుకొనటానికి మంచి అవకాశముఇస్తూ వున్నారు. మన ఆరాధ్యమూర్తి మనవారని అంతరాత్మ జ్ఞాపకం చేస్తూన్నా, మన ఈ వాతావరణాన్ని కప్పివేస్తున్న "మాయ" మూలాన తెలిసీతెలియనట్లు చూసీచూడనట్లూ మనగొడవల్లో ఉక్కిరిబిక్కిరై పోతూఉంటాం. పర్వతాగ్రంలోనుంచైతేనేం, అలాకాకపోతే మరో సన్నిహితమైనచోటనుంచిగాని సృష్టించబడ్డనదీ ప్రవాహం సముద్రం చేరుకొనటానికిముందే తన సృష్టికర్తనిగుర్తిస్తూ,ఆయన సహాయముననైతేనేం, మరోదివ్యశక్తిమూలాన నైతేనేం, తన వాంఛలని తీర్చుకుంటూండటం సహజం. అలాటి మహాసముద్రమే శ్రీ ప్రభాకరశాస్త్రిగారు, మాయపాశాలలో తాత్కాలికంగా బంధింపబడుతూండే జీవులంమనం,

శ్రీ శాస్త్రిగారితో నాకు గల సంబంధం జన్మజన్మలనుంచి వస్తూన్నదన్న రహస్యం నాకు తెలుసు. తెలియని స్థితిలోగూడా ఎంతో కాలం ఉండాల్సి వచ్చింది ఈ జన్మలో. అయినా ఆయన ఏదో విధంగా, మరేదోరూపంలో మన బంధుత్వాన్ని హెచ్చరిస్తూనే వుంటారు.

ప్రభాకరశాస్త్రిగారిని గురించి ఈ జన్మలో మొట్టమొదట వినటం నియోగులకు, వైదీకులకుమధ్య స్పర్థలు రేకెత్తుతూన్న కాలంలో. ఇప్పటి చారిత్రిక దృష్టితో నెమరువేస్తూంటే 1912 సంవత్సరంలో అనవచ్చు. అది శతావధానాల సమయము. మా పెద్దలు పండితులు,కవులు. అప్పటికి 13,14, సం॥ వయస్సులోనున్న విద్యార్థిని నేను. మా వంశపారంపర్యపు వాసన నాకూ బాగా పట్టింది. పద్యాలు అల్లటంలో అంత పాండిత్యం స్వయంగా సంపాదించుకొనలేకపోయినా, కవులగురించి, వారి కవితలనిగురించి వినే భాగ్యం లభించిందా, నా స్కూలు పాఠాలకు ఒక నమస్కారం చెబుకుంటూ, ఆ కవితాపుత్రుల సన్నిధిలో ఉండిపోతూ తన్మయుడైపోతూ ఉండేవాడిని. మాది, ఇప్పుడు ప్రకాశం మండలానికి కేంద్రమైనా,ఆ రోజుల్లో గుంటూరుజిల్లాలో చిన్న పట్టణం. ఒంగోలు, ఆ రోజుల్లో విద్యావంతులని పేరు ప్రఖ్యాతులు గాంచినవారు నియోగులు, ఆ శ్రేణికి సంబంధించిన వైదీకులూఉన్నా వారి సంఖ్య అంత చెప్పుకోదగినదికాదు. మమ్మల్ని ఉద్రేకపరుస్తూన్న శతావధానులు ఒక వైపున తిరుపతి వేంకటకవులు. వారి అనుయాయులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, వేలూరి శివరామశాస్త్రిగారు. ఇంకొకవైపున కొప్పరపు కవులు. ఆ కొప్పరపు సోదరుల శిష్యులు ఇతరచోట్ల ఎలాటివారోగాని మా పట్టణంలో 'తల' గల నియోగి వారి శిష్యకోటికి చెందినవారని చెప్పుకుంటూ ఒక్క కవితాగానంతో తృప్తిపడక, నియోగికాని బ్రాహ్మణులని, వారికి శుశ్రూషజేస్తూన్న వారిని చిన్నచూపుచూస్తూండేవారు. ఈ తత్త్వం నాకెంతో ఎబ్బెట్టుగా నుండేది. కవులు కవులే, వారు ఏకోవకుచెందినా ఆరాధ్యమూర్తులనే పట్టుదల నాకెంతో ఉండేది. ఈ పట్టుదల మూలాన నాకెంతో సన్నిహితులైనవాడు కురుగంటి శ్రీరామ శర్మగారు. తిరుపతి వేంకటేశ్వరకవుల శిష్యులు. స్వతాగా కవిపుత్రులు. అప్పుడు ప్రచారంలోనున్న తిరుపతి వేంకటకవుల బాణీలో కవితాగానంచేస్తూ మమ్మల్ని వుత్తేజపరుస్తూండేవారు. తిరుపతి వేంకటేశ్వరకవులు మావూరిని దర్శనంతో పావనం చేయకపోయినా, వారి శిష్యులు అక్కడికివస్తూ శతావధానాలుచేస్తూ తెలుగు సాహిత్యంలోని అపూర్వ శక్తులని చూపుతూండేవారు. మా శ్రీరామశర్మగారూ నాకు తెలిసిన మరికొందరూ బందరు, గుంటూరు మొదలగు చోట్లకు వెడుతూ అక్కడి సభలలోని అద్భుతాలని మాకు చెబుతూ, మా సాహిత్యాన్వేషణకు ఎంతో వూతనిస్తూండేవారు. అలాటి సమయంలోనే మా శ్రీరామశర్మగారు వేటూరి వారినిగురించి ఎన్నెన్నో సంగతులు చెబుతుండేవారు. అప్పటికి ఈ ఇద్దరూ నావృక్పథంలో యువకులే. వారు ఆరోజుల్లో రచించిన పద్యాలని, మా శర్మగారు గానం చేస్తుంటే మరో ప్రపంచంలో విహరిస్తుండేవాడిని. అంతటితో తృప్తిపడితేగా! పెద్దకవుల సంగతి ఎలావున్నా ఈ యువకకవులని ఒకసారి చూసి, వారి కవితాకంఠం ఒకసారి విని ఆనందించాలని కలలుకంటూ ఉండేవాడిని. అప్పటికి వారి రచనలు అచ్చుపడినవికావు. అయినా ప్రభాకరశాస్త్రిగారు అప్పటి నియోగివైదీకుల కలతలు అరికట్టటానికి చేస్తూన్న సహాయం పత్రికల ద్వారా చదువుతూ గర్వపడుతూ ఉండేవాడిని. నియోగుల పత్రికలలో అప్పటికి తలమానికం అనబడే "స్వధర్మ ప్రకాశిని" ఆయన రచనలకు పత్రికలో ప్రముఖ

స్థానం ఇస్తూ వుండటం ఎలా విస్మరించగలుగుతాను. మనకు, అంటే ఒక్క నియోగి వైదీకులకే గాక, అఖిలాంధ్రులకు అటువంటివారే ఆదర్శమూర్తులుగా ఉండాలని కలలు కంటూ ఉండేవాడ్ని.

అప్పుడప్పుడే ప్రభాకరశాస్త్రిగారి చాటుపద్య మణిమంజరి వెలుగులోకి రావటం నాకు బాగా జ్ఞాపకం. అప్పటి కవుల శతావధానాలు, ఇతర కవితాగోష్ఠులూ మాకు ఉత్తేజాన్నిచ్చి మావూరిలో ఒక చిన్న పుస్తక భాండాగారాన్ని వెలయింపజేయటానికి బ్రహ్మాండమైన అవకాశమిచ్చింది. మేము కుర్రవాళ్లం. సరస్వతీ పుత్రులం. లక్ష్మీదేవి మాకు ఎంతో దూరంగా నుండటం మూలాన, భిక్షాటనకు బయలుదేరుతూ. మా గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలని సేకరించటానికి నడుము కట్టుకున్న రోజులు. అలాటి శుభకాలంలోనే చాటుపద్య మణిమంజరి ఈ 'భిక్షాటనలో నాచేతికి రావటం. మొదట మా గురువుగారికి ఇచ్చా. తరువాత సాహిత్య పిపాసువులైన తోటి సోదరబృందం ఆ మణిమంజరిని చదివి ఆనందించింది. అటుపిమ్మట నాదగ్గరనే ఎంతో కాలముంది. ఊరక చదవటమేకాదు ఒక విధమైన పారాయణ గ్రంథమైంది. తెలుగు జీవనజ్యోతి అందులో తేజోవంతంగా ప్రకాశిస్తూ అప్పటి తెలుగు పాఠ్యపుస్తకాల వలలో ఉక్కిరిబిక్కిరై పోతున్న నావంటి యువకులకు మా సహజసిద్ధమైన లోకంలోకి రాజమార్గం చూపిందనే అనవచ్చు. ఎన్నో పద్యాలు నాకంఠంలో తిష్ఠవేసుకుని కూర్చున్నవనే అనవచ్చు.

అదృష్టమంటే అదీ అదృష్టం. 1916 సం॥ దశరాపండుగలకాలం. సాహిత్యపఠన వ్యామోహం మూలాన నా చదువుకు, తాత్కాలికంగా స్వస్తి చెబుతూ గ్రంథాలయోద్యమంలో మునిగితేలుతూ ఉన్న రోజులు. స్వస్థలం ఒంగోలు అయినా, నెలల పర్యంతం ఉండటం విజయవాడలో (అప్పుడు బెజవాడ) ఆంధ్ర గ్రంథాలయోద్యమానికి కేంద్రస్థానమైన రామమోహన పుస్తకభాండాగారంలో. నాయకులు సూరి నరసింహశాస్త్రిగారు, అయ్యంకి వేంకటరమణయ్యగారు. ఈ ఉద్యమం నియోగి వైదీకులను ఏకోదరులనుగా మార్చిన సంగతి ఈ ఇద్దరిలో స్పష్టంగా గుర్తించవచ్చు. ఉద్యమము తరపున మంచి పత్రికను ఈ ఏకోదరులు నడుపుతుండేవారు. వారికి అంతో ఇంతో ఒక్క గ్రంధాలయ సంఘ నిర్వహణలోనేగాక, పత్రికను నడపటంలో చేదోడుగా నుంటూండేవాడిని. ఒక రోజున వారి ఆదేశం నన్ను మదరాసునకు వెళ్లమని, అక్కడి సుప్రసిద్ధ కన్నెమరాలైబ్రరీని ఎలా నడుపుతున్నారో ప్రత్యక్షంగాచూసి తెలుసుకుని పత్రికలో ఆ విషయం ప్రకటించటానికి అవసరమైన వ్యాసం తయారు చేయమని.

ఇతర గ్రంథాలయాలతోచూస్తే కన్నెమారా గ్రంథాలయం బ్రహ్మాండమైనది. దాని ఆవరణలోనే మ్యూజియం, అదీ ఆ కాలపు పరిస్థితులకు చెప్పుకోదగినదే. మ్యూజియం కట్టడాలు ఆ బ్రహ్మాండాన్ని మనకు కన్నులకు కట్టినట్లు చూపేవే. అలాటి కట్టడాలలో ఒక భాగంలో పురాతన తాళపత్రగ్రంథాలయం. తెలుగు ప్రాచీన సాహిత్యపు రుచులని చూడాలని తాపత్రయ పడుతూండే తెలుగుసోదరుల ఆశ్రమము ఈ పుస్తకాలయమే, అప్పటి గవర్నమెంటు రూల్సుప్రకారం కాకపోయినా, కన్నెమారా గ్రంథాలయపు సింహావలోకనం పూర్తికావాలనుకుంటే ఈ తాళపత్రాల నిధిని తప్పనిసరిగా చూడాలి. అంతేనామరి? అక్కడి కార్యకర్తలని కలుసుకువి కాలక్షేపం చేయటం తప్పనిసరి. ఆ దృష్టితోనే ఆ అపూర్వమైన సరస్వతీనిలయాన్ని దర్శించే మహాభాగ్యం సంపాదించుకున్నా. ఆనాడు నా కోరికని మన్నిస్తూ, అక్కడి రహస్యాలు నాకు తెలిపినవారు మన గురుదేవులు! పాతిక సంవత్సరాలకన్నా ఎక్కువ వుండదు వారి వయస్సు. చిన్నాపెద్దా తేడా

చూపక పసపిచ్చి మాట్లాడేవారు ఆ రోజుల్లో తెలుగువారిలో అరుదు, అంతేనా మరి? తన ఆత్మీయుడ్నిగా చూసుకుంటూ అక్కడి పనిపాటలని గురించి ఎంతో చెప్పారు. అపూర్వమైన తాళపత్రాలని వ్రాతప్రతులనీ చూపుతూ నా రచనకు కావలసిన సామగ్రినంతా ప్రసాదించారు. ఊళ్ళోవున్న మా బసలకు ఆ పరిసరాలనుంచి చేరుకొనాలన్న ట్రాంకోసం (అప్పుడు బస్సులులేవు) నడవాలి, అలాటి నడకలు ఆయనకు ఒక లెక్కాపక్కా! ఆ సమయంలోకూడా ఆయన నిజంగా గురుదేవులే. ఇంకా కళ్ళకుకట్టినట్లుంది అప్పుడు ఆయనతో నడుస్తూండటం, ఆయన మాటామంతినుంచి ఎంతో తెలుసుకుంటూ తన్మయుడవుతూండటం! గ్రంథాలయంలో ఆయన జ్ఞానపీఠం. ఇలాటి నడకలలోగూడా ఆ విజ్ఞాన పీఠాన్ని నిలవబెట్టుతూ ఉండటం ఎలా మరచిపో మరచిపోగలుగుతాను.......ఆ కాలం ఆయన పరీక్షా కాలం. ఆ రోజుల్లో ఆయనలో వెలగటానికి ప్రారంభించిన జీవనజ్యోతిని గుర్తించటానికి నాకు అదృష్టంలేకపోయినా, అప్పటికే సీపీపీ శిష్యత్వం సంపాదించుకున్న ధన్యులని తరువాత తెలుసుకునే భాగ్యం నాది అయింది....ఆయన వాక్కులోని దివ్యత్వం అవగాహనం చేసుకొనలేకపోతానా?

1918-21 మధ్య తిరిగి మదరాసులో ఉండాల్సిన అదృష్టం నాది అయింది. నా యౌవనోత్సాహంతో దానికి వూతనిచ్చినది కవితాలోకం: గ్రంథాలయ ప్రపంచములలో యాత్రాపరుణ్ణిగా మూడు నాలుగు సంవత్సరాలు కాలక్షేపం చేసినా నాది తాడు తెగిన గాలిపటమని గుర్తిస్తూ ఒక సంవత్సరం ప్రవేశపరీక్షను పూర్తిచేయటానికి మదనపల్లి కళాశాలలో చదివా. నా సాహిత్య జిజ్ఞాసను అదుపు ఆజ్ఞల్లో నుంచటానికి ఆశిక్షణ నాభవిష్యత్తుకు ఎంతో దోహదమిచ్చింది. ఆ కాలంలో ''భారతి'' పత్రిక నా ఆప్తమిత్రము.గురుదేవుల రచనలు ఎన్నో భారతి నావంటి సాధకులకు అందజేస్తూ మా నిజలోకానికి మమ్మల్ని చేర్చటానికి తోడ్పడుతుండేది. నా బాల్యంలో శ్రీ శాస్త్రిగారితో కలిసిమెలసి వుంటూన్న వేలూరిశివరామశాస్త్రిగారి సాహిత్యలోకంలోకిఅడుగుబెట్టటానికి అవకాశం కలిగింది ఈ నా మదనపల్లి విద్యార్థి కాలంలోనే. శ్రీ శాస్త్రిగారి రచనలు చాలా వరకు వేదాంత దృష్టితో నుండేవి. మదనపల్లి కళాశాల అంటే మాతృమూర్తి అని బిసెంటుగారి విద్యాపీఠం. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా దివ్యజ్ఞాన ప్రపంచానికి దోవచూపుతూండే వాతావరణానికి అలవాటు పడటం అప్పటినుంచే. అంటే నా సాహిత్య పిపాసకు తిండిబెడుతూన్నది ప్రభాకర శాస్త్రిగారు. నా ఆత్మజిజ్ఞాసకు మేత బెడుతూన్నది శివరామశాస్త్రిగారు, నా బాల్యంలో శతావధానాల మూలాన ఆరాధ్యమూర్తులైన ఈ ఇద్దరూ ఈ రూపాన ఒక విధమైన నిద్రావస్థలోంచి మేలుగొలుపుతూ నన్ను నేను గుర్తించుకొనటానికి అంతులేని వూతనిస్తుండే వారని అనవచ్చు. జీవుడు అంత సులభంగా మేలుకొంటాడా? దానికి తగిన సమయం రావాలిగా........

మదనపల్లి చదువు ముగించటంతో, నా ఉన్నత విద్యాసాధనకు మదరాసుకు రావటం తప్పనిసరియైనది. మా కళాశాలపని 1918 స॥ ప్రారంభంలో తేనాంపేటలో, ఆ తరువాత కొంతకాలం కిల్పాకులో జరుగుతుండేది. ఆరోజుల్లో ఈ రెండు స్థలాలు ఉద్యానవనాలు. ప్రాచీనపు గురుకులాలని తమవిగా చేసుకున్న పరిసరాలు. ఇప్పుడో? ఉద్యానాలు కాలగర్భంలో చేరుకొని జనారణ్యాలకు తావునిచ్చాయి. కళాశాల పాఠాలు ముగియడంతో నా ధ్యాస ఆంధ్రపత్రిక కార్యాలయం మీద. ఆంధ్రపత్రిక నా బాల్యమిత్రం. వారపత్రికగా బొంబాయినుంచి వస్తున్నప్పటినుంచి ఆంధ్రపత్రిక విశాల ప్రపంచమంటే ఏమిటో తెలుసుకొనటానికి కనివిని ఎరగని అవకాశమిస్తుండేది. ఈ పత్రికే సాహిత్యలోకపు రుచులని చవిచూడటానికి అంతులేని అదృ

ష్టం ప్రసాదించింది. ఇంకో మాటలో నా ఆరాధ్య మూర్తులని గురించి మొట్టమొదట తెలుసుకున్నది ఈ పత్రిక కరుణాకటాక్షం మూలాన్నే. పత్రిక మదరాసుకు రావటం దినపత్రికగా మారటం, మన తెలుగుదేశ చరిత్రలో ముఖ్యంగా సాహిత్య ప్రపంచంలో అద్భుత సంఘటనలు. పత్రికకు తరుచుగా మా వూరి వార్తలను పంపటం మూలాన, సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలు వ్రాయటానికి ధైర్యం కలగటం మూలాన పత్రికాధిపతులు శ్రీ నాగేశ్వరరావుగారి పరిచయభాగ్యం సంపాదించుకొనగలిగా. 'నా తాడుతెగిన గాలిపటం' కాలంలో కొన్నినెలలు ఆంధ్రపత్రిక కార్యాలయంలో పని నేర్చుకొనటానికి పంతులుగారు అవకాశం ఇచ్చారు. ఆ సంబంధం నేను చెన్నపట్టణానికి అప్పుడు రావటంతో మరింత బలవత్తరమైంది. కళాశాల చదువు పూర్తి కావటంతో ప్రతిరోజూ గంటల పర్యంతం నా మకాం పత్రికా కార్యాలయంలోనే పంతులుగారు పత్రికకు సంబంధించిన కార్యకలాపం చూసుకొనటానికి. సాయంకాలమం దాకార్యాలయాన్ని పావనం చేయటానికి వస్తుండేవారు పూజ్యులు ప్రభాకరశాస్త్రి గారు. పంతులుగారికి ఆయన అంటే ఎంతో ఇష్టం. అంతేనా మరి? పంతులుగారి గురుదేవులు ఆయన. ఇంచుమించు ఒక గంటసేపు కూర్చుండేవారు. పంతులుగారు కూడా ఆయన వచ్చేసరికి తమ పని పాటలు ముగించుకొని, గురుదేవుల్ని తమ గదిలోకి ఆహ్వానిస్తూండేవారు. గురుశిష్యులు ఇహపర లోకాలకు సంబంధించిన విషయాలని తదేకంగా చర్చిస్తూండేవారు. ఆచర్చలలో పాల్గొనే స్థితిలో అప్పటికి లేకపోయినా, నన్నూ వారి దివ్యసన్నిధిలో కూర్చొనటానికి అనుమతి యిస్తుండేవారు. పంతులుగారు ఒక్క వ్యాపారస్థులేకాదు, పత్రికాధిపతులేకాదు. విజ్ఞానసర్వస్వం కూడా. గురుమూర్తులూ. ఆయనకు సరిసమానులే. నివురుకప్పిన నిప్పుకు మల్లె మరెంతో దివ్యశక్తి ఆయనలో వున్నా, ఆ రహస్యం ఇతరులకు ప్రకటించే తత్త్వం ఆయనది కాదు.....

పంతులుగారిని చూడటానికి అప్పటి సాహిత్యవేత్తలు దేశభక్తులేకాకుండా ''వేదాంతులు'' అని అప్పుడు అనుకుంటున్న తత్త్వవేత్తలు వస్తూ ఉండేవారు. తమ మాటామంతితో ఆయన్ని వలలో వేసుకొనటానికీ, అంతో ఇంతో ఆయన దగ్గర నుంచి చేజిక్కించుకొనటానికి! అలాటివారు పంతులుగారిని దర్శించటం ఒక్క ఆఫీసు వేళలోనే కాదు. ఇలాటి సత్సంగ సమయంలో కూడా ప్రత్యక్షమవుతూ వుండేవారు. అలాటివారి మూలాన గోష్ఠి తాత్కాలికంగా కట్టిపెట్టాల్సి వస్తుండేది.... .... ఇలాటి జీవనజ్యోతి సమావేశాలు నేను మదరాసులో ఉన్నంతకాలం జరగటం నాకు బాగా తెలుసు. నా కళాశాల చదువు పూర్తిచేసుకొనటానికి నాలుగు సంవత్సరాలు పట్టాయి. ఆ కాలంలో ప్రతిరోజూ కాకపోయినా అవకాశం దొరికినప్పుడల్లా వారి సన్నిధికి వస్తుండేవాడిని.

చిన్నప్పటినుంచ నా మానసిక తత్త్వం అవసరం వచ్చినప్పుడు తప్ప వయస్సులో నాకన్న పెద్దలయిన వారితో అనవసరంగా మాటామంతి సాగించకుండా వుండటం. ఈ సత్సంగం మూలాన గురువర్యులపట్ల నా భక్తి గౌరవాలు పొంగిపొరలిపోతూనే వున్నాయి. నా భవిష్యత్తుకు అవసరమైన సమయం రాకపోవటం మూలముననో, మరేకారణం చేతనో, అలాటి దివ్య సమయాల్లో ఆయన దివ్యవాక్కులు వింటూ తన్మయులై పోతున్నవారికి మల్లె ఆయన్ని ప్రశ్నించడం ఆ దివ్య కంఠంనుంచి వస్తుండే జవాబులకు మామూలు ధోరణిలో కృతజ్ఞత తెలుపుకొనడం చేయలేకపోయాను.......

సాహిత్య అభిరుచులు ఆనాటినుంచి పొం పొరలిపోతున్నాయి. ఒక్క ఆయన పత్రికలలో వ్రాస్తున్న వ్యాసాలనేకాక • అంతవరకు పుస్త

రూపంలో వస్తుండే రచనలూ నాకు తోడునీడగా నుండసాగాయి. పట్టభద్రుడయిన తరువాత అడయారు దివ్యజ్ఞాన కళాశాలలో అధ్యాపకుడుగా నుండగల అవకాశం కలిగింది. ఈబాధ్యతమూలాన ఆంధ్రపత్రిక కార్యాలయంలో అంతకు ముందుకు మల్లె పని చూసుకొనటానికి వీలుకాకపోయినా, పత్రికావాతావరణంతో నా సంబంధం వదులుకోలేదు. అవకాశంలభించినప్పుడల్లా పంతులుగారిని చూడటానికి వెళుతుండేవాడిని. అడపాదడపా శ్రీవారి దర్శనభాగ్యం కలుగుతుండేది,

కాలచక్రం దొర్లుకునిపోతూఉన్నది. నా విద్యాసంపత్తిని మరింత మెరుగుబెట్టుకొనటానికి నా విధి అనండి, అలాకాకపోతే మరోచక్కని మాటను ఉపయోగించండి ఇంచుమించు ఒక దశాబ్దం జర్మనీలో ఉండాలసివచ్చింది అక్కడి శార్మణ్యుల (మనకూ జర్మను పడింతులకూగల ఆధ్యాత్మిక సంబంధం మూలాన అక్కడి జర్మను సంస్కృత పండితులు శార్మణ్యులని పేర్కొనబడి అక్కడి వారిచేత గౌరవ మర్యాదలు పొందుతుంటారు) దివ్యసన్నిధిలో మన దేశంలో ఉన్నరోజులలో 'చిన్నచూపు' చూసుకున్న ఆధ్యాత్మిక విద్యపట్ల ఎంతో ఉత్సాహం చూపుతూండేవాడిని. ఇంతకుముందు మంచి ఆధ్యాత్మికగ్రంథమని వింటూన్న సీతారామాంజనేయాన్ని తెప్పించుకుని, జాగ్రత్తగా చదివి, ఇంగ్లీషులోకి అనువాదం చేయగలభాగ్యం లభించింది. అప్పటికి నా జర్మనుభాష తప్పటడుగులలో నుండటంమూలాన భారతశక్తిపట్ల ఎంతో వుత్సాహం చూపుతూఉన్న జర్మను మాతృమూర్తి ఒకరు జర్మనుభాషలోకి తెచ్చారు. మా యూనివర్శిటీ సంస్కృత పండితులు ప్రొఫెసరు చిమ్మరుగార్కి యోగవిద్యపట్ల ఎంతో అభిమానం. వేదపండితులుకూడా. నావేదపఠనకు శ్రీకారముచుట్టినవారు వారే. వారికి ఆధునిక భారత సాహిత్యవాహినులను తెలుసుకొనటానికి ఎంతో ఇష్టం. ఆ అవకాశం ఉపయోగించుకుంటూ, సంస్కృతాంధ్ర భాషలకుగల సంబంధ బాంధవ్యాలు తెలుపుతూ. ఈ విషయంలో మనవారిని వుత్తేజపరుస్తున్న మన గురువర్యులనుగురించి ఆయనకు చెప్పటానికి అవకాశం లభించింది. అక్కడ డాక్టరు పట్టము పుచ్చుకున్న తరువాత నా విశ్వవిద్యాలయ విద్యను కొంతకాలం సాగించిన ఏనావిశ్వవిద్యాలయంలో ఒక సంవత్సరకాలం ఆచార్యస్థానం అలంకరించే అవకాశం లభించింది. అప్పుడే మన సాహిత్య వీధులమ గురించి విద్యార్థిలోకానికి ఎన్నో వుపన్యాసాలు ఇయ్యగల అవకాశం కలిగింది.

జర్మనులకు, పాశ్చాత్యఖండంలోని ఇతర దేశాలవారికన్నా భారతభూమిపట్ల ఎంతో అభిమానము. వేదోపనిషత్తులను, యోగసాధనకు సంబంధించిన అమూల్యమైన గ్రంథాలను జర్మనుభాషలోకి తీసుకుని వచ్చారు. ఈ సంప్రదాయం తరతరాల నుంచి వస్తూనేవున్నది. మన దేశంలో మన ఇప్పటి పెద్దలకు తెలియని మన నిధులు, పూర్వపురోజులలో ఎలావున్నా, గత రెండు శతాబ్దాలనుంచి జర్మను భాషలో అతి సులభంగా లభిస్తున్నవి. ఇక తాళపత్రాలసంగతి మంత్రతంత్రాలకు సంబంధించిన అమూల్య రత్నాలు అన్నది గ్రంథాలయాలలో, ముఖ్యంగా బర్లిన్ విశ్వవిద్యాలయం పుస్తక భండారంలో మనం చూడవచ్చు. ఇలాటి సాధనలో భారతీయు లెవరైనా కూచుండటం విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారులు గుర్తించారా ఇంకేముంది, తమకు తెలియని తాళపత్రాలలోని, మంత్రతంత్రాలకు సంబంధించిన యంత్రాలని మన ముందుంచి వాటివివరాలు చెప్పమని ప్రాధేయపడుతూఉంటారు. వారి దృష్టిలో భారతభూమినుంచి పాశ్చాత్య ప్రపంచంలో అడుగుపెట్టిన ప్రతిభారతీయుడు పండితుడనే. మన సాహిత్యం మనకు కరతలామలకమని! అలాటి అగ్నిపరీక్షను నేనూ ఎదుర్కొనవలసి వచ్చింది. బర్లిన్‌లో నాకు కావలసిన సాహిత్య పరికరాలని సేకరిస్తున్నకాలంలో. అదేంఅద్భుతమో, ఆఅగ్ని

పరీక్షనుంచి బయటపడటానికి ఏదో దివ్యశక్తి నన్ను కారణ మాత్రుడ్నిగా చేసుకున్నది. అక్కడివారి కోరికలని తీర్చటానికి కనివిని ఎరగని అవకాశం ఇచ్చింది. అప్పుడు ఈ ‘మాయా’శక్తిని అర్ధం చేసుకొనలేకపోయాను....

తిరిగి మాతృభూమిని చేరుకున్న తరువాత, పూర్వపురోజులకన్నా, గురుదేవుల దివ్యశక్తి అవగాహనం చేసుకొనటానికి ఆయనే ఎన్నెన్నో రూపాల్లో దోహదమిస్తూఉండేవారు. అప్పటికి మల్లె ఇప్పుడు పదేపదే కలుసుకొనటానికి అవకాశంకలిగిందికాదు. అయితేనేం, ఆయనే తమ కరుణాకటాక్షాన్ని ఈ సాధకునిపట్ల ప్రసాదిస్తున్నారని మళ్ళాచెప్పటం అనవసరం.... అప్పుడు వారు తిరుపతిక్షేత్రంలో ఉంటూ అన్నమాచార్యుల దివ్యగానానికి దానికి సహజమైన రూపలావణ్యాలు ప్రసాదిస్తూ మనవారిని వుత్తేజపరుస్తూ ఉండేవారు. గురువర్యులు ప్రచురించిన ఆవాఙ్మయం, నాకూ ఎంతో వూతనిచ్చింది తెలిసో, తెలియకనో, ఎన్నుకున్న దోవలో సూటిగా నడవటానికి. రాయపేటలో అప్పుడున్న దేవస్థాన మదరాసు కార్యాలయం నాకు దోహదమిచ్చింది. ఇంతవరకు గురుమూర్తుల సాహిత్య రచనలు చూడటం ఒక ఎత్తు. ఈ సేవ సాహిత్యలోకానికి సంబంధించింది అయినా సహజసంపన్నమైన ‘‘కవి’’ లోకానికి దోవచూప నారంభించింది.

అలాటి సమయంలోనే శ్రీవారు కొద్దిరోజులు మదరాసులో ఉండటం తటస్థించింది. వారిమనమడు డాక్టరు రామచంద్రరావుగారి పుత్రుడు, మా విద్యాలయంలో చదువుతూండేవాడు. ఆ అబ్బాయి చదువుసంధ్యలనిగురించి తెలుసుకొనటానికి ఒక రోజున డాక్టరుగారు మాఇంటికి వచ్చారు. వారి వెంటవచ్చిన వారు మన ఆచార్యదేవులు. నా ఆనందానికి ఇక పట్టపగ్గాలులేవు. వారి ధ్యాసంతా వాళ్ల పిల్లవాడినిగురించి తెలుసుకొనాలనే .... ఇక నా సంగతా? నా మనోప్రపంచంలో పూర్వకాలపు పరిసరాలకు లాగుకుని పోవటం ఎలా మరచిపోతా. శ్రీవారు మా దగ్గరనున్న అర్ధగంట కాలంలో. దేశకాల పరిస్థితులలో కలుగుతుండే మార్పుల మూలాన అవి అన్నీ కలలుగా కనబడుతూఉన్నా. - మన కలలని మేలుకొనటంతో మరచిపోవటం మనకు పరిపాటి అయినా వాటికి దోహదమిస్తూన్న దివ్యశక్తిని మనం విస్మరించాలని నాటకమాడుతున్నా, ఆతల్లి మనలని ఎన్నోరూపాల్లో ఆదుకుంటుండటం ఆమె తత్త్వంగా .... ఆయనకు తెలుసు. స్పష్టంగా తెలుసు ఈ జిజ్ఞాసువు ఎవడే? ఆ వ్యక్తి తనని తాను గుర్తించటం అవసరం. అది ప్రకృతిసిద్ధం. అంతవరకు ఆయన తన సహజప్రపంచంనుంచి తన పని తాను చూసుకుంటారుగా....

ఆ తరువాత చీకట్లు. ఆ చీకట్లనుంచి వెలుగు దాని దోవలో అది దూసుకుని రావడం .... తిరిగి పాశ్చాత్య ప్రపంచానికి వెళ్లాలసివచ్చింది అక్కడి శార్మణ్యుల కోరికమీద. సంవత్సరం పైగా మాతృదేశపు భౌతిక పరిసరాలకు దూరం కావలసివచ్చింది అక్కడి పని ముగించుకుని తిరిగిరావటంతో ప్రభాకరులు. భౌతికదేహం వదలిపెట్టి వెళ్లటం సింది. ఇప్పుడు నా తాపత్రయం ఆయన రచనలని మరింత శ్రద్ధతో చదివి అర్ధం చేసుకొనాలని. ఈ సందర్భంలో నాయీ కోరికని తీర్చినవారు తిమ్మావఝ్ఝల కోదండరామయ్యగారు. ఆ రోజులలో కోదండరామయ్యగారు తండియారుపేటలో త్యాగరాజ కళాశాలలో అధ్యాపకులుగా ఉంటూండేవారు. వారు వ్రాస్తుండే వ్యాసాలు చదువుతున్నా. ఆయన గురుదేవుల శిష్యకోటిలోని వారని నాకు తెలియదు, మా విద్యాసంస్థలో పనిచేస్తున్న వారు ఈ రహస్యం వెల్లడిజేస్తూ స్వయంగా నన్ను ఆ పండితుల ఇంటికి తీసుకుని వెళ్లారు. ఎంతో ఆదరంతో నన్ను లోపలికి తీసుకునివెళ్లి. గురువర్యుల రచనలని నాకుచూపారు.

కావలసిన వాటిని తీసుకుని వెళ్లవచ్చని ఆదేశించారు. అన్నీ సాహిత్య రచనలే. వాటినే ఎంతో వుత్సాహంతో చదువుతూ, నా పాతలోకపు దోవలకు మంచి పునాదులు వేసుకొనగలిగాను....

లౌకికదృష్టితో సింహావలోకనం చేశానా ఈ జీవితపు రథం ముందుకు కదలించటానికి కావలసిన హంగులు కరతలామలకంగా నున్నాయి. ఆ స్థాయితో తృప్తిపడటం నా తత్త్వం కాదు చిన్నప్పటి నుంచి. ఊహ వచ్చినప్పటినుంచి ఆధ్యాత్మిక దృష్టితో చూడనీయండి నా బాల్యం నుంచి నా మనోవీధుల్లో తావు చేసుకొనటానికి సతమతమవుతున్న మత పరిభాషలో చూశాననుకొనండి, ఆ రోజులలో మా పరిసరాలలో మమ్మల్ని ఒక వూపు వూపుతున్న క్రైస్తవమార్గం ఒకవైపున, బ్రహ్మ, ఆర్య సమాజాలు మరొకప్రక్కన, దివ్యజ్ఞాన ప్రపంచం వేరొక వంక ఊతనిస్తుండేవి. వాటి ఆదర్శాలకు ఆశయాలకూ అంతవరకు నాకు అర్థమవుతుండే భారత శక్తికీ ఎలాటి తేడా కనబడుతుండేది కాదు. పరమేశ్వరుని యీ వివిధరూపాలకు ముగ్ధుడ్నవుతున్నా, నా 'వేషభాషల'కు ఒక నమస్కారం పెడుతూ ఆయుద్యమాల నాయకులు నా భవిష్యత్తుకు అన్నివిధాలా శ్రేయస్కరమని గీసే గీతలలో నడవటం సుతరాం నా జీవనమార్గానికి సరిపడుతుండేది కాదు. అయినా ఒక విశ్వాసం. నమ్మకమూ ఉండేది నేను ఒక యాత్రికుడనని. ఇలాటి యాత్రలని సాగించటం ఈ జన్మలోనే గాదు, పూర్వజన్మలు అనేవి ఎన్నో ఉన్నాయని, వాటిలో ఇలాటి ధర్మమార్గాలకు అవినాభావ సంబంధం ఉండేదని అదే ఈ జన్మలో కూడా ఇలాటి తత్వమార్గాలనుంచి అంతో ఇంతో తెలుసుకొనడం అవసరమనే పట్టుదల నన్ను సడలించేది కాదు. మన సాహిత్య సాధన దోహదమిచ్చేదికూడా ఈ రాజమార్గం చక్కగా అర్థము చేసుకొనమనే.

ఇలాటి సమయంలో గురుదేవుల చిన్న అల్లుడిని విధివశాత్తు కలుసుకొనే అదృష్టం కలిగింది. అదీ ఒక ఆధ్యాత్మిక సమావేశంలో. మదరాసులో యోగమందిరం ప్రారంభోత్సవ సమయంలో. నా ప్రక్కనే కూచుని ఉన్నారు. అంతకుముందు జిల్లెళ్లమూడి మాతృమూర్తి మదరాసులో మకాం చేస్తున్న సమయంలో దూరంనుంచి చూసిన వ్యక్తే. అంచేత నేనే పలకరించా. 'అరవతెలుగు' మాట్లాడుతూ ఎంతోకాలంనుంచి మేమిద్దరము ఆప్తులమైనట్లు ఆ మందిరం విశిష్టతను గురించి ఎంతో చెప్పుకొని పోయారు. అంతేనా మరి. తను గురుదేవుల అల్లుడనని తను ఉంటున్నది పుదుచ్చేరి అని చెప్పారు. ఆమాటతో ఒక్క పుదుచ్చేరి దృశ్యాలేగాక ఆరు దశాబ్దాలనుంచి గురువర్యులని గురించి నేను విన్న సంగతులు, తరువాత తరువాత ఆయనకూ ఈ దాసానుదాసుడికి గల సంబంధ బాంధవ్యాలు నా మనోపథంలో ఓపళాన దొర్లుకుని పోసాగాయి. లౌకిక విషయాల్లో రామమూర్తిగారు బాగా ఆరితేరినవారైనా వారిలో ఆధ్యాత్మిక చింతనం గమనిస్తూ ఆనందించసాగా. పుదుచ్చేరికి పదేపదే నాయాత్రలో చేరుకొనటం మాతా అరవిందుల దివ్య వాతావరణంలో కాలం గడపటం పరిపాటి. ఈ దఫా అక్కడికి వచ్చినప్పుడు ఆయన్ని తప్పక కలుసుకొంటానని చెప్పా............

ఆ అవకాశమూ కలిగింది. ఆ సంవత్సరంలో కాకపోయినా మరి కొంతకాలానికి. రామమూర్తి ఆరోజుల్లో తమ లౌకిక వ్యవహారాలని చక్కబెట్టుకొనటానికి విజయవాడ హైదరాబాదులకు వెళ్ళివున్నారు........ నన్నూ లోపలికి. ఎంతో ఆప్యాయంతో ఆహ్వానించినారు గృహలక్ష్మి. గురుదేవుల కుమార్తెగారు, వారిపిల్లలు. గురుదేవుల రచనలు ఏవైనా వారిదగ్గరవున్నాయా అని ప్రశ్నించటంతో ఆ తల్లి ''ప్రజ్ఞాప్రభాకరం''నిడుబ్రోలు యోగ సోదరులు ప్రచురించిన ''భృక్తరహిత తారకయోగము''

ప్రతులని ఇచ్చారు. అవి నాతరువాతి జీవన మార్గానికి దివ్యజ్యోతులనే అనవచ్చు........

మనం యాత్రికులంగా ఆ పరిసరాలని ఈ పరిసరాలని చూస్తున్నకాలంలో ఎన్నెన్నోవింతలూ విశేషాలూ వింటూంటాం. అవన్నీ ఒక దృష్టితో చూస్తుంటే సినిమా చిత్రాలకుమల్లె వుంటాయి. తాత్కాలికంగా ఆవేశపరులమవుతుంటాం. కాని కొన్ని కొన్ని మన మనోప్రపంచాలలో తావుచేసుకుని తిష్ఠవేసుకుని కూచుండటానికి ఎంతోకాలము పడుతూంటుంది. ఇతరుల సంగతి ఎలావున్నా తెలుగువారు స్వభావరీత్యా ఆధ్యాత్మికచింతన గలవారు. లౌకికసమస్యలనూ ఆ దివ్యదృష్టితో గమనించటం తరతరాలనుంచి వారికి పెట్టినదిపేరు. ఆ సాధనకు అంత సులభంగా సమకట్టుకొనటానికి మన ఇంటి వాతావరణంమూలాన నైతేనేం పరిసరాల ప్రాబల్యంచేత నైతేనేం తాత్సారం చేయటం మనకు బాగా అలవాటయిపోయింది. ఈ ఏడు దశబ్దాలనుంచి ప్రత్యక్షంగానైతేనేం పరోక్షంగానైతేనేం మనవారి వివిధ దశలతో నాకూ అంతో ఇంతో సన్నిహిత బాంధవ్యం ఉన్నది....

అప్పటినుంచి ఏదోరూపంలో గురుమూర్తుల దివ్యశక్తిమూలాన ఉత్తేజవంతుడనవుతూ ఆయన రచనలమూలాన ఆంధ్రపత్రిక కార్యాలయంలో నాకు లభించిన సత్సంగంతో నా సాహిత్య అభిరుచులతో సహజసంపన్నమైన భోజనమజ్జనాదులవి సంపాదించుకున్నా. తమ యోగప్రపంచాన్ని గురించి అప్పటి రచనలలో, సత్సంగసమావేశాలలో ప్రస్తావించినవారుకాదు. కారణాలు అర్థం చేసుకొనటానికి తగిన తరుణం రావాలిగా, ఆ దివ్యవాతావరణాన్నే శ్రీ వారి కుమార్తెగారు ఈ పుస్తకాలద్వారా నాకు అందజేశారు. అంతకన్నా స్పష్టంగా చెప్పాలంటే ఆ తల్లిగారు కారణమాత్రులయ్యారనే అనవచ్చు.

మాస్టరు సీవీవీ గురుదేవులని పాశ్చాత్య ప్రపంచములో అడుగుబెట్టటానికి ముందే విన్నా ఆ చెవిలోనుంచి ఈ చెవిలోకి దూసుకుని దాని దోవన మాయమైందనవచ్చు. అలా జరగటం కొంచెం దూరదృష్టితో ఆలోచిస్తే మన భవిష్యత్తుకు మంచిదే అనుకుంటా. తిరిగి మాతృభూమికి చేరుకున్న తరువాత ప్రొఫెసర్ పోతరాజు నరసింహంపంతులుగారు అడపాతడపా మమ్మల్ని చూడటానికి వస్తుండేవారు. వారి శిష్యులు జీ.వీ. సుబ్బారావుగారు. అడయారులో ఉన్న దశాబ్దికాలం సుబ్బారావుగారు మా కళాశాలకు అధ్యక్షులు. మదనపల్లిలో ఆయన శిష్యుడ్ని. నరసింహంగారు మమ్మల్ని చూడటానికి వస్తున్న సమయాల్లో ఆ గురుశిష్యబాంధవ్యం గురించే మాట్లాడుకుంటూండేవారం. మాస్టరు సీ.వీ.వీ దివ్యజ్యోతి ప్రస్థావన వస్తుండేదికాదు, మరొక సాధకులు న్యాయవాది చంచయ్యగారు. ఆయనే అప్పుడప్పుడు మాస్టరుగారిగురించి చెబుతూ ఉండేవారు. పుట్టిపెరిగింది సనాతనమైన హిందూకుటుంబంలోనైనా క్రీస్తుప్రభువు దివ్యమార్గానికి విద్యార్థిదశలో ఆకర్షింపబడినవారు. మంచి సాధనచేసి ధన్యులయినవారు. మనం సాధారణంగా కలుసుకుంటూండే క్రైస్తవులు ఒక ఎత్తు. చెంచయ్యగారి జీవనమార్గం ఒక ఎత్తు. అనుష్ఠాన కైస్తవులంటే ఆయనకే ఆ గౌరవము పూజ్యత చెందుతుంది. ఆయన జీవించి వున్నంత కాలము ఆయన సన్నిహితభాగ్యం సంపాదించుకున్నవాడిని. అడపాతడపా తమ గురుదేవులని గురించి చెబుతూండేవాడు. తను ఆయన్ని గురించి కూర్చిన రచనలు నాకు చదివి వినిపిస్తూ ఉండేవారు. ఎందరో మహానుభావులు. అలాటి శ్రేణికి చెంది భారతదేశపు పేరు ప్రతిష్ఠలు నిలిపిన మహానుభావులు మాస్టరుగారిని స్మరిస్తూ తృప్తి పడుతుండేవారు. ఆ వాతావరణం క్రైస్తవమార్గంలోని లోతుపాతులు క్షుణ్ణంగా అవగాహనం చేసుకొన్న మహాపెన్నిధిగా నాదిగా అయిపోయింది. అదేం మాయో అప్పటికి దాంతోనే

తృప్తిపడాల్సివచ్చింది. మరికొంతకాలానికి ఎవరో చెప్పారు, పత్రికలలో కూడా చదివా.ఏదో విలాసము తెలుసుకొని పూజ్యులు నారాయణఅయ్యరు గారి ''న్యూయోగ'' తెప్పించుకున్నా. అప్పటి నా వ్యాపకం మూలాన్నో, మరేకారణంచేతనో,దీనిలోని విషయాలు అయోమయంగా నుండేవి. అంచేత అప్పటికి ఆ రచన నా పుస్తక భాండాగారంలో ఒక మూల అజ్ఞాతావస్థలో తలదాచుకోవాల్సి వచ్చింది. తరువాత తరువాత నేను సేకరించిన ఆధ్యాత్మిక విజ్ఞాన గ్రంథాల్ని ఒక ఆశ్రమానికి ఇస్తున్న సమయంలో, ఆ రచనకూడా వాటివెంట తరలిపోయింది.

సాధకులు వేంకటరమణారావుగారు నాకు బాగా తెలిసినవారు. వారు బొంబాయిలో నివసిస్తున్న కాలంలో కొంతకాలం వారి అతిథినిగా ఉండగల భాగ్యం నాకు లభించింది. సీ.వీ.వీగారి ప్రియశిష్య కోటికి చెందినవారు. వారికి నాడీశాస్త్రమంటే పంచ ప్రాణాలు లేచివస్తాయి. ఆ రహస్యాలే నాకు చెబుతూ జ్యోతిషశాస్త్రాన్ని విశాలదృష్టితో అర్థం చేసుకొనటానికి ఎంతో సహాయం చేశారు. అలాటి సమయంలో కూడా సీవీవీ మాస్టరువారి దివ్య ప్రపంచంలోకి దోవ వెతకటానికి ఉత్సాహం చూపిన వాడినికాను.

ఊఁ! తరుణం రావాలిగా! ప్రజ్ఞాప్రభాకరం ఆ తరువాత మనోవాక్కాయాలతో గుర్తించటానికి కనివిని ఎరగని అవకాశం ఇచ్చిందని చెప్పటం అవసరం లేదనుకొంటా. అప్పటినుంచి నా కోరిక, నా దీక్ష మాస్టరుగారి దివ్యలోకానికి సంబంధించిన వాతావరణం నాదిగా ఎన్నుకొనాలని....

ఈ దీక్షాప్రపంచం పునాదులు అంతు పట్టటానికి మనలోనున్న శక్తుల్ని మన మనోవాక్కాయాలు ఉపయోగించాలి. మనపెద్దల నుంచి మనము నేర్చుకొనటం, ఒక జన్మలో ఈ కార్యం సాధించటం, అంత సులభం కాదనీ, అంచేతనే ఎన్నెన్నో జన్మలు మనకు ప్రసాదింపబడ్డాయని, వాటిని మనం ఉపయోగించుకొనాలనీ పెద్దలు చెబుతూ ఉన్నారు.ఈ జన్మలు ఏరూపాల్లో వెలుస్తుంటాయి అన్న ప్రశ్నకు ఇతరులు ఎలాంటి అర్థం చెబుతున్నా, ఆ పెద్దల మాటలకు గౌరవం చూపుతూ ఆ గుట్టు తెలుసుకొనటానికి మన స్వశక్తిని నదురూబెదురూ లేకుండా ఉపయోగించుకొనటానికి మనము నడుము కట్టుకొనాలి.మనవారు మనల్ని యాత్రీకులనటం తీర్థయాత్రలు సాగించటం మనకర్తవ్యమని తెలపటం కోసమే. ఈ దేవ రహస్యం మనం అర్థం చేసుకొనటానికే! ఆ దృష్టితో నన్ను నేను పరీక్షించుకుంటే నాకు అవగాహన మయింది ఈ జన్మలోనే ఎన్నెన్నో జన్మలు ఎత్తాననీ వాటిని నిలువబెట్టుకొనటానికి భగీరథ ప్రయత్నాలు చేశాననీ ప్రళయాలు ఎన్నో ఎదుర్కొన్నానని బ్రహ్మాండమైన ఈ తీర్థయాత్రలో నా గమ్యస్థానపు వాతావరణం చూపటానికి ఈరచన చేసిన సహాయం ఎలామరచిపోగలుగుతాను....

క్రిందటి సంవత్సరమే ఈ నాతీర్థయాత్రలో, అంతేకాదు ఈ నా జన్మజన్మల జీవిత రహస్యాన్ని అర్థం చేసుకొనటానికి అనుభూతిని ప్రసాదించిన శుభకాలం. మామాతృమూర్తి జిల్లెళ్లమూడి అమ్మను గురించి వినినప్పటినుంచి ఆ తల్లిని ప్రత్యక్షంగా చూడాలనే కోరిక నాలో రేకెత్తసాగింది. ఒక రోజున వారిని దర్శించటానికి మదరాసు నుంచి వచ్చాను. అక్కడ వారి సన్నిధిలో ఉండటం కొద్ది గంటల కాలమే. అలామూడుసార్లు జిల్లెళ్లమూడికి వెళ్లే అదృష్టభాగ్యం కలిగింది. ఆ సమయాల్లో ఆ అర్కపురంలో ఉండటం రెండుమూడు రోజులు మాత్రమే. మా మదరాసు సోదరీ సోదరుల కోరిక మీద చెన్నపట్టణానికే వచ్చి కొద్దివారాలు మా దగ్గరే వున్నారు. మా జీవిత గమ్యస్థానం గుర్తించటానికి తప్పనిసరిగా కావలసిన వాతావరణాన్ని సృష్టించారు. ఆమె వెంట రమణాశ్రమ అంతేవాసుల్ని జగద్గురువు శ్రీ కామకోటి ఆచార్యదేవుల్ని దర్శించగల

బ్రహ్మాండమైన అవకాశాన్ని మాకు ప్రసాదించారు. అప్పటినుంచి నాలో అంతూ పంతూ లేకుండా రేకెత్తుకొని వస్తుందే ఆశ ఆతల్లి దివ్యసన్నిధిలో అధమము ఒక వారంరోజులైనా ఉండాలని!

'అలాటి అవకాశం లభించడానికి ఎంతో కాలం పట్టింది........

ఈ కాలంలో కనివిని ఎరగని బాధలు, శారీరకంగా మానసికంగా ఎదుర్కొనాల్సి వచ్చింది! ఇవన్నీ ఇలావున్నా ఆ శక్తి అలాటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా నా తీర్థయాత్రకు ఎలాటి ఆటంకం, అవాంతరం కలిగించలేదు. వయస్సులో ఎనభయి నాలుగో మైలురాతిని దాటబోయే సమయం. ఆరోగ్యం అంత మంచిదికాదు. మా పిల్లల కోరిక ఇంటినుంచి కదలకూడదని. అయినా ఏదో బ్రహ్మాండమైన అదుర్దా ఆ తల్లిని చూడాలని......... ఇంట్లో చెప్పి వచ్చింది వారంరోజులు ఉంటానని. ఆ తల్లి సన్నిధి చేరుకొనటం తరువాయి, కాలచక్రపు కార్యకలాపాన్ని మరచిపోయా........

ఆరోజులలో నా సాధన గురుదేవుల రచనల్ని మరొకసారి చూడాలని! మారామమూర్తి దంపతుల మూలాన లభించిన ఆధ్యాత్మిక గ్రంథాల్ని అప్పుడు చదివా. తృప్తిపడ్డా. జిల్లెళ్లమూడి కళాశాలకు సమర్పించుకున్న గ్రంథములతోపాటు, అమ్మ సన్నిధిలో ఉన్నవారు చూడటానికి సవ్యంగా ఉంటుందనే తాపత్రయంలో గురుదేవుల రచనలమూ అక్కడికి పంపుకున్నా,..........ఇప్పుడు అక్కడికి రావడంతో మరొకసారి చూడాలని వాంఛ కలగడం ప్రజ్ఞాప్రభాకరంమీదా! నిడుబ్రోలు తారక మండలి వారు ప్రచురించిన గ్రంథంమీదా. ఈ రెండూ మదరాసులో నన్ను ఎలా హత్తుకున్నాయో పాఠక మహాశయులకు, ఇంతకు ముందే విన్నవించుకున్నా. ఆ ఘట్టం ఒకఎత్తు. వాటిలో నిబిడీకృతమైన విద్యుచ్ఛక్తి ఇప్పుడునాలో చేస్తున్నపని ఒకఎత్తు. మనవారు అంటుంటారు. జీవుని అంత్యదశలో భూతభవిష్యద్వర్తమాన కాలాలలోని కార్యకలాపాల చిత్రాలుకళ్లకు కట్టినట్లు కనబడుతుంటాయని వాటిని తదేకదృష్టితోచూస్తూ, కన్నీరుకారుస్తూ కళ్ల మూసుకుంటారని ....మనవారు అలాఅనటంలో ఎంతోఅర్ధముంది. ఈగ్రంథాలుచూస్తుంటే నన్నుకలవరపెడుతున్నబాధఅదే. ప్రభాకరులు తమదివ్యప్రభాకర శక్తులు అర్ధంచేసుకొనడానికి అప్పటి 'తమ' రచనలద్వారా నాయౌవనకాలంలో అంతులేని అవకాశం ఇచ్చారు. తమసత్సంగంలో పాలుపంచుకొనటానికి దారిచూపారు. దశాబ్దాలు దొర్లుకొనిపోయాయి. ఒకటా రెండా ? ఇప్పటి మన లెక్కప్రకారం ఏడు పూర్తిఅయ్యాయి. ఆరోజులలో మేలుకున్నానని ప్రగల్భాలు పలకడమేకాని, ఈ దాసుడు ఉండిపోయింది 'నిద్రాణం' లో. ఆయన పట్ల భక్తిగౌరవాలు సంతరించుకున్న వాడినికాను. ఈభాగ్యంతో మాస్టర్ సీవీవీ గారిని గురించి వారి దగ్గరనుంచి వీరిదగ్గరనుంచి తెలుసుకున్న రహస్యాలు నన్ను ఆదివ్యలోకానికి చేర్చాలని దోహదమిస్తూ ఉన్నా ఆ సంత్సంగానికి చెందిన ఇతర సాధక సోదరులకుమల్లె అంతవుత్సాహాన్ని చూపినవాడను కాకపోతిని.

అమ్మ జగదేకమాత. పెద్దలూ, పిన్నలూ ఆతల్లి బిడ్డలు. గారాబుబిడ్డలు. వారి నందరినిలాలించి పాలించి వారివారి మార్గములలో నడపడం ఆ మహాతల్లికి పెట్టిందిపేరు. ఇలా చేయమని అలా చేయమని పురమాయించే తత్త్వం ఆతల్లిదికాదు. ఆ మాతృమూర్తి పసరాల శక్తి బ్రహ్మాండమైంది. ఉపన్యాసాలు ఆమెకు గిట్టవు. ఉపదేశాలు మాటామంతితో చేయదు. అంతా మౌనమే. అదే అద్భుతంగా మనలో దానిపనిని అది చక్కబెట్టుకొంటుంది. అలాటి దివ్యవాతావరణంలో పూజ్యులు ప్రభాకరశాస్త్రిగారిని గుర్తించటంలో నా యీ తీర్థయాత్రలో అత్యద్భుతమైన ఘట్టం. పూజ్యపాదులు

సీవీవీగారి ధర్మమార్గం తెలుసుకొనటానికి దోవ చూపినవారు ఆ పుణ్యమూర్తులే ఈ రూపంలో....

అంతటితో ఈ ఘట్టం ముగిసిందికాదు..... జిల్లెళ్ళమూడి కళాశాలకు సంబంధించిన గ్రంథాలయం ఆద్యంతాలు లేనిది. మాతృమూర్తి దివ్యతత్త్వం మల్లె. ఈ కృషికి దోహదమిచ్చివ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, అధ్యాపకులు నిజంగా ధన్యులు. జీవితపర్యంతం గ్రంథాలయ పరిసరాలలోనే కూచొని అక్కడి సరస్వతీదేవిని ఆరాధిస్తూ ఈ జన్మని ఉత్తేజపరుచుకుంటూ ఉండవచ్చు. ఒక రోజున నా దృష్టిని ఆకర్షించినవి మాస్టరు ఈ.కే. గారి రచనలు. ముఖ్యంగా సీవీవీ గారిని గురించి ఆయన రచించిన గ్రంథం. ఆధ్యాత్మిక దృష్టితో ఆంధ్ర భాగవతానికి ఆ మహనీయుడు ఉత్త, అర్థ తాత్పర్యాలతోనే కాకుండా ఇంతవరకు తెలుగువారు సాధించలేని వ్యాఖ్యానం అందజేయడం. అప్పటికి ఎనిమిది సంపుటాలు వెలువడ్డాయి.

డాక్టరు ఈ. కృష్ణమాచార్యులవారిని గురించి మా సోదరులు నేను కలకత్తాలో ఉన్న రోజుల్లో ఎంతో చెప్పారు. జిల్లెళ్ళమూడిలో ఆయన్ని గురించి చెప్పుకొనటం విన్నా. కాని ఇప్పుడు ఈ రచనలు ఆయన ప్రపంచంలో ప్రవేశించడానికి చేసిన సహాయం ఎలా విస్మరించగలుగుతా?

ఇలాటి మహనీయులకు మన భారతభూమి అనాదినుంచి పుట్టిన యిల్లు. లాలించి పాలించిన దివ్యక్షేత్రం. ఆనాటి ఉపనిషద్ వాక్యాలు సృష్టించినవారు, మనోవాక్కాయాలతో తు.చ. తప్పకుండా ఆచరణలో బెట్టినవారు ఈ దివ్యపురుషులే. పరబ్రహ్మస్వరూపులు వారుకాక మరెవరవుతారు. వారి కాలంలో ఇప్పుడు మన్నము మనలోకం ఇది అనిపి. దాని చుట్టూ కట్టుకొన్న ప్రహరులు కలికానికైనా కానరావు. అంచేత ఇటు లౌకిక విషయాల్లో అటు ఆధ్యాత్మిక విషయాలలో వారి మనోవాక్కాయాలు సంకుచితాలు కావు. దేశ కాలపరిస్థితులలో పదేపదే మార్పులు రావటంతో మన దివ్యనిధులకు మనకు నచ్చిన నామరూపాలనిస్తూ ప్రధానాశయాలని విస్మరిస్తున్నాం. ఇది నిజంగా కలియుగమే. ఆకలి పురుషుని అతని హద్దుపద్దులలో నుంచటానికి తగినవారు అవసరం. సీవీవీ ఆచార్యదేవులు తమ "నూతనయోగం" మూలాన, మనకు నచ్చజెప్పటం మనలోనున్న "మనల"ని గుర్తించటానికి మన శక్తుల్ని సదురూ, బెదురూ లేకుండా ఉపయోగించమని, మనలోనున్న ఈ దివ్యరహస్యం మనకు కరతలామలకం చేయటం తమ బాధ్యత అని, అన్ని కాలాలలో ఈవిషయంలో మనకు చేదోడువాదోడుగా నుండటానికి సిద్ధంగా నున్నానని మనకు అభయహస్తమియ్యటం ఆ ఆచార్యమూర్తిలో నున్న విశిష్టత.

ఈ దివ్యశక్తిని తెలుగు ప్రపంచానికి అందజేయడానికి ఈతరంలో నడుము కట్టుకున్న దివ్యమూర్తులు ప్రభాకరశాస్త్రి గురుమూర్తులు. కవి కుమారుడు యోగమూర్తి అనే వేదవాక్కును తమ జీవితంలో సార్థక పరచారు. అందుమూలానే సీవీవీ ఆచార్యుని యోగసాధన పలువృక్షపు వేళ్ళకు మల్లె అన్ని దిక్కులకు వ్యాపిస్తుండుట మన అదృష్టము. ఇంకోమాటలో ప్రభాకరమూర్తి తన ప్రభాకరశక్తితో 'తెరను' తీశారు. ఇంకలోపలి దివ్యశక్తుల్ని మనవిగా చేసుకొని లోకకళ్యాణానికి ఉపయోగించుకోడానికి తోడునీడగానున్నవారు మాస్టర్ ఈ.కే గారు.

మాస్టర్ సీవీవీ లోకానికి నాయీజీవితంలో ఈమూలాన మార్గదర్శకులైన ఈయోగ ప్రతినిధులకు కృతజ్ఞుణ్ణి. ఇకముందు వారి దివ్యశక్తులను ఉపయోగించుకుంటూ ముందు నాయాత్ర సాగించడం నా ధర్మము; నాబాధ్యతకూడా. జిల్లెళ్ళమూడిలో మాతృమూర్తి దివ్యసన్నిధిలో ఈ అరుణోదయం కావటం నా అదృష్టం.

నాతీర్థయాత్ర ఇప్పుడు ఇంకముందు నిర్విఘ్నంగా, ఏరూపాననైతేనేం జయప్రదంగా సాగించుకొనటానికి ఈ పుణ్యపురుషులు నాకుతోడు నీడగా నుండగలరనే రహస్యంనాకుతెలుసు.

* * *

శుభాశంసనము

[1944, మార్చి 13వ తేదీ శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వారి సోదరులగు డా॥ శంకరశాస్త్రిగారికి వ్రాసిన పోస్టుకార్డులోని కవిత—సం॥]

దారుణంబగు యుద్ధతంత్ర మంతరితమై
        ధర్మపక్షమున కుద్యజ్జయము సమకూరి
ఆరోగ్యభాగ్య శాంత్యానంద విజ్ఞాన
        పారమ్యముల నెల్ల ప్రజలుఁబరితోషపడి
తారణాబ్దమునందు ధరణీతలంబీశ్వ
        రారాధనోత్సాహమందుఁగా కందు మన
తీరుముందటిదిగాఁ దేజరిల్లునుగాక
        దినదినము శుభములందికొనఁ కందుముగాక.

వే. ప్ర.

యోగవిషయము

(ఉపన్యాసము)

-వేటూరి ప్రభాకరశాస్త్రి

[1947 ఆగస్టు 3వ తేదీ సాయంకాలను ప్రార్థనాంతరము యోగ మిత్ర గోష్ఠిలో గురుదేవు లొసగిన ఉపన్యాసమిది. ఈ ఉపన్యాస పాఠమును లిఖించి నకళ్లు తీసి యోగమిత్రులు మరికొందరికి పంపినవారు శ్రీ శాస్త్రిగారి శిష్యులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు. తామందుకొన్న ఈ ఉపన్యాస పాఠమును దయతో మాకు పంపినవారు శ్రీ కొత్త వేంకటేశ్వరరావుగారు. ఇట్టి ఉపన్యాసములు మరికొన్నిటిని, 1939-50ల నడుమ గురుదేవులు వారికి వ్రాసిన లేఖలను ఏబదింటికిపైగా వారు మాకు పంపినారు. అందుకు వారికి మా కృతజ్ఞతలు— సం॥]

నేనిక్కడనుంచి మదరాసుకు వెళ్లక పూర్వము శాఖ. బాపట్లలకు వ్రాసిన ఉత్తరముల ప్రకారము ద్రాసులో మాతృశ్రీ[1] వారిని చూస్తానని అనుకొన్నాను. నేను 30వ తేదీకి మదరాసు చేరినాను. అంతకు పూర్వమే వారు ఒకనాడు మాత్రమే 28 వ తేది మదరాసులో నుండి కుంభకోణము వెళ్ళినారట. వారు 27 సాయంకాలానికి నారాయణయ్యర్ వగైరాల అనారోగ్యముచే అక్కడ ఉండడము కష్టముగాతోచి మరురోజు పి.యన్.[2] గారింటికివెళ్ళి అక్కడ ఆయన మాటాడలేని స్థితిలో (నాలుక తడబడి) ఉండడంచేత అంతా అశాంతిగా ఉన్నది నాకేమిబాగాలేదు కావున కుంభకోణమునకే వెళ్లిపోవుచున్నానని నాడే కుంభకోణం వెళ్లినారట.

అమ్మగారు – వెంకమ్మగారు

మదరాసు వెళ్లకపూర్వము మాస్టరుగారి పుట్టిన రోజుకు కుంభకోణంవెళ్ళి మాతృశ్రీగారిని చూచివస్తానని నేనిక్కడ అన్నాను. నేననుకొన్నది

చాంద్రమానదృష్టితో, సౌరమానముచేత నేడే పుట్టిన రోజు. ఈ విషయం తర్వాత చెప్పుదును.

మదరాసు ప్రయాణం ఈతూరి సాగినంత సౌకర్యంగా ఇదివరకెప్పుడూ సాగలేదు నాకు. వెళ్లిన తరువాత యింత ఉత్సాహంగా ఎప్పుడూ ఉన్నదీలేదు. అక్కడ జరిగిన సందర్భములన్నీ శ్రీ మునికృష్ణయ్యగారు,[3] సీసా[4],చెప్పగలరు. ఏదో సందర్భం ముఖ్యమయినది మొన్న సాయంత్రము ప్రార్థనా నంతరము మాట్లాడుతూఉంటే ఈవిషయం వెల్లడించడానికి యిది సమయం కాదుసుమా అని అడ్డుకలుగగా ఆపివేసి తర్వాత చెప్పుదునంటిని.

నిన్న సాయంకాలము పి. యన్. గారింటికి వెళ్లినాను. ఏవిషయమునైతే మొన్న సాయంకాలం నిలిపితినో అదే విషయము శ్రీ నరసింహముగారితో మాట్లాడడంలోనూ వచ్చినది. చాలా వింత అనిపించింది. ఇంకా చిత్రమేమిటంటే అప్పుడు నేనేమి మాట్లాడదలచుకొన్నానో అదేవిషయం యిక్కడ (తిరుపతిలో) ఉన్నవారికి కొందరకు అక్కడనే (మద్రాసులో) ఉన్నవారికి కొందరకు కనిపించినది. అవిట్టంనేడన్నసంగతి పి.ఎన్.గారింటిలోతెలిసింది. ఈనాడు ఉదయం ప్రాక్టీసు ఇక్కడ మిత్రులతో జరుపుకోవడం నాకు సంఘటిల్లినది.

ఇక్కడకు వచ్చిన తర్వాత ఆఫీసు గొడవలలో ఈ విషయమంతా మరచినాను. నాలుగు గంటలన్నర అయిన తర్వాత ఇంట్లో నాకు చాలా గందరగోళంగాఉంది. ఇక్కడికొచ్చి కూర్చున్నాను చాలా చికాకు, దుఃఖం కలిగింది. మధ్యాహ్నమునుండీ నా శరీరము పరవశముగానేఉంది.

ఈ పూట పండ్లు పూలు వగైరాలు తెప్పించే జ్ఞప్తిలేదు. ఇంట్లో సెట్టిగారు[5] పంపిన పండ్లుండుట గుర్తించలేకపోయినాను. ఊళ్లో పండ్లులేవన్నారు. బాదంపప్పు, పూలు తెప్పించినాను. అంతలో ఇంట్లో పండ్లు 100 ఉండుట తెలిసి తృప్తిచెందితిని. ఇంకా సి.వి.వి ఫొటో పూజనమేనా అన్న భావమే నాకు అత్యంత దుఃఖకారణమయినది. ఈ విశ్వమునంతను సృష్టించి చిద్విలాసము జరుపుతూవున్న దివ్యశక్తి అగోచరముగానే ఇంకా ఉన్నదిగదా అనీ, లోకము దాన్ని తృణీకరించి నిరీశ్వరవాదముతో హింసోద్రేకములతో నాస్తికమైపోతున్నదిగదా అనీ, నన్ను నేనే మరుస్తున్నానేమో అనీ చాలా చింతకలుగుతోంది నాకు.

ప్రపంచమంతా ఏదో సృష్టి జరిగిపోతూ ఉన్నది. అసలు దీనికికర్త ఈశ్వరుడు ఉన్నాడని ఎందుకనుకోవాలని కొంతమంది మాట్లాడడము జరిగింది. దాన్నిగూర్చి మాటాడుతూ మొన్నరాత్రి మద్రాసులో రామకోటయ్యగారి[6] కథ వివరింపసాగినాను. ఆ కథ కొంత దూరంచెప్పేటప్పటికే ''ఇక ఇప్పుడిదివద్దు ఆగు'' అన్నట్టయింది. ట్రీటుమెంట్లు జరుగుచున్నవిధమునుచూస్తే ఇంత ఆశ్చర్యకరముగా ఉన్నదిగదా అని, ఇదంతా ఈశ్వరశక్తేకదా అని తృప్తితోనే ఉన్నానుగాని అయితేఏమి? సముద్రంలో కొన్ని చెంబులనీళ్లు ముంచెత్తినట్లు ఇది ఏ మూలకు? దీనివల్ల లోకానికంతకూ ఈశ్వరాస్తిక్యం నిరూపితమవునా అనీ నిరుత్సాహం తోచింది. ఈ మాట చెప్పే అప్పటి సంభాషణ ముగించినాను.

పి.యన్. గారింటికి వెళ్ళినప్పుడు ఈశ్వరుడుంటే ఈ కష్టాలన్నీ ఎందుకుకలగాలి? అన్న సంభాషణ వచ్చింది శ్రీ మాష్టరుగారు[7] రెండుమూడు రోజులకు ఫిజికల్ విడిచిపెడతారనగా శ్రీ వారు పి.యన్. వగైరాలతో ఈ విధంగా అన్నారట. "మీ కెన్నో యోగసాధనలు, దానికి సంబంధించిన విషయములు వెల్లడించినాను. కాని అందులో ఎక్కడా 'గాడ్' అన్న పదాన్ని ఉపయోగించలేదు. ఇకముందు మీరు ఆ తత్త్వాన్ని తెలిసికోబోతారు'' అన్నారని వారు చెప్పినారు. ఇదివరకింకా

“భగవంతుడు ఫారం కాలే''దని అంటూన్నవాడనే నేను.శ్రీ సి.వి.వి వారి ఈపల్కులను (నేనిదివఱకు వినలేదు.) తెలుసుకొనేటందుకే యిక్కడికి వచ్చినాను కాబోలునని తృప్తిచెందినాను. ఇంతవరకు నేనంటున్నాను. ''ఈశ్వరుడు ఇంకా ప్రత్యక్షంగా తెలియరాలేదు. విశ్వానికి సెంటర్‌ఫారం ఇంకా కాలేదు.అయిఉంటేలోకానికి ఈ బాధలన్నీ కలగవు, అదేదయినా ఫారం అయిఉంటే లోకంలో విప్లవం దౌర్భాగ్యం ఉండరాదు” అని నేనంటూ ఉండేవాణ్ణి. ఈ విషయం మీ రెఱిగినదే. ఈశ్వరుడనేతత్త్వము ఇకమీద నెలకోవలసినదే కాని యింతవరకూ నెలకొన్నదనుకో వీలులేదు. ఈ విషయమే శ్రీవారు వెల్లడించినది. నరసింహంగారు చెప్పినమాట కదీ అర్థము.

సీసా వగైరాలకు కనుపడిన విషయాలను గూర్చి మాట్లాడినాను. ఆకసమున నక్షత్రమయముగా 47-48 సంఖ్యలమీద రెండుపాదములు కనపడినవి. అంటే 47 వ సంవత్సరము తుదిపాదము లోను 48 సం॥ ఆదిపాదములో ఒకపాదము ఉండడంచేత ఆ ఆఱుమాసములలోను సి.వి.వి. పాదదర్శనము అని, పాదములు 7-4 మీద ఉండడంచేత మిగిలిన అంకెలు 4-8, 48 లో సంపూర్ణదర్శనమని అర్థము.

ఇంతవరకు ఫారంకాకుండా ట్రిక్‌గాఉన్న సెంటరు విజిబుల్‌గా, సత్యంగా ఫారంఅయి లోకమంతా తెలుసుకొని అర్థం చేసుకోవడం 47–48 లోనే– దాని తీరు కడపటి సంఖ్యలు 7-8 కూర్చుకుంటే శ్రీవారి 78 వ సంవత్సరం కడపటినుండి తెలుస్తుందని గోచరమయినది.

నేను ఫీలయిన విషయం ఈశ్వరుడున్నాడని ఏవో వైబరేషన్‌లవల్ల అనుకొంటున్నాను. అందరూ దేవాలయాలల్లో గర్భాలయాలలో ఉండి లోని విగ్రహాల్ని చూచినట్లే ఇప్పటివరకూ నా అనుభవంఉంది. ఈ పూర్ణిమనుండి డిసెండింగ్ అయి V గా కావడమునకు నెల దినములు అవుతుంది.

ఈ రోజులలో డీప్‌ఫీలింగ్ చాలా తీవ్రంగా కల్గి అమావాస్యనాటికి డిసెండ్‌అయి అక్కడనుండి ఒక్కొక్కఛాయగా వృద్ధిపొందుతూ తర్వాతి అవిట్టము నాటికి ఒకడే కావచ్చు అనేకులు కావచ్చు పూర్ణచంద్రోదయమును గుర్తింపగల్గుదురనుకొంటాను. 48 నాటికి లోకమంతా గుర్తింపవచ్చును. ఇప్పుడు చెప్పిన విషయాలకు సంబంధించిన ఫీలింగ్సు చాలా తీవ్రంగా ఉన్నని. ఆ ప్రజ్ఞను పొందినవాని కెపాసిటీకి అడ్డుతగులునదేదీ ఉండరాదు. అది చల్లగా అందరి యిస్పర్లనూ చొచ్చుకొని అందరి దుఃఖాలనూ పోగొట్టునదిగా ఉండగలదు. ఆ పూర్ణచంద్రోదయమును దర్శించినవానికి ఎటర్నిటి లభించగలదు. వైద్యంలో పూర్ణచంద్రోదయమని ఒక రసాయనౌషధంఉంది. అది జరామరణములను తొలగిస్తుందని శాస్త్రప్రశంసఉన్నది. అదినిజమో కాదో కాని ఈ పూర్ణదంద్రోదయం అట్టిదే అవుతుంది–నేనీ వ్యూస్ ఫారం చేసుకొంటున్నాను. ట్రూత్ మాస్టర్‌గారి ఫిగరుఫారంకూడా లోకము మానవతలోని పవిత్ర దివ్యసంకల్పములన్నీ ఒకటిగా ఫోకస్‌అయి సెంటరుస్పేసును అందుఆఫిగర్‌ను ఫారంచేస్తుంది. అదెక్కడ ఉంటుందంటే మానవహృదయాలలోనే. ఆ ఫోకసింగ్‌లో ఎవడు ముందుగా ఆ పాయింటును చూస్తాడో వాడే ముందుస్టాండవుతాడు–

ఆ సెంటర్ ఫిగర్ ఫార్మేషన్ పూర్ణచంద్రోదయమువలె గుండ్రనై అందు CV.V లెటర్సు మాస్టరు స్వరూపం దృశ్యమవుతుంది- అని మన యోగమార్గ నిర్ణయము.

నీవివన్నీ మాట్లాడుతున్నావే , యివన్నీ జరుగునా అని అడుగవచ్చు. (గంధి రాజగోపాలాచార్యులువారికి పూర్వం జరిగిన చర్చ చెప్పినారు.)

కొన్ని చాలా ఖరీదుగల చీట్లపేక ఆట కాగితములలో ఆసుకార్డుల లోపల మరొక పిక్చరు తెలుస్తూ ఉంటుంది. అట్లే ఆ పూర్ణ చంద్రోదయమును చూచినవాని ఒడలిలోకూడా మాస్టరు(ఈశ్వర) స్వరూపం దృశ్యమౌతుంది. అది ఫోటో తీసుకొంటే కూడా కనపడుతుంది. కార్డులోని ఆ ఆయిల్ పిక్చర్‌వలె కనుపడగలదు. అప్పుడు ఈశ్వరుడు గలడను సత్యమును లోకము ప్రత్యక్షముగా గుర్తించగలదు. మనము చూస్తుండగా ఆ ఆనంద సౌలభ్యమును పొందుదుముగాక! 47లోనే తెలియవలెను 48 అంతమునకయినా ఆ పిక్చరును చూడవలెను.

యిప్పటికి 79 సంవత్సరములు వయసు గడచినది. అఖండ ప్రయత్నం చేస్తున్నాడు. అయినా యింతమటుకు గంధికే ఎటర్నటీ, అంటే ఈశ్వరదర్శనం, కుదుర్కొన్నట్టు తెలియడం లేదు. ఇక సామాన్యుల మాట చెప్పనేల! ఆ స్పిరిచుయల్ పిక్చరును గంధిలో లోకం గుర్తించవచ్చునేమో! ఈ విశ్వమానవలోకంలో ఇంకెక్కడైనా ఎవరైనా మహనీయులు గుర్తించవచ్చునేమో! మనమే అన్న మాటేమిటి? శ్రీవారు రహస్యంగా శిష్యులనుగా చేసుకొన్న వారెందరెందరెక్కడెక్కడ ఉన్నారో!

నేనెంత ఫీలయినానంటే మదర్ బాపట్లలోనో మద్రాసులోనో ఉండుటకు యత్నిస్తున్నట్టు, ఎవరో దానికి ధనసహాయం చేసేటట్టు విన్నాను. అది అసంభవమనుకొంటాను. వారెవరితో కలసి ఏచోట సర్వసౌభాగ్యములనూ, దివ్యానుభూతులనూ పొంది ఈ యోగమును వెలయించిరో అట్టి కుంభకోణములోనే ఉండి లోకమునకంతటికినీ దీని మాహాత్మ్యమున రేడియేట్ చేయవలెనుగానీ మరో చోట ఆమెగారు ఉండడం జరగదు. దానికి, ఆమెగారి ప్రస్తుత బాపట్ల, మద్రాసు అనుభవములే సాక్షి. ఆమెగారు ముక్కున ఊర్పు ఉన్నంతవరకు శ్రీవారిని ప్రతీక్షిస్తూ కుంభకోణంలోనే ఉండవలెను.

శ్రీవారి జన్మోత్సవమునకు వారు కుంభకోణమునకే వెళ్లవలసెను. మాతృశ్రీగారి జన్మోత్సవము జరిగిన మద్రాసులో ఉదయం పూటా, వివాహమహోత్సవము జరిగిన తిరుపతిలో సాయంకాలంపూటా నేనుండడం తటస్థించినది. తిరుపతిలో మనమిప్పుడు కూడి కూర్చుండి ప్రార్థనము జరుపుచున్న చోటనే జరిగినదట మాతృశ్రీగారి వివాహము.



సీతారామ విలాస్

అటువంటి లోకకల్యాణ స్థలములో శ్రీవారి జన్మదినోత్సవ దిన ప్రార్థనము మనమిప్పుడు జరుపుకొని ధన్యులమయినాము.

కుంభకోణం సెంటరు అయితే సర్కుంఫరెన్సు లిమిట్ ఇప్పటికి మదరాసు అయితే తిరుపతి కూడా సర్కుంఫరెన్సు సర్కిల్ రేఖలోకి వస్తుందనుకొంటాను. కుంభకోణ మొక సెంటరు పెట్టుకొని లైను గీస్తే 150 మైళ్లుంటుంది. ఈ స్థలమునకు కొంత మాహాత్మ్యమున్నది. మాస్టరుకు ఈ యింటిలోనే వివాహం జరిగింది. మదర్ పుట్టింది మదరాసు. ఈ రెండు చోట్లకు మాహాత్మ్యమున్నది. మాస్టరు వర్తిల్లిన సర్వస్థలాలకీ మాహాత్మ్యము ఉంటుంది.

నేడు మాస్టరుగారి జన్మనక్షత్రము ధనిష్ఠ. సౌరమాన ప్రకారము కర్కాటకమాసమున అది వచ్చి

నది. ఈ విషయము పి.ఎన్. గారు చెప్పేదాకా నాకు తెలియదు. చాంద్రమాన ప్రకారము చూస్తే నిజశ్రావణ పూర్ణిమ జన్మదినమవుతుంది. ఆనాడు సెంటరుకు కుంభకోణమునకు వెళ్లుదును గాక అనుకొంటున్నాను.

ఫలితమును చూస్తే గదా మనకు తృప్తి కలుగుతుంది. ఇవన్నీ కబుర్లేకదా అనుకొంటూ ఉండగా అప్పుడే తేలు కుట్టి ఏడుస్తూ ఉన్న చిన్న పాపాయిని ఎవరో తీసుకొని వచ్చారు. ఏమైనా బిడ్డకు తినడానికి ఉంటే యిమ్మన్నాను. యింట్లో అవిట్లానికి తరిగిన ఆపిల్ ముక్క ఒకటి యిచ్చారు. వెంటనే పాపాయి నవ్వుతూ వెళ్లింది. అట్లే మనమందరమూ దుఃఖంలేని స్థితిలోనికి పోగలుగుదుముగాక! మనమూ నేడు మాస్టరుగారి ప్రసాదముగా ఆపిల్ ముక్కలు వగైరాలను ఆస్వాదించితిమిగదా!

మనము ప్రయత్నమేమీ చేయక ఫలితము జరుగలేదంటే ఎట్లా? మనము ప్రయత్నం చేసి ఫలితాన్ని పొంది, అంటే, ఈశ్వరశక్తిని దర్శించి, లోకమునకు చూపవలెను. అప్పటికిగాని లోకం విశ్వసించదు. ఈ జరుగుతూన్న అద్భుత సంఘటనలన్నీ ఆ దివ్యతత్త్వానివే. ఆ తత్త్వమును ప్రత్యక్షంగా గుర్తించేటందుకు తగిన యోగ్యత మనకు సీ.వీ.వీ అనుగ్రహమున లభించుగాక!

షే. ప్రభాకర శాస్త్రి

---

1. మాతృశ్రీ - వెంకమ్మగారు
2. యోగామీడియం పోతరాజు నరసింహం పంతులుగారు
3. యోగమిత్రులు వెన్నెలకంటి మునికృష్ణయ్యగారు
4. యోగమిత్రులు, శాస్త్రిగారిశిష్యులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు
5. యోగమిత్రులు కంభంపాటి సత్యనారాయణశ్రేష్ఠిగారు
6. యోగమిత్రులు కొత్త రామకోటయ్యగారు
7. మాస్టర్ సీ. వీ. వీ గారు

.... 1950, మార్చి, బుధవారం 1 వ తేదీ.

ఉదయం 9 గం॥ ప్రయాణం. నింద్ర–38 మైళ్లు. అక్కడి విగ్రహాలు.

(1) దేవీ విగ్రహము
(2) జిన విగ్రహము.
(3) పార్శ్వనాథ విగ్రహము.
(4) శాసనంగల రాజదంపతి విగ్రహము.

అక్కడ కూలి 8–0–0 అక్కడనుండి తిరిగివస్తూ వడమాలపేట.
పొలంలో.

(5) దేవి విగ్రహం దిమ్మెతో/– మొత్తం 78 మైళ్లు.

1. నేను, 2. బాలకృష్ణ, 3. సీసా, 4. సచ్చిదా, 5. పార్థ, 6. సుందరమూర్తి, 7. దీన, 8. సుబ్బారావు, 9. నరసింహులు నాయుడు. వడమామాలపేటలో (6), (7), (8) విగ్రహాలు.

.... 1950, మార్చి, గురువారం, 2 వ తేదీ.

చంద్రగిరి, తిమ్మాపురం దేవాలయపు మొండివిగ్రహం (9).

1. డైరెక్టరు. 2. వే. ప్ర. 3. బాలకృష్ణ, 4. సీసా, కూలీలు ఆళ్లురు. విద్యార్థులు అయిదుగురు.

కూలి వగైరాలకు 3–0–0.

పెరుమాళ్లపల్లె. పేరూరు వెళ్లలేదు.

.... 1950, మార్చి, శనివారం 4 వ తేదీ.

నిడంబరం, 53 మైళ్లు. నందివిగ్రహం (10);
మూడు విగ్రహాలు త్రవ్వించే యేర్పాటు చేసితిమి. అక్కడ నుం
కనకమ్మ సత్రం. అక్కడి విగ్రహాలు (లోహపురి?) తిరువాలంగాడు, తక్కోలంలో ఉన్నవిట. తెప్పించే యేర్పాటు చేసితిమి, ఆర్కాటు కుప్పం. వరదరాజ విగ్రహం శివాలయం వాకిట (11): శివలింగాదులు. నవగ్రహాలు, దేవాలయ నిర్మాత విగ్రహాలు, శాసనం (ముద్దు వీరప్పనాయడు?) చూచితిమి. అక్కడనుండి అరంగళం జైన విగ్రహాలు చూచితిమి. ఒక తాటాకు పుస్తకం అర్చకుల దగ్గఱ. తిరుత్తనిలో నిద్ర.

.... 1950. మార్చి, ఆదివారం, 5 వ తేదీ.

ఉదయం వేలంజేరి.

(12) నంది విగ్రహం. (13) కేశవ పెరుమాళ్లు.
(14) అమ్మవారు. (15) విరిగిన అమ్మవారు.
(16) వజ్ర చిహ్నము.

కం॥ వేలంజేరి పురమ్మున
ఫాలాక్షుని యానవదసి బాలేందుముఖీ
లీలావతి నీ భక్తుల
పాలింపవె పసిడిబొమ్మ వడివేలమ్మా.

వడివేలమ్మ విగ్రహాలు చెరువుకట్టమీద 3 ఉన్నవి. అందు రెండు మహనీయము. అందు మటీ బిడ్డకు పాలిస్తున్న తల్లి విగ్రహం మహామనోహరం. మధ్యాహ్నం తిరుత్తనిలో భోజనం. తిరుత్తనినుండి పూనిమాంగాడు, నల్లాత్తూరు, వెళ్లితిమి.
1. వే. ప్ర. 2. బాలకృష్ణ, 3. సీసా, 4. సుందరరామయ్య, 5. సుందరమూర్తి, 6. రంగయ్య, 7. సుబ్రహ్మణ్యశర్మగారు, 8. మాణిక్యం.
పూనిమాంగాడులో ఖర్చు కూలీలకు 30-0-0.
(17) శివలింగం పానవట్టంతో, చెరువులో విగ్రహాలు,
(18) కేశవస్వామి. (19) దేవి. (20) మొండెం.
(21) దక్షిణామూర్తి. (22) క్రిందిభాగం మాత్రం మొండెం.
నల్లాత్తూరు. (23) ధర్మరాజ తీర్థంకర. (24) దక్షిణామూర్తి.
రాత్రి తిరుత్తనిలో భోజనం. రాత్రి 2 గం॥లకు తిరుపతి. రెండు రోజులకు 140 మైళ్ళు ప్రయాణం.

ఈటూరులో శ్రీ శాస్త్రిగారివెంట వెళ్లినవారు :-
బాలకృష్ణ :- శ్రీ పంగనామల బాలకృష్ణమూర్తి — పరిశోధన సహాయోద్యోగి.
సచ్చిదా :- శ్రీ సింగరాజు సచ్చిదానందం. శిష్యులు.
సీసా :- ఉదయగిరి శ్రీనివాసాచార్యులు శిష్యులు, శ్రీ శాస్త్రిగారు వీరిని ముద్దుగా 'సీసా' అనేవారు.
పార్థ :- శ్రీ పార్థసారధినాయుడు. శిష్యులు, యోగమిత్రులు.
సుందరమూర్తి-శ్రీ శాస్త్రిగారి జేష్ఠపుత్రులు.
దీన :- శ్రీ దీనదయాళనాయుడు. శిష్యులు. యోగమిత్రులు.
డైరెక్టరు :- శ్రీ పరవస్తు వేంకటరామానుజస్వామి. (తక్కినవారు మిత్రులు, శిష్యులు. విద్యార్థులును).

[తిరుపతిలో మ్యూజియం నెలకొల్పే యత్నంలో గురుదేవులు అనుయాయులతో, శిష్యులతో, మిత్రులతో కూడి జరిపిన పర్యటన విశేషాలిందున్నవి, అప్పుడు వీరు సేకరించిన విగ్రహాలు (కుండలీకరణాల నడుమ గుర్తించబడిన అంకెలలో గలవి) ప్రస్తుతం తిరుపతిలో ఉన్నవి. దరిమిలా ఇటువంటి టూర్లు మరికొన్నిచేసి చాలా చోట్ల చాలా శిల్పాలను సేకరించారు. తుదకు ఆ ప్రయత్నంలోనే శ్రీవారు తమ ఆరోగ్యాన్నికూడా కోల్పోయి అసువులను బాసినారు. వివరాలకు చూ. ''ఆంధ్రకళాలక్ష్మికి అందాలు దిద్దిన మహాశిల్పి''—1950 నవంబరు–డిసెంబరు మాసాల్లో ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధాల్లో వరుసగా అచ్చైన అయిదు వ్యాసాలు—సం॥]

“ఎన్ననిచెప్పేది మాఅన్నయ్య గురించి”

—డా॥ వేటూరి శంకరశాస్త్రి

[ప్రభాకరశాస్త్రిగారి ప్రసంగమెత్తితేచాలు ఎనభయ్యేళ్లముదిసీ లెక్కచేయకుండా గంటల తరబడి ఎన్నెన్నో జ్ఞాపకాలను ప్రకటిస్తారు శంకరశాస్త్రిగారు. అట్టి ప్రసంగాల్ని ఈవరకే చాలా టేపుమీద రికార్డుచేసి ఉంచినాము. మణిమంజరి సంచికకోసం ఇప్పుడీ వ్యాసాన్ని వారే స్వయంగా చెప్పి వ్రాయించి పంపినారు—సం॥]

ఇప్పటికి ఏభై ఆరవై ఏళ్ల క్రిందటి నాటిమాట నేచెప్పేది. మా గ్రామం (పెదకళ్లేపల్లి)లో తోలుబొమ్మలాట వాండ్రు రామాయణగాథను సంవత్సరానికి రెండుసార్లు వచ్చి ప్రదర్శించి పోతుండేవారు. ప్రదర్శకులు రంగనాథ రామాయణంలోని ద్విపద భాగాలను ఆయా ఘట్టముల సందర్భంలో చదువుతూ జనరంజకమైన భాషలో వివరణచెప్పుతూ ఉండేవారు. మధ్యమధ్య బంగారక్క, పోలిగాడు అనే వ్యక్తులు వచ్చి హాస్యరసభరితములైన కథలు చెపుతూ జనులను కడుపుబ్బ నవ్వించేవారు. నాచిన్నతనంలో ఈ తోలుబొమ్మలాటల ప్రదర్శన చూచే నేను రామాయణకథనంతా తెలుసుకున్నాను. చూడవచ్చిన జనం ఆట ముగిసేవరకు కూర్చున్న చోటునుంచి కదిలేవారు గారు. ఇలా ప్రతిగ్రామంలో ప్రదర్శనలు ఇస్తూ ఉండడం ఆరోజుల్లో జరుగుతుండేది. గ్రామస్థులూ వారిని భూరిగా సంభావించి పంపుతుండేవారు.

ఇంకొక విషయం చెపుతాను. ఆ సంవత్సరం మా ఊళ్లో సకాలంలో వర్షాలు కురియలేదు. రైతులు పంటలు లేవని గోలపెడుతున్నారు. ఊరిపెద్ద ఒక శాస్త్రులవారు తోలుబొమ్మలాటగాండ్రను పిలిపించి విరాటపర్వం ఆడించాలని సలహాచెప్పారు. రైతులంతా సరేనని ఆటగాండ్రని పిలిపించి విరాటపర్వం ప్రదర్శింపచేశారు. ఆట ముగిసినతరువాత ఆటగాండ్రు సామాను సర్దుకొని పొరుగూరుకు వెళ్లారు. అదేమిటో! మరునాడు కుంభవర్షం కురిసింది. ఈ విరాటపర్వానికి వర్షానికి సంబంధమేమిటో నాకు తెలియదు. అది మూఢ నమ్మకమే కావచ్చు. కాని వర్షం కురిసినమాట మాత్రం సత్యం.

ప్రజ్ఞానిధులు, విమర్శకాదర్శకులు కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు ఉపాధ్యక్షులుగా ఉన్నప్పుడు వారికెందుకు బుద్ధిపుట్టినదో రంగనాథ రామాయణంను సంస్కరించి శుద్ధప్రతిని తయారుచేసి ముద్రింప తలపెట్టినారు. గోన బుద్ధారెడ్డి రచించినాడనేతలపుతోవారీపనికి పూనుకొన్నారని నేను అనుకున్నాను. అంతకు మునుపు రంగనాథరామాయణం గుజిలీప్రతులు తప్పుతడలతో అచ్చైనవి లభిస్తుండేవి. అట్టి ఈ రంగనాథ రామాయణాన్ని సంస్కరించవలెనంటే సామాన్య పండితులవల్ల అయ్యేపని కాదు. దేశములో లభించే తాటాకుప్రతులు సంపాదించి గుజిలీప్రతుల పాఠములతో సంప్రదించి పాఠభేదములను, ఛందో విషయములను, ప్రయోగ విశేషములను; గ్రంథ భాగములను గుర్తించి మేలుప్రతిని వ్రాయించినగాని ముద్రణ పని పూర్తికాదు. ఇందుకు తగినవారు

ఎవరా అని విశ్వకళాపరిషత్తు పండితులతో రామలింగారెడ్డిగారు సంప్రదించిరి. కొంతకాలం వారా వీరా అని ఆలోచనలు సాగినవి. చివరకు ఒక ప్రసిద్ధ పండితుని సలహామీద- వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఇందుకు తగినవారనీ పరిష్కరణ కార్యములందు వారు సిద్ధహస్తులనీ, తెలుపగా- రెడ్డిగారు అందులకు అంగీకరించి ప్రభాకరశాస్త్రిగారికి యూనివర్సిటీవారిచేత జాబు వ్రాయించిరి. అప్పటికే శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారి నిదేశమున బసవపురాణమును పరిష్కరించుటవలన దానికి వ్యాప్తి ఎక్కువ అయినది. దానికి వారు రచించిన బృహత్పీఠిక భాషావేత్తల మన్నన పొందియుండెను. ఈ కార్యంతో సతమతమైన శ్రీ శాస్త్రిగారు మరల ఇంకొక బృహత్కార్యమును స్వీకరించుటకు సంకోచించిననూ వారి భాషాభిమానము ఇందుకు పురికొల్పినది. ఒక షరతు మీదనైతే ఈపనికి అంగీకరిస్తానని బదులు వ్రాసిరి. వారు కోరిన ఒక సహాయకుని వారికిచ్చుట ఆ షరతు కాలనిర్ణయంలేక సాధ్యమైనంత త్వరలో సంస్కరించి ఇచ్చుటకు వారు అంగీకరించే యెడల తానాపనికి పూనుకొందునని వ్రాసిరి. విశ్వకళా పరిషత్తువారు సరేనని అంగీకరించారు. శాస్త్రిగారు శ్రీ గన్నవరపు సుబ్బరామయ్యగారిని సహాయకునిగా తీసికొనిరి. పరిష్కరణ కార్యం చురుకుగా సాగుతున్నది. వివిధ ప్రతులతో సంప్రదించుట భాషా విశేషములను, పదప్రయోగములను, ఛందో విషయములను, ఎప్పటికప్పుడు నోటుబుక్కులలో వ్రాసుకుంటూ, రిక్త భాగములను పూరిస్తూ, తప్పులు సవరిస్తూ, చేసినపని ముద్రితప్రతిగా తయారైనది. ఇక పీఠిక వ్రాయవలెను। ఈ గ్రంథ కర్తృత్వ విషయమున భిన్నాభిప్రాయములు కలవు. అందుకు తగిన సాధకబాధకములను సమకూర్చుకొని నిష్పక్షపాతబుద్ధితో గ్రంథకర్తృత్వ విషయము నిర్ణయింపవలసి ఉండెను.

అందుకు కావలసిన చరిత్రాంశములనన్నిటినీ సమకూర్చుకొని పీఠిక చిత్తుప్రతి తయారగుచున్న సమయంలో శాస్త్రిగారికి మిత్రులైన యూనివర్సిటీ పండితులొకరు తమవద్దకు వచ్చి పీఠికా విషయములను చర్చిస్తూ ఇందును గూర్చి శ్రీ రెడ్డిగారికి కొన్ని నిశ్చితాభిప్రాయములుకలవనియూ, అవి ఇట్టివనియూ ముఖాముఖీ చర్చలలో తెలిపిరి. అందుకు అనుగుణముగా మీ పీఠిక ఉండుట సమంజసమని సలహాగా చెప్పిరి. అవన్నియూ శాస్త్రిగారు సావధానంగా విని "గ్రంథ పరిష్కరణ కార్యము ముగిసినది. పరిష్కర్త తాను సత్యములని నమ్మినవిషయములను పీఠికలో వ్రాయుట సమంజసము. పీఠికలోని విషయములకు నేను బాధ్యత వహించవలెను గదా! ఇతరుల అభిప్రాయములను అందు చొప్పించుట తగనిపని. నా అంతరాత్మ ప్రబోధమునకు విరుద్ధముగా నేనేమీ వ్రాయజాలను" అని తెలిపిరి. అంతటితో ఆ చర్చ ముగిసినది. తరవాత ఏమి జరిగినదో గాని శ్రీ పింగళి లక్ష్మకాంతంగారి పీఠికతో గ్రంథం వెలువడినది. గ్రంథము వెలువడిన మీదట సంగీత సాహిత్య విశారదులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు పరిష్కర్తయైన శాస్త్రిగారి పీఠిక లేమికి విచారిస్తూ అప్పటి భారతీ పత్రికలో ఒకవ్యాసమును ప్రకటించిరి. [చూ. సారస్వతాలోకము (పు. 84-107) 1980 ముద్రణ].

కొంతకాలం గడచిన తరవాత శ్రీ శాస్త్రిగారు రంగనాథరామాయణ కర్తృత్వమును గూర్చిన సాధకబాధకములను క్లుప్తంగా వివరిస్తూ ఇట్లు వ్రాసిరి.

* * *

'రంగనాథుఁడను కవీశ్వరుని గూర్చి యిటీవల చేలరేగిన వాదదావాగ్నిలోఁ జిక్కువడి నేనొడలు కాల్చుకొనఁజాలను. ప్రాచీన కావ్యలక్షణ శాస్త్ర

కవిచరిత్రాది పరిజ్ఞానము గొల్పుటలో నాకుఁ బ్రాచీన లక్షణ గ్రంథకర్తలు పితృతుల్యులు. ఉహ్వాని యువ్వెత్తున వారి పరిజ్ఞానము నుత్తిత్తిదానిగా నే నూఁదివేయఁజాలను. వారు భ్రమ ప్రమాదములు లేనివారనిగాదు. ప్రబల ప్రమాణములచే నట్టివట్టి వరకును నిరూపించి కొట్టివేయుట లగ్గు. రంగ నాథునిఁగూర్చి యుపలబ్ధాంశముల నెత్తిచూపుటకే నాయీ యుపక్రమము. ఇందు ప్రామాణ్య చర్చను ప్రాజ్ఞులు కావింపఁగలరుగాక!'

[చూ. వాఙ్మయ మణిమంజరి.ద్వి.భా. ప్ర.సం. 1952. పు.61-87

మఱియు సింహావలోకనము— వ్యాససంపుటి1955. పు. 14—30.]

* * *

ఇది రంగనాథ రామాయణ పరిష్కరణమును గూర్చి లోకమునకు తెలియని చరిత్రాంశము.

* * *

1919వ సంవత్సరమున విజయవాడలో ప్రథమాంధ్రాస్థానకవిగా నియమితులైన శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారికి సన్మానసభ జరిగినది. ఇది హిందూ హైస్కూలు ఆవరణలో యేర్పాటైనది. ఆ సభకు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు అధ్యక్షులు. రామలింగారెడ్డిగారు ప్రారంభకులు. ఉపన్యాసకులు చాలామంది ఉన్నారు. వేంకటశాస్త్రిగారిని సభావేదిక మీదికి శిష్యవర్గము బ్రహ్మరథం పట్టి తీసుకవచ్చినారు. ఒక పేముకుర్చీలో వేంకటశాస్త్రిగారిని వరుండబెట్టి హైస్కూలు ఆవరణ గేటుదగ్గరనుంచి సభాస్థలికి తీసుకవచ్చేటప్పుడు ముందు రెండువైపులా ప్రభాకరశాస్త్రిగారు, రాయప్రోలు సుబ్బారావుగారు, వింజామరలు వీస్తున్నారు. ముందుప్రక్క రథికులు వేంకటేశ్వరరావుగారు, లక్ష్మీకాంతంగారు అనే జ్ఞాపకం. వెనుకవైపు బుచ్చి సుందరరామశాస్త్రిగారు నాలుగోవారెవరో నాకు జ్ఞాపకం లేదు. ఈ విధంగా మేళతాళములతో వారిని వేదికమీదకు తెచ్చి వారి కుర్చీని అమర్చినారు. వేంకటశాస్త్రిగారు వారికి సహజాలంకారమగు నీరుకావి అంగవస్త్రమును తలకు చుట్టుకొని పెరిగిన గడ్డముతో శల్యావశిష్టమైన విగ్రహముగా బెర్నార్డుషాను తలపిస్తూ కుర్చీలో పడుకున్నారు. వేదికమీద ప్రభాకరశాస్త్రిగారు రామలింగారెడ్డిగారు, బూర్గుల రామకృష్ణారావుగారు, ప్రకాశంపంతులుగారు, కాశేశ్వరరావుగారు, వగైరాలు ఆసీనులైనారు. ఇంకా కొంతమంది ఉన్నారుగాని వారెవరైనదీ జ్ఞాపకం లేదు. జనసందోహం క్రిక్కిరిసి ఉంది. సభప్రారంభమైనది. ప్రారంభకులైన రెడ్డిగారు ఆరంభంలోనే పలికిన పలుకులుఇవి.

''ఈ సభలో నేను ఏ చిన్న రాయి విసరినా ఎవరో ఒక పండితుని తలకు తగులుతుంది. సభాధ్యక్షుడు ఈ ప్రభాకరశాస్త్రి సామాన్యుడా!" ఈ తొలిపలుకులతో వారు కొంత ప్రసంగం సాగించినారు. ప్రక్కనే పడకకుర్చీలోవున్న శతావధానిగారు, ''రెడ్డిగారికి రాళ్లు విసరడమే తప్ప పూలు చల్లడం తెలియదుగదా'' అని హీనస్వరంతో అన్నారు. అది అందరికీ వినపడ్డదో లేదోగానీ వేదికప్రక్కనే ఉన్నవారు అందరూ వినగలిగారు. శ్రీ రెడ్డిగారి ఈ తొలిపలుకుల్లో వ్యంగ్యమో, శ్లేషో, చమత్కృతో వక్రోక్తో అలంకార శాస్త్రంలో ఏమంటారో నాకు తెలియదుగాని రెడ్డిగారికి ఇట్టి సంభాషణా ధోరణి మామూలే. ఇంకొక విశేషమేమంటే ఎవరి పేరు చెప్పినా, వారెవరిపేరు పలికినా గౌరవవాచకం ఉండదు. పేరు చెప్పడమే తప్పు.

ఈ సభలో జరిగిన ఇంకొక సంఘటన ఏమిటంటే శతావధానిగారి శిష్యసంతతికి చెందిన విశ్వనాధవారు సభలో కానరాకపోవటం.

ఈ సంగతిని గ్రహించిన ప్రభాకరశాస్త్రిగారు ''నాయనా సత్యనారాయణా ఎక్కడున్నావు'' అని

దగ్గరగా పిలువగా జనసమూహంలో ఎక్కడో చివర నిలుచున్న విశ్వనాథవారు గబగబా వేదికవద్దకురాగా శాస్త్రిగారు ప్రక్కన కూర్చుండబెట్టుకొని శతావధాని గారిమీదతాము రచించిన పద్యములను విశ్వనాథ వారిచేత చదివించారు. సభాకార్యక్రమాలలో ఆనాడు విశ్వనాథ వారు సహజంగా పాల్గొనకపోవటానికిగల కారణా లన్నీ ఇప్పుడు చెప్పటం సందర్భంగా ఉండదు.

* * *

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ఆంధ్రయూనివర్శిటీ పండితపదవికి దరఖాస్తుపెట్టడం, సెనేట్ మీటింగులో రెడ్డిగారు శాస్త్రిగారి పదవిని సమర్థించటంమొదలుకొని చివరి దశలో అది ఎట్లా తారుమారైనది దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారి స్వీయచరిత్రలో వివరములు చూడవచ్చును.రంగనాథ రామాయణపీఠికా విషయము శతావధాని సన్మానసభలో శ్రీరెడ్డిగారి పలుకులు యూనివర్సిటీ పండితపదవి సమాచారము వరుసగా ఈ మూడింటికి అంతర్గర్భితమైన సంబంధము కలదని కొందరు తలంచుట తప్పుగాదు. లేకపోతే శ్రీ శాస్త్రిగారు కళాప్రపూర్ణ లయ్యేవారే.

* * *

ప్రసక్తి వచ్చిందికాబట్టి ఈ విషయంకూడా చెప్పడం బాగుంటుంది. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి సన్మానసభాసమావేశమును తూ॥గోదావరిజిల్లా కపిలేశ్వరపుర వాస్తవ్యులు సత్యనారాయణగారి నిర్దేశమున యన్. యస్. చౌహాన్ అనే ఫొటోగ్రాఫరు చలనచిత్రముగా ఫొటోగ్రాఫ్ తీశారు. అది ప్రదర్శించగా నేను చూచాను.ఆ ఫిలిము యిప్పటికీ సత్యనారాయణ రావుగారియొద్ద కలదు. ఒకప్పుడు నేను వారిని అడియిస్తే కాపీతీయించుకొని ఒరిజనల్ మీకు తిరిగి యిస్తావని అడుగగా ఆలాగే యిస్తావనికూడా అన్నారు.[1] కాని మరల వారిని కలుసుకోటం కుదరలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు, అకాడమీలు యిట్టివాటిని సేకరించి భద్రపరచి ప్రదర్శించుచుండుట ఆవశ్యకము. ఇంతేకాక, కడువృద్ధులైన పండితుల, కవుల, కంఠస్వరములను ప్రసంగరూపమున టేపురికార్డుచేసి భద్రపరుచుటకూడ అవసరమని ఈ సందర్భమున మనవిచేయుచున్నాను. కంఠస్వరము రికార్డింగు పద్ధతి వచ్చిన తర్వాతకూడా కొందరువిద్వత్కవుల కంఠస్వరముల రికార్డుచేసియుంచుకొనలేకపోయినాముగదా !

ప్రభాకరశాస్త్రిగారు విరామము దొరికినపుడో తాము సెలవుపెట్టినప్పుడో, వేసంగి సెలవుల్లోనో, బెజవాడ జగ్గయ్యపేట. ముక్త్యాల వైపులకు వస్తూయుండేవారు. ముక్త్యాల రాజాగారు వారికి ఆప్తులగుటచేతను, జగ్గయ్యపేట. ముక్త్యాలలో వారి మిత్రులు సోదరులు ఉండుటచేతను, విద్వద్గోష్ఠులు, యోగసమావేశములు జరుగుతూ వుండేవి. పూర్వము ఈ చుట్టుపట్టు అంతా బౌద్ధమత వ్యాప్తిగల స్థలములగుటచే. గుమ్మడిదుర్రు, బోగాలపాడు, బూదవాడ మొదలైన గ్రామపరిసరాలు, ఆ చుట్టుపట్ల గల పురాతన సమాధులు (రాకాసిగుళ్ళు) కొన్ని త్రవ్వించి అందలి అస్థివిశేషములను, కొన్ని పాత లిపి విభేధములను, గుర్తిస్తూ అందలి విశేషములను అందరికీ చెపుతూవుండుటము కద్దు. కాకతీయుల నాటి శాసనాలు, వీరశిలలు, మరికొన్ని శిల్పాలు చాలా సమకూర్చి ముక్త్యాలకు చేర్చినారు. ఈ పని మీద వారక్కడ ఉన్నప్పుడు వారి జన్మస్థలమగు పెదకళ్లేపల్లి గ్రామమునుండి యిద్దరు యువకులు ముక్త్యాలకువచ్చి, పెదకళ్లేపల్లిలో వారికి సన్మానము చేయుటకు గ్రామస్తులందరూ తలపెట్టినారని, సర్వసన్నాహములు జరుగుతున్నవని, తమరు అంగీకరించి వీలు యెప్పుడో తెలిపిన అన్నియేర్పాట్లుచేసి వచ్చి తీసుకువెళ్ళగలమని కోరిరి.

* * *

వాడు అందుకు చెప్పిన సమాధానము

“నాయనలారా! మీ ఉత్సాహమునకు చాలా సంతో

షించితిని, మీ కోర్కె ననుసరించి నేను వస్తాను, మీరేవో నాకు వినుతివాక్యములుచెప్పి, పూలమాలలు వేసి పంపుతారు. ఇవి నాకు తృప్తిగొలుపవు. ఆ గ్రామములో మంచినీటివసతి లేదన్నసంగతి మీకు తెలియును. పూర్వము మన ఊరి దేవాలయము ఎదుట రెండు మంచినీటిబావులు, రెండు మామిడి చెట్లు, పెద్ద చెరువు, ఆచెరువులో తామరలు కలువలు అల్లుకొని చూచుటకెంతో సొంపుగావుండేది. గ్రామస్తులందరికు ఆ నూతినీళ్లు, చెరువునీళ్ళు యెంతో ఆప్యాయతనిస్తూ వుండేవి. తామరాకులు విస్తళ్లక్రింద యెంతో ఉపయోగపడుతూవుండేవి. తామరగింజల ప్పు చిన్నతనములో నేనుతిన్న జ్ఞాపకమున్నది. తటాకముచుట్టూ పున్నాగచెట్లు కమ్ముకొని వుండేవి. గ్రామమునకు వచ్చేవారికి, గ్రామస్తులకు యెంతో హాయిని గొలువుతూయుండేది. దేవాలయము ఎదుట మామిడిచెట్లు, పొగడచెట్లు యిప్పటికి నాకు జ్ఞాపకమున్నవి. ధర్మకర్తల నిర్లక్ష్యవైఖరివల్ల ఆవన్నీ యిప్పుడు రూపుమాసిపోయినవి. తటాకము చేపలగుంట అయినది. అటువస్తే యిపుడు నీచు వాసనతప్ప మరేమీచూడలేము. కాబట్టి నేకోరేదేమంటే నా సన్మానానికి పెట్టేఖర్చు గ్రామస్తుల మంచినీటివసతికై వినియోగిస్తే నన్ను ఘనముగా సన్మానించినట్లు సంతోషిస్తాను. మీరు ఈపనిని చేయబూనుకుంటే నేనుకూడా చందాయిస్తాను, యేమంటారు?" అని అడిగారు. ఆ ప్రయత్నములో మరల వచ్చి దర్శించగలమని చెప్పి వారు వెళ్ళారు. అప్పటికి యిప్పటికీ అ మంచినీటివసతి అలాగే యున్నది.

* * *

పూర్వము ఆంధ్రసారస్వత మహాసభవారు యేటేటా ఒకపట్టణమున పరిషత్తు వార్షికసభలు జరుపుతూయుండేవారు, నరసారావుపేటలో ఒకనాటి సభకు శ్రీ ప్రభాకరశాస్త్రిగారిని ఆహ్వానించి, 'విమర్శకాగ్రేసర' అనే బిరుమనిచ్చి సన్మానిస్తామని తప్పక రావలసినదని రైలుఖర్చులు పంపుతామని వ్రాశారు. అందుకు బదులుగా వారు రైలుఖర్చులు పంపవద్దని వీలైతే అలాగే వస్తానని వారికి బదులు వ్రాశారు. మిత్రులు పలువురు దగ్గరనున్నవారు యిదేమి అన్యాయమండీ సన్మానిస్తాము, బిరుమనిచ్చి గౌరవిస్తామంటే యిలా బదులు వ్రాయటమేమిటండీ? అని అడిగారు. అందుకు వారు చెప్పిన సమాధానము, ''సన్మానములు బిరుదులు మత్తుపదార్థముల వంటివి. వీటితో వీట్టపీగితే నేనింతవాడ నంతవాడననే గర్వమును రేకెత్తిస్తాయి. ఈ మత్తులో యేపనీ సాగదు, అయినా నాకీబిరుదేమిటి, నాకంటె మహామహులెందరో ఉన్నారు. నేనీలాగే వుండటం నాకిష్టము. వేదము వెంకటరాయశాస్త్రిగారు మహామహోపాధ్యాయులని వారంతటి విద్వత్తుగలవారు ప్రస్తుతము ఆంధ్రదేశములో మరొకరులేరని, వారి ప్రఖ్యాతి అట్టిదని మనమందరము యెరుగుదుము. వారు నాకు జాబు వ్రాయునప్పుడల్లా 'కవిచూడామణి' అనే విశేషణముపెట్టి వ్రాస్తూవుంటారు. ఆ ఉత్తరాలు చూచినప్పుడల్లా ముగ్ధుడనై పోతూవుంటాను. ఆవిషయము మీకిప్పుడు చెపుతున్నాను, ఇతరులకెవరికి తెలియదు. ఇట్టి పండితాఖండలుని పరితోషమే నాకు పదివేలు. నేను సభలకు వెళ్ళటం, వారు నన్ను పొగుడుతూ యేవో ఉపన్యాసాలు యివ్వటం, అవి నేను వినటం నాకెంతో సిగ్గుగా ఉంటుంది, అట్టి ప్రశంసలకు బదులుచెప్పటం నాచేతకానిపని. నాదగ్గర యేవిధమైన యోగ్యతఅయినాఉంటే అది లోకంగ్రహిస్తేచాలు'' అని చెప్పారు.

* * *

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు, శ్రీ ప్రభాకరశాస్త్రిగారు జంటపండితులుగా ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో పనిచేస్తూ, ప్రాచీన గ్రంథసేకరణార్థమై జంటగానే కొంతకాలము ఆంధ్రదేశములో

పర్యటించారు. పలువురు పండితులతో గోష్ఠులు, సభలు, సమావేశములు జరిపి అనేక తాళపత్ర గ్రంథాలు సంపాదించి, మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునకు పుష్టినిగూర్చారు. తర్వాత తిరుపతిలోకూడా 'వెంకటేశ్వర ప్రాచ్యపరిశోధన శాల' యందు కొంతకాలము జంటగానే పనిచేశారు. వీరుభయులు కలిసి యేదైనా విషయమును చెప్పేస్తూ వుంటే, వినేవారికి ఎంతో విజ్ఞానదాయకముగా ఉండేది. రామకృష్ణకవిగారు చేసిన సారస్వతసేవ అమోఘమైనది. కాని వారి పాండిత్యాన్ని, సారస్వతసేవానిరతిని, ప్రభుత్వముగాని ప్రజలుగాని ఆయన బ్రతికున్నకాలములో సరిగా గమనించినట్లు కనుపడదు. వార్ధక్యమున వారెన్నో అగచాట్లకు పాలైనారు, భోజనముకూడా సరిగా అమరేదికాదు. తిరుపతిలో ఒక హోటలు యజమాని వీరి గొప్పతనాన్ని గుర్తించి భోజనానికి ఆహ్వానిస్తూ వుండేవారు. ప్రభాకరశాస్త్రిగారికి ఈ విషయమెంతో దుఃఖమునుకలిగిస్తూ ఉండేది. తిరుపతి పౌరులు కొందరు, యోగగోష్ఠిలోనివారు సారస్వతప్రియులు ప్రభాకరశాస్త్రిగారి షష్టిపూర్తి సందర్భమున సభ జరుపుతామన్నారు. అప్పుడు వారు వారిని వారించి నాషష్టిపూర్తి నేను ప్రశాంతముగా ప్రార్థనలో జరుపుకుంటాను అని ఈ క్రింది పద్యములు చెప్పినారు.

"వచ్చెను నేఁటి కర్వ్యదగు వర్షము పుట్టువుఁ
దొట్టి, గర్భముం
బొచ్చుటఁ దొట్టి నాకరయఁజూచిన నేఁటికె షష్టి
పూర్తి, యీ
వచ్చిన యేఁడు నిండిన ధ్రువంబుగఁ గాగల
షష్టిపూర్తితో
విచ్చుట నాకుఁ గావలయునిష్టికిఁ బూర్తియు వృష్టి
పూర్తియున్.
ఆనక్రేపఁగ నంతరంగపుటరణ్యం బంధకా
రమ్మునన్
దాసోహమ్మని చొచ్చితిన్ వెనక నంతర్యామి
నాలోనెదో
భాసిల్లెన్ జిఱువెల్గు, చేరఁజనదావమ్మయ్యెనా
యగ్నిలో
నేసోహమ్మయి నిల్చితిన్ విడవ నేడీ నా తపం
బయ్యెడన్?"

శిష్యులతో కూడి మౌనప్రార్థన జరుపుకొన్నారు.

ఈ సంఘటనకు ముందే తమ వియ్యంకులైన విస్సా. అప్పారావుగారితో రామకృష్ణకవిగారి దైన్యస్థితిని గమనించి వారికేదైనా సన్మానసభ యేర్పాటుచేసి, ఉత్త పూలదండలతో సన్మానించక కొంత ద్రవ్యనిధిని చేకూర్చే యేర్పాటుచేసి పెట్టండిబాబూ అన్నారు. వారందులకు యెంతో సంతోషముగా అంగీకరించి, అందుకు తగిన యేర్పాట్లుకొరకై మదరాసువెళ్లి కొంతమంది ప్రముఖులనుచూచి ద్రవ్యనిధికి తగు యేర్పాట్లు చేయుచుండగానే దురదృష్టవశాత్తు కవిగారి జీవయాత్ర ముగిసినది. ఈ సందర్భముననే కవిగారి దైన్యస్థితిని చూడజాలక అప్పారావుగారు, కవిగారిని కలుసుకొని గుప్తముగా యేదో కొంత ధనమిచ్చిన విషయము నాకు గుర్తున్నది.

* * *

ప్రభాకరశాస్త్రిగారి సారస్వతసేవలోని మౌలికతను నేను ఈ క్రింది అంశాలుగా విభజించి చెప్పదలచినాను.

1. వీరశైవ సాహిత్యము :— శివకవులు, వారి జానుతెనుగుభాషా ప్రయోగములు, ఛందోవిశేషములు. ద్విపదపద్ధతి, వారేలాప్రజలకు సన్నిహితులైనది తెలుపు రచనలు, వారి గ్రంథములు, సారస్వతరంగమున వారి ప్రత్యేకత. చూడండి 1924 భారతి ప్రథమ సంచిక.

2. ఆంధ్రభూమిని పాలించిన రెడ్డిరాజుల భాషాసేవ:- వారు తెలుగు సంస్కృతభాషలలో రచించిన గ్రంథాలు,ఇతరులచేత రచింపచేసిన గ్రంథాలు, వారు చేసిన దానధర్మాలు, వారి పరిపాలనాపద్ధతి వారుపోషించిన కవులు యివన్నీ మొట్టమొదటగా తెలిపినవారు శాస్త్రిగారే.

చూడండి, శృంగార శ్రీనాథం, రెడ్డిరాజ జయంతి సంచిక, రెడ్డిరాణి పత్రికలు. ఈ విషయములనే ధ్రువపరుస్తూ రెడ్డికింగ్‌డమ్ అనే ఆంగ్లగ్రంథమునందు సోమశేఖరశర్మగారు విశదీకరించినారు.

3. తాళ్లపాక అన్నమాచార్యులు: వారి సంకీర్తన భాండాగారము :- అన్నమాచార్యులు మహాభక్తుడనీ తిరుపతి వేంకటేశ్వరస్వామిమీద వేల సంకీర్తనలు రచించినాడనీ అందరికీ తెలిసిన విషయమే అయినను సంకీర్తన రేకులన్నిటిని లెక్కకుదెచ్చి, విశ్లేషించి, సరిగా సంస్కరించి వెలువరచే ప్రయత్నం చేసినదీ; సంకీర్తనాచార్యుల ఉబ్బెత్తు శిల్పాలు గల రాగిరేకులను వెలుగునకుదెచ్చి, వారిమూర్తులను గుర్తించి ప్రతిసంవత్సరము జరుగునట్లుగాఅన్నమాచార్యుల వర్ధంతిసభల నేర్పాటుచేసి, అన్నమాచార్య చరిత్ర ద్విపదను సేకరించి పరిష్కరించి విపులమైన పీఠికతో ప్రచురించి రేడియోద్వారాను సంగీత విద్వాంసుల మూలమునను ప్రచారములోనికి దెచ్చిన మనీషి ప్రభాకరశాస్త్రిగారే. సుపరిష్కృతములైన సంకీర్తన సంపుటముల ప్రకటమునకును శాస్త్రిగారే ప్రారంభకులు. ఆ ప్రాతిపదికమీదనే ఇప్పటికీ ఆ పనులన్నియు సాగుచున్నవి.

4. (1) సారంగధరునికథ : రాజమండ్రిలోని సారంగధరమిట్టకు ఆకథకు సంబంధములేదని మొట్టమొదటగా తెలిపినది వీరే.
(చూ. ఆంధ్రపత్రిక సారస్వతానుబంధము)

(2) శ్రీకాకుళము ఆంధ్రరాజధాని కాదనీ యిప్పుడున్న దేవాలయాది నిర్మాణములు పూర్వపువి కావనీ, శ్రీకృష్ణదేవరాయలు, శ్రీకాకుళ క్షేత్రమును దర్శించుట మాత్రమే జరిగినదనీ తెలిపినది వీరే.
(చూ.— శ్రీకాకుళక్షేత్రము వ్యాసము ఆంధ్రపత్రిక అనుబంధము).

(3) ప్రాచీనకాలమున శాసనాలలోను, చరిత్ర సంపుటాలలోను, పురాణాలలోను, అంధ్ర పదమే వున్నదికాని, ఆంధ్రపదము లేదని తెలిపినది వీరే.

(4) అహదనకరశాసనమును చిత్రాడసభలో లక్ష్మణరావుగారు అర్ధవివరణము కోరుతూ ప్రకటింపగా, కొంతకాలమునకు దాని అర్ధవివరణము తెలుపుతూ భారతిలో వ్యాసమును ప్రకటించినారు. వీరు అర్ధముతో ప్రకటించే కాలమునకు లక్ష్మణరావుగారు కీర్తిశేషులైనారు. వారే జీవించియుంటే ఎంత సంతోషించేవారో. వీరీ శాసనములను అర్ధవివరణముతో ప్రకటించిన తర్వాత పండితలోకమున ఎంతో సంచలనముకలిగినది. చరిత్రజ్ఞులలో జిజ్ఞాస రేకెత్తినది దుర్గమారణ్యమున ఒకబాట తీర్చిదిద్దటమే కష్టము కాని, బాట వేసిన తర్వాత కొన్నిచోట్ల ముళ్లున్నవని, మరికొన్ని చోట్ల మెట్టపల్లములున్నవని, ఒకచోట పొద అడ్డము వచ్చినదని యితరులు చెప్పటం తేలికే, అట్టిదే ఈకథ. (చూడండి భారతి సంచికలో)

(5) నాగబు శాసన విషయము.

ఆరుద్రగారు వ్రాసిన సంపుటములలో ఇది ఆదర్శముగా తీసుకొన్నారు.

(6) వినుకొండ వల్లభరాయ కృతిగా లోకమున ప్రచారములోనున్న క్రీడాభిరామము కవిసార్వభౌమ శ్రీనాథుని రచితమేనని సోపపత్తికముగా

నిరూపిస్తూ గ్రంథము సంస్కరించి పీఠికతో ప్రచురించటం.

(7) అన్నమాచార్యులవారి భార్య తిమ్మక్కను ప్రథమ ఆంధ్ర కవయిత్రిగా గుర్తించి సుభద్రా కల్యాణమును ప్రచురించటం. (చూ. తి.తి. దేవస్థానము వారి ముద్రణ.)

అవీ యివీ యింకా ఎన్నో ఉన్నాయి. ఎన్నని చెప్పేది? మరొకసారి చెబుతాను.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

---

1. "The film wanted by you is at Madras with my wife. When I next meet Sri Muktyala Rajah Garu at Madras, I shall send that film to you as desired by you." [S. B. P. B. K. S. Rao Dt. 10-11-1971]

చాటుపద్య-మణిమంజరి

[సంకలనం]

-వేటూరి ప్రభాకరశాస్త్రి

చాటుపంచచామరాల్

శరీర మగ్నిపాలు, బట్ట చాకిపాలు, ప్రాణముల్
పరేతరాజుపాలు, వాతిపైఁడి మాలపాలుగా
నెఱింగి యీ గులాలు ధర్మమేల చేయనేరరో
సిరామ రామ రామరామ శ్రీరమామనోహరా!

గురాలఁ బెట్టి మెట్లుమోసి కూళ్లు వండిపెట్టి వి
స్తరాకులమ్మి లంజెలిండ్ల తమ్మలెత్తి పిమ్మటన్
దొరైనవాఁడు ధర్మమైనత్రోవ ద్రొక్కనేర్చునా
సిరామ రామ రామరామ శ్రీ రమామనోహరా!

పరాంగనాజనంబుమీఁద బారుజెందువాఁడు ప
త్పురాణమార్గముల్ దొలంగిపోవువాఁడు విప్రులం
దురాసలన్ భ్రమించు లంజెదోపుగాడుమం దొరా
గరాసు మొండి దూఁబవాఁడుగాక బుద్ధినేర్చునా
సిరామ రామ రామరామ శ్రీ రమామనోహరా!

తఱట్లఁగొట్టి చెప్పుఁగాళ్లఁ దన్ని మొట్టి తిట్టినన్
గొఱట్లఁగాల్ప మూల దామకొన్న సొమ్ము లిత్తురా
నరండి మొండి బండగాడ్డె లర్థి కివ్వలేరయా,
సిరామరామరామరామ శ్రీ రమామనోహరా!

దరిద్రులైరి దాత, లాతతాయులైరి భూభుజుల్,
జరాయులైరి లోభు. లల్పజీవులైరి సజ్జనుల్,
ఖరాబులైరి మంత్రులెల్లఁ, గాల మెంత పెద్దదో
సిరామ రామ రామరామ శ్రీ రమామనోహరా!

* * *

నవనీతచోరాష్టకం

పళ్లని ప్రాణభీతిమెయి సారె భయంపడు దేహధారి గుం
డ్రాళ్లను రువ్వినన్ శితశరంబుల నాఁటిన రోగమొందినన్
నీళ్లమునింగినన్ రిపులు నిర్దయులై గరళంబువెట్టినన్
డ్రెళ్లనె బ్రహ్మవ్రాఁత కడతేరక యోనవనీతచోరకా!

ఘనమగు మంత్రిలేని నృపకార్యము నేరనివానివిద్య లు
బ్ధునిసిరి వృద్ధనారి రతి భూసురుపో టవివేకినీతి మ
త్తునిచదు వల్పుతో చెలిమి తూకొని మేలని లోకమెంతురే
కినియుచు నెంత హాయనుచుఁ గేరక యోనవ నీతచోరకా!

లక్షవ్రతంబులుండి పదిలక్షలు తీర్థములాడి భస్మరు
ద్రాక్షజటాచ్ఛటాభరణులై మునులై వనులం జరింపనా
యక్షయ కాలకింకర భయంకర బాధ లణంపవచ్చునే
కుక్షిని మీ పదామృతము గూరక యోనవనీతచోరకా!

ఆసలు పుత్రమిత్రజనకాదులఁబాసి మహోపవాసులై
దాసులటంచుఁజేరి సతతంబును వంచనలేక మానవుల్
గాసముఁ బెట్టుమంచు బరిగంటును గొల్చిన మేలుగల్గునే
దూసలుచారి యెత్తుబడి దోరక యోనవనీతచోరకా!

పసరముకై వడిన్ విటుఁడుపైఁబడి తుచ్ఛపుబంధరీతులన్
గుసుమమ వేచినట్లు కుసిగింపులు చేసినమేలుగల్గునే
నిసితమనోజ బాణనిభనిర్మలకాంతి నఖాగ్రపంక్తులన్
గిసలయపాణి చన్మొనలు గీరక యోనవనీతచోరకా!

పసగల యాచకుండు జనభావమెఱింగి మెలంగగావలెన్
రసికునివిద్య కాదనక రమ్మని ప్రార్థనచేసి మెచ్చినన్
గొసరక యీనివాని మఱిగొబ్బునఁ దిట్టక చారు కీర్తితో
పొసగని లోభితో జరుగుపోరక యోనవనీతచోరకా:

గదరున రాకుమారకుఁడు కండలు బెంచుక యూరకుండితే
విదితబలంబు శౌర్యమును విస్మితకీర్తులు గల్గనేర్చునే
బెదరొకయింత లేక యతిభీకరబంధుర యుద్ధభూమిలో
నెదిరిన వైరికోటి తలలేరక యోనవనీత చోరకా!

కసరెడికాపు ధూర్తయగుకామిని దుష్టగుబంటు వట్టిరా
జసమున నుబ్బుసుంకరి నిజం బొకయింతయులేనిదాసి న
ప్పసమును రమ్ముపొమ్మనియుఁ బ్రార్థనచేసిన లెక్కసేతురే
పసలక చేతికొద్ది బడిమారక యోనవనీతచోరకా!

⁂

కొన్ని జ్ఞాపకాలు

-బులుసు వేంకటరమణయ్య

పూజ్యులు, పితృతుల్యులు, బహుముఖ పాండిత్యప్రకర్ష కలవారు అయిన శ్రీ ప్రభాకరశాస్త్రి గారి ప్రతిభాపాండిత్యాలు ఎరగనివారు లేరు. వాటిని గురించి నేను చెప్పడం అనవసరం. వారి ఉదార-అమృత హృదయాన్ని తెలిపే నా అనుభవంలోని కొన్ని సంఘటనలు మాత్రం తెలుపుతాను. ఇందులో స్వవిషయం కొంత రాక తప్పదు. దానికి పాఠకులు నన్ను క్షమిస్తారనే నా నమ్మిక.

అది 1933 జూన్ నెల చివర. నేను ఉద్యోగ ప్రయత్నంలో విజయనగరం నుండి మద్రాసుకు వస్తూ. ఒక మృగతృష్ణతో నడుమ మచిలీపట్నానికి వెళ్లాను. ఒక పరిచయలేఖతో ఫ్రెంచిపేటలో రిటైర్డు జిల్లా జడ్జి పండిత్. నాగేశ్వరావుగారి యింట బస చేశాము. ఆయన, అక్కడ నాగురించి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయనకున్నూ చీకాకనిపించి 'మీవంటివారు మద్రాసు వెళ్లడమే మంచిది. ఇక్కడ యోగ్యత గమనించే వారు ఉండరు' అన్నారు. వారి యింట్లోనే ఒకభాగంలో శ్రీ శాస్త్రి గారిఅన్నగారు వేంకటశివశాస్త్రిగారు అద్దెకున్నారు. ఈ రీతిగా ఆయన పరిచయం మొదట కలిగింది. ఆయన నన్నభిమానంతో చూచారు. "మీ తమ్ముడిగారికి పరిచయలేఖ ఇవ్వండి" అని అడిగాను. "అవసరం లేదు. అయినా, మీరడిగారు కాబట్టి యిస్తున్నా" నన్నారు ఆయన చిరునవ్వు నవ్వుతూ. నేను మద్రాసు వచ్చి చిరపరిచితులు పేకుమళ్ల పాపయ్యశాస్త్రిగారితో కలిసి కొన్నిదినాలుండవలసి వచ్చింది : ఆయనే నన్ను శ్రీశాస్త్రిగారి దగ్గరకు తీసుకొని వెళ్లారు. నేను నా ప్రవర చెప్పుకొని, మద్రాసు వచ్చిన పనిని తెలుపుతూ వారి అన్నగారిచ్చిన పరిచయలేఖను అందించాను. ఆయన మడత విప్పి చూచి, వెంటనే మడిచి ప్రక్కన పెట్టారు. ఆజాబు పూర్తిగాచదివారని నాకుతోచలేదు.

"సరే! మీ గురువుగారికి వ్రాసి వెంటనే ఒక పరిచయలేఖ కుప్పుస్వామిశాస్త్రిగారికి తెప్పించి, నాలుగురోజుల తర్వాత కనబడండి" అన్నారు శ్రీ శాస్త్రిగారు. (మాగురువుగారు మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారు. ఆయనకు మద్రాసు ఓరియంటల్ లైబ్రరీ అధికారి కుప్పుస్వామి శాస్త్రి గారు మిక్కిలి పరిచితులు.) జాబు త్వరగానే వచ్చింది. శ్రీశాస్త్రిగారు - ఆ జాబుతో కుప్పుస్వామిశాస్త్రిగారిని చూడమన్నారు. శాస్త్రిగారు నెలరోజులు సెలవు పెట్టడం, వారి స్థానంలో నన్ను ఆక్టింగుగా నియమించడం జరిగింది. నా కెంతో ఆశ్చర్యం కలిగింది. శ్రీ శాస్త్రిగారి అమృత హృదయం అట్టిది.

శ్రీ శాస్త్రిగారు కార్యాంతరంమీద బందరు మున్నగు చోట్లకు వెళ్లదలచి సెలవుపెట్టారు. కాని, వెళ్లనక్కరలేకుండానే ఆయన పనులు జరిగాయి. ఆయన మద్రాసులోనే ఉండిపోయారు. ఆయన సెలవుపెట్టి ఇంటిలోనే ఉండిపోవడం లైబ్రరీలోని పండితులకు అపోహకలిగించింది. ఆయనకు అసిస్టెంటుగా అర్హతలులేని ఒక పండితుడు పని చేస్తున్నాడు. ఆతని స్థానంలో నన్ను నియమించడానికి శ్రీ శాస్త్రిగారు పన్నిన పన్నాగం యిది అని సంకుచిత దృష్టిగల పండితులకూ, ఆయనయెడ

అపారభక్తిగల ఆ అసిస్టెంటుకుకూడా అపోహ కలిగింది. ఈ సంగతి తర్వాత తర్వాత శ్రీశాస్త్రిగారే చెప్పారు, "మనం లోకంలో చాలా జాగ్రతగా ప్రవర్తించాలిసుమా!" అని హెచ్చరించారు. ఆ నెల్లాళ్ల అవకాశంలో నేను మార్గాంతరం చూసుకున్నాను. కాని, ధైర్యంచెప్పి నన్ను నిలిపిన శాస్త్రిగారి ఉదారత ఎన్నటికీ విస్మరింపరానిది.

వ్యక్తుల సామర్థ్యాన్ని గ్రహించి, ప్రోత్సహించి ఉపకారంచేసే విద్వాంసులలో వీరు అగ్రశ్రేణికి చెందినవారు. అట్టి వ్యక్తులతో తీవ్రమైన అభిప్రాయభేదాలున్నా, వాటిని మనస్సులో ఉంచుకోరు. భారతి సంపాదకవర్గంలో పనిచేసిన గన్నవరపు సుబ్బరామయ్యగారు ఓరియంటల్ లైబ్రరీలో కాపీయిస్టుగా పనిచేస్తున్నప్పుడు, ఆయన కార్యదీక్ష, బుద్ధినైశిత్యము శ్రీ శాస్త్రిగారిని ఆకర్షించాయి. శ్రీ నాగేశ్వరరావుపంతులుగారితో చెప్పి, ఆయనను భారతిలో ప్రవేశపెట్టినదీ శ్రీశాస్త్రిగారే! సుబ్బరామయ్యగారికి శ్రీ శాస్త్రిగారియందు గొప్ప గౌరవం! అయినా మతవిషయంలో ఇద్దరికీ చుక్కెదురు, వారిద్దరూ వాదిస్తున్నప్పుడు నేను దగ్గర ఉండి చూడటం తటస్థించేది. శ్రీ శాస్త్రిగారికి తీవ్రమైన కోపం వచ్చేది. నాకే భయమనిపించేది, కాని, ఆ కోపం తాటాకు మంట. వెంటనే చల్లారిపోయేది. ఉద్యోగం పోయి సుబ్బరామయ్యగారు శ్రమపడుతున్నప్పుడు శ్రీశాస్త్రిగారు, ఆంధ్ర యూనివర్శిటీవారు తమకప్పగించిన రంగనాథ రామాయణ సంపాదకత్వ బాధ్యతను ఆయనకు అప్పగించి రెండేళ్లపాటు ఉపాధిని కలిగించారు. ఇది ఆంతరంగికులైన ముగ్గురు నలుగురికి మాత్రమే తెలుసును.

ఇలాటిదే మరొక సంఘటన. మద్రాసు సైదాపేట టీచర్స్ కాలేజీ మోడల్ స్కూలులో పనిచేస్తున్న కాళ్లకూరి గోపాలరావుగారు రిటైరయి వారి పదవి ఖాళీగా ఉండినది. స్వాతంత్ర్యప్రియులు, ఆత్మగౌరవం అధికంగా గలవారూ అయిన శ్రీశాస్త్రిగారు ఎదురుతిరుగుటవల్ల అప్పటి ఓరియంటల్ లైబ్రరీఅధికారి పి.పి.యస్. శాస్త్రిగారు, శ్రీశాస్త్రిగారిని ఏమీచెయ్యలేక తన పలుకుబడిని ఉపయోగించి ఆయనను ఆ మోడల్‌స్కూలుకు ట్రాన్స్‌ఫరు చేస్తూ ఆర్డరు జారీ చేయించారు. శ్రీ శాస్త్రిగారు అక్కడికి వెళ్ళితే అక్కడ టెంపరరీగా పనిచేస్తున్న నరసింహదేవర సుబ్రహ్మణ్యంగారు ఆ స్థానం విడిచి వెళ్లిపోవలసి వస్తుంది. అందుకోసం ఆయన బెంగపడ్డారు. శ్రీ శాస్త్రిగారికి అక్కడికి వెళ్లడం సుతరామూ ఇష్టం లేదు. ఆరునెలలు వెంటనే సెలవు పెట్టారు. తాను సైదాపేట వచ్చేదిలేదనీ, ఎంతమాత్రం భయపడవద్దనీ సుబ్రహ్మణ్యంగారికి తెలియజెయ్యవలెనని నాతో చెప్పారు. ఆయన ఆనతిని శిరసావహించి నేను సైదాపేట పోయి, ఎలాగో సుబ్రహ్మణ్యంగారి బస కనుక్కొని యీ సంగతిని తెలియజేశాను. ఆయన మనస్సు కుదుటపడింది. సెలవు ముగిశాక శ్రీ శాస్త్రిగారు రిటైరయారు గాని, సైదాపేటకు వెళ్లనేలేదు. తర్వాత తిరుపతి ప్రాచ్యపరిశోధన సంస్థవారి ప్రార్థనననుసరించి అక్కడికి వెళ్లి స్థిరపడ్డారు. అప్పటినుంచి వారి సాన్నిధ్యం నాకు దూరమైపోయింది. మద్రాసుకు వచ్చినప్పుడు మాత్రం వారి దర్శనం చేసుకునేవాడను.

శ్రీశాస్త్రిగారు మందులకు కుదరని రుగ్మతతో బాధపడుతున్నప్పుడు వారికి మాష్టర్ సి.వి.వి. గారి (వారిపేరు వెంకాస్వామిరావుగారు) సంగతి తెలిసింది. ఆ మహనీయులు భృక్తరహిత రాజయోగాన్ని కనిపెట్టి తన్మూలంగా అసాధ్యాలైన రోగాలకు ట్రీట్‌మెంటు చేసి ఎందరినో ఉద్ధరించినవారు. శ్రీ శాస్త్రిగారు కుంభకోణం వెళ్లి మాష్టరుగారివద్ద ఉండి సాధనచేశారు. రుగ్మత మటుమాయమయింది. శ్రీశాస్త్రిగారికి మాష్టరుగారి శక్తులు సంక్రమించాయి. వారి అత్యంతాభిమానాన్ని చూరగొనిన ప్రత్యక్ష

శిష్యులు శ్రీ శాస్త్రిగారు. వీరి చికిత్సవల్ల ఎందరో రోగ విముక్తులయేవారు. ఈ ట్రీట్‌మెంటు పద్ధతిలో రోగుల బాధలను కొంతవరకు చికిత్సకులు మొదట్లో అనుభవించవలసి ఉంటుంది. తర్వాత తమ సాధన వల్ల తాము స్వస్థత చెందుతారు. ఈ పద్ధతిలో ఎందరో శ్రీశాస్త్రిగారివల్ల తమ రోగాలను పోగొట్టుకొనేవారు. ఉదయం, సాయంకాలం ఆరుగంటలకు ప్రేయరు. సాధన ప్రారంభమయేది. శ్రీశాస్త్రిగారి నివాసం— ట్రిప్లికేను, వెంకటరంగం పిళ్లై వీధి 4వ నెంబరు గృహం ప్రార్థనా కేంద్రమయింది. ఎందరో విద్యావేత్తలు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు వస్తూ ఉండేవారు. ప్రార్థనానంతరం ఇతర విషయాలను గురించిన చర్చలు కొనసాగుతూ ఉండేవి. శ్రీశాస్త్రిగారికి స్వాతంత్ర్యోద్యమం పట్ల అభిమానం ఎక్కువ. గాంధీ మహాత్మునియెడల ప్రగాఢమైన గౌరవం!

తెలుగుదేశంలోని విద్వాంసుల పాండిత్యాన్ని గురించి ఒకప్పుడు మాట్లాడుతూ నాతో ''మన పండితులలో ప్రతిభావంతులు నాకిద్దరే కనబడుతున్నారు. ఒకరు వేదం వేంకటరాయశాస్త్రిగారు, మరొకరు మీ గురువుగారు. (అంటే మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారు)'' "అని అన్నారు. "మరొకరు కూడా ఉన్నారు" అని నేను ఆయన ముఖం చూస్తూ అన్నాను. ఆయన నావైపు తీవ్రంగాచూచినా యథార్థం అంతే! మాస్టర్ సి.వి.వి గారొకప్పుడు "తమ శిష్యులంతా వారివారి అభిమాన విషయాలలో అగ్రశ్రేణికి చెందగలరని చెప్పారట! గురువుగారి ఆశీస్సు శ్రీ శాస్త్రిగారిపట్ల సంపూర్ణంగా ఫలించింది.

శ్రీశాస్త్రిగారు ఏవిషయాన్నిగాని మనస్సులో దాచుకోలేరు. ముఖంముందే అనేసేవారు. ఒక్కొక్కప్పుడు ఉద్రేకం కూడా కలిగేది. ఒకప్పుడు సంస్కృత కళాశాలలో పనిచేసి, ప్రిన్సిపలుతో పడక మద్రాసు వచ్చి ఒక స్కూలులో పనిచేస్తున్న పండితులొకరు ఆయనవద్దకు వచ్చారు. అప్పుడు రాత్రి 7 గంటలు. ఆ సమయంలో మా గురువుగారు చిట్టిగూడూరు సంస్కృత కళాశాలా స్థాపకులు, ప్రిన్సిపలు అయిన శ్రీ ఎస్.టి.జి. వరదాచార్యులు గారు, నేనుకూడా అక్కడ ఉన్నాము. ఆ పండితుడు తాను పనిచేస్తున్న కళాశాలలోని లోపాలన్నిటినీ వర్ణించి చెప్పసాగారు. అతని స్వభావం బాగా ఎరిగిన మాగురువుగారు, వరదాచార్యులుగారు వింటూ కూర్చున్నారు : యథార్థ విషయం తెలిసినా, నేనూ ఊరకున్నాను. శ్రీ శాస్త్రిగారు ''ఇలాంటి సంస్థ ఉండడంకంటె నశించి పోవడమే మేలు" అన్నారు. మాకు ఆశ్చర్యం కలిగింది. మర్నాడుఉదయం 7 గంటలకు నేను మాగురువుగారి వద్దకు వెళ్లేసరికి, వరదాచార్యులుగారు కూడా అక్కడ ఉన్నారు. (ఒకసంగతి చెప్పమరిచాను. మాగురువుగారు మద్రాసు ఎప్పుడు వచ్చినా శ్రీ శాస్త్రిగారి యింటిలోనే బస. ఆయన ఉన్నన్ని రోజులూ నేను ఆయనవెంట ఉండవలసినదే!) అప్పుడు నేను కళాశాల యథార్థవిషయాలను, దుష్ప్రచారానికి ఆ పండితుడు బెంగుళూరుదాకావెళ్ళిన సంగతిని — నాకు విశ్వాసపాత్రులు చెప్పినవి తెలియజేశాను. మా గురువుగారు ''వింటున్నారా ఈ సంగతి?" అని వరదాచార్యులుగారిని హెచ్చరించారు. ''మనకు తెలియదా ఆయన గురించి? లోపల ఉన్నవారువింటే బాగుంటుంది'' ఆన్నారు. శ్రీ శాస్త్రిగారు లోపల గదిలో ఉన్నారు. వారికీ ఇది వినబడింది. బయటికి వచ్చి "నీవు చెప్పినదంతా విన్నానులే! ఆయన నిజమే చెప్పాడనుకున్నాను'' అని నాతో అన్నారు. తర్వాత, ఆ పండితుడు శ్రీ శాస్త్రిగారిని కలుసుకున్నప్పుడు గట్టిగా చీవాట్లుపెట్టి పంపారు. ఇలాగని మీ కెవరు చెప్పారు? అని ఆయన అడిగితే శ్రీశాస్త్రిగారు నా పేరు చెప్పివేశారు. ఆతడు నావద్దకు వచ్చి నా మీద మండిపడ్డాడు. ఆకోపం తగ్గడానికి పదేళ్ళు

పట్టింది. ఇలా చెప్పుకునిపోతూవుంటే ఎన్నయినా జ్ఞాపకానికి వస్తూవుంటాయి! వాఙ్మయమత సిద్ధాంతాల అభిప్రాయాలనుబట్టి శ్రీ శాస్త్రిగారికి నచ్చని వారు. నాకు చాలా పరిచితులు ఉన్నారు. ఈసంగతి శ్రీ శాస్త్రిగారికి తెలుసును. అయినా నా యెడల ఆయనకు అసంతృప్తి కలగలేదు. ఎంతో అభిమానంతో చూచేవారు. వారి కుమారుడు చి. ఆనందమూర్తికి అక్షరాలు నేర్పే బాధ్యత నాకే అప్పగించారు. చి. గురుప్రసాద్‌ను నేను పనిచేస్తున్న స్కూలులోనే ప్రవేశపెట్టారు. నా సాహిత్యకృషికి ఎంతో ప్రోత్సాహం ఇచ్చేవారు. కావలసిన గ్రంథాలు, శాసనసంపుటాలు ఇచ్చేవారు. వారి ప్రోత్సాహమే లేకపోతే నా స్వల్పసాహిత్యసేవకు అవకాశం ఉండేదికాదు. శ్రీ ప్రభాకరశాస్త్రిగారిది అమృతహృదయం. "ఎందు మనంబు నవ్యనవనీతము" అనే నన్నయభట్టు వాక్కునకు ఆయన అసలైన దృష్టాంతం!

* * *

అప్పు పడియున్నదయ్య మా ఆంధ్రభూమి

-డా॥ ఉండేల మాలకొండారెడ్డి

[1951 సెప్టెంబరు 2 వ తేదీ మద్రాసులోని కిన్నెరపత్రికా కార్యాలయమున జరిగిన శ్రీ ప్రభాకరవర్ధంతి సభలో శ్రీ ఉండేల మాలకొండారెడ్డి చదివిన పద్యరత్నములివి- సం॥]

ప్రాక్కల్పగర్భ గుప్తములైన వెలలేని
    ఆంధ్రచరిత్రల కాయువొసగి,
అతి జీర్ణ తాళపత్రారణ్యముల జొచ్చి
    జీవౌషధలతల్ సేకరించి,
ద్రవిడ కర్ణాట సారస్వతాంభోధుల
    గాలించి మేలిముత్యాలుగూర్చి,
పాండితీశౌండీర్య భర నమ్రలేఖినీ
    ధారచే మృదుకావ్యతతి సృజించి,

పలుకుల వెలంది తళుకు జెక్కిళులమీద
తెలుగుమెఱుగుల సాంధ్య రక్తిమలు చింది,
జాఱిపోతె! ప్రభాకరా! చరమదిశకు
ఘోర తిమిరంబు మా యింట గుప్పవోసి॥

తిరుపతి పుణ్యతీర్థమొక దివ్యనివాసమెకాదు, సత్కళా
శరణమటంచు గర్వముగ జాటితి మిప్పటిదాక, నీ వటన్
దిరమయి యుంటజేసి, అదితీరె, నదృష్టముజాఱె, పండితుల్
ఇరమ ఋషిన్ గవీంద్రు నెడబాసితి మూఱటగల్గనేర్చునే?

తెలుగు జగాన నేడు నినదించెడు సత్కృతి వీణలెల్ల, మీ
"తొలినుడి" షడ్జమస్వర మధూళిమలన్ జవిచూచె, మీ తపో
బలమున వెల్గుజూచిన యపార పురాంధ్ర కళాచరిత్ర మీ
యలఘు యశోవధూటికి శిఖాభరణంబయి నిల్చె సత్కవీ,

మంజుల చాటూక్తి మణిమంజరీశ్రేణి
శారదాంగనకు వక్షమున నిల్పి,
అరసున్న పుట్టించి చరితంబు శోధించి
సరసుల కర్ణభూషణ మొనర్చి,
నిరత యోగాభ్యాస నిభృతాత్మబలసిద్ధి
ఆపన్నజన రసాయనముచేసి,
జీవదయామృతస్నిగ్ధ హృత్పాత్రంబు
దైవకైంకర్య సాధనముచేసి,

ఆలు బిడ్డలుగలుగు సన్యాసి యనగ
ప్రతిఫలముకోరకయె పాటుపడిన నీకు,
అప్పు పడియున్నదయ్య మా ఆంధ్రభూమి
పుణ్యగుణగణ్య! వేటూరి బుధవరేణ్య!

* *

గాంధిరామాయణం

సంకలనం

[గత సంచిక తరువాయి]

7

1948 జనవరి 3॥ సాయంత్రము మైలాపూరు లోని రసికరంజన సభలో జరుగుచున్న త్యాగరాజు 101 వార్షిక ఉత్సవములను చూచుటకై వెళ్ళియున్నాను. ఆనాటిసభకు గౌ॥ బెజవాడ గోపాలరెడ్డిగారధ్యక్షులు. ప్రార్థనానంతరము వారు లేచి మాట్లాడ మొదలుబెట్టిరి. సాయంత్రం 6 గంటలవేళ ఎవరో వేదికపైకి తొందరగావచ్చి ఒకరిద్దరితో నెమ్మదిగా మాట్లాడిరి. తరువాత శ్రీ గోపాలరెడ్డి గారితో ఏదోచెప్పిరి. అప్పుడు రెడ్డిగారు గాంధీ మహాత్ముని ఎవరో తుపాకితో కాల్చిచంపిరని రేడియోవార్త వచ్చినట్లుచెప్పి ఒకటిరెండు మాటలు గద్గదస్వరముతోచెప్పి తమ సంతాపమును వెల్లడించి సభను చాలించి వెళ్లిపోయిరి. ఇంక సభవారందరు కొంతసేపు ఏమియును తోచక, ఒకరితో ఒకరు వారివారి మనస్సులోని భయము, విషాదమును తెలుపుకొనుచు ఆశ్చర్యముతో విభ్రాంతులై నెమ్మదిగాసాగి గుంపులుగుంపులుగా, బైటనిలిచి మాట్లాడుకొని, క్రమముగా ఇండ్లకు వెళ్లిరి. ఏదో పెద్ద దెబ్బతగిలినట్లు అనిపించినది. గుండెలో ఏదో దిగవేసినట్లు బరువు అనిపించినది. ఎవరితో మాట్లాడ మొదలిడినా ఏడుపువచ్చుట, గొంతుకలోమాట తడబాటు మొదలెట్టినవి. అప్పుడు నన్ను 10 నిముషముల క్రిందటనే విడిచిబెట్టి వెళ్లిన చి.నా పెద్దవాడు దారిలో ఈ ఘోరవార్త తెలిసికొని, నాకై తిరిగి రసికరంజని సభకువచ్చి బైటను వేచియున్నాడు. అతనినికలసి, ఇంకొక మిత్రునితో బైలుదేరి కారెక్కి ఇంటికి వెళ్లినాము. దారిలో ఈ ఘోర వార్తను గురించి మాట్లాడుకొనుచు, దారిపొడుగున గుంపులుగుంపులుగా చేరియున్న జనాలనుచూచుచు, రేడియోఉన్న చోట్లనున్న పెద్దగుంపులను ఒకటి రెండుచోట్ల చూచుచు ఇంటికి చేరితిమి. అప్పటికప్పుడే రేడియో ద్వారా ఈ వార్తనువిన్న ఇంటిలోని కోడలు, కూతురు, మనుమలు అందరు బిక్కమొగముతో ఉన్నారు. ఇంటిలోని అందరకు ఒక విధమైన దిగులు కలిగియుండెను. చిరంజీవులగు మనుమలకు ఏదో తెలియని ఒక భావము కలిగి మాట్లాడక రేడియోవద్దనే మావద్ద అల్లరిమాని కూర్చొని యున్నారు. అలా రాత్రి 11 గంటల ప్రాంతము వరకు రేడియోవింటూనే హత్యవివరములను తెలిసికొంటూ ఉన్నాము. అనేకసార్లు వార్తలు వినినప్పుడల్లా కండ్లనీళ్ళు పెట్టుకుని, లోలోన, కొంచెము పైకి ఏడ్చుచు, నేను రేడియోవద్ద కూర్చునియున్నాను రఘుపతి రాఘవరాజారాం పతితపావన సీతారాం, అని పాడినప్పుడల్లా గుండెఝల్లుమని అయ్యేది. కొంతకాలము ఆ పాట విన్నప్పుడల్లా అలాగుననే ఉండేది. క్రమముగా కాని తగ్గలేదు. ఆ రాత్రి నిద్దుర కలతగావుంది. మరునాడు తెల్లవారినది లగాయతు రాత్రివరకు రేడియోవద్దనే కూర్చుని దిగులుతో

ఏడుపుతో కాలము గడిపినాను. ఢిల్లీలో మృతకళేబరమును ఊరేగించి తీసుకుని రాజఘాటువద్ద దహనసంస్కారముచేసిన వృత్తాంతమంతయు కొన్ని గంటలకాలము వినుచు ఇతరమును మరచి, ఏడ్చుచు వేదనతో చతికిలబడియుంటిని. ఈ విషయమిప్పుడు తలపునకువచ్చి వ్రాయుచుండగాకూడా లోపల ఏదో ఒక బాధకలుగుచున్నది. ఆనాడు ఇల్లు కదలలేదు. ఎవ్వరూ పిల్లలుకూడా, కదలలేదు. మాపెద్ద వాడు మాత్రము 2—3 గంటల కాలము తన ఆస్పత్రికివెళ్ళి తిరిగివచ్చి ఇంటనేఉండిపోయినాడు. మూడవనాడు సాయంత్రము కాస్మాపాలిటన్ క్లబ్బుకు వెళ్ళినాను. అచ్చట అందరు ఈ విచారవిషయముసుగురించి మాట్లాడుకొని చాలా బాధపడిరి. కొన్ని చోట్ల ఇంగ్లీషు తెలియనిస్త్రీలు రేడియోవద్దనేకూర్చొని వింటూ ఏదో తెలియనిబాధనుపొందుచూ ఏడ్చుచూ కూర్చున్నారని కొందరి మిత్రులు చెప్పసాగిరి. చెన్నపట్టణమందు ఆ రోజులలో ఒక వింత నిరుత్సాహము అశాంతి, స్పష్టముగా గుర్తించబడినవి.

తరువాత చాలా రోజులవరకు రేడియోవార్తను వీలైనంతకాలమూ ఈనాటి విషయమును గురించిన విశేషములసు ప్రచారము చేసినప్పుడల్లా ముందే గుర్తుంచుకొని తప్పకవినుట, వినినప్పుడల్లా దిగులు ఏడుపుకలుగుటగా ఉండెను. అలా ఆదిగులు 20 దినములు వరకు ఉండెను. క్రమముగా తగ్గినది.

గుంటూరు
23—1—50 | విస్సా అప్పారావు

8

మామూలువెంట ఆ దినముకూడ సాయంసమయపు భజన ముగించుకొని త్వరగావెళ్ల నీవు ఏదో వింటావని మనస్సు తరుముటచే వచ్చి రేడియోవద్ద తెలుగులో వార్తలు వినుటకు కూర్చుంటిని. ఇక ప్రారంభమయినది. ప్రథమముననే ఈ దినము దుర్దినమనీ, వార్త తెలుపలేకున్నానని ఇంకా గుర్తు లేవుగాని ఎన్నో చెప్పుచుండగనే మనస్సు రెపరెపలాడినది. గుండె దడదడమన్నది, ఇంకా చెప్పక ఆలస్యము చేస్తాడేమా అనిపించినది. ఏమయివుండునా! అని ఎన్నో ఆలోచనలు ఒక్కుమ్మడిగా ఆవరించినవి. చివరకు ''మనబాపూ మనను వీడినాడు. ఎవరో ఒక దుర్మార్గుడు తన పిస్తోలుతో ప్రార్థనకు వెళ్లుచున్న మహాత్ముని కాల్చినాడు'' అంతవఱకు మాత్రమే నేను వినగలిగితిని. శరీరమంతా వేడియెక్కెను. కుర్చీమీదనుంచి లేచి అసలు నిజమో అబద్ధమోనను సందియముతో, ఈ వార్తను వెంటనే పిల్లలనుబంపి అందఱకూ తెలియపఱచితిని. రెండు నిముసాల్లో అంతా రేడియోచుట్టూ జేరిరి.

ఇది అబద్ధమని మరల చెప్పునేమో ననిపించెను. కాని క్షణక్షణానికీ నిజమని దిట్టపడసాగెను. ఒక ఆలోచనగాదు. అయోమయములో పడ్డాను. మనసారధి మనలను వీడినాడా! నేను మద్రాసులో చూచినపుడు మహాత్ముని వక్షస్థలమేదో ఒక విధమగు కాంతితో రాగివర్ణముతో కాన్పించినదే! అట్టి వక్షములోగుండు ఎటుల చొచ్చుకొనిపోయినది? హింస, అహింసనే జయించినదా! అనియూ నాలో యెన్నెన్నో ఆలోచనలు పుట్టెను. తలంతయూ బఱువెక్క సాగెను. వెంటనే తలపై చన్నీళ్లస్నాన మాచరించితిని.

ఆ రాత్రంతయూ ఏదో భయముతో నిద్రపట్టలేదు. ఇక తెల్లవారి అంత్యక్రియలన్నీ రేడియోప్రసారముద్వారా విన్నాము. ఇక ఆ భజన చెప్పువారెవరు? చేయువారెవరు? మహాత్ముని భజనలో

పాల్గొన్న పిదపనే మేమూ, ఇచట భజన ప్రారంభించితిమి. రెండవరోజున భజనకు వెళ్ళితే పెద్ద దుఃఖము వచ్చినది. కాని వెంటనే గీతయందలి "నైనంఛిన్దన్తిశస్త్రాణి" అను శ్లోకము స్ఫురణకు రాగా కొంత వూరట కలిగెను.

మనందఱకూ సత్యాహింసలనే త్రోవ చూపించెను. తనతో రమ్మని పిలిచెను. సోపానములు చూపించెను. మహాత్ముడు పైమెట్టు యెక్కగలిగినాడు మనమో చివరిమెట్టుకూడ చేరలేకున్నాము. తానూ మనలోనేవుంటే చుట్టూనున్న మనమంతా కన్పించము గావున పైనుండి అందరి ఆత్మలనూ సన్నిహితం చేసుకొని సరిదిద్ది తనలో ఐక్యమొనరింపవలెననియే మన మధ్యనుండి నిర్గమించెను.

ఇక ఇప్పటి ప్రజలనుభవించు భయభ్రాంతులన్ననో! మహాత్ముల రక్తము భూమిపై పడిన వృధా పోవునా! జాతిపిత హత్యాఫలితము జాతియేగాదు ప్రపంచమంతా పంచుకోవలసినదేగదా త్వరలో ఒక దివ్యశక్తి ఉద్భవించి ఈ భయాందోళనలను నడంపవలెనని ప్రార్థిస్తూవున్నాను.

ముక్త్యాల
28–1–50

ఇట్లు,
రాజా వాశిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ.

⁂

మంగళహారతి



ప్రభాకరశాస్త్రిగారి జనకులు
వేటూరి సుందరశాస్త్రిగారి కృతులు

మంగళం శుకశ్యామలాంబకు
శ్రీ మంత్రమూర్తికి ॥మం॥

౧. మంగళం పికవాణికి – మంగళం మృదుపాణికి
మంగళం ఫణివేణికి – భవురాణికి భద్రకాళికి ॥మం॥

౨. తత్త్వసారస్వరూపకూ – తప్తకాంచనచేలకూ
దాసాత్మసుమోదకూ – దరకంఠకూ దైత్యలుంఠకూ ॥మం॥

౩. సత్యమార్గ ప్రవర్తికి – సనకాది మౌనిస్తుత్యకు
సారసదళనేత్రికి – సమవర్తి భయనివర్తికి ॥మం॥

౪. ఇందుజూటోల్లాసికి – సుందర కవిపోషకూ
ఇందువదనకు హారికి – బిందువాసికి భీతశోషికి ॥మం॥

౫. కైళలూరునివాసికి – కలుషగణవిదారికి
కనకకౌశేయకు – కమలాక్షికి కౌమారికి ॥మం॥

స్మృతిపథంలో

—శ్రీమతి లలితా రామచంద్రరావు

జగమెరిగిన బ్రాహ్మణునికి జందెంబేల?

కుంభకోణం మాస్టరు సీ.వి.వి.గారి శిష్యులలో కొందఱు (శ్రీప్రభాకరశాస్త్రిగారు), ఎన్‌ఆర్‌బివి (ఎన్‌ఆర్‌బివి వేంకటాచలపతిగారు) తాతిగారు (ప్రణతార్తిహర అయ్యంగారు) వెంకటరమణరావు (హిందూ హైస్కూలులో ఉపాధ్యాయులు) మాపిళ్లై (మహాదేవయ్యరు) మొదలైనవారితో ఒకానొక సందర్భమున శ్రీ ప్రభాకరశాస్త్రిగారి యింట ప్రేయరుగోష్ఠి జరిగినది. తదనంతరం శాస్త్రిగారి యింటనే భోజనముల ఏర్పాటు కూడ జరిగినది. అప్పుడు వారి యింట యోగమిత్రులు శ్రీ వేంకటసుబ్బయ్యగారు, వారి సతీమణికూడా ఉండిరి. సహాయము చేయుచుండిరి. విందు బాగా జరిగినది. భోజనానంతరం ఎంగిలివిస్తళ్లను తీయు సమయమున శ్రీఎన్.ఆర్.బి.విగారు బ్రాహ్మణులు కాకపోవుటను కారణముగాగల ఆచారముచేత ఆ విస్తరిని ఇంట నాడువారు తీయుటకు వీలుకాకుండెను. శ్రీశాస్త్రిగారే దానిని ఎత్తవలెనని సంకల్పించుచుండగా శ్రీ వెంకటసుబ్బయ్యశాస్త్రిగారునూ ఆపనికి పూనుకొనిరి. శ్రీ శాస్త్రిగారు వారిని వారించులోగా వేంకటసుబ్బయ్యశాస్త్రిగారు మీరు లేవనక్కరలేదు నేనున్నానుగదా అని తొందరగా పని పూర్తిచేయుచుండిరి. ఒకరినొకరు నేనున్నానుగదా అంటే నేనని మీరు వద్దంటే మీరు వద్దని పోటీపడి, ఒకరి చేతిలో పనిని మరియొకరు లాగుకొనుచుండగా శ్రీ వేంకటసుబ్బయ్యశాస్త్రిగారి జందెము ప్రభాకరశాస్త్రిగారి చేతిలో చిక్కుకొని పెనుగులాటలో తెగినది. అప్పుడు ఇద్దరూ ఆశ్చర్యచకితులైనారు. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తేరుకొని ''చూచావయ్యా ఎన్‌ఆర్‌బివి విస్తరి తీయుటకు అడ్డువచ్చే మన యీ బ్రాహ్మణ్యమునకు యీ జందెము(బ్రాహ్మణసూచకము) అవసరము తీరినది. మనయీపట్టింపులకు అర్థములేదని తేలినది" అని నవ్వి తన జందెము నుండి పోగులను వెంకటసుబ్బయ్యశాస్త్రిగారికి బహూకరించిరి.

గంధము అక్షతలు

ఉదయం ప్రేయరు కాస్త ఆలస్యమైనది. ఆరోజే నీళ్లు పోసుకుని వంట ప్రారంభించేసరికి మహాలక్ష్మమ్మగారికి వేళకు శ్రీ శాస్త్రిగారికి వంట వండి భోజనమును ఏర్పాటు చేయుటలో చాలా తొందరైనది. హడావిడిగా స్నానము ముగించుకొని శ్రీ శాస్త్రిగారు పీటవాల్చుకొని కూర్చుండిరి. టైము లేదు త్వరగా వడ్డన కానిమ్మని తొందరచేయసాగిరి. ఇంతలో భోజనమునకు ముందు ముఖమున పెట్టుకొనుటకు గంధాక్షతలు తయారుకాలేదు. ''ఏమే! సద్బ్రాహ్మణుడను బొట్టు లేకుండా ఎట్లా భోజనము చేసేది? ఇంత ఆలస్యమైతే ఎట్లా?'' అని చీకాకు పడిరి. ''అవును ఎంత హడావిడిగా నేను ఎంత తొందరపడిననూ చేతిపని తీరలేదు. నేనీరోజుననే ఇంత హడావిడిపడి వండివార్చుటకు లేని అభ్యంత

రము ఒకపూట మీరు బొట్టులేకుండ భోజనము చేస్తే వస్తుందా? అనిరి."

"అవును నీవు చెప్పినది నిజమే! ఈబొట్టు పెట్టుకొనకున్నా బ్రాహ్మణ్యమునకు ఏ అభ్యంతరము ఉండకూడదు. సరే యీ రోజునుండి వానిని విడిచేస్తున్నాను" అనిరి. అంతే ఆతర్వాత శ్రీశాస్త్రిగారు గంధాక్షతలను ధరించుట మానివేసిరి.

అనారోగ్యము - మందులవాడకము- ప్రేయరు ట్రీటుమెంటు

ఇంట్లో పసివాండ్లకు అస్వస్థత కలిగినప్పుడు రిక్షాలో వారిని వైద్యముకొరకు డా॥నారాయణస్వామి మొదలియార్‌గారి వద్దకు తోడ్కొని వెళ్లి పరీక్ష చేయించి, మందుచీటీ తీసుకుని ఆతర్వాత పిల్లలను ఇంటివద్ద దిగవిడిచి మరల ఆమందులకై ఎమ్ సి ఎన్ (ఎమ్‌సి నంజుండరావు) మందుల డిస్పెన్సరీకి వెళ్లి తీసుకొని వచ్చుట శ్రీ శాస్త్రిగారికి పరిపాటిగా ఉండేది. వైద్యుని వద్ద తమ వంతు వచ్చేవరకు వేచియుండుట— తదుపరి ఎమ్‌సిఎన్‌వద్ద ఔషధముల తయారీకై వేచియుండుటవలన ఉదయమంతా ఆపనితోనే సరిపోతుండేది. ఎంత తొందరపడినను ఎగ్మూరులోని ప్రాచ్యలిఖిత భాండాగారమునకు (ఆఫీసుకు) ట్రిప్లికేన్‌నుండి చేరుటకు ఆలస్యమగుచుండెడిది.

ఇట్లే తరచు ఆలస్యముకాగూడదన్న భావముచేత భోజనము చేయుటకు కూడా వ్యవధి లేక ఎన్నో మారులు భుజించకనే వెళ్లుచుండేవారు. ఇంతజేసియు వీరు ఆఫీసునకు ఆలస్యముగా యత్కించితైనను వస్తున్నారనేమాటను పైఅధికారియైన క్యూరేటరు గారికి కొండెము చెప్పేవారికి కొదవలేకుండెడిది. ఈ విషయములన్నియు శ్రీ శాస్త్రిగారికి మరింత చీకాకు కల్గించుచుండెడివి.

సరే ఇకపైన పిల్లలకు ఆరోగ్యము సరిగా లేనప్పుడు వైద్యము చేయించుటకు మందులను తెచ్చుటకు కాలము వినియోగించి ఆలస్యముగా వెళ్లుటకంటే పసివాండ్ల ఆరోగ్యము సరిదిద్దు బాధ్యత శ్రీ మాస్టరుగారిపైననే వేసి ప్రేయరువల్లనే సర్దుకొనవలననే భావము వారికి బలపడినది. మందులకు మందు వెందువోని మందు మాస్టరు శక్తిలోన పని చేయుచుండగా ఈ మందులవెంట తిరిగి కాలహరణము చేయనేల అన్నభావము వారిలో కుదుర్కొనుటకు ఒక అవకాశమును కలిగించినది. అంతే. ఆతరువాత వారిక ఔషధసేవనము త్యజించిరి. బిడ్డలకు ఆరోగ్యమును చక్కబడినవి. తదాదిగా ఎంత అనారోగ్యమైనను డాక్టర్ల వద్దకు వెళ్ళకయే మందులువాడకయే ప్రేయరువల్లనే అందరికీ స్వస్థత చేకూరుతుండేది. ఈ ప్రేయరు ట్రీటుమెంట్లు క్రమముగా ఇతరులకు, దీర్ఘవ్యాధులను తగ్గించుటకు, వైద్యమువలన నయముగానివానిని, అల్లోపతీ వైద్యమున మందులు లేవనే రుగ్మతలను నయము చేయుటకు మార్గదర్శకమైనది.

శాఖాభేదములు

ప్రతిదినము సాయంకాలపు ప్రార్థన జరిగిన తరువాత ఏదో విషయమై శ్రీ శాస్త్రిగారు వచ్చిన పెద్దలతో భాషించుట అలవాటు. మాస్టరుగారి సాన్నిధ్యమున జరిగిన ముచ్చట్లు, ప్రార్థనవల్ల కలిగిన దివ్యానుభూతులు, రకరకాల అనారోగ్యములను నివారించుటకు జరిగిన ప్రేయరు ట్రీటుమెంట్లు మొదలుగాగల ఎన్నో విషయములు గాంధీ సిద్ధాంతములు, అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ, అహింస, నాన్‌వయొలెన్సు; ఎన్నో విషయములు విశేషములు చర్చకువచ్చేవి.

ఒకానొకసందర్భంలో(1934ఆప్రాంతంలో) వర్ణభేదములు, శాఖాభేదములను గురించి తీవ్రముగా

చర్చ జరిగినది. ప్రతి సాయంత్రమువలెనే ఆ దినమున్నూ శ్రీ విస్సా అప్పారావుగారు ఇతరులూ చర్చలో పాల్గొంటున్నారు. అప్పుడు శ్రీ శాస్త్రిగారు ''చూడండీ అప్పారావుగారూ! ఉదాహరణకు మీరు నియోగ శిఖామణులు. నేను వైదికులలో అగ్రగణ్యుడనే. మన స్నేహము చాలా కాలముగా సాగుచున్నది. మన అభిప్రాయములు ఆంతర్యములు కలసినవేకదా! అయినా వివాహసమస్య వచ్చేసరికి మనము వియ్యమందగలమా? మన శాఖాభేదములు అడ్డువచ్చునుగదా. ఏమిటి మన సంస్కారము — మన యీ చర్చలు వేదికాలంకారములేనా— ఈ మాత్రమైన సహనమూ సమభావనే మనకు లేనప్పుడు కులమత భేదముల సమస్యతీరేదెట్లా?'' అనిరి. పైగా నావంతుకు సంస్కారవంతుడైన యువకుడు ఎదురుపడితే వాడే కుల సాంప్రదాయమువాడైనా వాని గుణసంపదను చూచి నాకుమార్తెను వానికిచ్చి వివాహాము చేయుటకు నేను సిద్ధపడతాను అంతా అట్లే సిద్ధపడగలగాలి అప్పుడుగాని యీ విభేదములు పోవు"అని దృఢముగా బల్కిరి— అదే నాంది ప్రస్థావనగా శ్రీ శాస్త్రిగారు శ్రీ అప్పారావుగారు వియ్యమందుటకు దారితీసినది. అది అంతటితో ఆగలేదు. శ్రీ శాస్త్రిగారి కుమారునికి శ్రీ అప్పారావుగారి మరదలు కుమార్తెనిచ్చి పెండ్లిచేసిరి. తమ రెండవ అల్లునిగా తెలగాణ్య యువకుని స్వీకరించిరి.

* * *

ఆత్మనివేదన

–వేటూరి ప్రభాకరశాస్త్రి

కవితా పట్టముఁ గట్టుకోఁ దొలుత వేడ్కల్ రేగె నాకుం గృతుల్
చివురొత్తెన్ వెస మోముమొత్తె నిఁక నాచేఁజెల్ల వీకల్లబొ
ల్లి వినోదంబు లివే జరామరణముల్ చీడల్ హతంబార్చి పు
ట్టువు చెట్టున్ సఫలీకరించుకొని యంటుల్ గట్టెదన్ మాలినై. 1

ధనసంపాదన తత్పరత్వమున వంతల్ సెంద నుద్యోగపుం
బెనుపుల్ వొందఁగ వందుఱన్, సుకవితా విద్యావిశేషమ్ములన్
ఘనతంగోరి తపింప నీపయి జగత్కల్యాణమైపొల్చు నీ
యనవద్యస్థిర సత్కృపాగరిమమే యర్థింతు నాత్మేశ్వరా ! 2

నన్నున్ వర్ణనసేయగా వలవదన్నా కన్నయందాఁక మీఁ
దన్నీవర్ణనమెందు కిందులకుఁ గొందాఁకన్ బ్రతీక్షింపు మం
చు న్ననూర్చిన యుష్మదాజ్ఞకు నెదుర్చూపై గృహద్వారమం
దున్నాఁడన్ గనరాఁగదే కనుటకర్హున్ నన్నుఁ జేయంగదే! 3

వచ్చెను నేఁటి కర్వదగు వర్షము పుట్టవుఁదొట్టి! గర్భముం
జొచ్చుటఁదొట్టి నాకరయఁ జూచిన నేఁటికె షష్టిపూర్తి, యీ
వచ్చినయేఁడు నిండిన ధ్రువంబుగఁగాగల షష్టిపూర్తితో
నిచ్చటనాకుఁ గావలయు నిష్టికిఁబూర్తియు సృష్టిపూర్తియున్. 4

ఆసల్ రేపఁగ నంతరంగపుటరణ్యం బంధకారమ్మునన్
దాసోహమ్మని చొచ్చితిన్ వెదక నంతర్యామి నాలో నెదో
భాసిల్లెన్ జిణువెల్గు, చేరఁజన దావమ్మయ్యె నాయగ్నిలో
నే సోహమ్మయి నిల్చితిన్ బిదప నేదీ నాతనం బయ్యెడన్. 5

వర్తింతున్ మత దేశజాతి కృతముల్ వైవిధ్యముల్ వీడి, ని
ర్వర్తింతున్ బరిచర్య నార్తులకు యావత్ప్రజ్ఞ నర్పించి,యా
వర్తింతున్ గురుదేవ సూక్తములు భావస్ఫూర్తి నట్లయ్యు నే
ధూర్తుండౌదు నొకొక్కచో, నడఁపుమీ తుందుడుక్కు
నాత్మేశ్వరా! 6

క్షణక్షణము సత్యజ్ఞాన సంతోష సంపత్
చణమయి విలసిల్లన్ స్వాంతమున్ దిద్దుకొమ్మా
ప్రణుతిపరతఁ దప్పం బాయగానేర నన్నా
అణువణువున నాతో నైక్యముంజెందు తండ్రీ! 7

* * *

గురుపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు

-చాగంటి కల్పవల్లి

పవిత్రమైన ఈ చరిత్రను రచించు భాగ్యము నాకెట్లు ప్రాప్తించెనో ఈశ్వరునికే ఎరుక. మన ఆంధ్రరాష్ట్రములో విస్తరించియున్న శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పేరు విననివారుండరు.

వారికి తల్లిదండ్రులు ప్రభాకరశాస్త్రి అను పేరు పెట్టిరి. పేరులోనే ప్రకాశవంతములైన ఆత్మకిరణములు కలవారు అను భావము ఇమిడి యున్నదని ద్యోతకమగుచున్నది. అట్లే వారి పేరుకు తగినట్లు ధ్యానసమయమున వారిలోని తేజస్సు అన్నివేపుల ప్రజ్వలించి అనేకమందికి ఒకేసారి వారు ట్రీట్‌మెంట్ చేయుచుండగా ఆరోగ్యభాగ్యమును కలిగించెడిది. ఆ యోగ కిరణములే అందరియందు ధ్యానసమయములో ప్రసరించి అనేక విధముల స్పందనలు కలిగించి వారివారి అనారోగ్యములను పోగొట్టునని అనుభవంబునుబట్టి గ్రహించిన ముఖ్య విషయము నాకు.

వారి సహధర్మచారిణి మహలక్ష్మమ్మగారు. పేరుకు తగినట్లు లక్ష్మీదేవివలెనుండి వినయవిధేయతలు, దొడ్డబుద్ధి, ఆధ్యాత్మిక చింతన గలిగి శ్రీ శాస్త్రిరికి ఎల్లవిధంబుల సహకరించిన పుణ్యవతి. ఈమె భర్త ఉద్దేశ్యములతో ఏకీభవించి సి.వి.వి. యోగమార్గమున యోగదీక్ష బూనిరి. మన శాస్త్రిగారు చిన్ననాటినుండియు దైవభక్తి గలిగినవారు. బాల్యమునుండి వాక్సిద్ధితో బహుళవిద్యావిలాసములను బాల్యము దాటకముందే ధ్యానమును అలవరచుకొనిరి. అపాయములేని తపస్సు నుపాయముగా కనుగొని పరమేశ్వరానుగ్రహము పొందిన గొప్ప తపశ్శాలురువీరు. కవియై విద్వత్సభలయందు మణివలె ప్రకాశించిరి. దేవతారహస్యములను, ఋషులభక్తి తత్త్వశాస్త్రములను గ్రహించిన మహామహులు. ఈశ్వరాంశ సంభూతులు. ఆధ్యాత్మిక గురువులు యోగనిష్ఠా గరిష్ఠులు అయిన శ్రీ మాష్టరు వేంకాస్వామిరావుగారివద్ద యోగదీక్షనుబూని యోగసిద్ధిని బొందిరి. వారిలోని శాంతస్వభావము, గురుభక్తి, ధ్యానదీక్ష, ఆశ్రితవాత్సల్యము పలువురి నాకర్షించినవి. పరమేశ్వరప్రీతికొరకే వీరు సర్వకార్యములను సంకల్పించి కృతార్థులైరి.

వారు అనేక గ్రంథములను రచించిరి. కడుపుతీపి, నీతినిధి. కపోతకథ, మూణ్ణాళ్ళముచ్చట, కర్ణభారము, ప్రతిమానాటకము, మధ్యమవ్యాయోగము శృంగార శ్రీనాథము, తెలుగు మెఱుగులు మొదలైన అనేక గ్రంథములను ఆంధ్రములో వ్రాసిరి. వారు తెలుగులో ఆరితేరిన నిపుణులు. సంస్కృతముకూడ సమముగా నేర్చిరి. గొప్ప కవులు, విద్వాంసులు. వీరు ఉద్యోగ విరమణముచేసిన కొద్దిరోజులకే శ్రీ శాస్త్రిగారు తిరుపతి దేవస్థానములో పనిచేయుటకు 1940 సం॥ ప్రాంతములో నియమింపబడిరి. అప్పటినుండి వీరు తిరుపతి నివాసులైనారు. 1939 సం॥లో శ్రీ మా మామగారు తిరుపతి దేవస్థానము కమీషనరుగా అచ్చటనేయుండిరి. వారి యోగ అనుష్ఠానములోనున్న వారిశక్తి అచ్చటచ్చట విని

యుండుటచే మా ముసలమ్మగారు రోగముతో పీడితురాలనైన నన్ను తీసుకొని వారి యొద్దకువెళ్లిరి. కరుణాసముద్రులైన శ్రీ శాస్త్రిగారు నన్ను చూచి భయములేదు అని అభయహస్తమిచ్చిరి. అప్పటి నా వయస్సు 18 వత్సరములు. దీర్ఘవ్యాధితో క్షీణించి శల్యావశిష్టురాలనై యుంటిని, మా తాతగారు తండ్రిగారు అనేక పెద్దఆసుపత్రులలో వైద్య శస్త్రచికిత్సలు అనేకసార్లు చేయించిరి. అంతుతెలియని వ్యాధి భయము నన్ను పీడించుచుండెను. చెవిపోటుకొరకై ఆపరేషనుచేసి అనేక ఔషధములు ఇచ్చిరి. ఆరోగ్యము స్వస్థత పూర్తిగా చేకూరలేదు. శ్రీ శాస్త్రిగారిని పరమేశ్వరుడే మాకు చూపినారు. ఆ రోజునుంచి నేను మాస్టరు గారి అనుగ్రహము వల్ల శ్రీ గురుదేవుల ఆశీర్వాదమువల్ల సక్రమముగా వారివద్దకువెళ్ళి ప్రార్ధనలు చేసుకొనుచుండెడిదానను. వారు అపారమైన ప్రేమతో అమ్మాయి అని పిలిచి ఆదరించుచూ నా ఆరోగ్యముకొరకు తగు శ్రద్ధతో, నాయందు దయతో ప్రార్ధనలుచేసెడివారు. ఎన్నియో అవాంతరములు ప్రేయరు టయిముకి వచ్చెడివి. వాటిని లెక్కచేయక తప్పక ప్రార్ధనలకు వెళ్ళుచుండెడిదానను. తామరఆకుమీది నీటిబిందువుమాదిరి నా మనసు ముందుకు వెనుకకు పరుగిడిచుండెడిది. కొద్దికాలము జరుగగా మాతాతగారికి అనారోగ్యముగా ఉన్నదని జాబువచ్చినది. నేను శ్రీ శాస్త్రిగారివద్ద శలవు గైకొనుటకు వెళ్లితిని. 'అమ్మాయి! ధ్యానము.ఆరోగ్యము ఎక్కువా తాతగారు ఎక్కువా?' అని ప్రశ్నవేసిరి. ఆ సమయములో పెంచి పెద్దచేసిన తాతగారినిచూచు వ్యామోహముతో, తాతగారిని చూచుటకు వెళ్ళుటతప్పదని నొక్కిచెప్పితిని. సరి నీ యిష్టము అనిరి. తాతగారిని చూచుటకు స్వగ్రామము బందరు వెళ్లినాను, తరువాత కొద్దిరోజులకే స్వర్గస్థులైరి మా తాతగారు. తిరిగి తిరుపతి చేరిన తరువాత గురువుగారి యొద్దకు వెళ్ళుటకు చాల భయపడినాను. ఎటులో ధైర్యముచేసి బాధల కోర్వలేక శ్రీ శాస్త్రిగారివద్దకు వెళ్ళినాను. వారు పూర్వముకంటె ఎక్కువ దయతో అమిత వాత్సల్యముతో ఆదరముతో నన్ను పిలిచి ప్రార్దనచేయుమని పల్కిరి. వారి ఆజ్ఞను శిరసావహించి ప్రతిరోజు ఉదయం సాయంత్రము వారి ఇంటికి ప్రార్ధనచేయుటకు వెళ్ళెడిదానను,

అట్లు కొద్దిరోజులకు నా అనారోగ్యము కొంచెముకొంచెము బయలుపడ సాగినది. ప్రార్ధన సమయములో వారి ఇంటియందు గంటలతరబడి యుండెడిదానను. ప్రార్ధన అయిన వెంటనే మనసు సంతోషముగా ఉత్సాహముగా ఉండెడిది. తిరిగి యింటికిరాగానే ఏదోబాధ మాంద్యము భయము నన్ను ఆవహించెడిది. ఈ విధముగా కొంతకాలమునకు కొద్దిగా ఆరోగ్యము చిక్కబట్టితిని. కాని మానసికముగా ఎప్పుడు బాధపడెడిదానను. ఒకదినం ధ్యానమందున్న నాకు అగమ్యగోచరముగా నుండుట తటస్థించి సర్వ అవయవాలు కంపించి సర్వనరములు పట్లుతప్పినట్లు అయి నేల పరుండినాను. శ్రీ శాస్త్రిగారు అమ్మా ఏమిటి చెప్పుమనిరి. కానీ చెప్పుటకు వాక్కురాలేదు. తిరుగ ప్రేయరు జరుపగా కొలదిసేపటికి కోలుకొనినాను.

అదేరీతిగా కొద్దిసార్లు జరిగినది. పిదప మాఇంటియొద్దకే వచ్చి ప్రేయరు జరుప నిశ్చయించినారు. అటులనే వారు ప్రేయరు టయిముకి మా స్వగృహమునకు వచ్చినారు. శ్రీ మా మామగారు అచ్చటనే యుండగా ప్రేయరు చేసినాము. యథాప్రకారముగా మనసు బాధతో నిండి ఏదో శక్తి ఆవహించినట్లు బాధపడినాను. శ్రీ శాస్త్రిగారు 'ఏమి ఈ వింత చేష్టలు, పైకివచ్చి సక్రమముగా జవాబు చెప్పు'మని గద్దించి పలికిరి. నా శరీరము విపరీతమైన బరువుగా స్తంభించియున్నట్లు మనసుకి కొద్దిగా గోచరించుచున్నది. అంతట నా శరీరము పైకి ఆమె వచ్చి యిట్లు పలుకదొడగెనట. 'తానే ఈ వ్యాధులకు

భీతికి మూలకారణమని పలికెనట. తరువాత శ్రీశాస్త్రిగారు ఆమెను హితైక వచనములచే శాంతింపజేసి మంచిస్వభావము కలిగి యుండుమనియు పరమేశ్వర ధ్యానములో నుండి తిరుగుజన్మ ఎత్తి సుఖించుమని తగురీతిని ఆమెకు నచ్చచెప్పిరి. అదేరీతిగా మాకును మంచి మనసుతో ఆమెను ఆదరించుడని చెప్పిరి. ఆమెను శాంతిగా నుండి మాయింట జన్మించుమని ప్రార్థించుమనిరి. వారి సలహా ప్రకారము ప్రేయరు జరుపుకొంటిమి. అనేక సందర్భాలలో వారు మాకు తగిన సలహాలు ఇచ్చి ధైర్యము చెప్పుచు ఎప్పుడు విశాలహృదయముతో, సమదృష్టితో, భేదభావము లేక పరమేశ్వరుని శ్రీ మాస్టర్ సి.వి.వి గారిని ప్రార్థించుమని యుపదేశించిరి. ఇవియే వారి విశాల హృదయములోని భావములు. పరజాతి వారైనను మంచి మనసుతో ఆదరించవలెననియు, చిత్తశుద్ధితో ఏ పనిచేసినా సుఖాంతమగుననియు వారి నిశ్చయము. సర్వభూతములయందు దయగలిగి సత్యము అనెడి దీక్షతో ఎల్లవేళల ప్రార్థనలు జరుపువారికి అదే ఔషధముకన్న ఎక్కువగా పనిచేసి సర్వ గ్రహములను బారద్రోలి శాంతి నిచ్చును అని చెప్పిరి.

కాలము గడచినకొలది మనసుకు విశ్రాంతి ప్రార్థనలు జరుపవలెననెడి దీక్ష కలిగి శ్రీశాస్త్రిగారే గురుమూర్తులని మనసున నిశ్చయమునకు వచ్చితిని. దూరప్రాంతములో నున్నను ప్రేయరు టయిములో వారే అనేకసారులు గోచరించుట ఏవో ప్రశ్నలకి సమాధానములు వచ్చుట జరిగి ప్రేయరునందు ఆసక్తి కలుగజొచ్చినది. ప్రేయరు టయిముకు ముందే ధ్యానమునకు వెళ్లవలెను అని మనసు తహతహపడెడిది. నీటియందు బుడగలవలె అప్పుడప్పుడు శ్రీశాస్త్రిగారి రూపవికాసములను తిలకించుచుండెడిదానను.

కాలవాహిని దొర్లుచు 10 వత్సరములు గడచెను. తపోనిష్ఠాగరిష్ఠులు అనుష్ఠానవంతులునైన శ్రీ మాగురువులు అప్పుడప్పుడు వచ్చి మాకు దర్శన భాగ్యము కలిగించెడివారు. వారి రాకతో బ్రహ్మానందము బొందెడివారము. మేము తిరుపతి వెళ్ళి వారిని దర్శించి వారియొద్ద ట్రీట్ మెంటు పొందెడివారము. నామనసు కొద్దినెలలు ఆలస్యమైన శ్రీ గురువులను చూడవలెనని వెళ్లుటకు సిద్ధపడెడిదానను. ఉత్తరప్రత్యుత్తరములు కూడ జరుగుచుండెడివి. వారి ఇంటి యావన్మందిలోను నేను ఒకబిడ్డనైనాను. శ్రీ శాస్త్రిగారిని నాన్నగారు అనుట అలవడెను. నాకు తల్లిలేని లోటు తీర్చిన మాగురుపత్నిని నేను అమ్మా అని పిలచుట అలవడెను. వారియింటిలో అన్నతమ్ములతో అక్కచెల్లెండ్రతో వదినెగారితో మెలగుట చాల ఆనందముగా నుండెడిది నాకు. వారి ఇంటనే కొద్దిరోజులుండి ధ్యానము చేసుకొని వచ్చుచుండెడిదానను.

గుంటూరులో మేముండగా మాప్రక్కింటామె అనేక చిక్కులలో వుండి నాకు స్నేహపాత్రులయినారు. ఆమె బాధలను చూచి మానాన్నగారివద్దకు ఒకసారి రండి అన్నీ చక్కచేయ సమర్థులు వారు అని మాటల సందర్భములో నేను చెప్పినాను. నేను ప్రయాణమై తిరుపతి వెళ్లుచుండగా ఆమెకూడ వచ్చెదనన్నారు. ఇరువురము శ్రీశాస్త్రిగారి ఇంటికి వెళ్లినాము. ఆమె వారికి నమస్కరించి 'తండ్రీ మీరు నాకుగూడ కష్టములను గట్టు ఎక్కించి దోవ చూపు' డని ప్రార్థించిరి. వారు జాలిపడినవారై సరే ప్రార్థన చేయుమని సెలవిచ్చినారు. క్రమేణా వారి సర్వ కష్టములు తొలగి సుఖముగా నున్నట్లు నాకు చెప్పిరి. ఇప్పటికిని జాబులు వచ్చుచున్నవి.

ఎప్పుడు మా పెద్దపిల్లవాడు అనారోగ్యముగా ఉండెడివాడు. వారి అనుగ్రహమువల్ల పిల్లవాడు ఆరోగ్యవంతుడైనాడు. శ్రీనాన్నగారి ఆజ్ఞప్రకారము

మా రెండవ కుమారునికి రత్నాకరుడు అని పేరు పెట్టినాము. అందరము ఆరోగ్యముగా నుంటిమి. తరువాత బిడ్డకి మా గురువుల పేరు పెట్టినాము. నాన్నగార్కి పిల్లవానిని చూపి మీ పేరు పెట్టినామని చెప్పగా విని ఎందుకు తల్లీ నాపేరు అని నవ్వి అందని ఫలములకు ఆశ ఎందుకు అనినారు. అప్పటికే పిల్లవానికి అనారోగ్యము అంకురించినది, కాని నాకు అప్పుడు బోధపడలేదు. అదే తథ్యమయినది. వారి భవిష్యత్ జ్ఞానము ఇంతని చెప్పుటకు ఇదే నిదర్శనము. వారి ఆశీర్వచన బలమువల్ల బిడ్డలు నలుగురు ఆయురారోగ్యములతో సుఖముగా నున్నారు. అది వారి ఆశీర్వాద ఫలమే అని నిరతము శ్రీవారికి సి.వి.వి.గార్కి నమస్కరించుచున్నాము.

చంద్రునికి ఒక నూలుపోగను సామ్యముగా దినదినము భగవదనుగ్రహమువల్ల సంక్రమించిన ధ్యానమును నేమరక మాహృదయములను ప్రకాశింపజేయుచున్న ధన్యజీవులు మాస్టరు సి.వి.వి. గారిని గురుమూర్తులు శ్రీ శాస్త్రిగారిని మనసుననే ధ్యానించి ప్రేయరు జరుపుకొనుచున్నాము. గూడూరులో నుండగా నొకసారి యింటికి శ్రీ నాన్నగారు వచ్చినారు. అప్పుడు మా ఇంట వారు భుజించుచుండగా అందరు నన్ను పరిహసించుచున్నారు అని నా కష్ట సుఖములు చెప్పినాను. కొందరి హేళనలు పరిహాసనములు చెప్పినాను. వారు ఇలా అనినారు. 'పరుల మెప్పులు మన కెందుకమ్మా! మనసునందు క్రోధము కోపము, ఈర్ష్య లేక నిర్మలమైన మనసుతో ధ్యానించిన అన్నీ సర్దుకొని పోవు'నని చెప్పి చిరునవ్వు నవ్విరి. ఆనాటినుంచి నాకు ఎవరిమాటలు ఎంత బాధాకరములైనను బాధ కలుగజేయుటలేదు. మరియొకసారి శ్రీ శాస్త్రిగారు మాయింటికి వచ్చియుండగా వెళ్లునప్పుడు మరల దర్శనము ఎప్పటికో అని బాధపడినాను. దైవాధీనం అనినారు. అదే ఆఖరిసారి వారిని చూచుట అయ్యెను. తరువాత పక్షము రోజులు దాటకమునుపే పరమేశ్వరునిలో వారు ఐక్యమయినట్లు పేపరులో చూచి దుఃఖించినాము. నాజీవితములో అమూల్యమైన పితృప్రేమను గోల్పోయినట్లు నామనసు బాధపడుచున్నది. అప్పటికి ఇప్పటికి ఆ తలపు వచ్చినప్పుడు కన్నీరు విడచుచు నా హృదయబాధను ఉపశమింపజేసుకొనుచున్నాను. తల్లిమరణ మెరుగని నాకు తీరని దుఃఖ మిగిల్చినారు శ్రీశాస్త్రిగారు. భగవన్నిర్ణయము.

అప్పుడప్పుడు అమ్మగారి వద్దకు వెళ్ళుచు ధ్యానము చేయుచుండెడిదానను. ఆరోజు ఎంతో తృప్తిగా మనసు నిర్మలముగా నుండెడిది.

2॥ సం॥లు గడచినను యథాపూర్వము అప్పుడప్పుడు అనుభూతులు కలుగుచూ వుండెడివి. కాని కష్టకాలమందు మా ఇంటిలో అనారోగ్యము ఎవరికైన గలిగినప్పుడు శ్రీ నాన్నగారు కలలో, ప్రేయరు సమయములో దర్శనమిచ్చుట కద్దు. ఒకటి రెండు సంవత్సరములనుండి మనసుకి అనేక తలపులు వచ్చుట అవి నిజమగుట కూడ కలదు. ఒకసారి అనగా 2 సం॥ పూర్వము మా పెద్ద కుమారునికి కొంచెము అనారోగ్యము కలిగినది. నాకు మనసులో చెప్పలేని భీతి కలిగినది. శ్రీశాస్త్రి గారిని సి.వి.వి.గారిని తలచి ధ్యానముచేసి కన్నులు మూసికొని బిడ్డను కాపాడుమని వేడితిని. వెంటనే కలయోనిజమో అనురీతి శ్రీ నాన్నగారు అబ్బాయి వద్ద కూర్చున్నట్లు కనిపించిరి. వెంటనే నామనసు ఆందోళన తగ్గి కుదుటపడినది. అదే రీతిగా బాబు పరీక్ష వ్రాయు టయమునకు ప్రేయరులో బాబు పరీక్ష వ్రాసి పాసవమే భారము మీదే తండ్రీ అని నమస్కరించితిని. ఆరాత్రే అబ్బాయి పరీక్ష వ్రాయుచుండగా ప్రక్కన నిలుచుండినట్లు అగపడిరి. ఆ పరీక్షలో అబ్బాయి మొదటితరగతిలో ఉత్తీర్ణుడయినాడు. మరియొకసారి పిల్లలకి మావారికి ఒకేసారి టైఫాయిడు వచ్చి ఒక నెలకుపైగా చాల కష్టములకు గురియైనాము. అప్పటిలో శ్రీ నాన్నగారు మాస్టరు

గారు తప్ప కష్టములను గట్టెక్కించువారు ఎవరూ లేరని పదేపదే ప్రార్థించుచుంటిని. ఒకదినం అమ్మాయికి సంధి, వచ్చి జ్వరతీవ్రము అధికమై డాక్టర్లు కూడ చాలఆదుర్దా చూపిరి. మనసులోనే ధ్యానించుచు నిముషమొక యుగముగా రాత్రి 12 గం॥ వరకు జరిపి కలత నిదురకు లోనైతిని. నిద్రలో బ్రహ్మ స్వరూపము వచ్చి బిడ్డకి భయము లేదు అని వీపు తట్టినట్లు మెలకువ వచ్చినది. జీవుడు వెళ్లినాడు అనినారు. ఒక గంటకే మాయింటిలో పెంచెడి పిల్లి రెండు పిచ్చి అరపులు అరచి చనిపోయినది. తెల్లవారుజాముకి పిల్ల దాహమని పలికినది. ఆరోజు నుంచి క్రమేపీ జ్వరము తగ్గినది. రోజురోజుకి అందరికి ఆరోగ్యము చేకూరెను. మరియొకసారి అనగా ఒక సం॥ క్రిందట నడుమునొప్పితో చాల బాధపడితిని. మందులకి కాపులకి లొంగక కడు బాధపడినాను. మాస్టరుగార్కి మానాన్నగార్కి యింక బాధ పడలేను మీదే భారం అని నమస్కరించినాను. శ్రీ నాన్నగారు నా నడుము చేతితో వ్రాసి అమ్మా నొప్పి తగ్గలేదా అనినారు. కన్ను తెరచిన తండ్రి కనుపించలేదు. అంతే ఆరోజునుంచి 1, 2, రోజులలో నొప్పి మాయమై మామూలు పనిపాటలు చేయగల్గితిని. అట్లే మాయింటిలో అనేక సమయాలలో దర్శనమిచ్చుచు ధైర్యము చెప్పుచుసంతోషము కలుగచేస్తున్న ధన్యులు శ్రీ శాస్త్రిగారు.

ఇట్లుండగా 8 మాసములకు పూర్వము ప్రార్థనా సమయములో ఏదో వారు నాకు చెప్పినట్లు భావములు కలుగుట తిరిగి జ్ఞాపకము లేకపోవుట జరిగెడిది. ఎవరితోనైనా చెప్పితే భ్రమ అందురని నామనసులోనే శ్రీశాస్త్రిగార్లకు వందనము లర్పించెడిదానను. అదే సమయమున మా పెద్ద అమ్మాయికి కూడ దర్శనమిచ్చినట్లు చెప్పినది. సరే నమస్కారము చేసికొనుము అని చెప్పితిని.

ప్రేయరుచేయుచు మనసు నిలకడ శాంతి చేకూర్చుమని వేడుకొని కన్నుమూసితిని. వెంటనే నాయెదుట శాస్త్రిగారి ఫొటోమారి అస్తళములో ఒక లింగాకారము ఒక రెప్పపాటు కనుపించినది. తరువాత శ్రీ నాన్నగారు, వీరితో ఎవరో ముని మహానుభావుడు కనుపించి అదృశ్యులైరి. మరియు జనవరి మొదటివారంనుంచి ఏవోభావములు ప్రేయరు టయిములో కలుగుచుండెడివి. మనసులోనే వచ్చిన వాక్యములను మరుగుపరచు చుండెడిదానను. కొద్ది రోజులు గడచిన తరువాత ఒక రోజు వచ్చిన వాక్యములు కాగితముమీద భద్రపరచవలెనని ఒక ఊహ కలిగెను. ఎక్కువ చదువు, ఛందస్సు, కవిత్వము రానినేను కావ్యగ్రంథములు చదువనినేను పెద్దమాటలకు అర్థమురానిదానిని వ్రాయుట ఏమిటి అని ఆలస్యము చేసితిని. పైగా ఇతరులు నవ్వుదురని భయము, నన్నుబాధపెట్టుచుండును. కాని మార్చిలో ఒకరోజు ధ్యానములో ఎందుకు వ్రాసుకొనకూడదు నేనే తిరుగచదువుకొనుటకు వీలుండునని వ్రాయ నిశ్చయమునకు వచ్చినాను. కొద్దిదినములకే మనసున ఉత్సాహము కలుగుటచే అప్పుడప్పుడు జ్ఞాపకమున్నవి వ్రాయుచు వచ్చితిని. అట్లే భావములు వచ్చినప్పుడు అప్పుడప్పుడువ్రాసినవి పొందుపరచి చూడ దాచిన ధనము దొరకినరీతి వారి జీవితములోని మధురఘట్టములు కనుపించినవి. అవి పద్యములో గద్యములో తెలియనినాకు అవి చదివి వారిని ధ్యానించుచు సంతోషించుటకు పూర్వజన్మ సుకృతమువల్ల శ్రీ మాస్టరు సి. వి. వి. పి. యస్. గార్ల కటాక్షమువల్ల వచ్చిన ఆ కొద్ది వాక్యములు చదివి సంతసించుచుందును. వారి అనుగ్రహమును నా అనుభూతినిబట్టి ఏదో కొద్దిగా ఈ వ్యాసమునందు వ్రాసినాను. అనేక తప్పులున్న పెద్దలను క్షమించుడని ప్రార్థించుచున్నాను. నా తప్పులు మన్నించి ఈ కొద్దిజ్ఞానము ప్రసాదించి సర్వదా మమ్ము కాపాడుడని శ్రీసి.వి.వి.పి.యస్. గార్లకు ప్రాధేయపూర్వకముగా వందనము లర్పించుచున్నాను.

*



ప్రజ్ఞా ప్రభాకరము

—డా॥ బాలాంత్రపు రజనీకాంతారావు

⁂

ఉరువైన చెంపల నరమోడ్పు గన్నుల
సిద్ధనాగార్జును చెలిమిచూపు.
పక్వమౌ నారంగ ఫలరసమ్మును మించు
వాత్సల్య మధువు జాల్వారు మాట.
ఎదుట కూర్చొను నిలువెత్తగు గోమతే
శ్వరుని శిల్పపు నిండుశాంతమూర్తి.
తెలుగు పల్కుబడుల కలరూపు తియ్యద
నముచాటు పరిశోధనల బెడంగు.

ప్రాచ్యవాచో విధాన సర్వజ్ఞతయును,
ప్రాజ్ఞతాయుక్త ప్రాభాకరతయు జేరి,
శ్రోతఁ, బఠిత, నంతేవాసిఁ జొక్కఁజేయు
పరమ మహిమాన్వితుడు ప్రభాకరగురుండు!

—రజని

మా అన్నయ్య

—కాజ శారదాంబ

[శారదాంబగారు కీ॥శే॥ కాజ వేంకటశేషయ్యగారి సతీమణి. ప్రభాకరశాస్త్రిగారి సోదరి. ప్రస్తుతం బిలాస్‌పూర్‌లో కుమారునివద్ద ఉంటున్నారు. వయస్సు 85 సం॥. మణిమంజరి సంచికలందుకొని, చదివించుకొని విని, అభినందనలందిస్తూ కొన్ని సంగతులు జ్ఞాపకం చేసుకొని 'కన్నుకూడా కనపడదు. ఆ పుస్తకాలమీద వుండే ఆశతో వ్రాశాను' అని వ్రాసి పంపినారు. అందులోంచి కొన్ని అంశాలు ఇక్కడ పొందుపరుస్తున్నాము —సం॥]

మా చిన్న అన్నగారు చల్లపల్లిలో అద్దేపల్లి సోమనాధశాస్త్రిగారి దగ్గర చదువుకుంటుండగా ఆయన పక్కవూరికి ఏదో పనిమీద వెళ్లినారుట. అప్పుడు వారి భార్య చిన్నమ్మగారు నూతి దగ్గర చీర వున్నది. ఉతుకు అన్నదిట. మనస్సుకు కష్టం తోచి ఏదో ఉతుకుతుంటే వంటయింటి కిటికీలోంచి చూచి 'బాగా ఉతుకు' అన్నదిట. ఏదో ఉతికి కొంచెంసేపు అయాక 'నేను మా నాన్నగారి దగ్గరికి వెడుతున్నాను' అని చెప్పి వచ్చేశారట. తరువాత శాస్త్రుల్లుగారువచ్చి 'ప్రభాకరం ఎక్కడ'? అని అడిగితే చిన్నమ్మగారు 'కళ్లేపల్లి వెళ్లినాడు' అన్నదిట—

తరువాత బందరులో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి దగ్గర చదువు ప్రారంభించినారు. అక్కడే వల్లూరి సూర్యనారాయణరావుగారు పురాణం వారు, జంధ్యాల గౌరీనాధశాస్త్రిగారు, కొండావెంకటప్పయ్యగారు ఇంకా ఎంతమందో పరిచయమైనారు, నాకు బాగా జ్ఞాపకం లేదు.

x x x

తరువాత మామరిది కాజ కామేశ్వరరావు పెళ్లి అయినది. కొజ్జిలిపేట పోపూరివారి పిల్లను ఇచ్చినారు. అప్పుడు మాఅమ్మ, చెల్లెలు, తమ్ములు వచ్చినారు. ఆపెళ్లిలో మాఅన్నగారు శ్రీ ప్రభాకర శాస్త్రిగారు అష్టావధానం చేసినారు. చాలా మంది పెద్దలు వచ్చినారు. మాశ్రీవారు కాజ వెంకట శేషయ్యగారు 'గొప్పబుర్ర' అన్నారు. 'మెద్రాసు వస్తావా'? అని అడిగారు.

x x x

మా నాన్నగారితో చెబితే సరే వెళ్లమన్నారు. మావారూ చినన్నగారూ ఇద్దరూ మద్రాసు వెళ్లినారు. వెంకటరంగం పిళ్లె వీధిలో రెండు పెద్దగదులున్న ఇల్లు తీసుకుని ఉన్నారు. తరువాత నన్ను తీసుకొని మా అత్తగారు వెళ్లినది. ఇల్లు చాలదని మైలాపూరు శాల వీధిలో ఇంట్లో వున్నాము. మా అత్తగారు కొన్నాళ్ళుండి వెళ్లినారు. తరువాత మా అన్నగారికి ట్రిప్లికేను కెలట్ స్కూలులో సంస్కృతం మాస్టరుగా పని అయింది. రెంటాల వెంకటసుబ్బారావు, వేపా రామేశం ఇంకా కొంతమంది పరిచయమైనారు.

x x x

కొన్నాళ్లకు మా అన్నగారికి టయిఫాయిడు జ్వరం వచ్చింది..... అదివరకు మా పెద్దతమ్ముడు చంద్రశేఖరానికీ జ్వరం వచ్చి మెడ వంకరయినది. తిరపతిలో వడుగు చేస్తామన్నారు. తరువాత ఇంటి దగ్గర చేసినారు. అందుచేత వచ్చినదేమో అని చిన్నతమ్ముడు శంకరానికి తిరవతిలో చేస్తామన్నారు.

x x x

అందరం తిరపతి వెళ్లాము. అలివేలు మంగాపురంలో వడుగు చేస్తుంటే మా పెద్దన్నగారి కూతురు బాలకు, ఆర్నెల్లపిల్లకు, నూటమూడు జ్వరం వచ్చినది. ఎవరికి ఏ కష్టము వచ్చినా బాధకలిగినా చూడలేకపోయేవాడు మా చిన్నన్నయ్య. జ్వరంతో ఉన్న పిల్లను వళ్లోపెట్టుకుని యీ పద్యం చేసినారు.

"చుట్టని మేనుకాలె గనుచూడ్కి వికారము
దోచె నన్న కుం
గుట్టది యాఱుమాసముల కూన యిదెక్కడి
వేకి సోకా మా
మొట్టల నాలకింపుము నమోనమః యప్పన
నీకు నప్పనా
చిట్టున చీదకుండ సుఖసిద్ధికి దార్పుమి బిడ్డ
దేర్పుమీ".

అప్పుడే ఈ పద్యాలూ చెప్పినారు. అవి నాకు ఇప్పటికీ జ్ఞాపకము.

"ఏడుకొండల మీద ఎక్కియుండుట యేల
పరమోన్నతిని దెల్పు సరణియొక్కొ
వడ్డికాసుల నెంచు వ్యాపారమదియేమి
భక్తి పెంచెడు నభిప్రాయమొక్కొ
తలవెంట్రుకల నూడ్చి తరలించుటదియేమి
భవబంధములద్రెంచు పగిదియొక్కొ.."
''జగము లెల్లను బ్రోచు చల్లచూపులవాడ
ఏడుకొండలవాడ ఏలుకొనుము....
అభయమొసగు వెంకటాద్రి నిలయ."

x x x

కొండ ఎక్కాము. వెయ్యిస్తంభాల మండపములో కొట్టు తీసుకున్నాము. వంట చేసుకోవలెనని మా అన్నగారు ఎదురుగుండా కూరలు తీసుకు వస్తుంటే కోతి బట్టచించి కూరలు ఎత్తుకుపోయింది. ఏదో వండుకుని గుడికి వెళ్లాము. శుక్రవారము ఒకసారే దర్శనము. మహంతు వుత్తరం తీసుకుని వెళ్లాము. రూపాయి కర్పూరహారతి వెలిగించి తిప్పి కింద పడేసినాడు పూజారి. అన్నగారికి మావారికి కోపం వచ్చినది. బావమరదులిద్దరూ 'మహంతు వుత్తరం మన్ను చేసినారా! దేముడు వరమిస్తే పూజారి వరమియ్యడన్నది ఇందుకే పుట్టింది' అంటూ గట్టిగా మాట్లాడినారు. కొట్లాటదాకా వచ్చింది. మేము భయపడినాము. ఏకజనము. చెమటలు కారుతూ వచ్చినాము బయటికి. బయట 'ఏమిటి శేషయ్యా నరసింహా ఉగ్రంగా వున్నావు' అన్నారు. ఆయన జిడ్డు జానకిరామయ్య. 'మీరున్నారని నాకు తెలీదు, దేవుడి దర్శనం కాలే'దని చెప్పినారు. అట్లాగా అని, ఆయన దేవస్థానం తాసిల్దారు, 'శ్రమ తీర్చుకోండి' అని పూజారికి కబురు చేసినారు. పూజారి చేతులు జోడించుకు వచ్చాడు. 'ఆ జనాన్ని బయటికి పంపి వీళ్లను ఒక్కర్ని దివిటీ వేసి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు ఇచ్చి పంపు' అన్నారు. బాగా దర్శనం చేయించి ప్రసాదం ఇచ్చి పంపినారు.

x x x

మా అన్నయ్య కుంభకోణం వెళ్ళివచ్చినారు. ఆరోగ్యం నయం ఆయింది. ఉద్యోగంలో తిరిగి ప్రవేశించినారు. వచ్చినది మొదలు ఎంతమందికో జబ్బులు నయం చేసినారు. ముఖ్యంగా మా మేనమామ కొడుకు కొండుబొట్లు అనే అతను బెజవాడలో మా ఇంట్లో అద్దంలో చూచుకొని 'నేను బతుకుతానా వదినా?' అన్నాడు. వెళ్ళు బతుకుతావన్నాను. ఆరుమాసాలు ఇంట్లోపెట్టుక నయంచేసి పంపినారు.

మళ్లీ మా ఇంటికి వచ్చేటప్పటికి మామూలుగా వున్నాడు. అది నాకు బాగా దృష్టాంతం.

x x x

మానాన్న పాటలు నాకు శానావచ్చు. కృష్ణ లీలలు, తొట్టెపాటలు, మహార్నవమి పద్యాలు, తలుపుదగ్గిర పాటలు, మంగళహారతులు ఇంకా ఎన్నో వచ్చు. రాయలేను. కొన్ని మాఇంట్లో టేపు చేశారు.

x x x

ఇంకా ఎన్నో. వ్రాయలేను. కన్నుకూడా కనపడదు. ఆ పుస్తకాలమీద ఉండే ఆశతో వ్రాశాను.....

ఇట్లు
కాజ శారదాంబ వ్రాసినది

అభిప్రాయవేదిక

……మణిమంజరి పత్రికకు భగవంతుడు, టి.టి.డి. సంస్థ చేయూతనిచ్చి అందరికి అందుబాటులో ఉండునట్లు చౌకధర కల్గిన విశేష ఆదరణ పొందును—

వి. పుల్లయ్య (వరంగల్)
మార్చి 82.

……ఈ రోజు ఉగాది. ఏదైనా మంచి పుస్తకం చదవాలనుకున్నాను. మణిమంజరి చేతికి దొరికింది. రాత్రి 12 1/2 గంటల వరకూ అలానే చదువుతూ ఉండిపోయాను. మహత్తర సాహిత్య సంశోధన పత్రిక.

తంగిరాల వెంకట సుబ్బారావు (గుల్బర్గా)
26.3.82

……సమర్థులైన మీ సోదరులు శ్రీ ప్రభాకర పరిశోధన మండలిద్వారా తండ్రిగారి ఋణాన్ని తీర్చుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. మణిమంజరి సంచికలో భాషాద్వయంలో ఉత్తమ రచనలు, వ్యాసాలు. ప్రకటిస్తూ వాఙ్మయానికి మహోపకారం చేస్తున్నది. మీ యీ సాహిత్యసేవ, పితృపాదుల వాఙ్మయ ప్రకటన అవిచ్ఛిన్నంగా కొనసాగగలదని ఆశిస్తున్నాను—

బులుసు వేంకట రమణయ్య (మద్రాసు)
5.4.82

'మహాపండితులు. యోగిపుంగవులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవ చిరస్మరణీయం. ప్రభాకర పరిశోధన మండలి యాజమాన్యాన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి రచనలన్నింటినీ మణిమంజరిద్వారా తెలుగు పాఠకలోకానికి అందించే ప్రయత్నం మీరు ప్రారంభించారు. ఎంతైనా ముదావహమైన విషయం. మణిమంజరి సంపుటాలలో శ్రీ శాస్త్రిగారి రచన లన్నింటినీ క్రమ బద్ధంగా ప్రచురించడమే గాక శ్రీవారిని గురించి పలువురు పెద్దలు వెలువరించిన అభిప్రాయాలను వ్యాసాలనుగూడా మీరు మణి మంజరిలో ప్రచురిస్తున్నారు. మీరు ప్రారంభించిన కృషి—ప్రణాళిక పూర్తి అయ్యే సరికి ప్రభాకర శాస్త్రిగారిని గురించి వెలువరించిన ప్రామాణిక దస్తావేజుగా మీ ప్రయత్నం ఫలించి రూపొందగలదని నావిశ్వాసం. శ్రీవారి రచనల విషయంలో ఇంకా కొంత పరిశోధన జరగవలసియున్నట్లు మణిమంజరి సంచికలు వ్యక్తం చేస్తున్నవి. మీ కృషిచాలా ప్రశంశనీయమయినది. తెలుగు దేశం మీకెంతో ఋణపడిఉంటుంది. శ్రీవారి

వ్యక్తిత్వాన్నీ పాండితీ వైదగ్ధ్యాన్నీ, సమకాలిక సమస్యలపై వారు వెలువరించిన అభిప్రాయాలనూ ఒకచోట క్రోడీకరించడం వలన తెలుగు సాహిత్యానికి ఎంతో సహాయాన్ని సమకూర్చినట్లుకాగలదు.

వేమూరి ఆంజనేయశర్మ (హైద్రాబాదు)
23.4.82

మణిమంజరి పరిశోధన పత్రికలు చాలా మంచి వ్యాసములతో అందముగా నుండునట్లు ప్రకటింపబడినవి. పరిశోధన విషయములో మీరు చేయుచున్నకృషికి నా ధన్యవాదములు.

ఎమ్. ఆర్. అప్పారావు (నూజివీడు)
22.6,82

మణిమంజరిలోని వ్యాసాలు కొన్ని స్కూలు టెక్స్ట్ బుక్స్‌లోకి సంకలనమైతే భావితరానికి మార్గదర్శకము కాగలవు.

వి. అప్పారావు (ఢిల్లీ)
14.7.81

I had the privilege of going through three issues of the journal, Manimanjari.

Sri Sastri Garu has shown us how painstaking True research could be. Apart from his acknowledged contribution to literary research, Sri Sastri Garu comes out in these issues as a man of great foresight with his relevance still undiminished. His argument that if the entire State administration is conducted in Telugu (in a form understood by all), it would result in an abridgement of the traditional alienation between the government and people is still contemporary. But coming as it did immediately after independence (1948), it is an evidence of his remarkable foresight.

Till recently (and probably, even today), middle class and affluent Indians have been under the erroneous impression that bottle-feeding is preferable to breast-feeding. This was created and fostered by powerful multinational corporations with infant milk food to sell. Even before the trend caught on Sri Sastri Garu had warned us that there is no substitute for breast-feeding, a view endorsed very recently by the UNICEF. If only we had listened to him, a whole generation of Indians would have been spared of the enervating effects of artificial feeds. But this was not to be.

The purpose of literary research is not to live in the past and offer interpretations recreating it. It is to offer solutions to contemporary problems in the light of known history. For this purpose, a researcher should be prepared to tackle contemporary problems and this calls for a modern mind. Sri Sastri Garu was richly endowed with this and we should be grateful for the legacy left by him.

C. H. Raghu Ram (Hyderabad)
8-8-82.

ప్రస్తుతం మావద్ద లభిస్తున్న గ్రంథాలు.
కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సంధానించిన
ప్రబంధరత్నావళి
నూతన ముద్రణము అమ్మకమునకు సిద్ధముగా ఉన్నది. వెల రూ. 15/-

⁂

వేటూరివారి సంపూర్ణ గ్రంథావళి లో
ప్రథమ సంపుటంగా
"నీతినిధి"
సెప్టెంబరు 29 న గ్రంథావిష్కరణోత్సవము. కావలసినవారు ముందుగానే ప్రతులకు వ్రాయండి.
మరో ఆరు మాసాల్లో మరో సంపుటం
వేటూరివారి పీఠికలు

⁂

ప్రతులకు : వివరాలకు
శ్రీ ప్రభాకర పరిశోధక మండలి
'శ్రీనివాస్' - 6/2 ఆర్. టి. (న్యూ)
విజయనగర్ కాలనీ. హైదరాబాదు-500 457
ఆంధ్రప్రదేశ్

manimanjari

Volume 2 - No. 2. August 1982
VARDHANTI ISSUE

A bi - lingual Bi - Annual
Literary Yoga Research Journal

Editors :

ANJANEYULU VETURI
ANANDAMURTHY VETURI

Editorial Advisory Board

SRI TIRUMALA RAMACHANDRA
SRI KOTTA RAMAKOTAIAH
Dr. P. SESHAGIRI RAO
Dr. V. SUNDARA MURTHY
SRI V. GURUPRASAD
Dr. VISSA RAMACHANDRA RAO
SRI RAVI RAMA MURTHY

SRI PRABHAKARA PARISODHAKA MANDALI
'SRINIVAS' 6/2RT (New)
Vijayanagar Colony,
HYDERABAD-500 457.
Andhra Pradesh

CONTENTS

1.	Ikshvakus and Their Origin (Tr)	45	Veturi Prabhakara Sastri
2.	Acharya Nagarjuna (Tr)	51	Veturi Prabhakara Sastri
3.	'Neeti Nidhi' - A Unique Exercise in Translation	53	Veturi Anjaneyulu
4.	Pragna Prabhakaram (Tr)	60	Veturi Prabhakara Sastri
5.	Biography of Srinatha (Tr)	64	Veturi Prabhakara Sastri
6.	Songs of Annamaya (Tr)	75	
7.	Our Contributors - 1982	81	
8.	News and Views	85	

Ikshvakus and Their Origin

Veturi Prabhakara Sastri

Sri Rama, the Great Hero of the Ramayana, belonged to the Aryan clan of Ikshvaku. And he was of the Krta Yuga (first of the four great periods of the the Hindu Astronomers). The dynasties of the fourth period Kaliyuga are described in the puranas. The latter say that after twenty nine monarchs of the Ikshvaku dynasty ruled the land, kings of other royal clans reigned for 1530 years followed by the Andhra rulers who held sway for over 560 years. Research scholars have found that the Satavahana era is from 150 B. C. to 300 A.D. If the puranas are taken as authentic the conclusion is inevitable that the Ikshvakaus existed round about three thousand five hundred years ago. Sri Rama was the ruler of Kosala These Ikshvakus of the Kaliyuga age may also be bracketted with the kings of Kosala.

Not all this is puranic. The Buddhist Stupa on the summit of the hill at Jaggayapeta in the Krishna District of Andhra was excavated a few years ago by the Department of Archaeology. Some of the inscriptions of the Ikshvakus were found there. On the authority of the scripts, the epigraphists guess them as belonging to 300 A.D. One of the names found is that of an Ikshvaku ruler Purushadatta. The Buddhist stupa at Nagarjuni-konda, also called Sri Parvata, was dug up last year. Announcements of the results from these excavations is awaited with great interest.

So much for historical and epigraphic research.

Recently, the Mysore Government published a Kannada work, Dharmamrita. It is a Jain work by one Nayasenacharya in 1125 A.D. It may be an adaptation from some Prakrit work. The eleventh chapter of this Dharmamrita has a story pertaining to the Ikshvakus and Andhra Desa. It says :—

